స్వాతంత్ర్య యువశక్తి - సహృదయ సంధాత్రి

(హృదయనేత్రి - మాలతీచందూర్ నవల)



డా. జంధ్యాల కనకదుర్గ

స్వాతంత్ర్య యువశక్తి - సహృదయ సంధాత్రి

('హృదయనేత్రి' – మాలతీచందూర్ నవల)

డా. జంధ్యాల కనకదుర్గ

జంకదు ప్రచురణలు

స్వాతంత్ర్య యువశక్తి-సహృదయ సంధాత్రి

('హృదయనేత్రి' - మాలతీచందూర్ నవల)

ప్రథమ ముద్రణ : మే 2026

జంకదు ప్రచురణలు

కాపీరైటు హక్కులు రచయితవి.

ISBN : 978-93-5810-046-4

ప్రతులు : 500

ప్రతులకు చిరునామా :
డా.జె.కనకదుర్గ
ఇం.నెం.5-35-18 లైను,
18 వ అడ్డరోడ్డు, బ్రాడీపేట
గుంటూరు-2
ఫోను : 94911 40299

ముద్రణ :

శ్రీ శ్రీ ప్రింటర్సు, విజయవాడ

srisriprinters.vja@gmail.com

ఫోన్ : 94906 34849

ధర : రూ.150/-

అంకితం

మాలతీచందూర్ రాసిన హృదయనేత్రి అనే నవలలోని ప్రధానపాత్ర సత్యం, అహింసా ధర్మాలకు కట్టుబడి ఆత్మనియంత్రణలో జీవితాన్ని కొనసాగించటం ఒక అసిధారావ్రతం.
అటువంటి నిరాడంబరత, మానవీయత, నిక్కచ్చితనం, సున్నితత్వం, ప్రలోభాలకు లొంగనితనం, దానశీలం మూర్తీభవించిన తమ్ముడు, చారిత్రకనాణాల సేకరణతో, వాటిమీద అపూర్వమైన రచనలు చేసిన

చిరంజీవి **శ్రీ జె.వి.ఎస్.ప్రసాద్ కి** *(రిటైర్డు డిప్యూటి జనరల్ మేనేజరు, బిఎస్ఎన్ఎల్)*

మరియు

మంచి, చెడుల విచక్షణా జ్ఞానులు, అందరి మేలుకోరే మనస్కులు

అనుజ సోదరులైన

శ్రీ జె.గోపాలకృష్ణ *(రిటైర్డు డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు – పంచాయితీరాజ్),*

శ్రీ విశ్వనాథ్ *(రిటైర్డు డిప్యూటి జనరల్ మేనేజరు – సింగరేణి కాలరీస్ ప్రభుత్వసంస్థ)* లకు

మరియు

జాతీయోద్యమసాహిత్యపిపాసకులు జీవనసహచరులైన

శ్రీ ఎమ్.వి.శాస్త్రి కి *(ఎగ్జిక్యూటివ్ – పర్సనల్ మేనేజర్ – సింగరేణి కాలరీస్ ప్రభుత్వసంస్థ)*

మా తల్లిదండ్రులైన

కీ.శే. శ్రీ జంధ్యాల కుమారస్వామి, లక్ష్మీప్రసన్నమ్మల ఆశీస్సులతో

ఈ **'స్వాతంత్ర్య యువశక్తి – సహృదయ సంధాత్రి'** అనే స్వీయరచనను అంకితం ఇవ్వటం సముచితమని భావిస్తూ, శుభాకాంక్షలతో

– జె. కనకదుర్గ

విమర్శకు మేలైన జోడింపు...

జంధ్యాల కనకదుర్గ గారికి పరిశోధకురాలిగా చాలా మంచి పేరుంది. బహుశా ఆమె సాహిత్య స్వభావంలో పరిశోధనాత్మకత పూవులో తావివలే ఇమిడిపోయింది కనుకనే అది సాధ్యమయింది. లేకపోతే ఆమె సంపాదించిన బంగారుపతకాలు అటుంచితే, రీసెర్చ్ ప్రాజెక్టులను, ప్రచురణలను చూసి మనం తప్పక ఆశ్చర్యచకితులమవుతాం. ఆమె ఎంచుకునే విషయం ఎంతో విశాలమై ఉన్నప్పటికీ అందులోగల సూక్ష్మపరిశీలనలకు మనం ముగ్ధులమవుతాం. తెలుగులో స్త్రీల సాహిత్యం గురించి కావచ్చు, ఆ సాహిత్యంలో మహిళా చైతన్య ప్రస్థానం కావచ్చు ఆమె చూపు నిశితమైనది. అది మరిన్ని విస్తృతమైన ఆలోచనలకు దోహదం చేసే విధంగా ఉంటుంది.

హృదయనేత్రి నవల దాదాపు ముప్పై ఐదేళ్ళ క్రితం రాసినది. మాలతీ చందూర్ గారికి సాహిత్య అకాడెమీ అవార్డు తెచ్చిపెట్టిన నవల. దాని గురించి ఇప్పుడీమె ఎందుకీ పుస్తకం తీసుకొస్తున్నట్టు ? ఈ నవలేతివృత్తం, పాత్రల స్వభావ చిత్రణ, కథాకథన వైశిష్ట్యత ఇవన్నీ ఒక వ్యాసంగా రాసుకోవచ్చును గానీ ఇంతటి సవివర పరిశోధనాత్మక రచన ఎందుకు చేయవలసి వచ్చింది ? అని ఆలోచిస్తే కనకదుర్గగారిపై ఈ నవల ప్రభావాన్ని అర్థం చేసుకోవచ్చును. ఏ నవలైనా అది ఎప్పుడు ఒక తీవ్రమైన ప్రభావ లక్షణాన్ని కలిగి ఉంటుంది ? సాహిత్య చరిత్రను మలుపుతిప్పినటువంటి ఉత్తమ నవలలను మనం ఎన్నింటిని చదివి ఉన్నాము ? 'నవలా రచయితకు తన దేశం యొక్క గతం, వర్తమానాల పట్ల ప్రత్యేకమైన బాధ్యత ఉంది. ఒక దేశ సాంస్కృతిక సంప్రదాయంలో వర్తమానానికి కూడా పనికివచ్చే అంశాలేవో గతం చూపుతుంది' (నవల–ప్రజలు) అంటాడు రాల్ఫ్ ఫాక్స్. కనకదుర్గ గారు ఈ నవల మూల విషయాంశంతో చాలా మమేకమై ఈ పుస్తకం ప్రచురిస్తున్నారు. ఇక్కడే మనం ఆమె అభిప్రాయలనుంచి తప్పించుకోలేనితనంలో పడిపోవడం జరుగుతుంది. ఈ నవల మీద కనకదుర్గ గారి విస్తృతాధ్యయనం ఈనాటి కాలమాన పరిస్తితులను బేరీజు వేసుకోవడానికి ఏమన్నా పనికివస్తుందా లేదా అన్నది నాకొచ్చిన సందేహం. ఎందుకంటే ఈ నవలలోని పాత్రల ద్వారా ఈమె స్వాతంత్ర్య తదనంతర కాలపు స్థితిగతులను గురించిన విస్తారమైన చర్చ చేస్తారు.

అపసవ్యమైన రాజకీయ విధానాలను, కురచ మత ప్రస్తావనలను సమర్థించడమే వర్తమాన దేశభక్తి, జాతీయవాదంగా చెప్పబడుతున్న రోజుల్లో ఉన్నాం. అందుకు సాక్ష్యంగా నిలిచే అనేక ఉదంతాలు మన చుట్టూ ఇప్పుడు జరుగుతున్నాయి. దేన్ని ఎవరు ఎందుకు సమర్థిస్తున్నారు, వ్యతిరేకిస్తున్నారు వంటి విషయాలు చాలా ఆసక్తికరమైనవి. కనకదుర్గ గారు ఈ నవలను తన విశ్లేషణాంశంగా తీసుకోవడంలో ఆ సార్వకాలికతను స్పృశించారనిపించింది. ఏమిటా సార్వకాలికత? కనకదుర్గ గారు గాంధేయవాద దృక్పథాన్ని సైద్ధాంతికంగా బలపరిచారని నేను సూత్రీకరించడం లేదు. నవలానుసారం ఆమె ఆ ప్రయత్నం గట్టిగానే చేశారు. లేదా స్వరాజ్య స్థాపన కోసం ఏర్పరుచుకున్న జాతీయ విద్యా విధానం, ఖద్దరు వస్త్రధారణ, అవినీతి లంచగొండితనం రూపుమాపడం వంటి కొన్ని ఆశయాలను కనకదుర్గ గారు ఇప్పటి కాలానికి అన్వయించి పరీక్ష చేయదలుచుకున్నారా? అని కూడా అనిపిస్తుంది. ఎందుకంటే ఇప్పుడు సరిగ్గా అవే విషయాలపై దేశవ్యాప్తంగా కొత్త భావనలు ఏర్పడుతున్నాయి. నూతన జాతీయ విద్యావిధానం, అవినీతి నిరోధక చట్ట సవరణలు, అపరిమితమైన ఈడీ అధికారాలు, జాతీయభాషగా హిందీని రుద్దడం వంటి విషయాలపై ప్రజల్లో వస్తున్న భిన్న అభిప్రాయాలను ఈ దిశగా మనం క్రోడీకరించుకోవచ్చు.

హృదయనేత్రి నవల రచనోద్దేశ్యాన్ని కనకదుర్గ గారు చాలావరకూ బాగానే అర్థం చేసుకున్నారు. స్వాతంత్ర్య ఫలాలను దుర్వినియోగ పరచకూడదన్న ఎరుక కలిగించడంలో నవల యొక్క పాత్రలు ఎంత సహజసిద్ధంగా తీర్చిదిద్దబడ్డాయో ఈ విశ్లేషణ వల్ల తెలిసివస్తుంది. విషయానుక్రమణికను పరిశీలిస్తే ఇతివృత్తం, రచనా శిల్పం అన్న విభాగాల్లో కనకదుర్గ గారి విశ్లేషణ సూటిగా ఉంది. రాముడత్తయ్య పాత్రని మాలతీ చందూర్ ఎంత ఉదాత్తంగా తీర్చిదిద్దారో కనకదుర్గ గారు కూడా అంతే గొప్పగా పరవశంతో ఒక దేశ సేవిక రూపంగా మనముందుకు తెస్తారు. అలాగే ఆమె మేనల్లుడు గోపాలరావు పాత్రను కూడా కనకదుర్గ గారు వాస్తవానికి మించి మనకి దగ్గర చేసే ప్రయత్నం చేస్తారు. అత్తయ్యంటే అతను చూపించే ప్రేమ చాలా బాగుంటుంది. నిజానికి ఆమె వల్లే అతను తన వ్యక్తిత్వాన్ని నిర్మించుకుంటాడు. ఉటంకిస్తే సబబుకాకపోయినా మేనత్తల ప్రాధాన్యాన్ని అత్తారింటికి దారేది వంటి సినిమాల్లో చూసి సంబరపడేవాళ్ళకి రాముడత్తయ్యని తప్పక పరిచయం చేయవలసిన అవసరం ఉంది. ఎందుకంటే ఆ పాత్ర మానవ సంబంధాలను ఎంత చలనశీలతతో అర్థం చేసుకుంటుందో చెప్పేందుకు మాటలు సరిపోవు. జాతీయోద్యమంపట్ల ఈ తరానికి ఉండవలసిన కనీస అవగాహనకి హృదయనేత్రి వంటి నవలలు దోహదపడతాయి. అదొక్కటేకాదు, తెలుగు సాహిత్యంపై గాంధీవంటివారి ప్రభావం అపారమైనది. ఉన్నవ గారి మాలపల్లి, ఆచార్య

రంగా గారి హరిజన నాయకుడు వంటివాటితోబాటు ఇతర భారతీయ భాషలలోనైతే లెక్క లేనన్ని రచనలు వచ్చాయి. ముల్క్‌రాజ్ ఆనంద్ గారి అంటచబుల్ (1935), ఆర్కే నారాయణ్ వెయిటింగ్ ఫర్ ది మహాత్మ (1955), వంటి నవలలు చారిత్రక ప్రాధాన్యం గలవి. కవిత్వమూ, నాటకాలు, వ్యాసాలైతే చాలా ఉటంకించవలసి వస్తుంది. సత్యాగ్రహ ఉద్యమాన్ని, నూలు వడకడాన్ని, మాలతీచందూర్ కథాగమనంలో భాగం చేస్తారు. అది ఆమె రచనాశిల్పానికి గొప్ప ఆకృతినిచ్చిందని కనకదుర్గ గారు అంటారు. బందరు జాతీయ పాఠశాలలో అస్పృశ్యుడైన నందయ్యతో కలసి గదిని పంచుకున్న గోపాలరావు పాత్ర ద్వారా హరిజనోద్ధరణను రచయిత్రి చిత్రించిన తీరు సాహిత్య ప్రయోజనంగల రచనా శిల్పానికి పెద్ద పీట వేయడమేనని కూడా చెబుతారు. ఉప్పు పన్ను ప్రస్తావన, గోపాలరావు పెళ్ళి సందర్భంగా వాసుదేవరావు చేసిన వ్యాఖ్యలు పరిశీలన చేసిన కనకదుర్గ గారు గాంధీ తత్వాన్ని ప్రశంశాపూర్వకంగా సమర్థించారని మనకి అర్థమవుతుంది. ఎమర్జన్సీ కాలాన్ని చర్చించగలిగిన హృదయనేత్రి నవల విభజన సందర్భంగా గాంధీపై వచ్చిన విమర్శను గురించి మాలతీ చందూర్ గారు ఎందుకు లేవనెత్తలేదో ఎక్కడా కనకదుర్గ గారు వ్రాయలేదు. హృదయనేత్రి నవలలో ఉన్న చారిత్రకత ప్రాధాన్యాన్ని కనకదుర్గ గారు విస్మరించకపోయినా గోపాలరావుకొడుకు శ్రీనివాస్ పాత్ర చిత్రణలో ఉన్న వైరుధ్యాలను ఎక్కువ చర్చకు తీసుకోలేదు. ఎందుకు?

శ్రీనివాస్ పార్వతి గోపాలరావుల కొడుకు. తాను నమ్మిన ఆశయాల కోసం అతను విప్లవోద్యమంలోకి వెళ్తాడు. తోటి కామ్రేడ్ రమను పెళ్ళాడతాడు. తండ్రి అహింసా సిద్ధాంతంకన్నా తుపాకి గొట్టంతోనే విముక్తి సాధ్యం అని నమ్ముతాడు. ఈ పాత్ర గాంధీ సిద్ధాంతాన్ని పరీక్షకు నిలబెడుతున్న సంక్లిష్ట పరిస్తితిని మన కళ్ళ ముందుకు తీసుకు వస్తుంది. దృక్పథ వైవిధ్యాన్ని గురించి కనకదుర్గగారు మరింత మాట్లాడగలిగిన అవకాశం ఉంది. స్వాతంత్ర్యానంతరం పెరిగిపోతున్న అవినీతి, స్వలాభాపేక్ష, లంచగొండితనం, పీడన వంటివాటికి వ్యతిరేకంగా పుట్టిన నక్సల్బరీ ఉద్యమ ప్రభావం గాంధీని గాంధీతత్వాన్నీ పక్కకు నెట్టింది. శ్రీనివాస్ ఆ కొత్త సామాజిక దృక్పథాన్ని గురించి అద్భుతంగా మాట్లాడతాడు. మహీధర కొల్లాయిగడితేనేమి, రథచక్రాలు నవలలు ఇక్కడ ఉదహరించదగినవి. కొల్లాయిగడితేనేమి గురించి రారా వంటివారు చారిత్రక దృష్టితో ఎలా చూశారో, హృదయనేత్రిని అలానే చూడవలసిన అవసరం ఉంది. 'నవలలోని దేశ కాల పరిస్తితులు ఒక చారిత్రక దశా విశేషం' అంటాడు రారా. శ్రీనివాస్ పాత్రలో ఉన్నఘర్షణ వయక్తికమైనది కాదు, ఒక సామాజిక ఉద్యమ ధర్మం తెలియజెప్పిన సంఘర్షణ. మళ్ళీ ఇక్కడ రావుల్ఫాక్స్ (విప్లవకారుడిలో) చెప్పిన సజీవ మానవుణ్ణి ఉటంకిస్తాను. శ్రీనివాస్ పాత్రలో ఉన్నసజీవతను మాలతీ

చందూర్ గాంధేయవాద ఆకర్షణ చేత పరిమితంగా చిత్రించారు. దాన్ని గురించి కనకదుర్గ గారు సౌకర్యవంతంగా విస్మరించడం కొంత బాధ కలిగించింది.

నవలా విమర్శ అంత ఆకర్షణీయమైన పని కాదు. ఈ సందర్భంగా గురజాడ చారిత్రక నవలల్ని విమర్శించిన విషయాన్ని, నవలా ప్రక్రియపై పింగళి లక్ష్మీకాంతం గారి సూచనల్ని గుర్తుచేసుకోవచ్చు. నవలా విమర్శలో దేశకాల పరిస్థితుల చర్చ ఎంత ముఖ్యమో పునరుద్ఘాటించవచ్చు. మొదలి నాగభూషణ శర్మ గారి తెలుగు నవలా వికాసము పుస్తకం గుర్తుచేసుకుందాం. నవలల వర్గీకరణ ఎలా ఉన్నా హృదయనేత్రిని కనకదుర్గ గారు సాంఘిక చారిత్ర దృష్టిని కలగలిపి చూశారు. చారిత్రక సన్నివేశాలను ఎంత గొప్పగా నవలలో చిత్రించారో ఆయా సామాజిక రుగ్మతలను కూడా మాలతి చందూర్ చాలా గొప్పగా రాశారు. వాటిని కనకదుర్గ గారు కూడా సమర్థవంతంగా గ్రహించారు. తనదైన రీతిలో విశ్లేషించి మనముందు పెట్టారు. ఇది చదివినవాళ్ళకి హృదయనేత్రి నవలలో రచయిత్రికిగల ప్రాపంచిక దృక్పథం పాఠకులకి తెలుస్తుంది. దాంతోబాటు వర్తమాన రాజకీయాలను అర్థం చేసుకునేందుకు కావల్సిన సిద్ధాంత స్పష్టత కూడా అలవడుతుంది. ఇందులో ఒక వివరణాత్మక ధోరణి ఉంది. శిల్పంతో పోలిస్తే వస్తు పరిశీలన సమర్థవంతంగా ఉంది. కనకదుర్గ గారిది సంస్కరణవాద విమర్శ. ఏది ఏమయినా ఈ గ్రంథ గొప్పదనానికి మొత్తానికీ మాలతీ చందూర్ గారు ముఖ్య కారణమైతే ఆ రచయిత్రి సంస్కారాన్ని మనకు సరైన విధంగా అందించడానికి కనకదుర్గ గారు చేసిన కృషి ఇంకా ప్రశంసనీయమైనది. ఎందుకంటే ఇలాంటి రచనలకు ఈ రోజుల్లో ఎవరు పూనుకుంటున్నారు ? హృదయనేత్రి నవల ఈ తరంలో ఎంతమందికి తెలుసు ? కనుక కనకదుర్గ గారు ధన్యురాలు. ఆమెకు హృదయపూర్వకంగా నమస్కారాలు. ఈ పుస్తకం నవలా విమర్శ పరిణామక్రమంలో తన స్థానాన్ని తప్పక స్థిరపరుచుకుంటుంది.

18-05-2025

శ్రీరామ్ పుప్పాల

యూనియన్ బ్యాంక్ రీజియనల్ మేనేజర్, వరంగల్

నా...చూపు

1990 సం. నాటికే శ్రీమతి మాలతీచందూర్ రాసిన హృదయనేత్రి అనే ఈ నవల నేటికీ చదవుకోవాల్సిన అవసరం ఉందనిపించింది. రచయిత్రి మనోనేత్రాన్ని విమర్శనాత్మక దృక్కోణంలో నుండి దర్శించగలిగితే పాఠకుల మరోనేత్రపుదృష్టి మరింత విశాలత్వాన్ని సంతరించుకుంటుందని ఆశించటం జరిగింది. ఎందుకంటే భారతదేశ ఆధునిక ప్రజాస్వామ్య సాధనలో స్వాతంత్ర్యానికి పూర్వం దేశభక్తిప్రపూరితమైన ఖద్దరు ఉద్యమం సత్యాగ్రహాల మేళవింపుతో ప్రాణత్యాగం ఆ హృదయనేత్రాలలో నిండిఉండేది. స్వాత్త్ర్యం దేశాభివృద్ధికై లభించిన అవకాశం. దాన్ని విస్మరించటంతో స్వాతంత్ర్యానంతర వ్యవస్థలో దేశభక్తికంటే స్వార్థభుక్తి కడుపునింపుతుంటే ఆ కళ్ళు పచ్చనోట్లతో కామెర్ల కాసారాలు అవుతున్నాయి. రాజకీయవ్యవస్థలోని ఆశ్రితపక్షపాతం, అవినీతి జమిలిబంధం సామాన్యప్రజావళి పాలిటి ఉరితాళ్ళుగా మారుతున్నాయి. హింస పెచ్చుపెరిగిపోతోంది. ఉద్వేగాలను తట్టుకోలేక కట్టుతాళ్ళు తెంచుకొని పిడికిలి బిగించి పోరాటం చేయటమే మార్గమనుకుంటున్నా దానిలో ప్రాణాలు పోవటంతప్ప వ్యవస్థమాత్రం మార్పుకు గురికావటంలేదు. దేశరక్షణకై ప్రాణాలను పణంగా పెట్టటానికి సైన్యం ఎల్లవేళలా సంసిద్ధంగా ఉండనే ఉంటుంది. అంతర్గతవ్యవస్థల రక్షణకోసం జీవితాలను నిలబెట్టుకోవలసిన అవసరంకూడా భారతప్రజలకు ఉంటుంది.

భారతదేశ స్వాతంత్ర్యపోరాటం సంస్కరణవాదంతో బలపడింది. కాని కుహనాసంస్కర్తల చేతిలో దేశభక్తికి అర్థం మారిపోయింది. హక్కులపోరాటంలో అలసిన హృదయాలెన్నో. అలాగని యువశక్తి నిరాశనిస్పృహలతో కొట్టుమిట్టాడుతుంటే అభివృద్ధి అథఃపాతాళంలోకి వెళ్ళిపోతుంది. దీనికి ప్రత్యామ్నాయాన్ని సూచించేది రచయితలే. సమాజంలో అలజడులకు పరిష్కారాలను సూచించి మనోనేత్రాలను విప్పారింపచేసేది రచనలే. ప్రస్తుతసమాజంలోని అసంతృప్తులను, ఆందోళనలను అధిగమించటానికి సాహిత్యం మాత్రమే ప్రజలచేతిలో ఉన్న పరికరం. మనిషి తనకాళ్ళమీద తాను నిలదొక్కుకుంటూ దేశానికి తాను చేయానుకొనే నిస్వార్థసేవ హృదయసంస్కారాలకు ఆయువుపట్టుగా స్వాతంత్ర సమరశీలురు దర్శించిన భారతదేశ భవిష్యత్తును నేటి యువశక్తి తమ హృదయనేత్రాలతో

చూడటమే వారిముందున్న కర్తవ్యం. దేశస్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకొనే బాధ్యత నేటి యువతరానిదే. పోరాటాలుచేసి జైలుశిక్షను అనుభవించటం ఒకప్పటి దేశభక్తి కాని నేడు దేశానికి తమ శక్తిమేరకు మానవాళికి అవసరమైన సేవచేయటం నేటి దేశభక్తి. గురజాడచెప్పిన – దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ – అనే కవితాసూక్తిని మననంచేసుకుంటూ చేయగల ప్రయత్నంయొక్క ఆరంభానికి ఈ నవల కరదీపిక కాగలుగుతుంది. ఆశయంలేని సిద్ధాంతం ఉండదు. సిద్ధాంతంలేని ఆశయం ఉండదు. ఏదైన మంచి ఆశయాన్ని ఆచరణలోకి తీసుకురావటానికి దానికొక సిద్ధాంతబలం ఉండాలి. అందుకే నవలలో దేశనాయకుల అహింసామార్గాన్ని మరొకసారి ప్రతిపాదించాలనుకొన్న రచయిత్రియొక్క ఉద్దేశ్యాన్ని పాఠకులకు అందించే క్రమంలో నా ఈ విమర్శనాత్మక సిద్ధాంతగ్రంథం –స్వాతంత్ర్యయువశక్తి–సహృదయసంధాత్రి–కాగలుగుతుందనే భావన. శ్రీమతి మాలతీచందూర్ రాసిన–హృదయనేత్రి– అనే నవలను యువనేత్రాలు మరింతగా విశాలదృక్కోణంతో దర్శించాల్సిన తరుణమిది.

నవలలో ప్రతిఫలించిన రచయిత్రి ఉద్దేశ్యంతో నిష్పక్షపాతంగా హృదయసంవాదం చేయగలిగినప్పుడే అది సహృదయ విమర్శ అనిపించుకుంటుంది. ఇక్కడ విమర్శకుల వ్యక్తిగత అభిప్రాయాలకు తావుండకూడదు. విమర్శకూడా ఒక కళ. ఉద్యమసిద్ధాంతల చర్చలకు అవకాశం తక్కువ. పాత్రలజీవనవిధానంలోనే అది ప్రతిఫలిస్తుంది. దేశవిభజన జరిగిపోయింది. హిందూముస్లిముల సమైక్యత శాంతి సాధనాశ్రిత ఆశయం. కొట్లాటలను కొని తెచ్చుకోవాల్సిన అవసరం ఉండకూడదు. చరిత్ర ఆయా కాలమాన పరిస్థితులనుబట్టి రాజకీయవ్యవస్థలో నాటి సమస్యల పరిష్కారాలకై కొన్ని నిర్ణయాలు తీసుకోవటం జరుగుతుంది. వాటిలోని తప్పొప్పులను బేరీజువేసుకుంటూ అహింసామార్గంలో శాంతియుతంగా పరిష్కరించుకోకపోతే దేశభద్రతకుకూడా ముప్పు ఏర్పడేప్రమాదం ముంచుకొస్తుంది. దేశస్వాతంత్ర్య పరిరక్షణకై ప్రాణాలను బలిపెట్టంవల్ల ప్రయోజనం సిద్ధించనప్పుడు నిస్వార్థంగా మానవాళి సేవయే ప్రత్యామ్నాయం అని పాఠకులు తమ హృదయనేత్రాలతో దర్శించటానికి ఈ హృదయనేత్రి నవలా ప్రయోజనం సిద్ధిస్తుంది. అందుకే ఈ విమర్శగ్రంథం స్వాతంత్ర్యంనాటి యువశక్తిని పుంజుకోవటానికై పాఠకుల సహృదయసంధాత్రి కాగలుగుతుందని విశ్వసిస్తున్నాను.

పుప్పాల శ్రీరామ్ గారు మంచి విశ్లేషకులు. వృత్తిపరంగా రీజినియల్ మేనేజర్గా బ్యాంకింగ్ రంగంలో ఉన్నప్పటికి ప్రవృత్తిపరంగా సహృదయ సాహితీవేత్తలు. స్వాతంత్ర్య యువశక్తి–సహృదయసంధాత్రి – అనే నా ఈ విమర్శగ్రంథానికి ముందుమాట రాయమని కోరినప్పుడు

వీలుచేసుకొని పాఠకచైతన్యానికి మరింతగా పదునుపెట్టాలనుకొని మేలైన జోడింపుగా తమ అభిప్రాయాలను తెలియచేసినందుకు వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఈ విమర్శ గ్రంథాన్ని అచ్చురూపంలో ప్రజలముందుకు తేవటానికి పూనుకొన్న శ్రీశ్రీ ప్రింటర్సు, విజయవాడ శ్రీ విశ్వేశ్వరరావు గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. ఈ విమర్శ పుస్తకం యొక్క ప్రచురణకై తమ సహాయ సహకారాలను అందించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుకోవటం నా బాధ్యత.

– జంధ్యాల కనకదుర్గ

విశ్రాంత ప్రిన్సిపల్, సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ కళాశాల,

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.

విషయానుక్రమణిక

			పత్రసంఖ్య
	అంకితం		iii
	విమర్శకు మేలైన జోడింపు...	- శ్రీరామ్ పుప్పాల	v
	నా... చూపు	- జంధ్యాల కనకదుర్గ	ix
1.	'హృదయనేత్రి' - రచయిత్రి పరిచయం.		1-3
2.	నవలాప్రక్రియ-లక్షణాలు		4-7
3.	'హృదయనేత్రి' నవల- రచనోద్దేశ్యం		8-10
4.	భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర-లక్ష్యాలు		11-17
5.	'హృదయనేత్రి' నవల-కథేతివృత్తం)		18-55
6.	దేశస్వాతంత్ర్యానంతర పరిస్థితులు		56-60
7.	'హృదయనేత్రి' రచనా శిల్పం-		
	7.1 పాత్రచిత్రణ		61-124
	7.2 కథనశిల్పం		125-143
8.	సైద్ధాంతిక ప్రతిపాదన-గాంధేయదృక్పథం		144-153
9.	హృదయనేత్రి నవల- సాహిత్యప్రయోజనం		154-156
10.	పాదచూచికలు		157-185
11.	ఉపయుక్తగ్రంథాలు.		174

1. 'హృదయనేత్రి' రచయిత్రి పరిచయం

'హృదయనేత్రి అనే నవలను వ్రాసిన శ్రీమతి మాలతీచందూర్ కేంద్రసాహిత్య అకాడెమి అవార్డు గ్రహీతగా తెలుగు ప్రజానీకానికి సుపరిచితురాలే. 1930-2013 మధ్యకాలంలో జీవించిన ఉత్తమ సాహిత్య సృజనశీలి, సామాజిక సేవాతత్పరురాలు. మానవతామూర్తి అని అందరి ప్రశంసలు అందుకొన్న విదుషీమణి. కేంద్రసాహిత్య, ఆంధ్రరాష్ట్ర సాహిత్య అకాడెమి, రాజాలక్ష్మి ఫౌండేషన్, మద్రాసువారి కళాసాగర్ వంటి విశిష్ట అవార్డులతోపాటు అనేకపురస్కారాలు మాలతీచందూర్‌ని వరించి పునీతం అయ్యాయి. 'ప్రమదావనం' లో పరిమళించిన సాహిత్యమాలతీ సుగంధవల్లిక ఈమె. ప్రముఖ పాత్రికేయులు శ్రీ చందూరు నాగేశ్వరరావు గారితో వివాహం జరిగి మాలతీ చందూర్‌గా ప్రసిద్ధి చెందారు. రచయితల సాంగత్యంలో జ్ఞానేత్రానికి మనస్సును జోడింపచేసి సహృదయపాఠక చైతన్యాన్ని కలిగించే రచనలతో మానవత్వపు విలువలను విస్తృతం చేసిన రచయిత్రి. ఆమె జీవించిన శతాబ్దంలోని ఆర్థిక-రాజకీయ పరిణామాలయొక్క ప్రభావిత సమాజాన్ని తరతరాలకు అందించిన అమరజీవి. తెలుగులో 27 నవలలు, పాతకెరటాల పేరుతో 300 కు పైగా ఆంగ్లరచనలకు అనువాదాలు చేసారు. మద్రాసులోని శ్రీ పొట్టిశ్రీరాములు స్మారకసమితి సంస్థాపక సభ్యురాలిగాను, అధ్యక్షులుగాను చెన్నైలో తెలుగుసాహితీ వైభవానికి చిరస్మరణీయైన ముద్రను వేసారు. సమాజాన్ని దగ్గరగా చూసి, సమస్యలపట్ల స్పందించి, అభివృద్ధికరమైన స్వీయసంస్కారపు ఆలోచనలను పాత్రలపరంగా నిక్షిప్తంచేసి రచనలు చేసారు. అందుకే అశేష పాఠకజనదృష్టిని తన సాహిత్యంవైపు మళ్ళింపచేయగలిగారు. అందునా మహిళలయొక్క స్వీయవ్యక్తిత్వాలకున్న విలువలను గుర్తింపచేసే రచనలు అవటంచేత మహిళాప్రగతికి రాచబాటను వేయగలిగాయి. వారి రచనలు అబలలను ప్రబలలుగా తయారయ్యేవిధంగా చైతన్యపరుస్తాయి. స్త్రీలపట్ల వకాల్తా పుచ్చుకొన్నట్లున్నా, ద్వేషాతీతంగా ఉండటంతో పురుషులుకూడా తమలోకి తాము తొంగి చూసుకొనే రీతిలో ఉంటాయి. సమాజంలో సమస్యలను సృష్టించేవారు అధికారాన్ని చెలాయించే వ్యక్తులే. అయితే అదే వ్యవస్థలో సంస్కారంగల వ్యక్తులుంటే వారి సాన్నిహిత్య సహకారాలు మానవసమస్యలకు పరిష్కారంగా కనపడతాయి. ఆ క్రమంలోనే మనుష్యుల్లో మంచితనాన్ని మేలుకొలిపి జీవితలక్ష్యాలను ఏర్పరచుకొనే విధంగా ఈమె వ్రాసిన నవలల్లో 'ఆలోచించు', 'బ్రతకనేర్చినజాణ', ఏది గమ్యం? ఏదిమార్గం 'ఎన్నిమెట్లెక్కినాలి',

‘గౌతమీపుత్రి’, ‘కలలవెలుగు’, ‘కాంచనమృగం’, ‘లావణ్య’ ‘మధురస్మృతులు’, ‘మనసులోనిమనసు’, ‘మేఘాలమేలిముసుగు’, ‘శతాబ్దిసూరీడు’, ‘హృదయనేత్రి’, ‘రేణుకాదేవిఆత్మకథ’, ‘సద్యోగం’, ‘భూమిపుత్రి’, ‘ఓమనిషికథ’, ‘రాగరక్తిమ’, ‘జయలక్ష్మి’, ‘కృష్ణవేణి’, ‘శిశిరవసంతం’, ‘రెక్కలచుక్కలు’, ‘వైశాఖి’, ‘ఏమిటి జీవితాలు’ వంటినవలలు, ‘చంపకం-చెదపురుగులు’ వంటి కథలు, పాతకెరటాలవంటి అనువాద రచనలు ప్రసిద్ధి పొందినవి. ఏ నవలకు ఆ నవలే ప్రత్యేకమైన ఇతివృత్తంతో తగిన కథనశిల్పంతో సామాజిక ప్రయోజనం కలిగిఉంటాయి.

మాలతీచందూర్ రచించిన ‘ఆలోచించు’ అనే నవలలో స్త్రీపురుష సంబంధాలను అర్థంచేసుకొనే క్రమంలో స్త్రీల సమస్యలకు వెనకాల ఉన్న మూలకారణాలను అన్వేషించగలిగి ఎవరిస్థితి ఏమిటో తెలుసుకొనేటట్టు రాసిన నవల. స్త్రీ తన అస్తిత్వం గురించిన ఆలోచనలను పెంచుకొంటూ సమాజంలో తనకంటూ ఒకస్థానాన్ని ఏర్పరచుకోవటమనే చైతన్య స్పృహను, తాత్వికదృష్టిని కలిగించే నవల. ఎంతో ఆదర్శవంతమైన వివాహాలలో కూడా మానవత్వం వెనకాల ఉన్న పురుషస్వార్థం స్త్రీని మానసిక హింసకుగురి చేస్తుందని, పురుషాధిక్యత స్త్రీల జీవితాలను బలిచేయటం-ఏదిగమ్యం? ఏది మార్గం? లో అర్థమౌతుంది. ‘కాంచనమృగం’ అనే నవలలో మానవసంబంధాలకు కులం, వర్గం అడ్డుగోడలుకావని తెలుస్తుంది.

ఆకలి, ఇంటిచాకిరి, ఆర్థికపరిస్థితుల ప్రేరేపణ కుటుంబ సంస్కృతిని అధిగమింపచేస్తుందని తెలియచేసే నవల అది. సూక్ష్మస్థాయిలో పరిశీలిస్తే ఇటు కుటుంబంలోని స్త్రీపురుషసంబంధాలలోని సంక్లిష్టతలు, అటు సామాజికంగా మానవసంబంధాల పరిణామాల మధ్యన మానవమనస్తత్వాల విశ్లేషణ పాఠకులను చైతన్యపరుస్తాయి. ‘లావణ్య’ అనే నవలలో డాక్టరు దంపతుల సేవలలోని మానవత్వపు గుబాళింపును మధురస్మృతిగా మిగిల్చి, మనస్సుల్లోనుంచి వచ్చే ప్రేమాభిమానాలకుండే విలువలను తెలియచేసే నవల అది. ‘సద్యోగం’ అనే నవలలో స్త్రీపురుష లైంగికసంబంధాల విషయాలలో స్త్రీలు జీవితంలో మోసపోయినా అందులోంచి బయటకువచ్చి ఉద్యోగంలో తనశక్తిని నిరూపించుకుంటూ వ్యక్తిగతానికి తావులేకుండా విధినిర్వహణచేయటమే సద్యోగం అని భావింపచేసే నవల. రచయిత్రి ఓల్గా పేర్కొన్నట్లుగా మాలతీచందూర్ రాసిన నవలల్లో “వాస్తవజీవితం, ఆధునిక దృష్టి, సంప్రదాయాల నిరసన, కొత్తదారులలో నడిచేవారి జీవితాలలో వచ్చే సమస్యలపట్ల సానుభూతి, స్త్రీలసమస్యలను ఆధునికదృష్టితో పరిశీలించటం, వివిధజీవన సందర్భాలలో చిక్కుకున్న పాత్రల మానసికవిశ్లేషణ” కనపడుతుంటాయి. ‘శతాబ్ది సూరీడు’ నవల దాదాపుగా గత శతాబ్దపుకాలపు ప్రారంభంనుండి జీవితం మొదలై, ఆ శతాబ్దపుముగింపు వరకు జీవించిన ‘సూరమ్మ / సూరీడు’ జీవిత చరిత్ర. దాదాపుగా శతాబ్దకాలంలో మారిన రాజకీయార్థిక, సామాజిక పరిస్థితులలో మహిళాసాంస్కృతిక పరిణామం ప్రజాస్వామికంగా స్థిరరూపం దాల్చవలసిన విషయాన్ని తెలియజేసిన

రచన. కేంద్రసాహిత్య అకాడెమి అవార్డును అందుకొన్న 'హృదయనేత్రి' నవలలో ఆంధ్రప్రాంతంలో చీరాల–పేరాల ఉద్యమంతో ప్రారంభమైన జాతీయోద్యమం నాటి ఆశయాలు, ఉద్యమఘట్టాలు, ఖద్దరు ధారణ, హరిజనోద్ధరణ, స్త్రీలు ఉద్యమంలో పాల్గొనటాన్ని చిత్రీకరించిన నవల. అంతేకాక, స్వాతంత్ర్యానంతరం ధనం, అధికారదాహంతో మానవీయ విలువలు తగ్గిపోయి, మనుషులలో స్వార్థంపెరగటం, రాజకీయాలు భ్రష్టుపట్టటంతో కొత్తసిద్ధాంతాలు సమాజంలో పుట్టుకురావటం అనివార్యం అవటంగా నవలలో పేర్కొనటం జరిగింది. స్వాతంత్ర్యానంతరం జాతీయోద్యమ స్ఫూర్తి విలువలు కోల్పోయి విప్లవోద్యమంగా రూపాంతరం చెందటం అర్థమౌతుంది. అంతేకాదు, చారిత్రక సంఘటనలతో మానవనీయవిలువలను ప్రతిపాదిస్తూ యువతదృష్టిని కర్తవ్యదిశగా సారింపచేసిన నవల. ఈ నవలకు 1992లో కేంద్రసాహిత్య అకాడెమి అవార్డు వచ్చింది కాబట్టి ఈ నవల రచనాకాలం ఇదమిద్ధమని నిర్ణయించలేకపోయినా దీనిని కనీసం 1990 లోపు రాసినట్టుగా భావించవచ్చు. ఎందుకంటే గతమూడేళ్ళలో రాసిన పుస్తకాన్ని మాత్రం ఆ అవార్డుకు అర్హతగా భావిస్తారుకాబట్టి దాన్నిబట్టి రచనాకాలాన్ని ఊహించవచ్చు.

మాలతీచందూర్ రాసిన 1947 నుండి రచనా వ్యాసంగాన్ని ప్రారంభించారు. రవ్వలడ్డూలు, లజ్ కార్నర్, నీరజకథలు, పాతకెరటాలు పేరుతో వచ్చిన అనువాద నవలలు. ఈమె రాసిన పిండివంటలు, వంటావార్పు, ప్రమదావనం పేరుతో వివిధ పత్రికలలోని శీర్షికలతో ఈమెను ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారితో అనుబంధం ఏర్పడింది. నవలలు, అనువాద నవలలు ఈమెకు ఎన్నో అవార్డులను తెచ్చిపెట్టాయి. మాలతీచందూర్‌కు పురస్కారాలు వాటంతట అవే మాలతీ తీగలవలె ఆమె సాహిత్యమూర్తిమత్వాన్ని అల్లుకొని ప్రపంచవ్యాప్తంగా గుబాళింపులను వ్యాపించేసాయి. ఈమె రాసిన హృదయనేత్రి నవలకు కలకత్తాలోని భారతీయ భాషాపరిషత్ అవార్డుతోపాటు కేంద్రసాహిత్య అకాడెమి అవార్డు వరించింది. అంతేకాదు ఈమె రచనలను గౌరవిస్తూ మాదిరెడ్డి సులోచన అవార్డు, మద్రాసు తెలుగు అకాడెమి అవార్డు, రాజాలక్ష్మి అవార్డు, గురజాడ అవార్డు, చెన్నై కళాసాగర్ అవార్డు, ఇల్లిందల సరస్వతీదేవి అవార్డువంటివి అనేకం అందించారు. అంతేకాక, శ్రీ పద్మావతి మహిళావిశ్వవిద్యాలయం, పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయంవారు ఈమెను గౌరవ డాక్టరేటులతో సన్మానించారు. 1. ఇంతటి ప్రతిష్ఠాత్మక సాహిత్యగౌరవం గల రచయిత్రి మాలతీచందూర్ రచించిన 'హృదయనేత్రి' 2. నవలను తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

హృదయనేత్రి కథావస్తువును రచించటానికి రచయిత్రి ప్రత్యేకంగా నవలాప్రక్రియని ఎంచుకోవటానికున్న వెసులుబాట్లను అర్థం చేసుకునే క్రమంలో నవలాప్రక్రియ లక్షణాలను, అందులోని కథనశిల్పం, పాత్రచిత్రణను తెలుసుకోవాలి.

2. నవలాప్రక్రియ - లక్షణాలు

ఆధునిక యుగంలోని సాహిత్య ప్రక్రియలలో నవలారచనకు ఒక విశిష్టమైన స్థానం ఉంది. విస్తృతసమాజ ప్రతిఫలనానికి ఆలవాలమై కాలక్రమానుగత సామాజిక యథార్థ జీవనాన్ని ప్రతిబింబించేది నవల. అవసరమైతే గతకాలపు లోతుల్లోకి కూడా తొంగిచూసి ఆనాటి నుండి నేటివరకు ఉన్న పరిణామసమాజాన్ని వాస్తవికంగా దర్శనీయంచేయగల అవకాశం ఉన్న రచన నవల. క్రమానుగతమైనకాలం నవలలో అంతస్సూత్రంగా ఉంటుంది. చరిత్రలో సామాజిక–సాంస్కృతిక, ఆర్థిక–రాజకీయాలు మానవజీవనాన్ని ప్రభావితంచేసినప్పుడు మానవ జీవితాలలో ఆటుపోట్లు సంభవిస్తాయి. బలహీనతలు చోటుచేసుకుంటాయి. వాటిమధ్యన నిలదొక్కుకోవటానికి నిండైన వ్యక్తిత్వచైతన్యాన్ని అందించేది నవల. జీవితం, జీవించటం ఒక కళ. అందుకే లార్డ్ డేవిడ్ సెసిల్ నవలగురించి చెప్తూ 'సజీవమానవజగత్తును పరిచయంచేసే కళాకృతి నవల"[1] అన్నాడు. జీవితాన్ని ప్రతిబింబించే నవలారచన కథాత్మక కళగా రాణిస్తుంది.

సమగ్రజీవితాన్ని ప్రతిబింబిస్తూ సంఘంలో మానవజీవితాలలోని చెడునుపోగొట్టి మంచిని పెంచేదిగా ఉండేదే నవలారచన అని భావించారు. ఆధునిక యుగంలో ప్రాథమికంగా వచన ప్రబంధంగా పేర్కొనబడి, తరువాత నవలగా ప్రక్రియ స్థిరపడింది. ఈ నవలలు ప్రధానంగా వస్తుపరంగా సామాజికనవలలు, చారిత్రకనవలలు, పౌరాణికనవలలు, విప్లవాత్మక నవలలుగాను, కాలానుక్రమానుగతంగాను విభజించి చెప్పటం తెలిసిందే. నవల అనేది కథాత్మక కళ. సంభాషణలు, నాటకీయతవంటి దృశ్యకావ్య కథనంతో కూడిన సమాహార కళా శ్రవ్యకావ్యపేటిక. దాన్ని గురించిన అవగాహనకై, స్థూలంగా నవలారచన స్వరూపస్వభావాలను తడిమి చూడాలి. 'యథార్థజీవనాన్ని యథార్థదృష్టితో అధ్యయనం చేసి దానిని గద్యరూపంలో వ్యక్తం చేసేదే నవల' అని రిచర్డ్స్ క్రాస్ ఉటంకింపు[2]. మాలతీచందూర్ గారి నవలలకు సరిగ్గా సరిపోతుంది. చరిత్రలోని వాస్తవ జీవితానికి కాల్పనికతను జోడించి కథగా మలిస్తే రూపొందేది నవల. యుగచిత్రణ నవలయొక్క ధ్యేయమని, దానిలో సమకాలీన సమాజ మానవజీవితాల చిత్రణ ఉండాలని నిర్దేశించారు[3]. పాత్రకి, సంఘటనలకు ఉన్నసంబంధం నవలా రచనకు అతిముఖ్యమైనది. అమెరికన్ నవలాకారుడు హెన్రీ జేమ్స్ చెప్పినట్లుగా

పాత్రల నడవడి, చేసేపనులనుండి ఆయాపాత్రలవైశిష్ట్యం వ్యక్తమౌతుంది[4]. అందుకే పాత్రలను, ఇతివృత్తాన్ని వేరుచేయలేరు. స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్యానంతర భారతదేశపు యుగచరిత్రలో భవిష్యత్తును హృదయనేత్రంతో దర్శించి కర్తవ్యాన్ని సూచించే దృష్టికోణాన్ని ఆవిష్కరించిన నవల హృదయనేత్రి.

కథేతివృత్తం కాలక్రమానుగతంగా ముందుకు సాగేవిధంగా ఉండవచ్చు. వెనకనుంచి ముందుకువచ్చి క్రమానుగతిలోను సాగవచ్చు. జలం బిందువునుండి సింధువు వరకు విస్తరించినట్లు మానవజాతి సంభృతమైన విశాలవిశ్వం వరకు జీవనయానం సాగించవచ్చు. రాజకీయ-ఆర్థిక, సామాజిక-సాంస్కృతిక స్వభావంతో కూడుకొన్న సంఘటనాత్మకమైన ఇతివృత్తంలో వ్యక్తులయొక్క అభిప్రాయాలను భావాలను విభిన్నకోణాలనుండి అభివ్యక్తీకరిస్తూ సమగ్రసమాజాన్ని ప్రతిఫలింప చేయగల సాహిత్యప్రక్రియ నవల. ఆయా సంఘటనల ప్రభావం పాత్రలద్వారా వ్యక్తీకరింపబడుతుంది. పాత్రలకు సంఘటనలకు సంబంధం ఉన్నప్పుడే కథేతివృత్తం సజావుగా సాగిపోతూ పాఠకులకు ఉత్కంఠతను కలిగిస్తుంది. అప్పుడే ఆ విషయం పాఠకుల మనస్సులలో స్థిరంగా చోటుచేసుకొంటుంది. ప్రణాళికాబద్ధంగా కార్యకారణ సంబంధాలతో కూడిన మానవచర్యలతో ప్రధానంగా సాగేది ఇతివృత్తం[5]. అందుకే పాత్రల స్వభావచిత్రణ సహజంగా ఉండాలి.

కథేతివృత్తంలో భాగంగా సజీవపాత్రచిత్రణతో రాజకీయ-ఆర్థికపరిస్థితుల నేపథ్యంలో సామాజిక జీవనసంస్కృతిని వ్యక్తంచేస్తూ అర్థవంతమైన పరిణామచైతన్యాన్ని విస్తృతంచేయగల సృజనాత్మక రచన నవల. కల్పన చేయటం కళకోసమే, కాని సామాజిక వాస్తవిక చిత్రణ మానవాభివృద్ధికోసం జరగాలి. సామాజిక జీవిత సత్యాలను చెప్పాలనుకొన్న రచయిత ఆయా కథాసంఘటనలలో పరోక్షంగా పాత్రలపరంగా చెప్పించటం ఉత్తమ రచనా లక్షణం. అందుకే పాత్రచిత్రణ నవలకు ఆత్మ వంటిదంటారు. ఇతివృత్తాన్ని, పాత్రలను వేరుచేసి చూపించకూడదని విమర్శకులు భావిస్తారు. సంభాషణద్వారా కథావికాసగమనం జరుగుతుంది. రచయిత దృక్కోణంలో ఉన్న సత్యాలను పాత్రలమనస్తత్వాలలోను, వారి చర్యలలోను పొందుపరచటం చేయాలి. అవసరమైనచోట ప్రతీకలు, భావచిత్రాలు, వర్ణనలు చిత్రించడంలో రచయిత పరోక్షంగా తనని తాను వ్యక్తీకరించుకోవచ్చు[6]. జీవితంపై ఒక దృక్పథాన్ని కలిగించేది నవల[7]. ఎంతో అవసరమైనప్పుడు మాత్రమే రచయిత కథనం కనిపించటం రచనాశిల్పానికి దోహదం చేస్తుందనేది విమర్శకుల భావన. కథేతివృత్తంలోని ప్రతి సన్నివేశం కేంద్రకం చుట్టూ అల్లుకొని ఉంటుంది. దానినే కథాసంవిధానం అంటారు. సూది-దారానికి ఉన్నసంబంధంలాగా కథావస్తువుకు, శిల్పానికి సంబంధం ఉంటుంది

కాబట్టి రచయితయొక్క కళాత్మకత నవలాకథాశిల్పంలో ప్రతిఫలిస్తుంది[8]. ప్రారంభంనుండి ముగింపువరకు రచయిత ఎన్నుకొన్న వస్తువిషయంయొక్క ప్రణాళికాబద్ధమైన కథానిర్వహణలో నవలాశిల్పం ఉంటుంది[9]. పాత్రపరిశీలనాదృష్టి, ప్రపంచజ్ఞానం, హృదయసంస్కారాలపై కథాపరిణామ వికాసాలు ఉంటాయి. ఆ పాత్రలను ఏ నేపథ్యపుశక్తులు నడిపిస్తున్నయో వాచ్యం చేయకుండానే ప్రతిపదంలోను స్ఫురింపచేస్తూ రచనచేయటం, సామాజికభావాలకు తప్ప పక్షపాత బుద్ధిలేకుండా మానవసంబంధాలలోని స్త్రీపురుషపాత్రచిత్రణ చేయటంలోనే రచయిత గొప్పతనం యిమిడిఉంటుంది. అప్పుడే అది శాశ్వతవిలువలతో గొప్పసాహిత్య మౌతుంది.

మానవజీవితాలకు విలువలుంటాయని భావించి వ్యక్తిత్వస్పృహ ఏర్పడినప్పుడు సంఘర్షణలకు లోనవటం, కుటుంబసంబంధాలలో సంక్లిష్టతలు చోటుచేసుకున్నప్పుడు గుండెనిబ్బరంతోకూడిన మానవీయత సమస్యలకు పరిష్కారం చూపుతుంది. అది స్థిరంగా ఉంటేనే మనిషికి శాశ్వతవిలువలు ఏర్పడతాయి. ఇదంతా పరిణామశీలక పాత్రచిత్రణలో స్పష్టమౌతుంది[10]. అయితే ఆ పరిణామం సహేతుకత, కార్యకారణ సంబంధంతో సమంజసంగా ఉంటూ మిగిలినపాత్రల చర్య, ప్రతిచర్యల ఫలితంగా స్పష్టమవ్వాలి. రచయిత పాత్రలరూపురేఖలను వర్ణించటంకన్నా సంఘటనాత్మక చర్యలలో ఆయా పాత్రల క్రియాశీలకతలో వాటిని స్ఫురింపచేయాలి. ఒక్కొక్కప్పుడు పాత్రల అంతరంగమనో విశ్లేషణరూపంలో పాత్రల స్వభావం అర్థమౌతుంటుంది. చారిత్రక కాలగమనంలో సామాజిక చలనసూత్రాల పరిణామాలు చోటుచేసుకుంటున్నా కుటుంబజీవన సంస్కృతిలో ఉండే మౌలికత అంతస్సూత్రంగా ఉంటూనే ఉంటుంది. మానవసంబంధాలలోని ప్రజాస్వామికత వ్యక్తుల ఆలోచనలను ప్రేరేపించినప్పుడు, క్రియాశీలకమైన అనుభూతులు, అనుబంధాలను పటిష్ఠంచేసేవిధంగా పాత్రచిత్రణ ఉన్నచోట అంతర్గత రచనాశిల్పం యిమిడి ఉంటుంది. పాత్రలు కథేతివృత్తానికి లొంగి ఉండటంకంటే సన్నివేశాల కూర్పుతో పాత్రలే కథని, కాలాన్ని నడిపించటం ఉత్తమ రచనా లక్షణం. అప్పుడే కథాశిల్పం రచనను కళాత్మకం చేస్తుంది. రచయిత కథాగమనదృష్టితో పాత్రల మనస్తత్వాలలో పరకాయ ప్రవేశంచెంది సాహిత్యప్రయోజనం సిద్ధించేరీతిలో ఆయాపాత్రలను సామాజిక వాస్తవపరిధిలో సంస్కారవంతంగా నడిపింపజేయటమే కథనశిల్పం[11].

కథానుగుణంగా సన్నివేశకల్పనలో సామాజికవ్యక్తుల సామీప్యతతో రూపొందింపబడిన పాత్రలను కట్టెదుట నిలబెట్టగలిగిన వాస్తవికత పాఠకహృదయాల్ని మమేకంచేసి చైతన్యాన్ని ఇవ్వగలుగుతుంది. రచయిత తన ఆలోచనలను, ఆశయాలను, ఉద్దేశ్యాలను కథావస్తుగతంగా నాటకీయంగా పాత్రలద్వారా చెప్పించినప్పుడే రచన విలువైనది అవుతుంది. 12 పాత్రల

పూర్వాపరాలు, స్వభావాలు సంఘటనలకు ప్రాణంపోస్తాయి. అటువంటి పాత్రలే రాజకీయ, ఆర్థిక, సాంఘిక–సాంస్కృతిక భేదాలకు అతీతమై మానవత్వపు శక్తిగా ప్రకాశిస్తాయి. అందుకే ఉత్తమమైన నవల సమాజసంబంధాలలో నుండి ఆవిర్భవించి అనుభూతిని ఇవ్వగలిగే విభిన్నజీవితాల పరస్పర ఆధారితాలైన పాత్రచిత్రణతో ఉంటుంది. ప్రధానపాత్రచుట్టూ పరిణామశీలమైన సమాజం కనపడుతూ ఉంటుంది. కాని ఒకొక్కప్పుడు పాతసంస్కృతి మాత్రం పట్టి ఉంచుతున్నప్పుడు, బాహిరపరిణామశీలత లేకపోయినా అంతర్గత సంస్కారయుతమైన మానవత్వం ఉట్టిపడుతుంది. పరిణామశీలమైన ప్రతిపాత్రకు కథేతివృత్తంలో విలువ ఉంటుంది[13]. అప్పుడే రచయిత ఉద్దేశ్యంతో పాఠకహృదయం మమేకం కాగలుగుతుంది. అవసరమైనచోట పాత్రని లోతుగా అర్థంచేసుకొని సహానుభూతిని చెందాల్సివచ్చినప్పుడు రచయిత ఉద్దేశం స్పష్టంచేయటం అర్థమౌతుంది. రచయిత వ్యాఖ్యానం ఎంత తక్కువ ఉంటే అంతగా పాత్రలు కథకు ప్రాణం పోస్తాయి. సృజనకారులు మాత్రమే గ్రహించే విషయం ఇది.[14] ఒక్కొక్కప్పుడు ఉద్దేశ్యపూరితంగా తప్పిదపు చేతలు లేనప్పుడు జరిగిన సంఘటనలకు నైతికబాధ్యత వహిస్తూ పాత్రలు అంతర్మథనం చెందుతూ మనోవిశ్లేషణలోకి జారుతుంటాయి. వ్యక్తి హృదయంలోని ఉద్విగ్నతలో చైతన్యస్రవంతి జాలువారుతుంటే పాఠకుల జీవితాలలోని తుల్యసంఘటనలు ప్రభావితం చేయటంతో వారు తమలోకి తాము తొంగిచూసుకొనే ప్రయత్నం చేస్తారు. పాత్రల సుప్తచేతనకూడా[13] దీనికి మినహాయింపు కాదు. సంఘటనలలోను, పాత్రలలోను సామాజిక వాస్తవికత ఉంటే ఆ రచన పాఠకులకు అంతదగ్గరగాను ఉండి చైతన్యశీలతను సంతరించుకొంటుంది.

సమాజంలోని మానవసంబంధాలలో వ్యక్తులుగా, ఆయా జీవన సంఘటనలలో వారి కదలికలు, నడవడిక, సంభాషణలోని మంచి–చెడులు కలిసి సమ్మిశ్రమంగా కలిగించే కుతూహలత్వం పాఠకులు అంతర్ముఖత్వంతో సంవాదం చెంది ప్రేరేపించిన చైతన్యం వెరసి సమాజాభివృద్ధిదిశగా నడిపింపచేయటం నవలాప్రయోజనంగా భావించవచ్చు. కాలానికి తగినట్లుగా అభివృద్ధికరమైన విప్లవాత్మక ఆలోచనలను కలిగిస్తే ఒక నూతనత్వాన్ని పొంది పాఠకులలో నూతనచైతన్యాన్నికి నవల నిధివంటిది అవుతుంది. ముగింపులో సామాజిక పరిణామప్రభావం కథను తరతరాలకు ఇంకా కొనసాగించేటట్లుగా ఉండాలి. అటువంటి రచనలే సార్వకాలికమౌతాయి. పాఠకులచేత మళ్ళీమళ్ళీ చదివింపచేస్తాయి. ఇటువంటి పరిపూర్ణమైన నవలా లక్షణాలు వాటంతటవే చోటుచేసుకొన్న నవలాశిల్పం కలది మాలతీచందూర్ రచించిన 'హృదయనేత్రి' అనే నవల.

3. 'హృదయనేత్రి' నవల - రచనోద్దేశ్యం

సామాజిక ప్రయోజనకరమైన సజీవ పాత్రచిత్రణతో సాహిత్యచైతన్యం సిద్ధించటంలోనే నవలాశిల్పం ఉంటుంది. స్థల, కాలాదులనుబట్టి పాత్రల మనస్తత్త్వాల ఆధారంగా కథాగమనం ఉండాలి. రాజకీయ–ఆర్థిక, సాంఘిక–సాంస్కృతిక పరిణామాల వాతావరణంలో పాత్రల అభివృద్ధికర నిర్ణయాత్మకత, క్రియాశీలత్వం, మానవీయ సంబంధాల పురోగతి, స్త్రీపురుష సంబంధాలలో వ్యక్తిత్వస్ఫూర్తి కలబోతగా ఉంటే అది ఉత్తమమైన రచన. అటువంటివే సాహిత్యచైతన్యానికి పట్టుగొమ్మలుగా ఉండే రచనలు. అవి విలువలను సంతరించుకొని పదికాలాలపాటు మన్నన పొందగలుగుతాయి. ప్రారంభవిషయం ముగింపువరకు ఉండి అభివృద్ధికరంగానో తిరోగమన రూపంలోనో వాటి పరిణామ ఫలితాలను వ్యక్తంచేసినప్పుడు రచనోద్దేశ్యం స్పష్టమౌతుంది. నేటి వ్యాపారసంస్కృతి విజృంభిస్తున్న ప్రపంచీకరణ సందర్భంలో రెపరెపలాడుతున్న భారతదేశ స్వాతంత్ర్యాన్ని సంరక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడ్డ ఈ తరుణంలో యువతకర్తవ్యాన్ని స్ఫురింపచేస్తూ స్వాతంత్ర్యపరిరక్షణ ధ్యేయంగా 'హృదయనేత్రి' నవలా కథావస్తువు సాగుతుంది. మానవాభివృద్ధి, స్వాతంత్ర్యానుభూతి పరస్పరాశ్రితాలు. మానవాభివృద్ధి అనేది విద్యా, వైద్య సదుపాయాలు, ఆదాయపు వనరులనుబట్టి ఉండి స్వాతంత్ర్యపరిరక్షణకు దోహదకారి అవుతుంది. విషయాలను తెలుసుకోవటానికి 'హృదయనేత్రి' నవలా పఠనంయొక్క ఆవశ్యకత ఉంది.

క్రీ.శ.19 శతాబ్దం నాటి పెట్టుబడిదారీ పారిశ్రామికీకరణకు, ప్రపంచీకరణకు ఉన్న అనుబంధం ఆలోచిస్తే నాడు వలసవాదుల వ్యాపార ధోరణితో కూడిన సామ్రాజ్యవాదం స్థానిక ప్రజలను అస్వతంత్రులను చేసిందనీ, నేటి ఆర్థిక పెట్టుబడిదారీ విధానం ప్రజల స్వాతంత్ర్యాన్ని కబళిస్తూ మానవసంబంధాల ఉనికికి ప్రతిబంధకంగా తయారవుతోందన్న విషయం అర్థం అవుతుంది. శ్రమ, ఆర్థిక దోపిడిని వ్యాపారలాభంగా భావించినపుడు ఏర్పడ్డ మానసిక, శారీరక బానిసత్వమే అస్వతంత్రకు చిహ్నము. నాడు భారతీయుల మనస్సులను, శరీరాలను, ఆలోచనలను అడ్డగించిన బ్రిటిష్ వారియొక్క ఆర్థిక, రాజకీయ, దాస్యశృంఖాలాలను వదిలించుకోవటానికి చారిత్రక జాతీయోద్యమం అవసరమైంది. నేడు ప్రపంచదేశాలలోని మార్కెట్ శక్తుల లాభార్జన, వనరుల

దోపిడి, రాజకీయ అవినీతి, అధికారం ముమ్మరమై వ్యక్తుల సామాజిక జీవనస్వాతంత్ర్యానికి ముప్పు ముంచుకొస్తోందనే అభద్రతాభావంనుండి విముక్తిని కలిగించే మార్గం కావాలి. పరిష్కారదిశగా గతానుభవంలోకి తొంగి చూసుకోవటానికి దేశభక్తిని, జాతీయాభిమానాన్ని పెంపొందించుకోవటానికి స్వదేశీవస్తు తయారీకి, విదేశీవస్తు వినియోగ నిరసనకై భారతదేశ స్వాతంత్ర్యోద్యమంనాటి సాహిత్య పఠనావసరం ఎంతైనా ఉంది. జీవితపరిస్థితులను, జాతిసంస్కారాన్ని మెరుగుపరచటమే ఏ యుగంలోనైనా సాహిత్యానికి ఏకైకలక్ష్యం కనుక జీవనపరిస్థితులను వ్యక్తులసంస్కారాలలో ఉన్న కంటకాలను, కాలుష్యాలను బహిర్గతంచెయ్యటం సాహిత్యానికి యెప్పుడూ ప్రథమకర్తవ్యంగానే ఉంటుంది[1]. కనుక హృదయనేత్రి నవలా రచయిత్రికూడా వ్యవస్థలోని వ్యక్తుల రాజకీయకాలుష్యాన్ని బహిర్గతంచేసి జాతిసంస్కారాన్ని మెరుగుపరచాలనుకోవటంగా రచయిత్రి ఉద్దేశం అర్థమౌతుంది. నేటి పాఠకులు తాము నిజమైన స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్నామా లేదా అని తమలోకి తాము తొంగి చూసుకొని తమని తాము అర్థంచేసుకోవటానికి, స్వాతంత్ర్యపరిరక్షణకు పూనుకొనేవిధంగా జ్ఞానవంతులు కావటానికి 'హృదయనేత్రి' అనే నవల ఎంతో ఉపయోగపడుతుంది.

భారతదేశ స్వాతంత్ర్యోద్యమకారుల వారసులుగా దేశస్వాతంత్ర్య సంరక్షణబాధ్యత అందరిపై ఉన్నది. స్వాతంత్ర్యం అందించిన ఆస్తిపాస్తులను అనుభవించటంలో ఉన్న శ్రద్ధ భారతీయులకు దేశాభివృద్ధిలోనూ దేశ సంరక్షణలోను తగినంతగా ఉండటంలేదు. అందుకే దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలొడ్డి పోరాడిన స్త్రీ, పురుషుల జాతీయోద్యమ స్ఫూర్తిని నేటికీ సంస్మరించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. నాడైనా నేడైనా జాతిని ఏకం చేసేది జాతీయత, మాతృదేశాభిమానమే. నేటి ప్రపంచీకరణ సందర్భంలో అటువంటి మానసిక స్థితిని అందుకోవటమే జాతీయాభిమానము. భిన్న సంస్కృతులు, భిన్న ప్రాంతాలు, భిన్నమతాల కదంబమాలలో ఏకసూత్ర బంధనమే భారతజాతీయత. అదే భారతీయుల దేశాభిమానం. దానిలోనే మానవుల స్వేచ్ఛ ఇమిడి ఉంటుంది. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా 1947 సంవత్సరంవరకు సాగిన నాటి ఉద్యమకారుల్లోఉన్న జాతీయాభిమానమే భారతదేశ స్వాతంత్ర్యసాధనకు మూలకారణమని స్మరించుకోవాలి. వారిస్ఫూర్తిని కొనసాగించుకుంటూ నిరంతరం దేశాన్ని సంరక్షించుకొనే దేశభక్తి నేటికీ అవసరం. అందుకోసం స్వార్థం, అవినీతి, ధనదాహం లేకుండా ఉండాలి. దేశభక్తి అంటే భారతీయుల అభివృద్ధిని కోరుకునే ఒక సహజ మానసికస్థితి. దానిలో సేవాభావన ఇమిడి ఉంటుంది. ప్రతిఒక్కరూ జీవితంలో ఆ నాటి గాంధేయదృక్పథాన్ని అలవరుచుకొని దేశస్వాతంత్ర్యరక్షణకు నేటి యువత పూనుకోవాలనేది రచయిత్రిఉద్దేశ్యంగా భావించవచ్చు[2]. సమాజానికి అవసరమైన సేవను యువత తమ

హృదంతరాళాలలోకి తెచ్చుకొనే దృష్టిని సారింపచేయటమే సహృదయనేత్రి అవుతుంది. తనేంటో తనకేం కావాలో తరచి చూసుకునే స్వేచ్ఛాభావనను తమ జాతికి విస్తరించాలని అనుకోవటమే జాతీయత. ఆ జాతీయతను ప్రతిఫలించిన సాహిత్యపఠనం అవసరం. అటువంటి రచనయే మాలతీ చందూర్ రాసిన హృదయనేత్రి అనే నవల.

రచయితలతో పాఠకులు హృదయ సంవాదానుభూతిని పొందే సాహిత్యమిది. రచయిత తెలియ చెప్పాలనుకొన్న సామాజిక మానవ విలువలు సంఘటనలలోనుంచి సహజంగా పుట్టుకొచ్చినప్పుడే చైతన్యస్పృహను కలిగించి నవలాప్రయోజనం సిద్ధింపచేస్తుంది. అటువంటి ఉత్తమ రచనగా రాజకీయ–ఆర్థిక, సామాజిక–సాంస్కృతిక స్పృహను కలిగించే 'హృదయనేత్రి' అనే నవలను అవలోకించాలి. అప్పుడే అది పాఠకుల సహృదయసంధాత్రి అవుతుంది. ఈ హృదయనేత్రి అనే నవలా నేపథ్యానికి మూలం స్వాతంత్ర్యోద్యమ కాలం కాబట్టి ఆ స్వాతంత్ర్యోద్యమ చారిత్రక ఘట్టాలను, వాటి లక్ష్యాలను గుర్తుకు తెచ్చుకోవాలి.

4. భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర - లక్ష్యాలు

భారతీయులలో అంకురించిన 'జాతీయతా' భావం స్వాతంత్ర్యసంపాదనకు మూలమైన శక్తిగా పరిణమించింది. బ్రిటిష్ పాలనలోని సామాజిక, ఆర్థిక, మత పరిస్థితులు జాతీయతను ప్రేరేపించటంతోబాటు నాటి పత్రికలు, దేశీయవాఙ్మయం ప్రచారంచేసిన జాతీయతా భావాలు పరస్పర పోషకాలై స్వాతంత్ర్యం సిద్ధించేవరకు కొనసాగిన పోరాటంగా భారతీయుల జాతీయాభిమానం స్పష్టమైంది. ఈ జాతీయత బ్రిటిష్ వారి 'విభజించు పాలించు' అనే సూత్రానికి లొంగకపోయినా, స్వార్థపరుల కుట్రలకు భారతీయుల ఐక్యతా భావం బలి అయింది. అందుకే స్వాతంత్ర్యానంతరం కూడా సమైక్యతను కాపాడుకోవాల్సిన పరిస్థితి నేటికీ కొనసాగుతోంది. స్వరాజ్యస్థాపన, ప్రజలయొక్క ఆర్థిక, సాంఘిక, నైతిక, వైజ్ఞానికాభివృద్ధి, ఆత్మవికాసాభివృద్ధిని సాధించుటమే జాతీయతాలక్ష్యంగా కొనసాగిన స్వాతంత్ర్యోద్యమం భారతీయుల ఆత్మగౌరవ పతాకగా నిలచింది.

వలసపాలకులనుండి దేశానికి విముక్తి కలిగించాలనే "జాతీయతా భావం" ఉద్యమ స్ఫూర్తిని పొందింది. భారతదేశ ప్రజలలో స్వపరిపాలనకై కలిగిన రాజకీయరంగ ప్రవేశపు ఆకాంక్షయే బ్రిటీష్ పాలనలో భాగస్వామ్యం కోరుకొనేటట్టు చేసింది. దేశీయ ప్రతిపత్తికై సంపూర్ణ స్వరాజ్యంకోసం ఏర్పడిన తపనయే జాతీయోద్యమంగా విస్తృతిని పొందింది. చరిత్రపరిశోధకులు తెలియజేసిన భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామచరిత్రను[1] సంగ్రహంగా అవగాహన చేసుకోగలిగితేనే జాతీయాభిమానానికి ఉన్న విలువ అర్థమవుతుంది.

1773 సం.లో భారతదేశంలో వ్యాపారాన్ని క్రమబద్ధీకరించటానికి బ్రిటిష్ ప్రభుత్వం 'భారతదేశవ్యాపార రెగ్యులేటింగ్ చట్టాన్ని' అమలుపరచింది. వర్తకరూపేణా భారతదేశానికి వచ్చిన ఇంగ్లీషువారు 1776 లో 'ఈస్ట్ ఇండియా కంపెనీ' ని ప్రారంభించారు. భారతీయరాజుల, జమీందారుల అంతర్గత కుమ్ములాటలనే బలహీనతల నేపథ్యంలో తమ వ్యాపారాన్ని పెంచుకుంటూ ప్రావిన్సులను తమ అధీనంలోకి తెచ్చుకోవటంతో బ్రిటిష్ ప్రభుత్వం1784 సం.లో భారతదేశ రాజకీయాలలో ప్రవేశిస్తూనే గవర్నర్ల వ్యవస్థను ప్రారంభించింది. బ్రిటిష్ అధికారులు పాలనకై భారతీయుల భాషలను నేర్చుకోవటం కంటే కూడా వారికే ఇంగ్లీషుభాషను నేర్పటం సులభమని

భావించి 1817లో బెంగాల్ లో హిందూ కళాశాలను స్థాపించారు. 1824 నాటికి భారతీయులలో కొంతమంది ఇంగ్లీషు విద్యాధికులు కావటంతో పాశ్చాత్యవిద్యల అభివృద్ధి, పాశ్చాత్య మానవ సమానత్వం, ప్రపంచ దేశాలలోని వలస పాలనను అవగాహన చేసుకున్నారు. 1833 నుండి కంపెనీల చేతినుండి బ్రిటిష్ గవర్నరు జనరల్ ఆధ్వర్యంలోకి భారతదేశ పాలనాధికారం వచ్చింది. మానవ స్వేచ్ఛ, ప్రజాప్రభుత్వం, జాతీయత అనే విప్లవాత్మక భావాలు ఏర్పడటంతో భారతీయులలోని విద్యాధికవర్గం 1839 నాటికి చట్టపరమైన రాజకీయ సంఘాలుగా ఏర్పడ్డారు. మరొకప్రక్క హైందవమత ధర్మపునరుద్ధరణకై సంస్కర్తలు బ్రహ్మమత, ఆర్యమతసమాజాల స్థాపనలతో మతసంస్కరణలకు పూనుకొని భారతీయ ప్రాచీనసంస్కృతి, దాని పరిణామములను విశ్లేషించుకుంటూ సాంఘికసంస్కరణలకు పూనుకున్నారు. తద్వారా ప్రజలలో ఐక్యతాభావాన్ని పెంపొందించాలనుకున్నారు.

ఈస్టిండియా కంపెనీ ప్రవేశపెట్టిన భూమిశిస్తు విధానంతోనూ, కరవుతోనూ భారతదేశంలో రైతులు కుదేలయ్యారు. ఇంగ్లాండు యంత్రావిష్కరణతో వస్త్రపరిశ్రమను పెంచుకునే క్రమంలో నేత వస్త్రాలపై పన్నులు పెంచేసరికి స్వదేశీ చేనేతవస్త్రాల ఎగుమతి తగ్గింది. బ్రిటన్ వస్త్రవ్యాపారంతో భారతదేశంలోని నేతపనివారి ఆర్థికస్థితి దిగజారింది. కంపెనీ పాలకుల వ్యాపారాభివృద్ధియొక్క ఆధిక్యత, ఆంక్షలు, వెనుక బడిన భారతీయుల ఆర్థికస్థితి, రైతులపై పన్ను భారం భారతీయులను కృంగదీశాయి. సైనికులు మరియు నావికులలో క్రైస్తవ మతమార్పిడుల వల్ల ఏర్పడిన అసంతృప్తి కలసి వెరసి భారతీయులలో జాతీయతా జ్వాలలను రగిలించటంతో తాము పరాయి పాలనలో పరాధీనులుగా ఉంటున్నామన్న గ్రహింపు కలిగింది. భారతీయుల ఆర్థికస్థితి బ్రిటిష్ వ్యాపారస్థుల ఆధిక్యం క్రింద ఉన్నంతవరకు స్వావలంబన ఉండదని భావించటంతోనే 1857వ సంవత్సరంలో తిరుగుబాటు చేయటమే సిపాయిల తిరుగుబాటుగా చరిత్రలో చోటుచేసుకుంది. అదేకాలంలో స్వదేశీహక్కుకై పోరాడిన ఝాన్సీలక్ష్మీబాయి వీరమరణం చెందింది.

1858 వ సంవత్సరంలో ఈస్టిండియా కంపెనీ పాలన బ్రిటీష్ రాణియైన విక్టోరియా చేతుల్లోకి వెళ్ళింది. గవర్నరుజనరల్ పదవిని వైస్రాయిగా మార్చి బ్రిటిష్ వారి రాజప్రతినిధిగా ఇండియా పరిపాలనను నిబంధించే హక్కును ఇవ్వటంజరిగింది. వైస్రాయి వ్యవస్థలో భారతదేశం బ్రిటిష్ ప్రభుత్వంలో ఒకరాష్ట్రం అయింది. వ్యాపారాభివృద్ధికై బ్రిటిష్ వారికి భారతీయులతో సత్సంబంధాలు అవసరమయ్యాయి. వ్యాపారస్వేచ్ఛకై పార్లమెంట్ ప్రజాస్వామ్యంలో భారతీయులకు ప్రాతినిధ్యాన్ని ఇవ్వాలనుకొని, పాఠశాలలను నెలకొల్పి ఇంగ్లీషువిద్యను ప్రవేశపెట్టారు.

1858 సం.లో బ్రిటన్ లో విక్టోరియారాణి పరిపాలనలో భాగంగా ఆమె సంస్థానాధీశులతో సంధిచేసుకొని, క్రైస్తవ మతమార్పిడులను తగ్గించి భారతప్రజల అర్హతనుబట్టి ఉన్నతోద్యోగాలలో వీలుకల్పించింది. భారతీయుల ప్రాతినిధ్యంతోపాటు బాధ్యతాయుత పాలనకై 1861సం.లో చట్టం చేసి గవర్నర్లు గల కేంద్ర శాసనసభలలోను, మద్రాసు, బొంబాయి ప్రావిన్సులవంటి రాష్ట్రసభలలో ఇద్దరు చొప్పున భారతీయులకు స్థానం కల్పించారు. స్త్రీల ఉద్ధరణకై చేసిన శాసనాలతోను, భారతదేశంలో కేంద్ర, రాష్ట్రస్థాయిలలో శాసనసభలు ఏర్పడటంతోనూ భారతీయులలో భావవిప్లవం ఏర్పడింది. 1861సం.లో నేరస్థశిక్షాస్మృతిని ప్రవేశపెట్టారు. 1875 సం.లో మొదటిసారిగా భారతదేశంలో మున్సిపల్ సభలు, జిల్లా బోర్డులను స్థాపించటం జరిగింది. బ్రిటిష్ పాలన సాగుతున్న సమయంలో మాతృభూమిని కాపాడుకునే లక్ష్యంతో రాజకీయ సంఘాలన్నీ కలిసి 1885సం.లో అఖిల భారత కాంగ్రెస్ ఏర్పడింది. 1892సం.లో భారతకౌన్సిల్ చట్టంలో ఎన్నికల విధానం వచ్చింది.

బ్రిటిష్ వారు హిందూ ముస్లింలను విభజించి పాలించే దృష్టితో 1905సం.లో చేసిన బెంగాల్ విభజనను వ్యతిరేకించిన జాతీయవాదులుగా లాలాలజపతిరాయ్, తిలక్ మొదలగువారు చేసిన 'స్వరాజ్యం' జన్మహక్కు అనే నినాదంతో 'వందేమాతరం' ఉద్యమం వచ్చింది. బ్రిటిష్ వారి వ్యాపారానికి గండికొడితేనే వారిని పారద్రోలవచ్చని భావించి విదేశీ వస్తుబహిష్కరణ, స్వదేశీవస్తు తయారీతో వందేమాతరం ఉద్యమానికి అంకురార్పణ చేసారు. బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశానికి మార్లే, మింటోలు అనే బ్రిటన్ లోని ఇండియా మంత్రులను వరుసగా రాజప్రతినిధులుగా పంపించగా వారు 1909 సం.లో మింటో-మార్లే సంస్కరణలను ప్రవేశపెట్టారు. శాసనసభల సంస్కరణలను చేసే మిషతో కాంగ్రెస్ లోని మితవాదులను జాతీయవాదుల నుండి విడదీయటంతోపాటు హిందూ ముస్లింలను కూడా విడదీయగలిగారు. వీరు సంస్కరణల రూపంలో గవర్నరు కార్యనిర్వాహణలో దేశరక్షణ, నేరపూరిత కుట్రవంటి శిక్షాస్మృతులను చేసి అనుమానాస్పదులనే మిషతో శిక్షించే దమననీతిని ప్రవేశపెట్టి భారతీయులను అణచటానికి ప్రయత్నించారు. దీనిని వ్యతిరేకించిన ఉద్యమ వాదులను అణచే వీలుకాక 1909 సం.లో మింటే సంస్కరణలో భాగంగా శాసనసభ, జిల్లాబోర్డులు, మున్సిపల్ సభలలోనూ, గవర్నర్ల కార్యనిర్వాహక సభలలోను భారతదేశపు పూర్వపాలకులనే మిషతో ముస్లింలకు ప్రత్యేక స్థానాలనిచ్చే విధంగా సంస్కరణలు చేసారు. బెంగాల్ ప్రజల తిరుగుబాటు ఫలితంగా బ్రిటన్ నుండి వచ్చిన ఇండియా మంత్రి క్ర్యూ కి రాజప్రతినిధియైన హోర్డింజ్ యిచ్చిన సలహా మేరకు 1911 సం.లో బెంగాల్ విభజనను రద్దుచేయటం జరిగింది.

1915 సం.లో దివ్యజ్ఞాన ప్రబోధకురాలైన అనీబిసెంటు లండన్ నుండి ఇండియాకి వచ్చి భారతదేశీయుల బానిసత్వం యెడల స్పందించింది. 1916 సం. నుండి కాంగ్రెస్ జాతీయవాదులైన

తిలక్ తో కలసి పరాయిపాలనను నిరసించేవిధంగా ప్రజలను కూడా కలుపుకొని స్వరాజ్యం కోసం అంతర్గత స్వపరిపాలనకై 'హోంరూల్ ఉద్యమాన్ని' ప్రారంభించింది. దానికి వ్యతిరేకంగా బ్రిటిష్ ప్రభుత్వం తమ దమననీతికి వీలుగా1919 సం.లో 'రౌలత్' చట్టాన్ని ప్రవేశపెట్టింది. ప్రథమ ప్రపంచ యుద్ధసమయంలో దేశరక్షణకై విధించిన సైనికపాలనను రద్దుచేసే మిషతో బ్రిటీష్ ప్రభుత్వం యొక్క ఆదేశంతో రౌలత్ అనే బ్రిటిష్ న్యాయాధికారి భారతీయుల ప్రాథమిక హక్కులకు భంగకరంగా రౌలత్ చట్టాన్ని తయారుచేయగా, దానిని 1919 సం. నుండి ఆచరణలో పెట్టారు. ఖైదీలను వదిలి పెడతామన్నారు కాని వదిలిపెట్టలేదు. 1919 సం.లో పంజాబులోని జలియన్ వాలాబాగ్‌లో భారతీయులు సమావేశమైనప్పుడు డయ్యర్ అనే సైన్యాధికారి తుపాకీ గుండ్లు కురిపించే సరికి 1000 మంది చనిపోయారు. ఎటువంటి విచారణ లేకుండా ఉద్యమకారుల్ని నిర్దాక్షిణ్యంగా శిక్షిస్తున్న సమయంలో గాంధి ఉద్యమంలోకి ప్రవేశించి రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా సత్యాగ్రహోద్యమాన్ని ప్రారంభించారు. గాంధికి జైలుశిక్ష వేసారు. ఉద్యమ ఫలితంగా మాంటేగ్ – ఛేమ్సుఫర్డ్ సంస్కరణల రూపంలో పరిపాలనకై బ్రిటిష్ ప్రభుత్వం ఇండియా చట్టం, 1919 చేయటం జరిగింది. దీనిప్రకారం కేంద్ర రాష్ట్ర శాసనసభలలోని ఎగువ, దిగువ సభలు ఏర్పడ్డాయి.

ఎగువసభలో సంస్థానాధీశులును, బ్రిటిష్ అధికారులతోను కూడిన గవర్నరుకు ప్రత్యేక అధికారాలను ఇవ్వటం జరిగింది. కేంద్రశాసనసభకు బాధ్యతాయుత పరిపాలన ఉండేటట్లు చేసింది. దిగువసభకును సాధారణ నియోజక స్థానాలతోపాటు ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలకును ఎన్నికల ద్వారా ప్రాతినిధ్యం ఏర్పడేటట్లు చేసి, కార్యనిర్వాహక సభలతోపాటు మంత్రివర్గం ఏర్పడేటట్లు రూపొందించారు. దీనితో భారతదేశంలో ప్రజాస్వామ్యానికి పునాది ఏర్పడింది. ధనవంతులకు మాత్రం ఓటుహక్కు ఉంది. ప్రధానశాఖలైన, రక్షణ, ఆర్థిక వ్యవస్థలకు సంబంధం లేకుండా విద్య, వైద్యం, వ్యవసాయం, చిన్న పరిశ్రమల మంత్రిత్వశాఖలను కాంగ్రెసు, ముస్లింలీగులకు కేటాయించి కేంద్రానికి బాధ్యతాయుత పరిపాలన ఉండేటట్టుగా చట్టం చేసారు. దీనితో కాంగ్రెస్ లోని మితవాదులు ఎన్నికలలో నిలబడలేదు. లోకల్ బోర్డులుగా మున్సిపాలిటీ, పంచాయితీల ఎన్నికలు జరగాలని నిర్ణయించారు. 1919 చట్టం ద్వారా గవర్నర్ కు మంత్రులు చేసిన తీర్మానాలను తిరస్కరించే ప్రత్యేక అధికారాలను ఇచ్చారు. మంత్రిత్వ శాఖలలో చేరిన కాంగ్రెస్ జాతీయవాదులు గవర్నర్ కు ఉన్న ప్రత్యేక అధికారాలను నిరసిస్తూ రాజీనామా చేసారు.

1919 చట్టం చేసినా 'స్వరాజ్యం' ఇవ్వనందుకు 1920 సం.లో గాంధి ఆధ్వర్యాన మొదలుపెట్టిన సహాయ నిరాకరణోద్యమంలో భాగంగా తిలక్ మునుపే తలపెట్టిన వందేమాతర

ఉద్యమానికి కొనసాగింపుగా సత్యాగ్రహనిర్మాణ కార్యక్రమాలు మొదలుపెట్టారు. దీనిలో భాగంగా ఖద్దరు స్వదేశీ దీక్ష, రైతుజనోద్ధరణ, విదేశీవస్త్ర బహిష్కరణ, న్యాయస్థానాల బహిష్కరణ, పంచాయితీ కోర్టుల నిర్మాణం, మద్యపాన నిషేధం, జాతీయవిద్య, అస్పృశ్యతానివారణ వంటి సత్యాగ్రహోద్యమ నిర్మాణకార్యక్రమాలు ప్రధానలక్ష్యంగాను, అదనంగా శాసనోల్లంఘనమనే ఉద్దేశ్యంతోనూ సహాయనిరాకరణోద్యమం సాగింది. విదేశీవస్త్ర దుకాణాల దగ్గర పికెటింగ్ ఊరేగింపులు చేయగా అరెస్టులు జరిగాయి. బ్రిటిష్ వ్యాపారం దెబ్బతినటం జరిగింది. 1921 సం.లో అధికపన్నుల రాబడికై చీరాలను మున్సిపాలిటీగా చేసినప్పుడు, దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి ఆధ్వర్యంలో పన్నుల నిరాకరణోద్యమంగా చీరాల-పేరాల ఉద్యమం వచ్చింది. మరొకప్రక్క నల్లమల అడవులలో ఆదివాసీల అటవీహక్కులను హరించినందుకు ఒంగోలులో కన్నెగంటి హనుమంతు తిరుగుబాటును లేవదీసినందుకు అతడు తుపాకీకాల్పులకు గురిఅయ్యాడు. బ్రిటిష్ దేశంలోని స్త్రీలు చేసిన పోరాట ఫలితంగా వారికి అక్కడ ఓటుహక్కు లభించటంతో, 1928 సం.నుండి అక్షరాస్యతగల భారతీయ స్త్రీలకు కూడా ఓటు హక్కు ఏర్పడింది.

అహింసాయుతంగా సహాయ నిరాకరణోద్యమం చేస్తున్నాకూడా భారతీయులకు స్వయంప్రతిపత్తి ఇవ్వనందుకు 1930 సం.లో గాంధీనాయకత్వంలో శాసనోల్లంఘనంలో భాగంగా ఉప్పుసత్యాగ్రహం ప్రారంభించారు. భారతీయులు తమ ఉప్పును తాము చేసుకొని అనుభవించటానికి వీలులేకుండా చేస్తూ 3 శాతంగా ఉన్న ఉప్పుపన్నును 8 శాతానికి పెంచటంతో, ఆ పన్నును నిరాకరిస్తూ చేసిన ఉద్యమమే ఉప్పు సత్యాగ్రహం. 1932 సం.లో శాసనోల్లంఘన ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. స్త్రీ పురుషుల భేదంలేకుండా ప్రజలందరూ ఈ శాసనోల్లంఘనలో భాగస్వాములయ్యేసరికి బ్రిటిష్ వారు భారతదేశ ప్రభుత్వ చట్టం, 1935 ను రూపొందించిచారు. ఇది కేంద్ర, రాష్ట్ర సభలలో సాధారణ నియోజకవర్గాలకు భారతీయులను, అదనంగా ముస్లింలకు, సిక్కులు, క్రైస్తవులు, అస్పృశ్యులను ప్రత్యేక నియోజకవర్గ సభ్యులుగానూ ఎన్నుకోబడే హక్కును కలిగించింది. 1937సం. నుండి ఈ చట్టం అమలులోకి వచ్చింది. సంతకం చేయటం వచ్చిన వారికి మాత్రమే ఓటుహక్కు ఉండేది. 1938 సం.లో జరిగిన ఎన్నికలో కాంగ్రెస్ పార్టీవారు, ముస్లింలీగువారు శాసనసభ్యులుగా ఉండి డొమీనియన్ (స్వయంప్రతిపత్తి) కై పోరాడాలనని అనుకొన్నారు. కాని బడ్జెటును చర్చించే అధికారంగానీ, భారతీయులకు తీర్మానం చేసే హక్కును ఇవ్వకపోయేసరికి అధిక సంఖ్యలో ఎన్నికైన కాంగ్రెసు శాసనసభ్యులు రాజీనామాలు చేసారు. ముస్లింలీగు వారు పరిపాలనలో కొనసాగారు.

గాంధినాయకత్వం సంపూర్ణస్వాతంత్ర్యంకోసం శాసనోల్లంఘనాన్ని తిరిగి కొనసాగించటానికి పూనుకొని 1940-41 సం.లో వ్యక్తిసత్యాగ్రహ ఉద్యమానికి పూనుకోవటం జరిగింది. 1942

సం.లో రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న సమయంలో బ్రిటిష్ వారికి భారతీయ సైన్యసహకారం కావాల్సివచ్చింది. ముందుగా భారతీయులను సంప్రదించకుండానే వారు యుద్ధంచేయాలని బ్రిటిష్ వారు నిర్ణయించటంతో భారతీయులు నిరాకరించారు. కాని బ్రిటిష్ వారు యుద్ధానంతరం భారతీయులకు స్వాతంత్ర్యం ఇస్తామని వాగ్దానం చేయటంతో, భారతీయులు రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొని ప్రాణత్యాగాలుచేసి బ్రిటిష్ వారి విజయానికి దోహదం చేయగలిగారు. యుద్ధానంతరం స్వాతంత్ర్యాన్ని యిస్తామన్న మాట నిలబెట్టుకోక బ్రిటిష్ వారు కాలయాపన చేస్తుంటే సంపూర్ణస్వాతంత్ర్యానికై భారతీయులు 'సాధించు లేదా మరణించు' (డు ఆర్ డై) అనే నినాదంతో 'క్విట్ ఇండియా' ఉద్యమం సాగింది. దానిలో భాగంగా అహింసాయుతంగా ర్యాలీలు, పికెటింగ్ ప్రారంభించేసరికి అరెస్టులు జరిగాయి. బెంగాల్ యువకులు జాతీయవాదియైన సుభాష్ చంద్రబోస్ నాయకత్వంలో సాయుధ పోరాటం జరిపి ప్రాణత్యాగం చేసారు. హిందూముస్లింలలో ఒకరికి భారతదేశపు బాధ్యతాయుత పరిపాలనను అందిస్తామని వాగ్దానం చేయగా హిందువులు ముందు కొచ్చినా, ముస్లింలీగు నాయకుడిగా జిన్నా ఒప్పుకోనందుకు చివరికి ఇండియా-పాకిస్థాన్ గా భారతదేశాన్ని విడగొట్టి బ్రిటిష్ వారు 1947సం. లో భారతీయులకు పరిపాలనను అప్పగించటం జరిగింది[2].

1885 సం. నుండి 1947 సం. వరకు భారతీయ కాంగ్రెసులో అహింసాతత్వంతో ముందుకు సాగాలనుకున్న మితవాదులు, సాయుధ విప్లవాత్మక ధోరణిలో సాగాలనుకున్న జాతీయవాదులు, ప్రజల పోరాటస్ఫూర్తి కలిసివెరసి జాతీయోద్యమాన్ని కొనసాగించారు. పరాయిపాలననుండి భారతదేశానికి దాస్యవిముక్తిని కలిగించి భారతమాత స్వేచ్ఛావాయువులను పీల్చుకొనేటట్టు చేయటానికి భారతీయులు దాదాపుగా 60 ఏళ్ళు పోరాటం చేసారు. ఇది చరిత్రపుస్తకాలు తెలిపే స్వాతంత్ర్యోద్యమ చరిత్ర. అయితే ఆ చరిత్రపట్ల అనుభూతి చెందితేనే దానిని మరచిపోకుండా ఉంటాము. కళమాత్రమే అటువంటి అనుభూతి జ్ఞానాన్ని యిస్తుంది. అందుకే రచయిత్రి భారతదేశచరిత్రను సాహిత్యకళద్వారా పాఠకులు అనుభూతి చెందగలగుతారని, భారతదేశస్వాతంత్ర్యపు విలువలను గుర్తించి, దాని పరిరక్షణకై కర్తవ్యోన్ముఖులు కాగలుగుతారనే ఉద్దేశ్యంతో నవలాప్రక్రియ రూపంలో పాఠకులకు అందించా లనుకొన్నారు. ఈహృదయనేత్రి నవలాపఠనంవల్ల రచయిత్రి కృతకృత్యులు అయ్యారని అర్థమౌతుంది.

'హృదయనేత్రి' నవలలో జరుగుతున్న స్వాతంత్ర్యోద్యమాన్ని కథలుగా చెప్పే స్వాతంత్ర్యోద్య కారిణిగా వందేమాతరం నినాదంతో ఖద్దరు వస్త్రధారిణిగా రాముడత్తయ్య / రామలక్ష్మి నవలా నాయకుడైన గోపాలంతో 'గాంధిగారు స్వరాజ్యం తెచ్చిపెడతాడు-తెల్లవాళ్ళందరినీ తరిమికొడతాడు'

అంటూ చెప్పే వారిద్దరి సంభాషణతో కథాప్రారంభం జరుగుతుంది. వెంటనే కాంగ్రెస్ సమావేశంలో స్వాతంత్ర్యోద్యనాయకుడైన గాంధిప్రచారం ప్రజలలో కలిగించిన ఉద్యమస్ఫూర్తి, దాని ప్రభావంతో మొదలైన చీరాల–పేరాల ఉద్యమం, స్థానికంగా వేసిన పన్నులపై చేసే పోరాటాన్ని గోపాలరావుకి బాల్యంలోనే పరిచయం చేయాలనుకోవటంతో రచయిత్రి ఉద్దేశ్యం స్వాతంత్ర్యంయొక్క విలువలను పాఠకులకు అందచేయాలనుకోవటాన్ని స్ఫురింపచేస్తుంది. అందుకే నవలలోని ఆ వాతావరణంలోకి పాఠకహృదయం చేరుకోవటానికి 'హృదయనేత్రి'[3] నవలా కథేతివృత్తంలోకి ప్రవేశించాలి.

5.'హృదయనేత్రి' నవల - కథేతివృత్తం

రాముడత్తయ్య అని పిలువబడే నలభైఏళ్ళ రామలక్ష్మమ్మగారు ఆ యింటి పెద్దాడబడుచు. ఆమె కడజాతి పిల్లవాడిని యింట్లో పనికి పెట్టుకోవటం, ఉపన్యాసాలను యిస్తూ జాతీయోద్యమంలో తిరగటం, కల్లుదుకాణాల దగ్గర పికెటింగ్ వంటి కార్యక్రమాలలో పాల్గొంటూ ఉంటుంది. కృష్ణాపత్రిక, ఆంధ్రపత్రిక చదవటంవంటి పనులు చేస్తూండటంతో పుట్టింటివారు, ఆ ఊళ్ళోని పెద్దవాళ్ళు ఆమెను గురించి విడ్డూరంగా చెప్పుకోవటానికి కారణం అవుతుంది. ఆమె ఖద్దరుచీరెను కట్టి రాట్నం దగ్గరకూచుని గంటసేపు నూలువడకటం ఆమె దినచర్యలో భాగం. దాన్ని గమనిస్తున్న గోపాలం "అత్తయ్యా రాట్నం వడికితే మనకి స్వరాజ్యం వస్తుందా" అన్న ఆతని సందేహానికి రామలక్ష్మమ్మ గోళ్ళుగిల్లుకుంటూ కూచుంటే స్వరాజ్యం రాదని, గాంధీగారంత గొప్పవాడివి అయితే స్వరాజ్యం వస్తుంది అనీ, ముందు రాట్నం వడకటం నేర్చుకోమని అంది. అక్కడకు వచ్చిన మునసబు బెజవాడలో జరిగే కాంగ్రెస్ సభలో గాంధిగారి దర్శనం చేయిస్తారా అని అడుగుతున్న అతనితో ఆమె తప్పకుండా గాంధి దర్శనం అవుతుందనీ, కనీసం రెండు లక్షలమంది ప్రజలైనా రావాలని, దానికోసం స్వరాజ్యనిధికి చందాలు వసూలుచేసి సభ్యులను చేర్పించమని అంది. అటువంటి దేశభక్తురాలైన ఆమె తన అత్తయ్య అయినందుకు గోపాలానికి దిలాసా ఏర్పడింది. అత్తయ్య మగవాళ్ళతో సమంగా కూచొని మాట్లాడుతుంటే గర్వంగా ఉండేది. ఎనిమిదేళ్ళుకూడా రాని గోపాలం అత్తయ్యతో వాళ్ళ ఊరువెళ్ళాలనుకొంటాడు. గోపాలంతో పాటు ప్లాటాఫారమ్ కు చేరుకొన్న రామలక్ష్మి చుట్టూరా కనిపిస్తున్న పచ్చటి ఆచ్ఛాదనను చూస్తూ ఆ గడ్డకీ తనకు స్వాతంత్ర్యం లేదని, దూరానఉన్న తెల్లవాడు తమజాతిపై అధికారాన్ని చెలాయిస్తున్నాడని, తమ భారతజాతికి విముక్తి ఎప్పుడు కలుగుతుందని అనుకొంది. రామలక్ష్మి భర్త వాసుదేవరావు. న్యాయవాది. గాంధికి ఏకలవ్యశిష్యుడైన ఆదర్శవాది. నూలు వడకటం, తాను స్వయంగా వడికిన నూలుతో నేసిన బట్టలను ధరించటం, విదేశీవస్తు బహిష్కరణ, వృత్తిపరంగా న్యాయస్థానాలను బహిష్కరించటంవంటి స్వాతంత్ర్యోద్యమ కార్యక్రమాలలో పాల్గొనే జాతీయవాది. అన్ని కులాల, మతాలవారిని తన యింటికి తీసుకొచ్చేవాడు. కాంగ్రెస్, స్వరాజ్యసంపాదన అనే ఈ రెండే కులాలు వారికి తెలుసు. అతడు కాంగ్రెస్ సభలకు తనతోకూడా

భార్యను తీసుకువెడుతుండటంతో రామలక్ష్మి అక్కడకువచ్చిన సరోజినీదేవి, ఉన్నవ లక్ష్మీబాయమ్మలను చూసి, వారిలాగా తానుకూడా ఉద్యమ కార్యరంగంలోకి దూకాలనే స్వరాజ్యసంపాదన ధ్యేయం ఆమెలో జీర్ణించుకుపోయింది. తన యింట్లో హరిజనబాలుడ్ని పెట్టుకొని అతనిని చదివిస్తోంది. ఈ దంపతుల్ని సంస్కారప్రియులని, గాంధేయవాదులని గౌరవించేవారు. కాని కొంతమంది దృష్టిలో వీరివి అప్రాచ్యపు పనులు అని అనేవారు ఉన్నారు. గోపాలం ఫస్టుక్లాసు ఉన్న రైలుపెట్టె చూపించి దానిలో ఎక్కుదామంటె రాముడత్తయ్య ఆపెట్టెలోకి తెల్లవాళ్ళు ఎక్కనీయరనీ, అలా ఎక్కినందుకే దక్షిణాఫ్రికాలో గాంధిని తెల్లవారు రైల్లోనుండి తోసేసారనీ, అలా ఎక్కే స్వతంత్రం భారతీయులకు లేదని అంది. భారతీయులకు తమ బట్టలు తాము ధరించటానికిగాని, తమ తిండి తాము తినే స్వాతంత్రంగాని లేదని చెప్పింది. గోపాలం తల్లిదండ్రులవంటి పిరికివాళ్ళవల్ల భారతమాత సంకెళ్ళల్లో పడి ఏడుస్తోందనీ, సంకెళ్ళంటే భారతీయుల కాళ్ళకీ, మనసుకీ వేసిన సంకెళ్ళని రామలక్ష్మి చెప్పి చిన్నపిల్లవాడైన గోపాలానికి స్వాతంత్రం అంటే ఏమిటో అర్థమయ్యేలా చెప్పటానికి ప్రయత్నించింది.

రామలక్ష్మిని తీసుకెళ్ళటానికి స్టేషనుకు వచ్చిన వాసుదేవరావు దారిలోనే ఆమెతో బ్రిటిష్ అధికారులు పన్నులను పెంచటానికై దుగ్గిరాలను మున్సిపాలిటిగా చెయ్యాలనుకొన్నారని చెప్పాడు. బ్రిటిష్ అధికారుల నిర్ణయానికి వ్యతిరేకంగా వారికి మహజర్లను పంపినా, వారు తమ నిర్ణయాలను మార్చుకోనందుకు, గాంధిగారి సలహాను అనుసరించి సత్యాగ్రహంకాని, వూరువదిలిపెట్టి వెళ్ళిపోవటంగాని చెయ్యాలి అని దుగ్గిరాలగోపాలకృష్ణయ్యగారు[1], ప్రజలను ఆర్నెల్లపాటు పన్నులు కట్టవదని చెప్పారని రామలక్ష్మితో వాసుదేవరావు చెప్పాడు. ఇంటికి వెళ్ళే దారిలోనే పన్నులనిరాకరణ ఉద్యమవిషయాలను ఆతడు భార్యతో పంచుకొన్నాడు. ఆ రోజుల్లో స్వరాజ్యోద్యమ కార్యకర్తలకు నిరంతరం దేశవిషయాలు మాట్టాడుకొనే వాతావరణమే ఉండేది. దుగ్గిరాలవారు కార్యాచరణపథకాన్ని నిర్ణయించటానికే రేపు సమావేశమవుతున్నారనీ, దానికి జానకమ్మ నాయకత్వం వహిస్తున్నారని, రామలక్ష్మిని ఆమె సహాయకురాలిగా నిర్ణయించిన విషయాన్ని వాసుదేవరావు చెపుతుండగా ముగ్గురూ యిల్లు చేరు కొన్నారు.

మరునాడు వాసుదేవరావుగారింటికి వచ్చిన దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు గోపాలాన్ని గురించి తెలుసుకొని ఆతడ్ని మిషన్ స్కూల్లో చేర్పించి గుమాస్తాగా తయారుచేయవద్దని, బందరులోని జాతీయవిద్యాలయంలో చేర్పించమనిచెప్పారు[2]. గోపాలం తనతండ్రితో ఊరికివెళ్ళకుండా అత్తయ్యదగ్గరే ఉండాలనుకొన్నాడు. జుట్టును కత్తిరించుకొని క్రాపు చేయించుకున్నాడు.

గోపాలం అత్తయ్య, మామయ్యలదగ్గర ఉండి గోపాలరావుగా ఎదిగాడు. ఖద్దరుచొక్కాతో కాంగ్రెస్ జెండాతో వారితో కలిసి బెజవాడలో గాంధిసమావేశానికి వెళ్ళటానికి అత్తయ్యతో కలిసి

రైలు ఎక్కాడు. ఆ రైల్లో వారు పన్నులనుగురించి మాట్లాడుకుంటూ 'వద్దు, కుయ్యో,మొర్రో' అంటున్నా వినకుండా రుపాయి ఆరణాల ముక్కాని పన్నును అమాంతం ఎనిమిది రుపాయలకు పెంచారని చెప్పుకున్నారు. ఆవిషయాలు అర్థంకాని గోపాలం దానిగురించి చెప్పమంటే 'పెద్దయ్యాక అర్థం అవుతుందని, విన్నమాటలను జాగ్రత్తగా గుర్తుపెట్టుకో' అని రాముడత్తయ్య చెప్పింది. పిల్లలకు చదువులకంటే దేశవిషయాలను బాగా గుర్తుపెట్టుకోమని చెప్పే వారు. ఖద్దరుధరించిన జనంతో కిక్కిరిసిగా ఉన్న జనం తగవులాడుకోవటం అనేది లేకుండా స్నేహితుల్లాగా ఉన్నారంటే అందరి దృష్టిలో దేశస్వరాజ్యంముందు ఈ యిబ్బందులు లెక్కలోనివి కావని అర్థమౌతుంది. గాంధి వచ్చిన బెజవాడ సమావేశానికి రాముడత్తయ్యతోపాటు గోపాలరావు వెళ్ళాడు. విజయవాడలో కొండమీద ఖద్దరు కొల్లాయికట్టి పైన కండువాకూడ లేకుండా సన్ననిగొంతుతో ఉపన్యసించే పిలకమనిషిని చూపించి అత్తయ్య మహాత్మాగాంధికి జేజేలు పలికి జెండా ఊపమని చెప్పింది. ప్రజలందరూ ఆయనను చూడటానికి ముందుకు తోసుకుంటున్నారు. గోపాలరావుకు 'ఈ గాంధినా దేశానికి స్వరాజ్యం తెచ్చిపెట్టేవాడా' అని సందేహంవచ్చింది. అసలు దేశానికి స్వతంత్రం వస్తుందా? స్వతంత్రం అంటే ఏమిటి? అనే ఆలోచనలతో సమావేశానంతరం అత్తయ్యతో వెళ్ళిన గోపాలం యింటికి చేరుకోవటం, ఆ తెల్లవారుజామునే ఊళ్ళోవాళ్ళందరూ యిళ్ళు ఖాళీచేయటం, గొడ్లని, కోళ్ళను తీసుకొని ఆ ఊరి శివార్లుదాటి శిబిరాలపాకల్లోకి చేరుకోవటం జరిగింది.

మహిళలతో జానకమ్మ అంటూ, సొంటూ ఏమిలేవు అందరూ కలిసి కట్టుగా బయలుదేరండి అంటూ సారథ్యం వహిస్తే దుగ్గిరాల గోపాలకృష్ణయ్య మగవాళ్ళనందరినీ బయలుదేరతీసాడు. బ్రాహ్మణకుటుంబంలో జన్మించిన జానకమ్మ జుట్టుతీయించేసిన బాలవితంతువు. ఆ వూళ్ళో వాళ్ళందరికి తల్లో నాలికవంటిది. అమె ముందుగా వంటయింటికే పరిమితమైనప్పటికి, గాంధి గారి బోధనలకు, గోపాలకృష్ణయ్యగారి ప్రభావానికి లోనయి ఆమె ఖద్దరు కట్టటం మొదలుపెట్టింది. ఆమె తఖిలీ పట్టుకొని మాట్లాడుతూనే మొగవాళ్ళలాగా బారుబారులుగా నూలుతీసేది. ఖద్దరుమూటలను నెత్తినపెట్టుకొని యింటింటికి వెళ్ళివస్తుండేది. చీరాలలో ఆమెకు తెలియని యిల్లులేదు. మంచికి చెడుకు ఆదుకొనే కరుణామూర్తి. మంచి అన్నది మాలయైతే ఆ మాలనే నేనవుతానంటూ కడజాతి, అగ్రజాతి అన్న భేదంలేకుండా అందరికీ పురుళ్ళుపోస్తుంటే, అగ్రవర్ణాలవారు ఆమెను వెలివేసారు. ఇంట్లో వాళ్ళు ఆమెకి వసారాలో అన్నం పెడుతుంటే భరించలేక ఆమె ఆప్పటినుండి అపక్వాహారాన్ని తీసుకొనేది. రాత్రిళ్ళు నానపెట్టిన పప్పులు తిని, నగలను ఒళ్ళోనే దాచిపెట్టుకొని గుళ్ళోనే పడుకునేది. ఇంట్లోవాళ్ళు అడిగినా తన నగలు యివ్వలేదని వారికి కోపం.

గోపాలరావు తన అన్న మరణించినప్పుడు వెళ్ళగా అతనిని తల్లి ఉండమన్నా అతడు ఉండననేసరికి రామలక్ష్మి తమకొడుకుకు మందుపెట్టిందని నిందించింది. రామలక్ష్మి దానికి తగ్గట్టుగానే తాను గోపాలానికి స్వరాజ్యమనే మందు పెట్టానని అంది. మునిసిపాలిటీ పన్నులకు వ్యతిరేకంగా ఉద్యమకారులు ఆ ఊరి శివార్లుదాటి వేసుకొన్న శిబిరాలప్రదేశానికి రామ్ నగర్ అనీ, యువకులందరికి రామదండు అని పేరుపెట్టుకున్నారు. గోపాలానికి ఎనిమిదేళ్లు రానందుకు ఆతనిని రామదండుతో చేర్చుకోనందుకు గోపాలానికి ఏడుపు వచ్చింది. చీరాల–పేరాల ఉద్యమాన్ని[2] చూడటానికి గాంధిశిబిరాలకు వచ్చినప్పుడు గోపాలానికి ఆయనను దగ్గరగా చూసే అవకాశం వచ్చింది. రాముడత్తయ్య గోపాలాన్ని గాంధీ దగ్గరకు తీసుకెళ్ళగానే, గాంధి గోపాలంమీద చెయ్యివేసినప్పుడు ఆ స్పర్శ గోపాలంలో ప్రకంపనను కలిగించింది. ఆ సందర్భంలో జానకమ్మ మొదటగా తన నగలను స్వరాజ్యనిధికి యిచ్చింది. గాంధి స్త్రీలకు నగలమీద వ్యామోహం ఉండకూడదనీ, జానకమ్మగారు, మాగంటి అన్నపూర్ణ దానికి ఉదాహరణ అని చెప్పుతుంటే, రాముడత్తయ్యకూడా తన వంటిమీద నగలనుదూసి గాంధిగారికి యిచ్చింది. దానికి గాంధి మళ్ళీచేయించుకోనని హామియిస్తేనే ఆ నగలను తీసుకుంటానని అన్నాడు. ఆ రోజునుంచి రాముడత్తయ్య నగలను ధరించలేదు.

గాంధి వచ్చివెళ్ళిన తరువాత చీరాలలోని సాలెవారు, రంగులు అద్దేవారు శిబిరాలలోకి వచ్చి చేరుకొన్నారు. చీరాల, పేరాల నిర్మానుష్యంగా తయారయింది. ఇళ్ళల్లో నక్కలు గబ్బిలాలు చేరుకొన్నాయి. ఉద్యమకారుల రామ్ నగర్ శిబిరాలల్లో నీళ్ళలేక పోవటంతో రామదండు[3] దూరంనుంచి నీళ్ళుతెచ్చిపోయటం, అక్కడే వంటలు, కూరలు పండించటం, అవసరమైతే పురుళ్ళుకూడా పోయటం చేసేవారు.

దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు ఊరూరు తిరిగి ఉపన్యాసాలు యిస్తుంటే సర్కారువారు ఆంక్షపెట్టి ఆతనిని అరెస్టుచేసేసరికి కొందరు భయపడి ఊళ్ళోకి వెడదామన్నారు. కాని వాసుదేవరావుగారు మాత్రం తాము ఊరిని వదిలి వెళ్ళమని గాంధికి మాటయిచ్చామని, అరెస్టులకు భయపడి ఊరు వదిలేదేలేదని అన్నాడు. ఇంతకంటె కష్టంగా పల్నాడులో పశువులమేతపై వేసిన పన్నును నిరాకరిస్తూ అక్కడి ప్రజలు ఉద్యమం చేస్తున్నారని, ఈ ఉద్యమాన్ని మధ్యలో ఆపొద్దని అంటాడు. ఇలా వాదోపవాదాలు జరుగుతుండగానే పోలీసులువచ్చి శిబిరాలువేసిన చోటు సర్కారువారిదని అన్నారు. ప్రజలు అది పోరంబోకు స్థలమని వాదించినా, చేసేదిలేక సర్కారు ఆ శిబిరాలపాకలమీద పన్నువేసి పీకేస్తామని చెప్పటమేకాక ఊళ్ళోని వారియిళ్లకు నిప్పుపెట్టారు. ఆ

సందర్భంలో సాలెకులస్థుడైన శివయ్య అనే అతను తన కొంప తగలబడి పోతోందని ఏడుస్తూ సామాన్లను కాపాడుకొందామని ఆ మంటల్లోకి వెళ్ళి బూడిదయ్యాడు. దాన్ని గోపాలరావుకూడా చూసి భయపడ్డాడు. శిబిరాలనుండి ప్రజలను తరమలేక సర్కారువాళ్లు పోలీసులను కాపలాపెట్టటంతో, వారి తిండి కోసం శిబిరాలలోనివారు పండించిన కూరగాయలు, పాలు అన్నింటినీ వారు తీసుకెళ్లేవారు. పైపెచ్చు ప్రభుత్వంవారు పోలీసుల, సైనికుల తిండికోసం, భత్యాలకోసం 'ప్యూనిటివ్ టాక్సు' చెప్పి శిబిరాలలోఉన్న వారికి తినటానికి తిండిలేకుండా చేసారు. పోలీసులదౌర్జన్యాన్ని ఎదుర్కొన్నందుకు జానకమ్మను, వాసుదేవరావును అరెస్టుచేసేసరికి గోపాలానికి ఏడుపొచ్చింది. ఒకపక్క అరెస్టులు, మరొకపక్క సర్కారువారు తిరిగి చీరాలను, పంచాయితీ యూనియన్లోకి చేర్చటం యిష్టంలేక పన్నులను తాత్కాలికంగా వాయిదా వేసేసరికి, అందరు రామ్ నగర్ నుండి తిరిగి తాత్కాలికంగా వూళ్ళోకి ప్రవేశించారు. పదినెలలపాటు జరిగిన పన్నులనిరాకరణ ఉద్యమం గోపాలరావుపై చెరగని ముద్రవేసింది. తిరిగి అందరూ మన శిబిరం అనేమాట పోయి మాయిల్లు అనీ, కులం, ఆచారం అంటూ ఎవరికి వారే వేరయ్యేసరికి గోపాలానికి చాలా సందేహాలు ఏర్పడ్డాయి.

చీరాలవాసియైన సుబ్బమ్మలాంటివారు కొంతమంది గాంధి కాలిపోయిన తమ యిళ్ళను కట్టిస్తాడా అంటూ మాట్లాడుతుంటే రాముడత్తయ్య వీరంతా దేశద్రోహులనీ, తమ యిల్లుకాలిపోయిందని బాధపడుతున్నారని అంది. స్వరాజ్యం రావాలంటే యిళ్లూవాకిళ్ళు అన్నింటినీ పోగొట్టుకోవటానికి సిద్ధంగా ఉండాలని, త్యాగంచేయాలని అంది. జైలునుంచి వచ్చిన తరువాత జానకమ్మకు జీవనం గడవటం కష్టమైనప్పటికీ, ఆమెకు తన నగలను తిరిగి చేయించుకొనే స్థితి లేకపోయినా ఆమె అలా యివ్వటాన్నే త్యాగం అనాలని రామలక్ష్మి అంది. తాను కావాలంటే నగలనుచేయించుకునే స్థితిలో ఉన్నాననీ, తను నగలను యివ్వటం త్యాగంకాదని రాముడత్తయ్య చెప్పింది. మనదేశాన్ని మనం పాలించుకోగలిగేటట్లుగా దేశానికి స్వరాజ్యం వస్తే అందరికి తిండిబట్ట ఉంటుందనీ, దరిద్రం ఉండదనీ, నీలాంటి పిల్లలు ఇప్పటిలాగా కాకుండా స్వేచ్ఛగా, ధైర్యంగా బతకవచ్చనికూడా చెప్పింది. ఇంట్లో పడగొట్టబడిన గోడలనుచూస్తే భయంవేస్తోందని గోపాలరావు అంటే ఆ గోడలకు భయపడకూడదనీ, వాటి వెనక ఉన్న దౌర్జన్యాన్నికి హింసకు భయపడాలని రాముడత్తయ్య చెప్పింది. ఆంధ్రపత్రిక చదువుతున్న రామలక్ష్మి గాంధీ అరెస్టుకాబడ్డారనే వార్తచదివి కేకలేసుకుంటూ బయటకు వెళ్లింది. ఇంటిముందు జనం గుమికూడి ఆ వార్తచదవటానికి ప్రయత్నించటం, గాంధి న్యాయమూర్తి ఎదుట తమ స్వాతంత్ర్యంకోసం తాను పోరాడటం తన పవిత్ర ధర్మమని చెప్పిన విషయాలను చెప్పుకున్నారు. గాంధికి ఆరేళ్ళ శిక్ష వేసినందుకు చీరాలప్రజలందరూ ఏడుస్తూ ఆ రోజు వంటలుకూడా చేసుకోలేదు.

రాముడత్తయ్య యింటికి పల్నాడునుండి టోపీలను పెట్టుకొన్న కాంగ్రెస్ కార్యకర్తలు రాత్రిళ్ళువచ్చి సమావేశమయ్యేవారు. పల్నాడులోని అడవిలో ఆదివాసీలు పశువులను మేపుకుంటుంటే 'పుల్లరి' అనే పేరుతో పన్నుకట్టమని సర్కారువారు అన్నారు. అందుకని ఆదివాసీప్రజలు వారికి మంచినీళ్ళుకూడా యివ్వకుండా, పన్నులుకట్టకుండా ఉండేవారు. వారు పన్నుల నిరాకరణోద్యమాన్ని ధర్మబద్ధంగా అహింసాయుతంగా ఉద్యమాన్ని సాగించారు. రెవిన్యూవారు పోలీసులు కలిసి ఆ ఉద్యమ నాయకుడైన ఉన్నవ లక్ష్మీనారాయణను వారి అనుచరులను ఖైదుచేసి ఏడాది శిక్షనువేసారు. ఆ తరువాత నాయకత్వం వహించిన కన్నెగంటి హనుమంతును చర్చలకు ఆహ్వానిస్తున్నట్టు నటించి రమ్మని పిలిపించుకొనగా, ఆయన మించాలపాడు నుంచి కన్నెగట్లకు వస్తుంటే దారిమధ్యలోనే ముప్ఫైమంది పోలీసులు చుట్టిముట్టి తుపాకీలతో కాల్చి చంపారు. చివరిక్షణంలో దాహమని కన్నెగంటి హనుమంతు అడగినా పోలీసులు పైశాచికంగా ఆతని మొహంమీద మూత్రం పోసారు. ఆతనికి అంతిమసంస్కారం చేయటానికి పోలీసులు ఒప్పుకోరు. దానితో జనం తిరగబడ్డారని, ఆతనిని చంపిన చోటనే ఆతని భౌతికకాయానికి అంతిమ సంస్కారంచేసి వచ్చామని కాంగ్రెస్ కార్యకర్త చెప్పాడు. జరిగినదానికి అందరూ బాధపడితే ఊళ్ళో ఒకామె మాత్రం శంకరాచార్యులని జైల్లోపెట్టినట్లే యిదికూడా ఉందని అంది. అక్కడఉన్నవారికి ఆమె అజ్ఞానపు పోలిక అర్థమై ఏమి మాట్లాడలేదు. (అది జయలలిత పాలనాకాలం కాదుకదా) రాములక్ష్మికి యిరవైమంది చందాలు యివ్వగా ఆ డబ్బుతో ఆమె పది బీదకుటుంబాలకు గ్రాసాన్ని ఏర్పాటు చేయవచ్చునుకుంది.

ఆ తరువాత వాసుదేవరావు, జానకమ్మ జైలునుండి విడుదలై వస్తుంటే గుంపులు గుంపులుగా జనం జెండాలు పట్టుకొని వందేమాతరం నినాదాలు చేద్దామనుకుంటుంటే, రామలక్ష్మి వారిని వారించి రెచ్చగొట్టవద్దనీ, మామిడి తోరణాలు కట్టి నూలుమాలలతో వారికి స్వాగతం పలుకుదామని అంది. గోపాలంకూడా రాట్నంవడికి నూలుతీయటం నేర్చుకోవటంతో తాను వడికిన నూలుమాలను వాసుదేవరావు మెడలో వెయ్యాలనుకొన్నాడు. కాని రాముడత్తయ్య ఆ మాలను జానకమ్మ మెడలో వేయించింది. ప్రజలు నిశ్శబ్దంగా తమ తీవ్రమైన నిరసనను ప్రదర్శించారు. విల్లంబుబద్దలాగా వంగిన వాసుదేవరావు, స్ట్రెచరుమీద ఎముకలగూడులాగా ఉన్న జానకమ్మ రైల్లోనుంచి దిగారు. జానకమ్మను జైల్లో నేరస్థులతో కలిపి ఉంచి, ఆమెకు రాళ్ళవంటి ఆహారాన్ని, రాళ్ళు యిసుక కలిపిన పప్పుపులుసు, గొడ్డుకారం బద్దెంకలతో కలిపి ఆ దేశసేవికురాలికి యిచ్చారని, జుట్టుపెరగటంతో పక్కవాళ్ళ తల్లోని పేలన్ని చేరాయని, ఆమె చెబుతుంటే విన్న గోపాలరావుకు అసహ్యంవేసింది. జానకమ్మది జబ్బుకాదని, ఆమెకు జైలువాళ్ళు జబ్బుతెప్పించారని, స్వాతంత్ర్య

యోధులను పూజించటం మాని హింసించటం దారుణమని ఆమెను చూచిన ప్రజలు అంటుంటే రామలక్ష్మికి కన్నీళ్ళుపొంగుకు వచ్చాయి. వాసుదేవరావుకు జైల్లో ఉన్నప్పటినుండి పట్టిన దగ్గు వదలటంలేదు. ఆతనిలో ఉషారు తగ్గిపోయింది. సాయంత్రం జ్వరంవస్తుంటే కప్పుకొని పడుకున్న వాసుదేవరావును చూస్తుంటే గోపాలరావుకు గుబులుగా ఉండేదట. జానకమ్మ కోలుకుంది. వాసుదేవరావు అనారోగ్యంవల్ల రామలక్ష్మి కాకినాడ కాంగ్రెస్ సభకి వెళ్ళలేకపోయింది. రెండువేల గజాల నూలుతీసిన వారికి ఆనాడు కాంగ్రెస్ సభ్యత్వాన్ని యిచ్చేవారు. గాంధి లేకపోయేటప్పటికి ఆ కాంగ్రెస్ సమావేశంలో దుగ్గిరాలవారే ప్రముఖంగా కనపడ్డారని, బులుసు సాంబశివరావు తన కొడుకుపోయిన దుఃఖాన్ని పక్కకుపెట్టి సభను జయప్రదం చేసినందుకు సరోజినీదేవి ఆయనను అభినందించగా తామంతా గర్వపడ్డామని ఆ సభకు వెళ్ళివచ్చిన జానకమ్మ చెపుతుంటే శ్రోతలందరూ కన్నీరు కార్చారు.

రామలక్ష్మి వాసుదేవరావును రాజమండ్రి దగ్గరున్న సీతానగర ఆశ్రమానికి తీసుకెళ్ళటానికి నిశ్చయంచేసుకొన్న రోజే గాంధీని విడదలచేసినట్టు వార్తలు వచ్చాయి. వాసుదేవరావుకు అంటువ్యాధియైన క్షయ ఉంది కాబట్టి గోపాలాన్ని తీసుకువెడతామని వచ్చిన ఆతని తల్లిసీతమ్మ, తండ్రి వెంకట్రామయ్యలతో రామలక్ష్మి తాను గోపాలాన్ని బందరులోని జాతీయపాఠశాలకు పంపి వాడిని స్వతంత్రవీరుడిగా తీర్చిదిద్దాలనుకొన్నట్టు చెప్పింది. అయినా ఆమె వదిన వినకుండా తాము బెజవాడకు మారుతున్నామని అక్కడ గోపాలాన్ని చదివిస్తామని చెప్పింది. పైగా ఆడబడుచుకు తిక్కకుదిరిందని లోలోపల సంతోషపడింది ఆ వదిన. వాళ్ళు గోపాలాన్ని తమతో తీసుకొని వెళ్ళినా, అతని యిష్టప్రకారం బందరులోని జాతీయపాఠశాలలో చేర్చారు. తల్లి తన తమ్ముడైన బుచ్చిని విజయవాడలోని ఇంగ్లీషు పాఠశాలలో చేర్పించింది. పైగా గాంధివల్ల దేశం నాశనమైందనీ, కడజాతివారిని కలుపుకు పోవటంతో దేశంలో కరువుకాటకాలు వచ్చాయని అంది. పదమూడేళ్ల గోపాలరావు తొమ్మిదో తరగతిలోకి వచ్చాడు. బందరు జాతీయపాఠశాలలో ఇంగ్లీషుభాషా నిర్బంధం ఉండేదికాదు. రోజుకు గంటసేపు చర్కా వడకటం ఉండేది. నెలకు రెండువేల గజాలనూలుతీస్తే కాంగ్రెస్ సభ్యత్వం లభించేది. అది పట్టభద్రత కంటె గౌరవనీయపత్రమని అనుకొనేవారు. 'మాకొద్దీతెల్లదొరతనం'[4] అనే పాటలను పాడేవారు. ఖద్దరుతో నేసిన మట్టలాగూలు, అరచేతుల చొక్కాలను ధరించేవారు. రాముడత్తయ్య చదివే కృష్ణాపత్రిక5 కార్యాలయాన్ని బందరులో చూసినప్పుడు ఆ ఆఫీసుకు వెళ్లాలనుకొన్నాడు గాని ఎలావెళ్ళాలో గోపాలానికి తెలియలేదు. ఆ ఆశ నందయ్యవల్ల తీరింది. నందయ్య హరిజన విద్యార్థి. మిగిలిన విద్యార్థులు ఆతనితో సహపంక్తి భోజనానికి

వొప్పుకోకపోయేసరికి, ఇటువంటి ఆలోచనలే కాంగ్రెస్ వారి స్వాతంత్ర్యసాధనకు అడ్డుగోడలని గోపాలరావు గాంధిబోధనలను చెప్పి వారిని వొప్పించాడు. రాముడత్తయ్య యింట్లో గోపాలరావుకి హరిజనబాలుడితో కలిసి తిరగటం అలవాటే కాబట్టి నందయ్యతో కలిసిపోగలిగాడు. సత్తెనపల్లినుండి వచ్చిన నందయ్య చురుకైనవాడు. శిల్పి. ఆతని తండ్రిది చెప్పులుకుట్టే వృత్తి. కొండా వెంకటప్పయ్యగారు[6] నందయ్యను బందరు జాతీయకళాశాలలో చేర్పించగా, పెద్దలందరూ తలోరూపాయివేసుకొని అతడిని చదివిస్తున్నారు. నందయ్యకు వయసుమించిన తెలివి గ్రహణశక్తి ఉండేవి. ఆతని చేతిలో 'మాలపల్లి'[7] అనే నవలనుచూసి గోపాలరావు నిషేధింపబడిన పుస్తకంకదా అన్నందుకు, నందయ్య నిషేధానికి గురియైనందుకే చదవాలి అన్నాడు. తమకులాన్ని గురించి బ్రాహ్మణుడు రాసాడని, ఆతనిని తన అయ్యగారైన కొండ వెంకటప్పయ్య గారింటికి వచ్చినప్పుడు చూసాననీ, తాను మాలదాసరినని, మాంసంతినమని, తన తండ్రి చదువుకోకపోయినా తత్వాలు బాగా పాడుతాడని, మడికట్టుకు పూజచేస్తాడని, స్నానం చేయకుండా యింట్లోవారెవరూ భోజనం చేయమని నందయ్య చెప్పాడు.

గోపాలరావుకూడా తానెందుకు మాలపల్లి చదవకూడదని పట్టుదలతో చదివాడు. ఆ పుస్తకంలో పేర్కొన్న సెటిల్మెంట్[8] లలో పోలుదౌర్జన్యం, జ్యోతి అప్పాదాసుల ప్రేమ[9], సంగదాసు[10] బతికుంటే బాగుండేదనీ, తాను పెద్దయినతరువాత తక్కెళ్ళజగ్గడిలా[11] ఘనకార్యాలు చేయాలనుకొన్నాడు. అంటే మాలపల్లి పుస్తకం గోపాలరావుపై చెరగని ముద్రవేసింది. రాత్రిపూట గోపాలరావుకు మాలపల్లి నవలలోని పాత్రలైన రామదాసు, మాలక్ష్మిలు[12] కలలో కనపడేవారు. గోపాలరావు మాలపల్లి పేరుగల ఊరికి వెళ్ళాలనుకొన్నాడు. తెల్లవారిన తరువాత నందయ్యతో ఆ పుస్తకం గురించి గోపాలరావు మాట్లాడాలనుకొనే లోపలనే, నందయ్యచేతిలోని మాలపల్లి నవలను చూసిన పోలీసులు ప్రభుత్వవిద్రోహ చర్యగా భావించి అతనిని అరెస్టుచేసి రెండేళ్ళు జైలుశిక్షను వేసినట్టు తెలిసింది. అప్పుడు గోపాలరావుకు తన చిన్నప్పుడు రాముడత్తయ్య స్వరాజ్యం అంటే ఏమిటో చెప్పిన స్వేచ్ఛస్వాతంత్ర్యాలు[13] గుర్తుకువచ్చి, నచ్చిన పుస్తకం చదివే స్వేచ్ఛకూడా భారతీయులకు లేదనిచెప్పిన విషయం అర్థమైంది.

ఒకరోజు పాఠశాలకు వచ్చేసరికి హిందూముస్లిముల ఐక్యతకోసం గాంధి నిరాహారదీక్ష చేపట్టినందుకు అందరూ ప్రార్థనలు చేస్తున్నారు. గాంధికి అపెండిసైటిస్ ఆపరేషన్ జరిగినందువల్ల ముందుగానే గాంధిని విడుదలచేసినా, గాంధి మాత్రం తన మిగిలిన శిక్షాకాలాన్ని బయటఉండి గడుపుతానని, ఆ సమయం ముగిసేవరకూ రాజకీయాలు చేయకూడదని, ఎటువంటి ప్రభుత్వ

విద్రోహచర్యలకు పాల్పడకూడదని నిర్ణయించుకోవటంచేత నిరాహారదీక్షను చేపట్టాడు. గాంధి దేహబలం క్షీణించినా మానసికబలంతో శక్తిమంతుడవుతున్నాడు. అన్ని మతాలవారు ఏకోన్ముఖంగా వచ్చి తాము కలిసి ఉంటామని చెప్పటంతో గాంధి తన 21 రోజుల నిరాహారదీక్షను విరమించటం జరిగింది. దేశం అంతటా నిరాహారదీక్షలతో కదిలిపోతుంటే గోపాలరావుతల్లి సుబ్బమ్మమాత్రం ఒకపక్క శారదా చట్టం[14] వస్తోందనీ, రజస్వలకాని కన్యలు దొరకరనీ, మరొకపక్క రాజమండ్రికి దగ్గరలోనే ఉంటున్న రాముడత్తయ్య రాజమండ్రిలో ఉన్న కందుకూరి వీరేశలింగంగారి[15] వితంతుశరణాలయంనుండి ఒక వితంతువుతెచ్చి గోపాలరావుకిచ్చి పెళ్లిచేస్తుందనే భయంతోను అతడికి పెళ్ళిచెయ్యాలని హడావుడి పడింది. గోపాలరావుతో ఆతని పెళ్లిసంగతి ఎత్తేసరికి అతను తాను దేశసేవకు తన జీవితం అంకితంచేస్తానని, దేశానికి స్వాతంత్ర్యంవస్తే తప్ప తాను పెళ్ళిచేసుకోనని చెప్పాడు. పెళ్ళిచేసుకొని దేశసేవచేయమని గోపాలరావు తండ్రి అన్నాడు. మేనత్త మొగరాయుడిలా మాదిగలతో తిరుగుతుంటే గోపాలం చెల్లికి పెళ్ళిసంబంధం తప్పిపోయిందని తల్లి అంది. గోపాలారావుకు తన మెడలువంచి పెళ్ళిచేయటం యిష్టంలేకపోయినా ఎదిరించలేకపోయాడు. కేంద్రరాష్ట్ర శాసనసభలకు జరిగిన ఎన్నికలలో[16] కాంగ్రెస్ స్వరాజ్యపార్టీ[17] గెలిచినరోజే గోపాలరావు పెళ్ళినిశ్చయ తాంబూలాలు తీసుకోవటంతో ఆతడు అత్తయ్యను పిలవటానికి సీతానగరం ఆశ్రమానికి వెళ్ళాడు. గాంధి ఆంధ్రదేశానికి వచ్చినప్పుడల్లా ఆ ఆశ్రమంలోనే బస చేసేవాడు. అక్కడ సత్యాగ్రహయోధులకు వీలుగా ప్రశాంతంగా ఉంటుంది. అక్కడికి వెళ్ళిన గోపాలరావుకు కొత్తశక్తి వచ్చినట్లు అనిపించింది. మామయ్య వాసుదేవరావు గోపాలరావుతో మెట్రిక్యులేషన్ పూర్తికాకుండానే పెళ్ళిచేసుకొన్నా, ఆ తరువాత అయినా చదువుకోమని, ఆ అమ్మాయిని కూడా చదివించమని చెప్పాడు. ఆడది చదువుకుంటే ఆ కుటుంబం, పిల్లలు బాగుంటారని, పెళ్లిలో భోగంమేళం పెట్టవద్దని, ఆ డబ్బును హరిజననిధికి[18] యివ్వమని చెప్పి, అంతరాత్మకు వ్యతిరేకమైనపని ఏమీచేయవద్దనే గాంధి సూక్తిని చెప్పాడు. అంతేకాక తనకు ఆరోగ్యంసరిగా లేదని, గోపాలరావు మళ్ళీ వచ్చే వరకు ఉంటానోలేదో నని అంటూ, మనిషి తనకోసం తానుబ్రతకటం గొప్పకాదని, యితరులకోసం బ్రతికినవాడే ఉత్తముడని చెప్పాడు. స్వంతలాభం కొంతమానుకొని పొరుగువాడికి సాయపడమని గురజాడవారు[19] చెప్పారనీ, అటువంటి వ్యక్తియైన దుగ్గిరాలవారికి ఆరోగ్యంబాగాలేదని గోపాలరావుకు చెప్పి ఆతనిని గుమాస్తాగా పనిచేయవద్దని, దేశసేవకు అంకితం కమ్మని చెప్పాడు. అంతేకాక, గాంధిచెప్పినట్లుగా నీకు నమ్మకం కలిగించినది, మనసుకు నచ్చింది చేయమని, స్వాతంత్ర్యజ్యోతి తమతో ఆరిపోకూడదని, పోరాటం కొనసాగించాలని అన్నాడు. తాము స్వాతంత్ర్యంకోసం లాఠీదెబ్బలు

తినటం, జైల్లో రాళ్ళు కొట్టటం, ఎద్దులకు బదులుగా నూనెగానుగలు తిప్పటం, మట్టిముంతలో తిండి, దోమలు బద్దింకలతో సహజీవనం చేసేశక్తి ఆ గాంధిమహాత్ముడు తమకు ప్రసాదించాడని చెప్పాడు. స్వాతంత్ర్యం రావటం తాముచూడగలమో లేదో అని, ఈ ఆశ్రమాన్ని నెలకొల్పిన డాక్టరు సుబ్రమణ్యంగారు 20 లాఠీదెబ్బలు తిన్నా, స్వాతంత్ర్యపోరాటాన్ని ఆపలేదని అన్నాడు. స్వతంత్రాన్ని అనుభవించటం ప్రతిపౌరుడి హక్కు అని, ఆ హక్కుకోసం పోరాడే ధర్మంకోసం భార్యాపిల్లలు శృంఖలాలు కాకూడదని దేశస్వాతంత్ర్యాన్ని మరచిపోవద్దని వాసుదేవరావు గోపాలరావుతో చెప్పాడు.

రాముడత్తయ్య ఆశ్రమాన్ని గోపాలరావుకు చూపిస్తూ, తాను తన భర్తయైన వాసుదేవరావును వదిలిపెట్టి పసుపుకుంకాలతో తాను చనిపోవాలనుకొనేంత స్వార్థపరురాలినికాదని, గుండె రాయిచేసుకొని ఉపన్యాసాలను యిస్తున్నానని చెప్పింది. ఆయనతో తనకు పెళ్ళయినప్పటినుండి భర్తగా తనను చదివించి స్వేచ్ఛను యిచ్చాడని, లోకాన్ని చూపించిన గురువు, స్నేహితుడని మహావ్యక్తి అని వాసుదేవరావుగురించి చెప్పి రాముడత్తయ్య దుఃఖించేసరికి గోపాలరావుకు ఏమి చేయాలో అర్థంకాలేదు.

గోపాలరావుపెళ్ళిలో అలకపాన్పుమీద యిచ్చిన వందరూపాయలను హరిజననిధికి యిచ్చినందుకు అందరికి విడ్డూరంగా అనిపించింది. పెళ్ళిలో భార్యాభర్తలిరువురు పరస్పరం యిద్దరికి ప్రేమ ఉందని చెప్పుకున్నారు. అత్తగారింట్లో ఉన్న గ్రంథాలయంలో ఇంగ్లీషు పుస్తకాలున్నాయిగాని చదువటానికి తనకి ఇంగ్లీషు రానందుకు గోపాలరావు మనసులో బాధపడ్డాడు. ఇంగ్లీషుభాషను నేర్చుకోవాలనుకొన్నాడు. గోపాలరావు జాతీయకళాశాలలో చేరిన ఐదురోజులకు దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు చనిపోయారనే వార్తతెలిసి చీరాలకువెళ్ళి ఆతని ఊరేగింపులో పాల్గొన్నాడు. గోపాలరావు వాసుదేవరావుకు సీరియస్ గా ఉందని వార్త తెలిసి వెళ్ళేసరికి, ఆశ్రమానికి చేరుకునేసరికే వాసుదేవరావు చనిపోవటం జరిగింది. ఆతని దేహంమీద కాంగ్రెస్ కార్యకర్తలు ఖద్దరుమాలలను వేసారు. గోపాలరావు తాను మామయ్యకు తలకొరివిని పెడతానంటే, తండ్రి బతికున్నప్పుడు కర్మకాండలు చేయటాన్ని శాస్త్రం వొప్పుకోదని, రామలక్ష్మి వాసుదేవరావుకు కులాలపట్టింపులేదని, ఉన్నది కాంగ్రెస్ కులమొక్కటే అనేసరికి యువకులందరూ తాముచేస్తామంటూ ముందుకొచ్చారు. భారత్ మాతాకి జై అనేనినాదాలతో వాసుదేవరావుయొక్క అంత్యక్రియలు జరిగాయి. గోపాలరావు అత్త వొడిలోకి చేరి దుఃఖించాడు. ఆ మర్నాడు వచ్చిన పుట్టింటివారితో రామలక్ష్మి తమకు కర్మకాండలమీద నమ్మకంలేదనీ, నలుగురికోసం చేయమని, తాము నమ్మిన సిద్ధాంతాలకోసమే బ్రతుకుతున్నామని చెప్పింది. వాటికయ్యే ఖర్చులడబ్బును హరిజననిధికే యిమ్మని వాసుదేవరావు

తనకు చెప్పిన విషయాన్ని తెలియచేసింది. తాను మూడురోజులపాటు ఉపవాసం చేయాలనుకొన్నట్లు చెప్పింది. గోపాలరావుయొక్క తల్లి రామలక్ష్మి బొట్టుగాజులు తీయనందుకు నిష్ఠురమాడుతూ కూతురుని యిచ్చిన వియ్యాలవారు నవ్వుతారని అనగా, రామలక్ష్మి తాను పుట్టింటికి వచ్చి యిబ్బందిపెట్టననీ, విరూపంచేసే మూఢాచారాలను పాటించనని, దేశసేవచేస్తానని తన భర్తకు మాట యిచ్చినట్లు చెప్పింది. ఆయనకు యిచ్చిన మాట నిలపెట్టుకోకపోతే నిజంగా పాపం చుట్టుకుంటుందని, నలభైఏళ్ళువచ్చిన తనదేహానికి ఆడామొగ భేదంలేదని, తాను ప్రాణం ఉన్న దేహిగా మనసుతో దేశసేవచేస్తానని, స్వాతంత్ర్యేచ్ఛతప్ప తనకుమిగిలించి ఏమీ లేదని అన్నది. తన ఆశయాలకు రూపమిస్తాడని గోపాలంమీద మమకారం ఉందని, తాను ఏకాకినని, తాను దేశం మనిషికాబట్టి ఆ తప్పువప్పులన్నీ దేశానికి చెందుతాయికాని పుట్టింటికి అంటుకోవని రామలక్ష్మి చెప్పింది. ఆ రోజు తెల్లవారుజామున వెళ్ళి వాసుదేవరావు అస్థికలను కలిపి, తిరిగివస్తున్న రాముడత్తయ్యను మెడలో పసుపుతాడు, నుదిటన బొట్టులేకపోవటాన్ని చూస్తూ గోపాలరావు బాధపడ్డాడు. రాముడత్తయ్యతో దుగ్గిరాలవారు చనిపోయిన విషయంచెప్పి తాను అక్కడకు వెళ్ళినట్లు చెప్పాడు. రామలక్ష్మి తనజీవితాన్ని వంటింటికి పరిమితం చేయనని, వీరేశలింగం గారి ఆశ్రమం వాళ్ళు తనని పిలుస్తున్నారని అక్కడికిగాని, సత్యాగ్రహ ఆశ్రమానికి[21] గాని వెళ్ళి ఉంటాననీ, యిక చీరాలవెళ్ళి ఉండలేనని గోపాలరావుతో చెప్పింది. అతడు తన రాముడత్తయ్యని ఆశ్రమంలో వదిలిపెట్టి వెళ్ళిపోయాడు.

గోపాలరావు తాను నాగపూర్ లో ప్రైవేటుగా మెట్రిక్ చదివి, ఆ తరువాత అక్కడే కళాశాలలో చేరతానని తండ్రికి చెప్పాడు. గోపాలరావు నాగపూర్ బయలుదేరుదామనుకొంటే 'సైమన్' కమిషన్ ఉద్యమం[22] ఆరంభమైంది. భారతీయులకు స్వపరిపాలన దక్షత ఉందా అని నిర్ణయించేది ఆంగ్లేయులుకాదని, ఆంగ్లేయసభ్యులతో వేసిన ఆ కమిషన్ ను వెనక్కివెళ్ళిపొమ్మంటూ ప్రజలు అన్నిచోట్ల హర్తాళ్ లు జరపాలని నిర్ణయించారు. బెజవాడ స్టేషన్ గుండా వెడుతున్న 'సైమన్' అనే పేరుగల వ్యక్తి ఆధ్వర్యంగల కమిషన్ని నిరసించే ఉద్యమంలో గోపాలరావు పాల్గొన్నాడు. కాళేశ్వరరావు సైమన్ ని వెనక్కి వెళ్ళమంటూ కాగితంమీద రాసి ఆ కవర్ ను రైల్లో ఉన్న సైమన్ కి అందించిన ధీశాలితో కలిసి గోపాలరావు హర్తాళ్ చేసాడు. హాస్టల్ కి వచ్చిన అతనికి మామ, తండ్రి ప్రత్యక్షమవటం జరిగింది. గోపాలరావుతో అతని మామ చిన్నవయసులో రాజకీయాలు వద్దనీ, మేనత్తవల్ల చెడిపోయాడని గోపాలరావుతండ్రి అంటుంటే, ఆతనిని తీసుకొని వెళ్ళి మామ బెనారస్ హిందూవిశ్వవిద్యాలయంలో చేర్పించటం జరిగింది. దానితో గోపాలరావుకు తన చదువుకు అత్తయ్యకు

సంబంధంలేదనీ, దేశక్షేమం మరచి స్వంతలాభం గురించి ఆలోచించే వారిమీద అతనికి కచ్చపుట్టింది. మెట్రిక్ పాసయిన గోపాలరావును ఆతని మామ కాశీ విశ్వవిద్యాలయంలో ఇంటర్ మీడియేట్ కోర్సులో చేర్పించాడు. మదన్ మోహన్ మాలవ్య ఆధ్వర్యంలో క్రమశిక్షణకు మారుపేరుగా ఉన్న ఆ విశ్వవిద్యాలయంలో నందయ్యను చూసి సంతోషం కలిగి, ఆతనిని గోపాలరావు కావలించుకున్నాడు. నందయ్యతన గురించి చెపుతూ ఆ రోజు మాలపల్లి నవల విషయంలో పోలీసులు తనని అరెస్టుచేసిన తరువాత బోర్డర్స్ స్కూల్ లో చేర్పించారని, తనచేత విప్లవకర సాహిత్యం చదవనని బాండ్ రాయించుకొని విడుదలచేసినట్టు చెప్పాడు. కాని తాను విద్రోహకర పుస్తకాలు చదవనని రాసిచ్చాగాని ప్రభుత్వ వ్యతిరేకచర్యలు చేయనని రాసివ్వలేదని చెప్పాడు. నందయ్యకు కేటాయించిన రూమ్ లో గోపాలరావు ఉంటానంటే, అతడు తనతో ఎవర్నీ ఉంచరని చెప్పాడు. ఇంతవరకు ఈ విశ్వవిద్యాలయంలో హరిజనులకు సీటు యివ్వలేదనీ, తాను మెరిట్ తో పాసు అయినా తనకు సీటురావటానికి ఎంతోమంది సిఫార్స్ అవసరమైందని, ప్రజలు యింకా తమని అస్పృశ్యులుగాను, అంటరానివారుగానే చూస్తున్నారనీ, అట్టడుగున ఉన్న తమజాతిని పైకితేవటానికి ప్రయత్నించకపోగా, యింకా అణగద్రొక్కటానికే చూస్తారని నిరాశతో అన్నాడు. దానికి గోపాలరావు అతనితో భవిష్యత్తులో నందయ్య కలెక్టరు అయితే వారు నెత్తినపెట్టుకుంటారని అనగా, నందయ్య తాను ఆ బానిస ఉద్యోగంచేయనని, కలెక్టరైనా తోటిసోదరులపై బానిసజులుం ప్రదర్శించనని అన్నాడు. దానికి గోపాలరావు నందయ్య రాజకీయనాయకుడైతే ఆతనికి ప్రజలు బ్రహ్మరథం పడతారంటే, తనకి కాక తన పదవికి పడతారని నందయ్య అన్నాడు. గోపాలరావు నందయ్యరూమ్‌లో ఉండటంతో మిగిలిన విద్యార్థులుకూడా నందయ్యతో కలిసిపోయి ఆతడు అస్పృశ్యుడనే భావనను మర్చిపోయారు.

లాహోర్‌లో పోలీసులు స్వాతంత్ర్యోద్యమ నాయకుడైన లాలాలజపతిరాయ్ ని ఛాతీమీద కొట్టటంతో పక్కటెముకలు విరిగి కొన్నాళ్ళకు ఆతడు మరణించాడు. ఆ పనిచేసిన సార్జంటు సాండర్సుమీద ప్రతీకారం తీర్చుకోవటానికి భగత్ సింగ్ కేంద్రశాసనసభలోకి పట్టపగలే ప్రవేశించి బాంబ్ విసరటాన్ని కొంతమంది సాహసకార్యంగా చెప్పుకొన్నారు. ఈ సందర్భంలోనే రాజకీయఖైదీలు నేరస్థులు కాదనే చర్చవిద్యార్థులమధ్యన జరగుతున్నప్పుడు, ఆ విషయమై జైల్లో ఉన్న స్వాతంత్ర పోరాటయోధులు సత్యాగ్రహం చేస్తున్నారనీ, అప్పడే జైలు అధికారులకు బుద్ధివస్తుందని నందయ్య గోపాలరావుతో చెప్పాడు.

త్రిపాఠి అనే మరొక సహవిద్యార్థి తెల్లవాళ్ళనందరినీ కాల్చి చంపేయాలని అంటే గోపాలరావు దానివల్ల స్వతంత్రం రాదని నిరాహారదీక్ష చేయటమే మార్గమని అనగా, త్రిపాఠి తాను ఆకలికి ఆగలేనని, జైల్లో కష్టాలను అనుభవించలేనని అన్నాడు. రాజకీయ ఖైదీలలో ఒకడైన జితేంద్రనాథ్

దాస్[23] ఒక ఆశయం, సిద్ధాంతంకోసం పోరాడుతుండే రాజకీయ ఖైదీలు, నేరస్థులు ఒకటికాదనీ, ఆతడు అరవైమూడురోజులపాటు శిక్షాస్మృతిలో మార్పులు తేవాలని నిరాహారదీక్ష చేస్తున్న విషయం తెలిసి, త్రిపాఠివాదన సరియైనది కాదని వారికి అర్థమైంది. భగత్ సింగ్[24] ప్రాణాలకు తెగించి ఈ దేశస్వాతంత్ర్యంకోసం కష్టపడ్డాడని నందయ్య అంటే, త్రిపాఠి ఆతడు బ్రిటిష్ వారిదృష్టిలో హంతకుడు అన్నాడు. దానికి నందయ్య మరి జనరల్ డయ్యరు[25] సాండర్స్[26] కూడా భారతీయుల దృష్టిలో హంతకులే అని అంటే దాన్ని వారు ఒప్పుకోరనగా, గోపాలరావు కూడా ఆ విషయాన్ని సమర్థించాడు. నందయ్య కోపంతో వర్తకం చేసుకోవటానికి వచ్చి మెల్లిమెల్లగా భారతదేశాన్ని ఆక్రమించుకొని, నీతిలేకుండా తమజాతి దురహంకారాన్ని ప్రదర్శిస్తున్నారని అన్నాడు. దొంగకి, హంతకునికి, దేశంకోసం ప్రాణాలర్పిస్తున్నవారికి తేడా తెలుసుకోలేనివారు భారతీయుల నెత్తినెక్కి తాండవం చేస్తున్నారనీ, వారికి జితేంద్రనాథ్ దాస్ వంటి వారి గురించి అర్థం కాదని గోపాలరావు అన్నాడు. జితేంద్రనాథ్ అరవైమూడురోజుల నిరాహారదీక్షానంతరం అసువులు బాసాడు. నందయ్య కలకత్తా వెళ్ళి ఆతని అంతిమయాత్రలో పాల్గొన్నానని చెప్పినప్పుడు తాను వెళ్ళలేకపోయినందుకు గోపాలరావుకు మనసు చివుక్కుమంది. గోపాలరావుకు భార్యను చూడాలనే కోరిక ఒకవైపు, మరొకపక్క హరిజననిధికి డబ్బుపోగుచేస్తున్న గాంధివెంట వెళ్ళాలనే ఆశ ఉంది.

గాంధి పల్లెపల్లెకు వెళ్ళి హరిజననిధిని వసూలుచేస్తున్నాడు. బ్రిటిష్ వారి దమనశక్తిని ఆయుధాలతో ఎదుర్కోవటం కష్టమని విప్లవం తీసుకురావటానికి ఏమి చెయ్యాలని గాంధీ ఆలోచిస్తున్నప్పుడే ఉప్పు పన్ను పెరగటంతో ఉప్పుసత్యాగ్రహాన్ని[27] మొదలు పెట్టాలనుకొన్నాడు. అదే సమయంలో రాముదత్తయ్య గోపాలరావుకు ఉత్తరం రాస్తూ తాను బంధువర్గానికి దూరమైన తరువాత, తనలో ఆత్మధృతి, జీవితంపట్ల అవగాహన పెరిగిందని, తాను ఉప్పు సత్యాగ్రహ ప్రచారానికై గాంధివెంట పల్లెలలో తిరుగుతూ, ఆతని ఉపన్యాసాన్ని తెలుగులో తర్జుమాచేస్తున్నట్టు రాసింది. అంతేకాదు, తన జీవితానికి ఒక ఆలంబన దొరికిందనీ, గాంధీ బృందంలో తానుఉండటం తన పూర్వజన్మ సుకృతం అని రాసింది. ఆ ఉత్తరం చదివిన గోపాలరావుకు పునర్జన్మ కలిగిన భావన కలిగి తనకి ఏకాంతమూ, మనోనిగ్రహం కావాలనుకొన్నాడు. తన అత్తయ్యరాసిన ఉత్తరాన్ని నందయ్యకు, తోటివిద్యార్థులకు చూపించేసరికి అందరూ గోపాలరావును గౌరవంతో చూడటం మొదలుపెట్టారు.

గాంధిమహాత్ముడు మొదలుపెట్టాలనుకొన్న ఉప్పుసత్యాగ్రహాన్ని గురించిన చర్చలు సాగుతుంటే కొంతమంది జాతీయవాదులు[28] గాంధీది తాడు బొంగరంలేని విప్లవం అన్నారు. ప్రజలందరూ ఈ కొత్తఉద్యమానికి సిద్ధంగా ఉన్నారని గ్రహించిన గాంధి ప్రజలను సన్నద్ధం చేసాడు. గతంలో రౌలత్

చట్టానికి, విదేశీవస్తు బహిష్కరణోద్యమం వంటివి జరిగినప్పుడు చెలరేగిన జలియన్ వాలాబాగ్ లో వేలమంది హత్యలు జరిగాయి. అప్పుడు దేశంలో అవాంఛనీయ సంఘటనలు జరిగిన విషయం కాంగ్రెస్ కార్యకర్తలకు గుర్తుకువచ్చి ఈ ఉప్పుసత్యాగ్రహం నిర్జనప్రదేశంలో నియమబద్ధంగా జరగాలనుకొన్నారు. అయితే సముద్రతీరవాసులకు మాత్రమే ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొనే వీలుంటుందని అంటే, గాంధి మిగిలిన వారిని సారాయి, విదేశీవస్తువుల అమ్మకాన్ని కొనసాగనీయ కుండా అడ్డుకోవటంకూడా ఈసత్యాగ్రహంలో భాగమే అని పిలుపునిచ్చాడు. గోపాలరావు పరీక్షలకు చదువుకుంటున్న సమయంలో గాంధి తాను లవణోత్పత్తి శాసనాన్ని ఉల్లంఘిస్తున్నట్టు ప్రభుత్వానికి తెలియబరచి సబర్మతీ ఆశ్రమం నుండి సూరత్ జిల్లాలోని దండి అనే తీరానికి బయలుదేరాడనీ, గాంధితో వేలాదిమంది ప్రజలు పాల్గొన్నారనే వార్తను గోపాలరావు పేపర్లో చదివాడు. గోపాలరావు కూడా ఉద్యమంలో పాల్గొంటాడనే భయంతో, ఆతని మామ గోపాలరావుని పిలిపించి శోభనం ఏర్పాటుచేసాడు. ఆ మైకంలో పార్వతికి తాను పరీక్షలయ్యేంతవరకు సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొననని మాట యిచ్చాడు. త్రిపాఠిలాంటివారు కూడా ఉద్యమంలోకి వెడితే తాను వెళ్ళనందుకు గోపాలరావు తనని తాను పిరికివాణ్ణని తిట్టుకొన్నాడు. నందయ్య బందరునుండి ఉత్తరంరాస్తూ తాను ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొన్నానని, తమబృందంలో రామలక్ష్మిగారున్నారనీ, తానుకూడా బందరులోని మంగినపూడి బీచ్ దగ్గర ఉద్యమంలో పాల్గొనబోతున్నాని రాసాడు. పరీక్షలురాసి గోపాలరావు యింటికి వెళ్ళేసరికి తమకి బిడ్డపుట్టబోతున్నట్టు పార్వతిచెప్పింది. తనతండ్రి మద్రాసులో పైచదువు చెప్పిస్తాడని పార్వతి గోపాలరావుతో అంటున్నా, గోపాలానికి మాత్రం తాను ఎంత చదివినా తెల్లవాళ్ళకింద ఊడిగం చేయాలి కాబట్టి చదువుకో కూడదనని అనుకుంటాడు. పైపెచ్చు ప్రజలందరూ ఉద్యమంలో పాల్గొంటుంటే తాను చేతులు ముడుచుకొని కూర్చోవటం గోపాలరావుకి నచ్చలేదు.

ఉప్పెనలాగా వచ్చిపడుతున్న ఉప్పుసత్యాగ్రహ ఉద్యమకారులతో రైళ్ళు కిటకిటలాడుతుంటే సర్కారువారు వాళ్ళని దూరంగా తీసుకెళ్ళి వదిలిపెడుతున్నారు. సముద్రతీరంలో దేశమంతటా ప్రజలు ఉప్పుతయారుచేసి శాసనధిక్కారంతో అరెస్టుకాబడి జైలుకెడుతున్నారు. ఏడాదిపాటు ఉప్పుసత్యాగ్రహ ఉద్యమంసాగింది. దేశంలోని జైళ్లు పట్టకపోయేసరికి ప్రభుత్వం దిగివచ్చి కొన్నిఅధికారాలను యివ్వటానికి వొప్పుకొని గాంధి–ఇర్విన్ ఒడంబడికను[29] చేసుకొంది. పార్టీభవనాలపై కాంగ్రెస్ జెండాను ఎగరవేసే అధికారం, ఉప్పుసత్యాగ్రహం చేసుకొనే స్వతంత్రం, ఖద్దరువస్త్రాల విక్రయం, కల్లుకొట్ల దగ్గర పికెటింగ్ చేసుకోవటాన్ని అనుమతిస్తూ ఒడంబడిక

చేసుకుంది. ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొన్న అందరినీ విడుదలచేసింది. కాని స్వయంప్రతిపత్తి ఒడంబడికను ఆచరణలోపెట్టలేదు. పోలీసులజులుం ఎప్పటిలాగానే కొనసాగుతోంది. 1931సం.లో గాంధి ఈసారి సామూహిక శాసనోల్లంఘనంకాక వ్యక్తిసత్యాగ్రహంతో శాసనోల్లంఘనం[30] చేయాలని ఆదేశించాడు. శాసనోల్లంఘనంలో పాల్గొన్న ఉద్యమకారులను, కాళ్ళువిరిగి స్పృహలేనిస్థితిలో కార్యకర్తలను ప్రభుత్వం జైళ్ళలోకి తీసుకెళ్ళింది. గోపాలరావు కల్లుకొట్టుదగ్గర పికెటింగ్ చేస్తుంటే అతనిని కొట్టిన దెబ్బలకు స్పృహలేనిస్థితిలోఉన్న గోపాలరావుని కూడా రాజమండ్రి జైలుకి పంపారు. అక్కడనుండి 'సి' క్లాసు శిక్షనువేసి కడలూరు జైలుకి మార్చారు. సి క్లాస్ జైలులో వారికి దోమలు, మురికి, వుడికీ ఉడకని అన్నం, ఇరవైనాలుగు గంటలూ లెట్రిన్ నుండి వచ్చే దుర్వాసనతో భరించలేని స్థితి ఉంటుంది. దానిని భరించలేక చివరికి సి క్లాస్ జైల్లోని ఇరవైమంది ఖైదీలు తమ వంట తాముచేసుకొనేటట్లు, పుస్తకాలు తెచ్చుకొని చదువుకునేటట్లు అనుమతిని పొందారు. మూడుసంవత్సరాలు జైలుజీవితం గడిపి సగం చేతులున్న ఖద్దరుచొక్కా, లాగుతో బయటకు వచ్చిన గోపాలరావు, ప్రపంచాన్ని చూసి ఉక్కిరిబిక్కిరి అయ్యి, పార్వతి దగ్గరకువెళ్ళాడు. తాను జైలుకెళ్లేటప్పుడు మూడునెలల బాలింతరాలైన పార్వతి ఈ రోజు పిల్లవాడితో వచ్చింది. గోపాలరావుకి జైలుజీవితం సుఖంగా లేకపోయినప్పటికి మానసికంగా తృప్తిమాత్రం కలిగింది. మాతృదేశంకోసం పోరాడు తున్నాననే గర్వం, పరిపూర్ణత అతనిలో కలిగాయి. రాత్రిపూట జైల్లో తనకాలం అంటూ పార్వతిని తలచుకొనే గోపాలం యింటికి చేరుకున్న ఆనాడు పార్వతిని దగ్గరకు తీసుకోబోతుంటే ఆమె దూరంగా జరిగి, గోపాలరావు యికనుండి కాంగ్రెస్‌లో తిరగనని హామియిస్తూ ఉత్తరం రాసిస్తే తన తండ్రి ఉద్యోగంలో పెట్టిస్తాడని చెప్పింది. అప్పుడు గోపాలానికి ఆ గది పరుపు, చంద్రకాంతి సంకెళ్ళలాగా తోచి, దోమలు, గొంగళిగల జైలుజీవితమే సుఖంగా అనిపించింది. స్వంతలాభం మానుకొని జైల్లోమగ్గిన అసంఖ్యాకమైన స్త్రీపురుషులు మదిలోమెదిలి తన భార్యకు వారికి ఉన్నతేడా అర్థమై, ప్రపంచంతో సంబంధంలేకుండా బ్రతకటం తనకి సాధ్యం కాదనిపించింది. అత్తారింట్లో ఉండాలనిపించక బెడవాడలోని తల్లిదండ్రుల యింటికి చేరుకొన్నాడు.

ఇంటికివెళ్లిన గోపాలంతో అతని తండ్రి, గోపాలానికి తమ్ముడైన బుచ్చి రెవిన్యూ ఉద్యోగం చేసుకుంటున్నాడని, ఉద్యమంలోకి వెళ్ళనని ఉత్తరం రాసిస్తే అతడు ప్రభుత్వ ఉద్యోగం యిప్పిస్తాడని అన్నాడు. సర్కారువారు గోపాలాన్ని ప్రభుత్వవిరోధి అని భావించి గతంలో తమ యిళ్ళూవాకిళ్లూ జప్తుచేస్తుంటే, తమకి గోపాలరావుకు తెగతెంపులయ్యాయని తండ్రి ఉత్తరం రాసివ్వటంతో జప్తునుండి బయటపడ్డామని తల్లి చెప్పింది. పైగా చిన్నప్పటినుండి రాముడత్తయ్య గోపాలాన్ని తీసుకెళ్ళి స్వతంత్రం

అంటూ నూరిపోసి చెడకొట్టిందని అంది. రాముడత్తయ్య సబర్మతి ఆశ్రమంలో ఉన్నదనుకున్న గోపాలరావుతో, ఆతని తండ్రి ఆమెకు క్షయవచ్చి సీతానగర ఆశ్రమంలో ఉందనీ, శాసనోల్లంఘనం చేయటంతో తాకట్టులో ఉన్న ఆమె యిల్లు, పొలం జప్తుచేసారని చెప్పాడు. బందిఖానానుండి బయటపడ్డ గోపాలరావుకు బయటప్రపంచం అంతకంటె దారుణంగా యిరుకుగా అనిపించింది. తెల్లారి సీతానగరం ఆశ్రమాన్ని చేరుకొన్న గోపాలరావుకి రాముడత్తయ్య అనారోగ్యంతో ఉన్నా ఆత్మస్థైర్యంతో ఉన్నట్టు అనిపించింది. మూడేళ్ళజైలుజీవితం ఆమెను బండరాయిగాకాక నవనీత సదృశం చేసిందని, గాంధి నీడన ఉండటంతో ఆమె హృదయంలో స్థిరత్వం, కరుణ అభివృద్ధి చెందిందని రాముడత్తయ్యను చూస్తే గోపాలరావుకి అర్థమయింది. దేశంకోసం భవిష్యత్తులో చెయ్యాల్సిన నిర్మాణకార్యక్రమాలు చాలా ఉన్నాయనీ, సత్యాగ్రాహిగా జైలుకెళ్లివస్తే సరిపోదనీ, మహాత్ముని మార్గంలో నడిచి పల్లెప్రజలకు స్వాతంత్ర్యాన్ని గురించి బోధించమని, చీరాలవెళ్ళమని రాముడత్తయ్య గోపాలరావుకు చెప్పింది.

గోపాలరావు చీరాలవెళ్ళి జానకమ్మను కలుసుకున్నాడు. గోపాలరావు చీరాలలో చిన్నపాక వేసుకొని ఒకపక్క చుట్టుపక్కల పిల్లలకు హిందీ, ఇంగ్లీషు, లెక్కలను నేర్పుతూ, మరోపక్క ఖద్దరు ఉద్యమంలో[31] భాగంగా రాట్నం వడికి నూలును తీయటమేకాక, దొడ్లో కూరగాయలను పండిస్తూ జీవితాన్ని గడుపుతున్నాడు. జానకమ్మ ఆధ్వర్యంలో ఊళ్ళోవాళ్ళు బియ్యంతెచ్చి యిస్తున్నారు. గోపాలరావుకు కాయకష్టంలో గల ఆత్మగౌరవాన్ని ఆచరణలో పెడుతున్నట్టు అనిపించసాగింది.

ఆ సమయంలో దేశంలో ఉన్న ఎనిమిది ప్రావిన్సురాష్ట్రాలకు ఎన్నికలు[32] వచ్చాయి. జానకమ్మ గోపాలరావును ఎన్నికలలో నిలబడమంటే ఆతడు యిష్టపడలేదు. ఎనిమిది రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీకి మెజారిటివచ్చింది. నందయ్య సత్తెనపల్లిలో నిలబడి గెలిచాడు. (1938సం.లో) మద్రాసు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా రాజగోపాలాచారి ఆధ్వర్యంలో రెండేళ్ళ నాలుగు నెలలపాటు స్వపరిపాలన ఏర్పడింది. ఆ రెండేళ్ళపాటు కాంగ్రెస్ పార్టీవారు చేపట్టిన అస్పృశ్యతానివారణ, ప్రాథమికవిద్య, మద్యపాననిషేధం, హరిజనదేవాలయ ప్రవేశం, ఋణవిమోచనచట్టం, సత్యాగ్రహంలో పాల్గొన్నవారి ఆస్తిపాస్తులను తిరిగి యిప్పించటం వంటి ప్రజాసంక్షేమ కార్యక్రమాలను చేయటంతో ప్రజలకు కాంగ్రెస్ పార్టిపై నమ్మకం కుదిరింది. జస్టిస్ పార్టీకంటె, బ్రిటిష్ పాలకులకంటే కాంగ్రెస్ పార్టీవారిని ప్రజలు ఆదరించారు. ఆ సమయంలోనే రామలక్ష్మిగారి ఆస్తిమీద చక్రవడ్డీ మాఫీచేసి పొలం అమ్మి బాకీతీర్చి, ఆమె యింటిని నిలబెట్టటం జరిగింది. కాంగ్రెస్ మంత్రివర్గంచేసిన ఈ పనులకు వేలాది కుటుంబాలు అప్పులబాధనుంచి విముక్తికాగలిగి, తమ యిళ్ళను నిలబెట్టుకోగలిగారు.

కాంగ్రెస్ మంత్రివర్గంలోని స్థానికవ్యవహారాల శాఖామంత్రిగా బెజవాడ గోపాలరెడ్డిగారు చీరాల–పేరాలను లాంఛనప్రాయంగా తిరిగి పంచాయితీగా మార్చటంతో దుగ్గిరాలవారి ధర్మయుద్ధం ఫలించిందని ప్రజల కళ్ళు తడిఅయ్యాయి. ఆ మీటింగుకు ఎమ్.ఎల్.ఎ. వచ్చిన నందయ్య ఏమిచేస్తున్నావని గోపాలరావుని అడిగితే, ఆతని పక్కనున్న జానకమ్మ అతడు గాంధిగారి అడుగుజాడలలో నడుస్తున్నాడని గర్వంగా చెప్పింది. మద్రాసువస్తే కలుసుకోమని గోపాలరావుకు నందయ్య తన విజిటింగ్ కార్డు యిచ్చి వెళ్ళాడు.

రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభమైంది. బ్రిటిష్ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీవారితో సంప్రదించకుండానే భారతీయులు యుద్ధంచేయాలని నిర్ణయించినందుకు భారతదేశంలోని అన్నిపార్టీలవారు, వారికి సహకరించమని ప్రకటించారు. అంతేకాదు, సత్యాగ్రహాన్ని ప్రకటించి బ్రిటిష్ వారిని భారతదేశంనుండి తరిమికొడతామని ముందుకు ఉరికారు. సామ్రాజ్యవాదులు తమ రాజ్యరక్షణకోసం చేస్తున్న యుద్ధాన్ని గాంధి నైతికంగా వొప్పుకోలేదు. పైగా కాంగ్రెస్ మద్దతు ప్రకటిస్తే అహింసా వాదానికి స్వస్తిపలికినట్లు అవుతుందని గాంధి మనసు అంగీకరించక పోయినా, యుద్ధం చేయకపోతే దేశం ఏమి అవుతుందనీ, హిట్లరుయొక్క హింసను ఎలా భరించగలరనే ఆలోచనలుకూడా వచ్చాయి. ఆ సందర్భంలో గాంధి ప్రజలను శాంతియుతంగా వ్యక్తి సత్యాగ్రహం చేస్తూ తమ అసమ్మతిని తెలియజేయాలని ఆదేశించాడు[33]. గోపాలరావు ఆ యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ ఫలానారోజున తాను వ్యక్తిసత్యాగ్రహంలో పాల్గొంటున్నట్టు జిల్లాకలెక్టరుకు లేఖ పంపించాడు. తెల్లవారిలేచి నూలువడికి, వంటచేసుకొని వ్యక్తిసత్యాగ్రహానికి బయలుదేరుతున్న సమయంలో మామగారు, తమ్ముడు బుచ్చి వచ్చి గోపాలరావు కారణంగా తమ కాంట్రాక్టులను కలెక్టరు రద్దుచేస్తామంటున్నాడనీ, గోపాలరావు తన భార్యాపిల్లవాడిని పట్టించుకోవటంలేదని నిష్ఠూరం ఆడి సత్యాగ్రహాన్ని వదిలిపెట్టమన్నారు. గోపాలరావుమాత్రం పెళ్ళాంబిడ్డలకోసం తన ఆశయాన్ని వదలనన్నాడు. నాలుగురోడ్లకూడలిలో వ్యక్తిసత్యాగ్రహం చేస్తున్న గోపాలరావును ఆ రోజు మధ్యాహ్నమే అరెస్టుచేసి పదినెలల జైలుశిక్షను వేసారు. పదినెలల తర్వాత జైలునుండి విడుదలై బయటకు వచ్చిన గోపాలరావుకు తిండిగింజలు, కిరసనాయిలుకూడా దొరకకపోతుంటే ప్రజలు పడుతున్న యిబ్బందులు అర్థమయ్యాయి. ఒకపక్క యుద్ధం, మరోపక్క కరువు. వార్తాపత్రికలకు పేపరు కరువు. అన్నీ ధరలు పెరిగిపోయాయి. గోపాలరావు చలించిపోయాడు. యుద్ధసమయంలో శత్రుదేశాలకు ప్రజలఉనికి తెలుస్తుందని రాత్రిళ్ళుదీపాలు వెయ్యకూడదు, పెట్టకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. పల్లెల్లోకూడా చిమ్మచీకటిగా ఉంచమని ప్రభుత్వ ఆదేశాలు. తమ పల్లెలో దీపాలను వెలిగించు

కోవటానికి అనుమతికోసం ఊరిప్రజలతో సంతకంచేయించి తాసిల్దారుకి గోపాలరావు అందచేస్తే, ఆతడు దానిని గోపాలరావు చేసే దేశవిద్రోహచర్యగా భావిస్తామని, కటకటాలకింద కూర్చొపెడతామని అనేసరికి, గోపాలరావు అది ప్రజలహక్కు అని అన్నాడు. పైగా ఆ తాసిల్దారు చుట్టుపక్కల ఊళ్ళనుంచి బియ్యం కూరగాయలు సేకరించి మిలిటరీకి పంపాలని ఉత్తర్వులు వచ్చాయని చెప్పాడు. సన్నబియ్యం తీసుకొని బార్లిలాంటి బర్మాబియ్యం యిస్తున్నారని గోపాలరావు అంటే దేశాన్ని కాపాడే మన సైనికులకు మంచి బియ్యంపెట్టాలని అన్నాడు. మరి వారు భారతీయ సైనికులయితే వారు యుద్ధంకావాలని అడిగారా అనీ, వారిని ప్రభుత్వం అడిగిందా అని గోపాలరావు అన్నాడు. ధాన్యం, కూరలు దాచిపెడితే ఊరుకోమని తాసిల్దారు హుకుం జారిచేసాడు. తాసిల్దారు ఆఫీసుముందు జపాను సైనికుడి బొమ్మపెట్టి 'కనిపిస్తే కాల్చు' అనే ప్రకటనను రాసారు. అది చూసిన గోపాలరావుకి జపానువారికంటె ఆంగ్లేయులే పెద్ద శత్రువులని అనిపించింది. షాపులన్నీ ఖాళీ అయిపోయాయి. ఆ సమయంలో గాంధి క్విట్ ఇండియా ఉద్యమ పిలుపును యిస్తూ కోర్టులు, స్కూళ్ళు, ప్రభుత్వోద్యోగులను వదిలిపెట్టమని ఆదేశించాడు. ఆ రకంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని స్థంబింపచేస్తేగాని సామ్రాజ్యవాదులైన బ్రిటిష్ పాలకులకు బుద్ధిరాదన్నాడు. గాంధి తన ప్రచురణయైన హరిజన్ పత్రికద్వారా ఆంగ్లేయులను భారతదేశం వదిలిపెట్టి పొమ్మని చెప్పాడు. అంతవరకు భారతీయులకు 'సాధించు లేదా మరణించు' అనే క్విట్ ఇండియా ఉద్యమం[34] పిలుపును గాంధి ప్రకటించాడు. నిరసనకారులైన విద్యార్థులు తెనాలి స్టేషన్ లో టెలిగ్రాఫ్ తీగెలను తుంచటం, సిగ్నల్స్ ను ధ్వంసంచేయటం పోలీసుస్టేషన్లను తగలపెట్టటంవంటి వాటితో విజయోత్సాహాన్ని ప్రకటించుకుంటున్నారు. విద్యార్థులు నిప్పుపెట్టటాన్ని శాంతియుత పోరాటంచేస్తున్న గోపాలరావు దూరంనుంచి చూస్తున్నందుకు గోపాలాన్ని అరెస్టుచేసి పట్టుకెళ్ళారు. ఖద్దరుకట్టుకొన్న ప్రతికాంగ్రెస్ వారిని పట్టుకెళ్ళి జైల్లోపెట్టారు. గోపాలరావు మళ్ళీ నాలుగేళ్ళపాటు జైల్లో గడపాల్సివచ్చింది. గోపాలరావు జైల్లో ఉన్నప్పుడు 'రిఫ్ వాన్ వింకోలా' ఉంది. అంటే బయటినుండి ఏకబురు తెలియనీయరని దాని అర్థం. వార్తాపత్రికను కూడా చదవనీయరు. కాని రాముడత్తయ్య చనిపోయినట్టు వచ్చిన ఉత్తరాన్ని సెన్సారుచేసి ప్రమాదకరం కాదని భావించి, జైలు అధికారులు గోపాలరావుకు అందచేసారు. ఆమె చివరి క్షణంలో తాను లేకపోయాననే బాధతో గోపాలరావుకి ఆ రాత్రి నిద్ర పట్టలేదు.

గాంధి ఆగఖాన్ అనే చోట గృహనిర్బంధంలో ఉన్నప్పుడు ఆతనిభార్య కస్తూరిబాయిని, బాపూజి కార్యదర్శి మహదేవ్ దేశాయిని అందులోనే ఉంచగా, ఒకరోజు ఆమె, మరియు గాంధీ కార్యదర్శి అనారోగ్యంతో మరణించారు[35]. కస్తూరిబాయి మరణం ఆంగ్లేయుల వినాశనానికి

దారితీస్తుందని ప్రజలందరూ అనుకొన్నారు. కాని కస్తూరి తుదిశ్వాస గాంధి సమక్షంలో తీసుకున్నదని తెలిసిన గోపాలరావుకి, తన అత్తయ్యకంటె కస్తూరిబాయి అదృష్టవంతురాలని అనుకొన్నాడు. రోజులు, వారాలు ఏళ్ళు జైల్లో గడుపుతున్న గోపాలానికి గతంలో తాను చివరిసారిగా చూసిన తన మూడునెలల కొడుకు గుర్తుకువచ్చి చూడాలనిపించినప్పుడల్లా తండ్రిగా తాను ఆతని బాధ్యతను నెరవేర్చనందుకు తనకా అర్హతలేదనుకొనేవాడు.

నాలుగేళ్లు జైలులో గడిపిన గోపాలరావు బయటకు రాగానే భార్యాబిడ్డలు స్వాగతం పలకటానికి వచ్చేసరికి అతనికి ఆశ్చర్యం కలిగింది. పన్నెండేళ్ళ మన బాబు అంటూ కొడుకును చూపించిన పార్వతి ఆతడిపేరు శ్రీనివాస్ అనిచెప్పింది. గోపాలరావును అందరూ గౌరవంగా చూస్తుంటే దేశానికి నిజంగా స్వతంత్రం వచ్చిందా అని అతనికి అనుమానం వచ్చింది. ముందురోజు జైలు అధికారులు వచ్చి తనని విడుదలచేస్తున్నారంటే తరువాత తానెక్కడికి వెళ్ళాలని ఆలోచించిన విషయం గుర్తుకువచ్చింది. పార్వతి మనయిల్లు వచ్చింది దిగండి అంటే గోపాలరావు అవాక్కయ్యాడు.

పార్వతి మనగది అనిచూపించి, కాంగ్రెస్ కార్యకర్తలు కలుసుకోవటానికి వస్తున్నారని చెప్పింది. నాజూకు అయిన పొందూరు ఖద్దరుకట్టి తనకికూడా యిస్తే గోపాలరావు తనతోపాటు తెచ్చుకున్న ముతకబట్టలనే ధరించాలనుకొన్నాడు. వచ్చినవారిలో నందయ్య గోపాలరావుని కావలించుకుంటే ఆశ్చర్యపోయాడు. జైల్లో ఉన్నవాళ్లని ప్రజలు గెలిపిస్తారనే నమ్మకంతో నందయ్య ఎలక్షన్లలో నిలబడాలన్నాడు. గోపాలరావు జైల్లో ఉన్నప్పుడే నందయ్య నామినేషన్ దాఖలు చేసానన్నాడు. కాని గోపాలరావు తనకి పదవులమీద వ్యామోహం లేదన్నాడు. పదవికోసంకాక పోయినా బ్రిటిష్ వారు చిన్నాభిన్నంచేసిన ఆర్థిక వ్యవస్థను బాగుచేయాలంటే గోపాలరావువంటి జాతీయవాదులు దేశంకోసం నిలబడాలన్న నందయ్యకు తాను ఆలోచించుకోవాలని జవాబును గోపాలరావు యిచ్చాడు. జానకమ్మ గోపాలరావుకోసం ఎదురుచూస్తున్నదన్న విషయాన్నికూడా నందయ్యచెప్పాడు.

రెండవ ప్రపంచయుద్ధం ముగిసింది. అటు జర్మని, ఇటు జపానుకూడా ఓడిపోయాయి. రంగూన్ ఆక్రమణలో భారతసైనికుల ధైర్యాన్ని గుర్తించిన ఆంగ్లేయులు తమ విజయానికి బ్రిటిష్ ప్రధాని చర్చిల్ రాజనీతి సమర్థత అని భావించారు. కాని యుద్ధానంతరం జరిగిన ఎన్నికలలో మాత్రం కన్సర్వేటివ్ పార్టీని ఓడించి లేబరుపార్టీని గెలిపించటంతో అట్లీ ప్రధానిగా అధికారంలోకి రావటం జరిగింది. అట్లీ భారతదేశానికి స్వతంత్ర పాలనను యిద్దామని మౌలికంగా అంగీకరించాడు. దానితో కేంద్ర, రాష్ట్ర శాసనసభలకు ఎన్నికలు[36] జరపాలని భావించగానే గోపాలరావును చీరాలనుంచి

నిలబడమని అడిగారు. కాని గోపాలరావుమాత్రం ప్రజలుపడ్డ యిబ్బందులను గురించి ఆలోచిస్తానన్నాడు. నందయ్య ముందుకు వచ్చి ఎలక్షన్లకు తాను డబ్బు పెడతానంటే గోపాలం ఎలక్షన్లలో నిలబడటానికి డబ్బు ఎందుకు అవసరమో అతనికి అర్థంకాలేదు. ప్రచారానికై యింటింటికి వెళ్ళి ఓట్లు అడగటానికి మీటింగ్ లకు డబ్బు కావాలని చెప్పిన నందయ్యతో అటువంటి ఎలక్షన్లలో తాను నిలబడనని, అది తన ప్రిన్సిపల్స్‌కి వ్యతిరేకమనీ ప్రజలు తనని యిష్టపడితే ఓటువేస్తారని గోపాలరావు అన్నాడు. దానికి నందయ్య లోకం మారిపోయిందని, కొంతమంది యుద్ధం టైములోనే బ్లాక్ మార్కెట్ లో సరకులను అమ్మి డబ్బుసంపాయించి ఆస్తులను పోగేసుకున్నారని, తాను మాత్రం రెండిళ్ళే కొనగలిగానని చెప్పాడు. తన తమ్ముడు బుచ్చి, మామగారు బాగానే సంపాదించినట్లు గోపాలరావుకి అర్థమైంది. ఎన్నికలలో గోపాలరావుకు నిలబడాలనిపించింది. ఇంటింటికి సైకిలు తొక్కుకుంటూ వెళ్ళి ప్రచారం చేసుకొన్నాడు. ఎలక్షన్లలో గోపాలరావు గెలిచాడు. మద్రాసు రాష్ట్రానికి ప్రకాశంగారు ముఖ్యమంత్రి అయ్యారు. నందయ్యకు హరిజనశాఖామంత్రిగా యిచ్చారు. గోపాలానికి మంత్రిపదవి రానందుకు పార్వతి వాళ్లు నిరాశచెందారు.

తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడిననాటినుంచి ఆస్తుల పంపకంతో హిందూ,ముస్లిముల మధ్యన ఘర్షణ వాతావరణం ఏర్పడింది. 1947 సం.ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం[37] వచ్చింది. అయినా ఆగస్టు 14 వ తారీఖు అర్థరాత్రి సమయంలో అందరూ కులమతాలకు అతీతంగా స్వీట్లు పంచుకొని, రేడియోకి చెవులు రిక్కించి నప్పుడు, నెహ్రూమాట్లాడుతూ 'ప్రపంచం అంతా నిద్రావస్థలో ఉన్న ఈ అర్థరాత్రి సమయంలో బానిసత్వం, పరాయిపాలన అనే గాఢసుషుప్తినుంచి భారతదేశం మేలుకుంది' అని ఆయన ఉపన్యసిస్తుంటే అందరూ చేసిన కరతాళధ్వనులతో దేశం మారుమ్రోగింది. కాని గోపాలరావుకు బ్రిటిష్ వారితో కావాలనుకొంటే తనని రెండుగా చీల్చండికాని, దేశాన్ని చీల్చవద్దని ప్రాధేయపడుతూ గాంధి అన్న మాటలు గుర్తుకు వచ్చాయి. మహాత్ముని మాటలను ఎవరూ పట్టించుకోనందుకు గోపాలరావుకి మాత్రం ఆనందంగా లేదు. గోపాలరావు కళ్ళల్లో కలకత్తాలోని భాటియాఘాట్ లోని మతకలహాల హింసాకాండను ఆపటానికి ప్రయత్నిస్తున్న గాంధి మనసులో మెదిలి ఆయనగురించి ఎవరూ ఆలోచించటంలేదని బాధ కలిగింది. రాజధాని నవ్వటం మర్చిపోయిందనుకొన్నాడు. ఢిల్లీకి దగ్గరలో ఉన్న నౌకాలిలో కాలినడకన పర్యటిస్తున్న గాంధి వెలుగులోకి వచ్చిందనుకొన్న భారతదేశం తిరిగి చీకట్లలోకి జారిపోతోందని బాధపడుతుంటే గాంధిని ఆ సమయంలో చారిత్రాత్మక సందేశం యిమ్మని విలేఖరులు అడిగారు. వారికి గాంధి 'నిరాహారదీక్ష'[38] అని సమాధానం చెప్పాడు. భాంధికాలనీలో నిర్భాగ్యులతో కలిసి వారిలో తానొకడుగా ఉండాలనుకొన్న

గాంధీని ఢిల్లీలోని బిర్లా భవనంలో ఉంచారు. గోపాలానికి గాంధి మానసిక క్షోభ అర్థమై మతకల్లోలాలు ఈ దేశంయొక్క స్వాతంత్ర్యాన్ని ఎటు తీసుకెడుతున్నాయో అని బాధపడ్డాడు గోపాలరావు. శాసనసభ్యుడు కాబట్టి నామమాత్రంగా గోపాలరావు విజయోత్సవాలలో పాల్గొన్నాడు. అక్కడ వేలాదిమంది కాందిశీకులను బస్తాలలో కుక్కినట్టుగా ఉన్నారు. ఢిల్లీలోని కాందిశీకులకు సేవచెయ్యాలనుకొని గాంధి అక్కడకు వెళ్ళాడు. గాంధి అక్కడనుంచే రాజకీయనాయకులను ఒకతాటిమీదకు తెచ్చే ప్రయత్నంచేస్తూ తన నైతికతతో పాకిస్థాన్‌కి భారతదేశానికి సామరస్యం తెచ్చేప్రయత్నంలో భాగంగా కట్టుబట్టలతో వెడుతున్న ముస్లిమ్ సోదరులు వెనక్కిరావటానికి నిరాహారదీక్షను చేపట్టాడు. గాంధిని చూడటానికి గోపాలరావు ఢిల్లీ వెళ్లాడు. దాన్ని దూరంగా నిలుచొని చూస్తున్న గోపాలరావుకు దేశం తల్లడిల్లిపోతుంటే ఆతని నిరాహారదీక్షకు, అహింసకు[39] ఉన్న శక్తియొక్క పదును[40] అర్థమైంది. హిందూ, ముస్లిములుగల భారత్-పాకిస్థాన్ ప్రజలు అవగాహనకు రావటంతో రెండువర్గాలపట్ల సానుభూతి ఏర్పడి జనవరి 18 వ తారీఖున గాంధి నిరాహారదీక్షను విరమించాడు. హిందూ-ముస్లిముల మధ్యన సయోధ్యత తాత్కాలికంగానైనా ఏర్పడింది. ఇది జరిగిన పది రోజులకే అంటే జనవరి 30 వ తారీఖున గాంధిని ఎవరో దుండగులు కాల్చగా 'హే రామ్' అంటూ గాంధి నేలకొరిగాడు[41]. గాంధి చనిపోవటాన్ని గోపాలరావు కళ్ళారా చూసాడు. మతోన్మాది తుపాకీగుండ్లకు బలియైన గాంధీని చూసిన తరువాత గోపాలరావు కాళ్ళకు చెప్పులు తొడుక్కోవటం మానేశాడు.

ఒక దశ గడిచింది. దేశం యావత్తూ కటికచీకట్లోకి వెళ్ళింది. గోపాలరావు తన జీవితంలో గడిచిన ఆ పదేళ్ళకాలాన్ని గురించి ఆలోచించటం మొదలుపెట్టాడు. డబ్బు, అధికారం తప్ప స్థిరమైన ఆదర్శాల విలువగల ప్రశాంతవాతావరణం లేని సమాజంలో తాను యిమడలేకపోతున్న విషయాన్ని గ్రహించాడు. భార్యాకొడుకులకు తనపట్ల ప్రేమలేదనిగ్రహించాడు. కొడుకైన శ్రీనివాస్ తో బి.ఇడి చదివి టీచరు అయితే భావిపౌరులను తీర్చిదిద్దగలిగే సమాజసేవ చేయొచ్చని చెప్పాడు. గోపాలరావు రెండవసారి గెలిచి నందయ్యవలె మంత్రి పదవిచేపట్టాలని తన భార్య పార్వతి ఆకాంక్షించినా, రాజకీయాలంటే కొరుకుడుపడని ఆతడు ఎన్నికలలో నిలబడలేదు. హిందీప్రచారసభలో హిందీటీచరుగా చేరినందుకు భార్య పార్వతికి గోపాలరావంటే హేళన ఏర్పడింది. అందుకే వెంటనే ఖస్సుమంది. నందయ్య రాజకీయవాదికాని తానుకాదనీ అన్న గోపాలరావుతో తమ్ముడైన బుచ్చి అందుకొని నందయ్య, నువ్వు, కాంగ్రెస్ వాదులందరూ సత్యాగ్రహం అంటూ పికెటింగులు చేయటం రాజకీయాలుకావా అని అడిగాడు. ఆనాడు అందరం దేశస్వాతంత్ర్యసిద్ధి లక్ష్యంగా పోరాడామని,

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత గాంధి అన్నట్లుగా 'కాంగ్రెస్ పార్టీని రద్దుచేసి ఖద్దరు టోపీలను పెట్టుకోవటం మానెయ్యాలి' అని గోపాలరావు అన్నాడు. అంటే ఖద్దరుటోపీ ముసుగులో స్వార్థపరులు డబ్బుకోసంచేస్తున్న రాజకీయ విజృంభణను అప్పటికే గోపాలరావు గ్రహించాడు. అటువంటి మార్గంలో నడుస్తున్న నందయ్యను విమర్శించదలచుకోలేదు గోపాలరావు.

ఒకరోజు గోపాలరావు రెండవసారి మినిష్టరైన నందయ్య దగ్గరకు ఒక హరిజన బాలుడిని వెంటబెట్టుకొని ఆ పిల్లవాడియొక్క కాలేజి సీటుకై వెళ్ళి, ఎంతోసేపు కూచొని ఎదురుచూసిన తరువాత కారు ఎక్కటానికి వచ్చిన నందయ్య గోపాలరావుని గుర్తుపట్టి వచ్చావా అని పలకరించి మరొకసారి వస్తే మాట్లాడుతానన్నాడు. ఆ తరువాత మూడురోజులకు నందయ్య దర్శనం అయినా ఆతడు ఆ పిల్లవాడికి సీటు యిప్పించటానికి బెట్టుచూపిస్తుంటే గోపాలరావు కొండా వెంకటప్పయ్యగారు నందయ్యకు కాలేజీలో సీటు యిప్పించి సాయంచేసిన విషయాన్ని నందయ్యకు గుర్తుకుతెచ్చాడు. అయినా నందయ్య మాత్రం తాను ఇప్పుడు అలాంటి సాయం చేయాలంటే చాలామంది వస్తారని, ఒకడికి సాయంచేస్తే హరిజనవాడంతా వస్తుందని తాను మునిగిపోతానని అన్నాడు. ఆనాడు నందయ్యకు అగ్రకులాలమీద కసి ఉండేదని గోపాలరావు గుర్తుచేయగా, తనకు యిప్పుడూ ఉందనీ, కాని నిరాశనిస్పృహ ఏర్పడిదని, గోపాలరావుకు వలె తాను ఆత్మనిగ్రహం చేసుకొనే స్థితిలోలేదని నందయ్య అన్నాడు. నందయ్య వేదాంతం మట్లాడుతున్నాడని గోపాలరావు అంటే, గోపాలరావుకు వ్యామోహం, అధికారం, గంపెడు పిల్లలబాధ్యత, తలకుమించిన అవసరాలు ఏవీలేవని నందయ్య అన్నాడు. దానికి గోపాలరావు ఇవన్నీ ఉండికూడా ఆత్మనిగ్రహంతో ఉండాలని అంటే, దానికి నందయ్య అగ్రకులాలవలె తమని గౌరవించరని, కేవలం తనకున్న మంత్రిపదవివల్ల తనముందు నక్కవినయాలు చూపిస్తున్నారని అన్నాడు. కిందటిరోజు జరిగిన సంఘటనను చెబుతూ తనని ఒక అగ్రకులాలవ్యక్తి భోజనానికి పిలిచినా, వారి యింట్లోనివారు తనకి వసారాలో పెడతామని అనేసరికి, ఆ ఆహ్వానించిన కుటుంబీకుడు తనకి క్షమాపణలను చెప్పాడని అన్నాడు. అగ్రకులాలవారు తమని అవమానిస్తున్నప్పుడు, తాము సొంతలాభం మానుకొని దేశంకోసం ఎందుకు పాటుపడాలని అనిపిస్తుందనీ, తనకుటుంబంయొక్క బాగు తాను చూసుకుంటున్నానని చెప్పాడు. తనకూతురును పెళ్ళాడే హరిజనపిల్లవాడికి చదువు చెప్పించాలనుకొన్నా తన మామ మినిష్టరని వాళ్ళు సరిగా కష్టపడి చదువు కోవటంలేదని, పైపెచ్చు తమ అవసరం తీరినతరువాత ఉద్యోగం సంపాదించుకొని పారిపోతున్నారని తమ కులంలోని యవత గురించి ఏకరువుపెట్టాడు. నందయ్య తన ఆదర్శాలు సిద్ధాంతాలు రాజకీయాలకింద నుజ్జునుజ్జయినాయని, మొదటిసారి మంత్రి అయినప్పుడు ఆదర్శంగా

ఉన్నానని, కాని ఈసారి తెలివిమీరినట్టలును, పైనవాడుపైనా, కిందివాడుకిందా ఉండటమే న్యాయమని తెలుసుకున్నట్టు[42] నందయ్యచెప్పాడు. సీటుకావలసిన ఆ పిల్లవాడు తనకూతురుని పెళ్లిచేసుకుంటే ఆతడి బాగోగులు చూస్తానని, కావాలంటే పెళ్లిలో వాళ్ళకుటుంబీకులకు బాగా తాగపోయిస్తానని నందయ్య అన్నాడు. ఆ మాటలువిన్న గోపాలరావుకు నందయ్య తన కులంవారిని పైకితీసుకురాకపోగా వారిని కిందికి నెట్టేస్తున్నాడనీ, స్వార్థంతో పెళ్ళిని ఎరవేసి విద్యావకాశాలు కల్పిస్తానన్నందుకు బాధపడి, ప్రపంచంలో అధికారం, డబ్బు, స్వార్థానికి తప్ప విలువలేకుండా పోతోందని అనుకొన్నాడు. కాని ఆ హరిజనబాలుడికి నందయ్యకు మధ్యవర్తిగా తాను వచ్చినందుకు నందయ్య అభిప్రాయాన్ని ఆ హరిజన బాలుడికి తెలియచేయాలనుకొన్నాడు.

గతమూడేళ్ళుగా నాగపూర్ లోని పౌనార్ లోగల వినోభా ఆశ్రమము నందు జీవితాన్ని ప్రశాంతంగా గడుపుతున్న గోపాలరావుకు పార్వతికి సీరియస్ అని వచ్చిన టెలిగ్రామ్ చూసుకొని ఇంటికి బయలుదేరాడు. దారిలో గోపాలరావుకు మూడేళ్ళకిందట తాను అక్కడ ఉన్నప్పుడు ఒకరోజు కొడుకు శ్రీనివాస్ నుండి నాన్నగారి ఆశయసిద్ధికోసం పోరాడుతున్నానని, తనకోసం వెదకి డబ్బు, కాలం వృధాచేసుకోవద్దనే లేఖ వచ్చినవిషయం గుర్తుకువచ్చింది. ఆనాడు పార్వతి తనకొడుకు అట్లా దేశసేవ అని తిరగటానికి కారణం గోపాలరావే అని తనని నిందించటం గుర్తుకువచ్చింది. ఆనాడు రాముడత్తయ్య, దేశసేవచేస్తున్న మామయ్య చివరిక్షణం వరకు సేవచేసి పునీతమైన విషయంకూడా గుర్తుకువచ్చి, పార్వతి తనని అర్థం చేసుకోవటంలేదని బాధపడ్డాడు. ఇంటికి చేరగానే పార్వతి గుక్కపెట్టి ఏడుస్తున్న పసిపిల్లను వొడిలో పెట్టుకొని పాలుతాగిస్తోంది. రెండురోజులకిందట ఒక కామ్రేడ్ వచ్చి పసిపిల్లను చేతిలో పెట్టి కొడుకైన శ్రీనివాస్ పంపిన లేఖను చేతిలోపెట్టి వెళ్ళిన విషయాన్ని బావమరిది చెప్పాడు. గోపాలరావుకు రాసిన ఆ లేఖలో కాలం మారినప్పుడు ఆశయాలు, ఆదర్శాలు మారుతుంటాయనీ, ఎంతోమంది, దేశంకోసం ప్రాణాలు త్యాగంచేయటం, గోపాలరావు వంటివారు ప్రాణాలు బలిపెట్టటానికి సిద్ధపడటంతోనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందనీ, కాని స్వరాజ్యంతోపాటు సమానత్వం రాలేదనీ, ఆకలితో అన్నార్తులు, శ్రామికుల ఆర్తనాదాలకు పంచవర్షప్రణాళికగాని, ఓటుహక్కుగాని పరిష్కారం చూపెట్టలేకపోయాయనీ, రాజకీయనినాదాలు వంచనకే తప్ప ఆకలిని తీర్చటంలేదనీ, ఆర్థిక అసమానతను వర్గపోరాటంతో తప్ప పోగొట్టలేమని, గోపాలరావుతరంవారు అహింసను చేపడితే, నేడు తమతరం ఆయుధాలను చేపడుతోందనీ, మార్గాలు వేరైనా, ధ్యేయం ఒకటేనని, యిద్దరిలో చిత్తశుద్ధి ఒకటేనని, దోపిడీలేని సమాజం తమ ధ్యేయమని[43], రాసాడు. అంతేకాదు, తాను తోటి కామ్రేడ్ రమని జీవితభాగస్వామిని చేసుకొన్నట్టును, పోరాటంలో

తమప్రాణాలు ఏనాడైనా పోవచ్చునీ, తమకు పుట్టినబిడ్డకు సమసమాజంలో పెరిగే అవకాశం ఉండాలని, పసిబిడ్డను మీకు అప్పగిస్తున్నానని రాసిన విషయం ఆ లేఖలో ఉంది. ఆ పసిబిడ్డను గోపాలరావు దగ్గరకు తీసుకుంటే ఆ పిల్లలో రాముడత్తయ్య కళ్లు కనపడ్డాయి. పార్వతి ఆవిషయాలను తెలుసుకున్నప్పటినుండి ఎప్పటికప్పుడు నేలమీద పడిపోయే రోగం ఆమెకు వచ్చింది. గోపాలరావు ఆ పసిపిల్లకు పాలుపట్టటం మొదలుపెట్టాడు. తనకు పార్వతి, ఆ పసిపిల్ల కలిపి యిద్దరు బిడ్డలని భావించాడు. ఆ పసిపాపకు స్వరాజ్యలక్ష్మి అనే పేరుపెట్టాడు. అప్పటినుండి గోపాలరావు కాంగ్రెస్, సమాజసేవను పట్టించుకోకుండా కుటుంబాన్ని పట్టించుకోవటం మొదలుపెట్టాడు. సంపాదనకోసం ఒక తెలుగు పత్రికలో సబ్ ఎడిటర్ గా చేరి గాంధేయవాదులు యిష్టపడే విధంగా గాంధేయదృక్పథం అని వారంవారం వ్యాసాలను రాసేవాడు. ఇంట్లో ఉన్నప్పుడు స్వరాజ్యలక్ష్మికి కథలుచెప్పటం, ఆ పిల్ల ఊకొట్టటం వంటివి జరిగేవి. స్వరాజ్యం రాకతో గోపాలరావుకి, పార్వతికి కొంత సామరస్యం ఏర్పడటంతో పాటు ఆర్థికంగా కాస్త నిలదొక్కుకోగలిగాడు గోపాలరావు.

గోపాలరావు తన తమ్ముడి ఇంట్లోనే పక్కనున్న పోర్షన్ లో ఉంటున్నందుకు బుచ్చి భార్య అనే మాటలకు తమది పరాధీనపు బతుకయిందని పార్వతి అంటుంటే గోపాలరావుకు ఆమె తనయొక్క చేతకానితనాన్ని ఎత్తిచూపిస్తున్నట్టు అనిపించింది. మనిషి కష్టాల్లో ఉన్నప్పుడు, ఆత్మీయత–బాధ్యత మిళితమై కష్టాలు వ్యక్తులను సన్నిహితం చేస్తాయి. కష్టాలు దూరంకాగానే మనుషులు దూరం అయి, సాధింపులు అసంతృప్తి మిగులుతాయి. పార్వతికి తమదంటూ సొంత యిల్లు లేదని బాధపడుతుందని గ్రహించిన గోపాలరావుకు మనుష్యులు తమ యిల్లు, తనవాళ్ళు, తమ రాష్ట్రం, తమ భాష అంటూ సంకుచితం అయిపోతున్నట్టు బాధపడ్డాడు. నా అన్న పరిధిలేని కోర్కెలతో రాజీపడలేకపోతున్నారని దేశం భిన్నాభిప్రాయాలతో గిజగిజ లాడుతుంటే నా అన్న వేరుపురుగుకు స్వార్థం కారణం అని గ్రహించాడు. పార్వతికి తనయిల్లు అనే భావన ఉంటే, బుచ్చికి తన వాళ్ళు అన్న భావన, నందయ్యకు తన కులం, తన నియోజకవర్గం అని అనుకుంటుంటే ప్రజలు తమ భాష తమ రాష్ట్రం అని పోరాడుతున్నారని గోపాలరావు భావించాడు. వీటన్నింటిలో స్వార్థం ఉన్నట్టుగానే స్వాతంత్ర్య పోరాటంలోను నా దేశం, నా స్వాతంత్ర్యం అనే స్వయంచింతన, అహం ఉందని ఆలోచిస్తుంటే గోపాలరావుకు పరాయిత్వం గుర్తుకు వచ్చి నవ్వు వచ్చింది.

దేశ స్వాతంత్ర్యానంతరం ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం[44] కావాలనే ఉద్యమం ఆరంభమైంది. వ్యక్తిగత లబ్ధికోసమైతే స్వార్థమని, దేశం కోసమైతే త్యాగం అని అంటూ వారిని చిన్నబుచ్చుతున్నామా అని తనలో తాను ఆలోచించాడు. వెంటనే కాదని అనిపించింది కాని అందరిని సరిసమానంగానే

చూస్తున్నామా అని ఆలోచించాడు. పత్రిక ఎడిటర్ వచ్చి రాష్ట్ర పరిరక్షణకై అఖండభారతదేశం అంటూ చేతులు ముడుచుకు కూర్చోలేమని అంటుంటే గోపాలరావుకు ఆ ఎడిటర్ తననే దెప్పిపొడుస్తున్నట్లు, సమస్యను, వ్యక్తిని వేరుచేసి చూడనివారు, ప్రజాబాహుళ్యపు ఆలోచనా విధానాన్ని పట్టనివాళ్ళు పత్రికలు నడుపుతున్నారని అనిపించింది. గోపాలరావుకు గాంధేయవాది అయిన పొట్టి శ్రీరాములుగారంటే గౌరవం ఉంది, కాని ఆయన గమ్యంతో ఏకీభవించలేకపోయాడు. భాషా ప్రయుక్త రాష్ట్రాలు దేశాన్ని బలహీనపరుస్తాయని, వ్యక్తులస్వార్థంతో ఇప్పటికే కరుడు కట్టుకొనిపోయిన దేశం భాషాప్రయుక్త రాష్ట్రాలవారీగా విభజింపబడితే, తుక్కుపోతుందనుకునే చిల్లుల జల్లెడనిండా పెద్దరాళ్ళుమిగిలే ప్రమాదం ఉంటుందని అన్నాడు. దానికి ఎడిటర్ మాత్రం ఆత్మ త్యాగంచేసిన పొట్టి శ్రీరాములు గాంధి కంటె గొప్పవాడనగా, గోపాలరావుకు నిరాశ, నిస్పృహకలిగి జైల్లో రాజకీయఖైదీలు, నేరస్థులు ఒకటికాదని పోరాడి దానికోసం ప్రాణాలొడ్డిన జితేంద్రనాథ్ దాస్ గుర్తుకువచ్చాడు. తనకి పొట్టి శ్రీరాములంటే గౌరవం అభిమానం ఉన్నాయికాని, ఆయన పోరాటఫలితం ఆయన ఆశయసిద్ధికి తగినట్టుగా ఉంటుందో లేదో అనే అనుమానం ఉంది. అందుకే గోపాలరావు ఉద్యమకారులకు ఆత్మత్యాగం ఒక్కటేకాక మేధ, సునిశితదృష్టి, రాజకీయపరిజ్ఞానం, పదునైన శక్తి ఉండాలని అనుకొన్నాడు.

ఆంధ్రరాష్ట్రం వచ్చి పన్నెండేళ్ళు తిరక్కుండానే తెలంగాణా ఉద్యమం వచ్చింది. ఒకే భాషమాట్లాడుతూ ఒకేసంస్కృతి ఉన్నా తెలుగువాళ్ళు కలిసిమెలిసి ఉండలేకపోతున్నారు. కాందిశీకుల్లాగా తెలంగాణానుండి ఆంధ్రాకు వచ్చినవాళ్ళల్లో నందయ్యకూడా ఉన్నాడు. తెలంగాణావాళ్ళ దృష్టిలో ఆంధ్రవాళ్ళు తెలివైనవారని, ఉద్యోగాలన్ని వాళ్ళే తెచ్చుకుంటున్నారని, తెలంగాణావాళ్ళు కుళ్ళుపడి ఏడుస్తున్నారని నందయ్య తనని సమర్థించుకుంటుంటే గోపాలరావు అతనితో తెలంగాణాలో నందయ్య పోగుచేసిన ఆస్తులు ఏమవుతాయని అడిగాడు. దానికి నందయ్య ఆస్తులకు కాళ్ళులేవుకాబట్టి అక్కడే స్థిరంగా ఉంటాయని అన్నాడు. పొట్టిశ్రీరాముల ఉద్యమంలో అతనితో కూడా ఉండిన నందయ్య ఈ ఉద్యమం రాజకీయాలలో చిన్న ఆట అని ఆంధ్రవారికి ముల్కీసర్టిఫికెట్లు[45] జారిచేసి సొమ్ముచేసుకొన్న నందయ్య అన్నాడు. తెలంగాణాలో నందయ్య యింటిమీద ప్రత్యేకమైన దాడులు జరిగాయి. గోపాలరావుకు నందయ్యజీవితం, అతని చుట్టూపరిసరాలు కుళ్ళిపోయాయని అర్థమై, అతనితో వాదించటం అనవసరం అని ఆనాడు తాము అనుకొన్నవిషయాలను ఆలోచిస్తుంటే స్వరాజ్యలక్ష్మి వచ్చి ఏమి ఆలోచిస్తున్నావని అడిగింది. ఆ పిల్లకి రాజకీయాలను గురించి చెప్పలేక స్వరాజ్యానికి మహనీయుల చరిత్రలను, స్వాతంత్ర్యసమరానికి సంబంధించిన పాఠాలను ఆ రోజునుంచి చెప్పాలని గోపాలరావు నిర్ణయించుకున్నాడు.

దేశస్వాతంత్ర్యంకోసం తమ ఆస్తులను పోగొట్టుకొని సత్యాగ్రహం చేసిన కాంగ్రెస్ వారు ప్రస్తుతరాజకీయాలలో యిమడలేని ఉద్యమకారులకు పదిఎకరాలభూమిని యిస్తున్నందుకు సంతోషపడి తీసుకుంటుంటే వారిది స్వార్థమనిపించింది. ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన తరువాత రాజధానిగా మా ఊరంటే మాఊరని ప్రజలు కమిషన్ కి అర్జీలను అందచేసారు. నాయకులు మద్రాసులో కూర్చొని ఆంధ్ర రాజధానిని నిర్ణయించటం సబబుకాదని గోపాలరావు అంటే ఎడిటర్ ఉదరపోషణకోసం ఉద్యోగాలకోసం ప్రత్యేకరాష్ట్రం కావాలని అన్నాడు. గోపాలరావు ఆతనితో ప్రజలు ఉద్రేకంతో తప్పుదోవన నడుస్తుంటే బుద్ధజీవులైనవారిగా పాత్రికేయులకు వారికి విభజనలోని కష్టనిష్ఠూరాలను చెప్పే బాధ్యత పత్రికలకు ఉందని అన్నాడు. దానికి ఎడిటర్ ఆంధ్రరాష్ట్రం వస్తే విద్యాఉద్యోగాభివృద్ధి జరుగుతుందని అనగా, ఖద్దరుటోపికి గౌరవం యివ్వలేని స్థితిలో రాజకీయనాయకుల అవినీతి ఉండటమే దానికి కారణం అని గోపాలరావు అన్నాడు. ఇంటికి వచ్చిన తరువాత బుచ్చి సత్యాగ్రహులకు గుంటూరు విజయవాడ మార్గమధ్యంలో పదిఎకరాలభూమిని నందయ్య పంచుతున్నాడని, మినిష్టర్లు కూడా తీసుకుంటున్నారని చెప్పగా, స్వరాజ్యం పెళ్ళికి ఉంటుందని పార్వతికూడా అర్జీని పెట్టమని అంది. గోపాలరావుకు కోపంవచ్చి తాను ఆ పది ఎకరాలకోసం జైలుకు వెళ్ళలేదని, అందుకే ఖద్దరుటోపీ అనహేళనకు గురి అవుతోందనీ, నందయ్య తనతోపాటు చదువుకున్నాడని చెప్పాలంటేనే తనకి సిగ్గుగా ఉందని అంటాడు. స్వరాజ్యానికి తన కష్టార్జితంతో చదువుచెప్పించగలనని, యింటికోసం హౌసింగ్ బోర్డులో తనకు లోయర్ ఇంకమ్ గ్రూపుకు కట్టిస్తున్న ఇళ్ళు ఇస్తున్నట్టుగా ఉన్న కాగితాన్ని చూపించాడు. కొన్నాళ్ళకు గృహప్రవేశం అంటూ స్వరాజ్యలక్ష్మి గాంధి ఫొటోచేతిలో పెట్టుకొనిరాగా దీపారాధనచేసి ఆ కొత్త యింట్లోకి మారారు.

జానకమ్మ తనకు ఆరోగ్యం బాగాలేదని ఒకసారివచ్చి తప్పనిసరిగా తనని కలవమని ఉత్తరం రాసి పంపేసరికి గోపాలరావు స్వరాజ్యాన్ని వెంటపెట్టుకొని పదిహేనేళ్ళ తరువాత చీరాలకు బయలుదేరాడు. మనిషికీ మనసుకూ ఎంతోదూరం ఉంటుందంటారుగాని గోపాలరావుకు రోజూ రాముడత్తయ్య స్మృతి తాజాగానే ఉంటుందనుకున్నాడు. రైల్లో తోటిప్రయాణీకుడు స్వరాజ్యంయొక్క చదువుగురించి అడిగి ఆమె మామూలు స్కూలులో చదువుకుంటూనే తాతచేత యింటిదగ్గర ఇంగ్లీషు నేర్చుకుంటున్నట్టు తెలుసుకొన్నాడు. అతడు తన మగపిల్లలిద్దరిని ఇంగ్లీషుస్కూల్ లో వేసి హాస్టల్‌లో ఉంచాననీ, అక్కడ వారికి చదువురాకపైగా చెడుతిరుగుళ్ళు, చెడు వ్యసనాలు వచ్చాయని వాపోయాడు. అప్పుడు గోపాలరావు అతనితో ప్రిన్సిపాల్‌కి చెప్పక పోయినారా అని అంటే, ఆయన మీఊళ్ళోనే అలవాటయిందని ఎదురు మమ్మల్నే అన్నాడని, తన చుట్టాలపిల్లవాడైతే మత్తుమందుకుకూడా బానిస

అయ్యాడనీ, అతడిని డిస్మిస్ చేసి పంపారని చెప్పాడు. దానికి కారణం వాళ్ళ హాస్టల్ లో రాత్రిపూట కరెంటు ఖర్చుకాకూడదని, లైట్లు వేయకపోవటంతో ఆ చీకట్లో లేచి బాత్రూమ్‌లకు వెళ్ళటం నుండి తప్పించుకోవటానికి మత్తుబిళ్ళలు వేసుకొని పిల్లలు నిద్ర పోవటం అలవాటుచేసుకున్నారని చెప్పాడు. అంతేకాక, ఇంగ్లీషు స్కూళ్ళల్లో కావలసింది పిల్లలు, యూనిఫారమ్ తళతళలాడే బూట్లు, టై వేసుకొని వస్తే వారు క్రమశిక్షణతో ఉన్నట్టుగా భావిస్తారు కాని పిల్లలమనసు వారికి అక్కరలేదని చెప్పాడు. చేరిన కొత్తల్లో పిల్లవాడు ఆ చీకటికి భయపడి జ్వరం తెచ్చుకుంటే ప్రిన్సిపాల్‌కి చెప్పినా వాళ్ళకు క్రమశిక్షణ ముఖ్యమని అంటారనీ, అదంతా పిల్లలకు ఉండే యింటిమీద బెంగ అని అంటారని చెప్పాడు. వేరేస్కూల్‌లో వేద్దామంటే ధనవంతురాలైన తన భార్య తమకు స్టేటస్ తగ్గుతుందని అంటుందని, యింట్లో తనమాటకు విలువ లేదని బాధపడ్డాడు. పార్వతికూడా స్వరాజ్యాన్ని ఇంగ్లీషు కాన్వెంటులో వేస్తే బాగా ఇంగ్లీషు వస్తుందని గొడవపెట్టిన విషయం గోపాలరావుకు గుర్తుకువచ్చి ఇంగ్లీషుస్కూల్‌లో చదివితేనే ఇంగ్లీషు వస్తుందా అని ప్రశ్నవేసుకున్నాడు. బ్రిటిష్ పాలనలో ఇంగ్లీషు స్కూల్ వద్దని ఇరవైఏళ్ళు పోరాడి, తిరిగి యిప్పుడు అదే చదువు కావాలనుకుంటున్నామా అని, గుమాస్తాలను తయారుచేసే బ్రిటిష్ విద్యావిధానం బాగాలేదనుకొని బాయ్ కాట్ చేసినవారే తిరిగి అదే కావాలనుకుంటున్నారనీ, తిరోగమనం చెందుతున్నామా అని గోపాలరావుకు అనిపించింది. మనభాష మన సంస్కృతి అంటూనే తమ పిల్లలకు ఇంగ్లీషునే నేర్పిస్తున్నారని, ఇంగ్లీషు నేర్చుకోవటం తప్పుకాదుకాని, దానినొక స్టేటస్ సింబలుగా భావించటాన్ని గోపాలరావు వ్యతిరేకించాడు. ఈ చదువులు కేవలం ఉద్యోగానికితప్ప వ్యక్తివికాసానికికాదనీ, విద్యార్థులను ఫ్యాక్టరీ మోడల్స్ లాగా తయారుచేస్తోందని, ఈ విద్యవల్లనే బానిసత్వం ప్రాణం పోసుకుంటోందని, ఫారెన్ వెళ్ళటానికి మొదటిమెట్టని భావించటమే దేశానికిపట్టిన పెద్దపిచ్చిజబ్బు అని గోపాలరావు వ్యక్తం చేసాడు. చివరికి ఆ ప్రయాణికుడు తమ ఊళ్ళో ఉన్న అన్న నిద్రలో కూడా లెనిన్ ని తలచే ట్రేడ్ యునియన్ నాయకుని పిల్లలుకూడా అమెరికాలోను, వెస్ట్ జర్మనీలోను చదువుతున్నారని చెప్పగా గోపాలరావుకు ప్రజల విదేశీమోజు వందరెట్లు పెరిగిందని అర్థమైంది. క్యాబిన్లోంచి ఎగరేస్తున్న జెండాని చూపించిన స్వరాజ్యానికి రైలు పనిచేసే విధానాన్ని చెప్పాడు. చీరాల చేరుకొన్న గోపాలరావును గుర్తుపట్టి రిక్షాబండిని తెచ్చిన వ్యక్తి దారిలో జానకమ్మకు ఆరోగ్యం బాగాలేదనీ, ఆమెకు గవర్నమెంటు ఐదుఎకరాల భూమిని యిచ్చారని చెప్పినప్పుడు గోపాలరావుకు జానకమ్మ ఆ భూమిని తీసుకున్నందుకు మనస్సు కలుక్కుమని వెనక్కివెళ్ళిపోవాలని అనిపించింది. చీరాల అంతా మారిపోయింది. ఎక్కడచూసినా లౌడ్ స్పీకర్లు, అది మాట్నీసినిమా వదిలిన టైమ్ కావటంతో జనం తొక్కిసలాట

అనీ, రోజూ సాయంకాలమైతే మగవాళ్ళు సినిమాచూడటం, తాగటం, యింటికివెళ్ళి పెళ్ళాలను చావగొట్టటం చేస్తుంటారని, మగవారు గంజిమాని కల్లుతాగుతారనీ, వారి ఆడవారు పిల్లలకు తిండిపెట్టక మాట్నీ సినిమాకు వస్తారని రిక్షా బండి అతను చెప్పాడు. ఆ ఊళ్ళో సారాకొట్టులేని వీధి లేదనీ, సందు సందుకు కాంగ్రేసువాళ్ళు కల్లుకొట్టు పెట్టినవిషయాన్ని ఆ రిక్షాబండి వ్యక్తితో తనకు జరిగిన సంభాషణలనుండి గోపాలరావు గ్రహించాడు.

గోపాలరావు జానకమ్మను ఆమె యింటిదగ్గర కలిసాడు. ఆమె స్వరాజ్యాన్నిచూస్తూనే ఆ పిల్లలో రాముడత్తయ్య పోలికలున్నాయని చెప్పింది. జానకమ్మ తాను చనిపోయే ముందు కొన్నిపనులు చేయాలనుకుంటున్నట్టు, రోజులుమారిపోయాయని, స్వాతంత్ర్యపోరాట సమయంలో కల్లుమానమంటూ కల్లు కొట్లముందు పికెటింగులు చేసి అరెస్టుకాబడి జైలుకెళ్లామని, కాని స్వాతంత్ర్యానంతరం ప్రతివీధిలో కల్లుకొట్టు వేలంపాడి ఆ డబ్బుతో వోట్లు కొంటున్నారనిచెప్పింది. త్యాగాలు మిగిలాయికాని, ఒక్కటికూడా మార్చుకోనివాళ్ళకు స్వంతంత్ర్యాన్ని పొందే అర్హత లేదనిపిస్తోందని, ఆనాడు హరిజనోద్ధరణ, అస్పృశ్యతానివారణ అని తాము అనుకుంటే నేడు ఊరికి దూరంగా వారికి కాలనీలను కట్టారనీ, బాపూజీ దీనిని కలలోనైనా ఊహించి ఉండిఉంటే ఆయన ఇటువంటి స్వరాజ్యం, స్వాతంత్ర్యం వద్దని చెప్పి ఏనాడో హిమాలయాలకు వెళ్ళేవారని జానకమ్మ అంది. అంతేకాదు, ఆదర్శాలు వల్లిస్తూ కూర్చోకుండా రాజకీయనాయకులు చేస్తున్న అన్యాయాలను ప్రజలకు చెప్పి వారి కళ్ళుతెరిపించండి అనీ, ఆనాడు బ్రిటిష్ వాళ్లను తరిమికొట్టాలనే లక్ష్యంతో రాత్రిళ్ళు కార్యకర్తలువచ్చి మాట్లాడేవారనీ, అలాగా నేడు మరోలక్ష్యంకోసం పోరాడాలని, ప్రజలు తలచుకొని రాజకీయ దురహంకారాలను, కులతత్వాలను తరిమికొట్టాలని అంది. ఆ మాటలు వింటుంటే గోపాలరావుకి తాను అసమర్థుడినని అనిపించింది. గోపాలరావు గవర్నమెంటు యిచ్చిన పొలం తీసుకోలేదని నందయ్య తనకు చెప్పిన విషయం జానకమ్మ చెప్పింది. తానుకూడా వద్దంటుందనే భావనతో వచ్చిన నందయ్యతో, తాను పొలం తీసుకొని నలుగురికి పనికివచ్చే పనిచేయవచ్చని భావించాననీ, లేకపోతే ఆ పొలాన్నికూడా అప్రాచ్యుడెవరైనా స్వాహాచేస్తారని, అందుకే కాటికి కాలుజాచుకు కూర్చొన్నా, తాను ఆ పొలాన్ని తీసుకున్నట్టు జానకమ్మచెప్పింది. అంతేకాదు ఆ నాడు కులం, సగోత్రం లేకుండా యిళ్లూవాకిళ్లూ వదులుకొని దుగ్గిరాలవారి ఉద్యమంలో చేరిన బడుగువారి గురించి అందరూ మరిచిపోయినా, తాను మరవలేదని చెప్పింది. దానికి గోపాలరావు తనపని అయిపోయిందనీ, తన మనమరాలికోసమే బతుకుతున్నానంటే, జానకమ్మ దానినే స్వార్థం అని అంటారని అంది. గోపాలరావు ఏమిచెయ్యాలో తోచక ఆ రాత్రి నిద్రపట్టక ఒకప్పుడు దేశానికి

ఏమిచెయ్యాలని ఆలోచించే స్థాయినుండి నేడు దేశం తనకేమిచేస్తుందని ప్రతిఫలం కావాలనుకొనే వారి చేతుల్లోకి దేశం చేరితే, దేశం పురోగమించదని అనుకొన్నాడు. మర్రోజు జానకమ్మ తనకు యిచ్చిన పొలాన్ని చూపిస్తూ ఫలసాయాన్ని అయిదుగురు పంచుకొంటారని చెప్పింది. గోపాలరావుని రాముడత్తయ్య యింటికి తీసుకెళ్ళి, రామలక్ష్మి తన యింటిని గోపాలరావు యిష్టం వచ్చినట్లు చేసుకోవచ్చని వీలునామా రాసిన విషయాన్ని చెప్పినప్పుడు గోపాలానికి కూడా పూర్వం అత్త చెప్పిన అదేవిషయం గుర్తుకు వచ్చింది. జానకమ్మ చీరాల-పేరాల ఉద్యమ సమయంలో తన యింటిని కాలపెడుతుంటే సామానులను కాపాడకోబోయి ఆ మంటల్లో చనిపోయిన శివయ్య మనమడైన సూర్యారావును పిలిచి పరిచయం చేసింది. ఆతడు హరిజన బాలికను పెళ్లిచేసుకున్నాడని, భార్య మాల కులస్థురాలని, యిద్దరు ప్రేమించి పెళ్ళిచేసుకున్నందుకు ఆతనిని కులంనుండి వెలివేసారనీ, వీరికి రాముడత్తయ్య యింటి గొడ్లసావిటిని బాగుచేసుకొని ఉండటానికి అనుమతి యివ్వమని చెప్పింది. స్థానిక రాజకీయనాయకులు దీనిని దుగ్గిరాల పఠనమందిరం చేస్తామనే వంకతో రామలక్ష్మి-వాసుదేవరావుల యింటిని స్వాధీనంచేయమని ప్రభుత్వానికి అర్జీపెట్టుకొన్న విషయాన్నికూడా చెప్పింది. గోపాలం ఆ రాజకీయనాయకులకు చిత్తశుద్ధి ఉంటే ఊరికి చివర్లో ఉద్యమం చేసిన ప్రదేశంలో ఆ లైబ్రరీని పెట్టవచ్చుకదా అని అన్నాడు. ఇక్కడ ఇల్లు ముఖ్యంకాదని కులాలపోరాటమని, వీళ్ళిద్దరికి ఆశ్రయం యిచ్చి ఆ మల్లెతోటమీద ఆదాయాన్ని తీసుకోమని తాను చెప్పినందుకు ఇదంతా రాజకీయాలు చేస్తున్నారనీ, ఈ ఇంట్లో సూర్యారావువాళ్ళు వాసుదేవరావుపేరిట నైట్ స్కూల్ పెట్టుకోవటానికి అనుమతిని రాసియివ్వమని జానకమ్మ గోపాలరావును అడిగింది.

కాలం మారిపోయిందని, కాలం చెడిపోయిందని అంటూ మనిషి తానుచేసిన కొన్నింటికి బాధ్యతవహించి మిగతాది కాలంమీద నెడుతూ అనే మాటలని గోపాలరావుకు గుర్తుకు వచ్చింది. మనిషి మనిషిగా బ్రతకలేక తన బలహీనతలను కాలంమీదకు నెట్టుతున్నాడనీ, మనిషి తాను మారిపోతూ చుట్టూర ఉన్న పరిసరాలను కాలుష్యంచేస్తూ కాలాన్ని తప్పుపడుతున్నాడని అనుకొన్నాడు. కాలం ఎప్పుడూ ఒకేరకంగా ఉందని, తనతల్లికూడా తన చుట్టూరా ఉన్న పరిస్థితులు మార్పుకు గురియై విలువలు తలకిందులైనప్పుడు కాలంమీద తప్పుపెట్టేదని గోపాలరావుకు గుర్తుకు వచ్చింది. మొదటినుండి తనని అప్రయోజకుడని చిన్నచూపు చూసిన తల్లి రెండవ కోడలి దగ్గర అవమానపడుతూ, దానికి కారణం కాలంలో వచ్చిన మార్పు అని అంటుందనీ, అసలు కారణంగా బుచ్చి డబ్బుకు విలువయిచ్చినట్లుగా తల్లికి విలువను యివ్వటంలేదని ఆమె గ్రహించటంలేదని గోపాలరావు భావించాడు.

చీరాలనుండి యిల్లుచేరుకున్న గోపాలరావు యింటికి తల్లి పెట్టెబేడా సద్దుకొని వచ్చి బుచ్చియింటికి వచ్చినా తిరిగి వెళ్ళనని చెప్పింది. దానికి కారణం బుచ్చికి తల్లి నగలమీద ఉన్న కోరిక, తల్లి బొడ్లోపెట్టుకొని పడుకొన్నప్పుడు ఆ నగలను చిన్నకొడుకు తీసుకోవాలనుకోవటంతో ఆమె వచ్చినట్టు చెప్పటంతో, ఆమె తన నగలకు అక్కడ భద్రతలేదని భావించి గోపాలరావు దగ్గరకు వచ్చినట్లు అర్థమైంది. గోపాలరావు ఆ నగలను బుచ్చికి యిచ్చేయమంటే ఆమె తన తదనంతరం స్వరాజ్యం పెళ్ళికి యివ్వాలనుకుంటున్నట్టు చెప్పింది. స్వరాజ్యలక్ష్మి తాను బుచ్చికూతురు రేవతిలాగా అమెరికా పెళ్ళికొడుకుముందు తలొంచుకొని పెళ్ళిచేసుకోనని, తాను ఉన్నతచదువు చదివి, ఉద్యోగంలో చేరేంతవరకు తన పెళ్ళివిషయం మాట్లాడవద్దని తాతమ్మను హెచ్చరించింది. అంతేకాక తాతమ్మ తన నగలను ఎరగా పెట్టి నీప్రేమను కొనుక్కోవాలనుకుంటోంది కాని, నీవు డబ్బుతో సంబంధంలేకుండా ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటావని తాతమ్మకు తెలియటంలేదని గోపాలరావుతో స్వరాజ్యలక్ష్మి అంది. దానికి గోపాలరావు తల్లి స్వరాజ్యానికి అచ్చంగా రాముడత్తయ్య లక్షణాలు వచ్చాయని అంది. దానికి గోపాలరావు తల్లిని యింట్లోనే స్వరాజ్యం జోలికివెళ్ళకుండా కుదురుగా ఉండమన్నాడు. తల్లి సుబ్బమ్మ అప్పుడప్పుడూ బుచ్చి యింటికి వెడుతూ వస్తూనే ఉంది.

ఒకరోజు కారేసుకొని బుచ్చి గోపాలరావు యింటికి వచ్చి, దేశం భ్రష్టుపట్టి పోతోందని, ఎక్కడచూసినా అవినీతి, లంచగొండితనం ఉన్నదనీ, ఏడాదికి నాలుగువందలకోట్లు నల్లధనంగా మారుతుందని, వ్యాపారస్తులు ప్రభుత్వాన్ని మోసంచేస్తున్నారని, వారు పన్నుకట్టటంలేదని, ప్రభుత్వంలో పన్నులన్నవి ప్రజలధనమని ఎవ్వరూ గుర్తించటం లేదని వాపోయాడు. బుచ్చిమాటలు వింటుంటే గోపాలరావుకు మసికుండ ఇనుపకెటిల్ ని నువ్వు మసిపట్టినట్టున్నావని అంటుందన్నసూక్తి గుర్తుకువచ్చి నవ్వురాగా తన నవ్వును బయటకు తెలియనీయకుండా గోపాలరావు జాగ్రత్తపడ్డాడు. బుచ్చి రాజకీయకాలుష్యాన్ని కడిగి ముందుతరాలవారికి క్లీన్ అడ్మినిస్ట్రేషన్ అందించాలని, దానికి క్లీన్ చిట్టు ఉన్న గోపాలరావు వంటివారు ఎలక్షన్‌లలో నిలబడాలని పార్లమెంటు సీటుకు పాతిక లక్షలు, అసెంబ్లీసీటుకు ఐదు లక్షలు ఖర్చుపెట్టుకోవాలని బుచ్చి చెప్పాడు. అధికారం వస్తేకాని అవినీతిని అరికట్టలేమని, కాని ఆ అధికారంకోసం డబ్బు ఖర్చుచేయాలని అన్నాడు. దానికి గోపాలరావు పార్టీ టికెట్టు కొనుక్కోవటమే అవినీతి అనీ, దానికోసం ఖర్చుపెట్టే నల్లడబ్బుతో వోట్లుకొనుక్కోవటం ఎలక్షన్లు కావనీ, ప్రజాసేవ చేయటానికి ఎలక్షన్లు పునాదిరాళ్ళని, వోట్లు కొనుక్కోకుండా తాను గెలిచానని అనగా, ఇప్పటిరోజుల్లో పిలిచి సీటు యివ్వరని, నువ్వూ నందయ్యా గెలిచారుకాని, నందయ్య మినిష్టరై లక్షలు గడించి పార్టీకి పెద్దతలకాయ అయ్యాడని, నోట్లకువిలువ ఉందికానీ

నిజాయితీకీ విలువ లేదని అన్నాడు. గోపాలరావు తన దగ్గరకు ఎందుకొచ్చావని బుచ్చిని అడగగా, పార్టీలో గోపాలరావు అన్నపేరుకు కాస్తవిలువ ఉందనీ, పార్టీ హైకమాండునుండి ఎంక్వైరీ వస్తే తనకు సుముఖంగా రాయమని అడగటానికి వచ్చినట్టు బుచ్చి చెప్పాడు. అంతేకాక, ఇప్పుడు గాంధినీతులు, సిద్ధాంతాలు ఎవరికీ అవసరం లేదని, ఇప్పుడు గాంధి ఎవరని అడిగితే భారతప్రధాని ఇందిరాగాంధి తండ్రి అని చెప్పే మేధావులు శాసనసభలలో నాయకులుగా ఉన్నారని అన్నాడు. ఎలక్షన్లలో[46] బుచ్చి గెలిచి ఊరేగింపులో వంగి వంగి దండం పెడుతుంటే, గెలిచిన నాయకుల మెడలోని పూలదండలలోని ప్రతిపువ్వు ఒకొక్క లంచగొండికి ప్రతీకలని భావించాడు గోపాలరావు. బుచ్చికి అధికారం, ఢిల్లీలో నివాసం ఉండికూడా తల్లి నగలు కావాలనుకొనేవాడు తల్లికి అన్నం పెట్టలేనివాడు చేసే ప్రజాసేవ యేమిటనీ, బుచ్చి పదవీపందెంలో ఆరాటపడుతున్నాడుగాని దేశానికి సేవచేయాలని ఆతనికి ఉందా అని అనుమానం గోపాలరావు. వచ్చింది.

డొనేషన్ కట్టాల్సిన అవసరంలేని స్లమ్ ఏరియాలలోని[47] పిల్లలు చదువుకునే కాలేజిలోనే స్వరాజ్యం చేరాలనుకుంది. అది పార్వతికి యిష్టంలేనందుకు స్వరాజ్యలక్ష్మి ఆమెతో పెద్దింటివారు చదువుకునే కాలేజీలో చేర్పించినా బుచ్చికొడుకు తాగిన మైకంలో పేవ్‌మెంటు మనిషిమీదకు కారును ఎక్కించి ప్రాణం తీయటం జరిగిందని చెప్పింది. అంతేకాదు, అతడు తన క్లాస్ మేట్‌తో రొమాన్సు నడపటంతో ఆ పిల్ల ఆత్మహత్య చేసుకొనేటట్టు చేయటం, పెద్దింటి పిల్లలచదువా అని స్వరాజ్యం తాను అమ్మమ్మగా పిలిచే పార్వతితో గొడవకూడా పడింది. చదువుకునేవారికి అన్ని కాలేజీలలో ఒకే రకమైన చదువు వస్తుందని, వాళ్ళుచదువుకోక లెక్చర్లమీద నెపంపెడతారని, ప్రసిద్ధులైన కమలాదేవి ఛటోపాధ్యాయ, ముత్తులక్ష్మిరెడ్డి, ఆచంటరుక్మిణమ్మ వంటి గొప్పవారు తమకి డబ్బు ఉన్నా క్వీన్ మేరీస్‌లోనే చదువుకున్నారని, గవర్నమెంటు ఫ్రీగా సీటు యిచ్చి చదువుకోమంటే హాయిగా చదువుకోవాలిగాని, ప్రైవేటుకాలేజీలకు ఎందుకు వెళ్ళాలని స్వరాజ్యలక్ష్మి పార్వతితో వాదించింది. పైగా స్వరాజ్యం ఖద్దరునేత చీరెలు కడుతున్నందుకు విమర్శిస్తే స్వరాజ్యలక్ష్మి తనకు దొంగతనంగా తెచ్చుకునే స్మగుల్డ్ వాటిని వినియోగించటం యిష్టంలేదని, దొంగ ఒకకుటుంబాన్ని దోచుకుంటుంటే, స్మగ్లర్లు దేశాన్ని దోచుకుంటున్నారని, యిద్దరూ ఒకటేనని స్వరాజ్యం అనేసరికి పార్వతికి కాలేజివిషయంలో కూడాతనకు ఓటమి ఎదురైనట్టు భావించి కోపం వచ్చింది. తనని కాలేజీలో తెలుగులిటరరీ బ్రాంచ్‌కి సెక్రటరీగా చేసారని స్వరాజ్యం గోపాలరావుతో చెప్పింది. అప్పుడప్పుడు కాలేజీలో లేటయితే పార్వతికి అనుమానం వచ్చి కారణం అడగగా గోపాలరావు ఆడపిల్లలు, మగపిల్లలు సరిసమానంగా చదువుకోవాలని తాము కలలుకన్నామని, ఆడపిల్లలు

స్వేచ్ఛను దుర్వినియోగం చేయరని, వారిని కట్టదిట్టంచేయాల్సిన అవసరం లేదని చెప్పాడు. ఇప్పటి ఆడపిల్లలు తమ చదువులను గురించి తమ బాధ్యతలను గురించి లోతుగా ఆలోచిస్తున్నారని, వివక్ష ఉండకూడదనీ, ఆడపిల్లలకు చదువు అలంకారంగా కాకుండా వారిలో ఆత్మస్థైర్యాన్ని ధైర్యాన్ని ఇవ్వాలని, స్వరాజ్యంలో అవన్నీ ఉన్నాయనీ కాలేజినుంచి లేటుగావచ్చినా భయపడవద్దని పార్వతితో గోపాలరావు చెపుతుంటే స్వరాజ్యం ఇంటికి రానే వచ్చింది.

ఒకరోజు సూర్యారావు గోపాలరావుదగ్గరకు వచ్చి జానకమ్మ పొలం ఊళ్ళోవాళ్ళకు రాసిచ్చినందుకు ఆమెకు స్వంతవాళ్ళు కుంపటి అంటించి పెడతారుగాని వంటచేసిపెట్టరని, డాక్టర్లు ఆమెను అపక్వాహారం తీసుకోవద్దని అన్నారని, అప్పటినుండి ఆమె వంటచేసుకు తింటున్నారని చెప్పాడు. నైటుస్కూల్ పెట్టినా పెద్దవాళ్ళకు చదువుకుందామన్న శ్రద్ధలేక పనులున్నాయంటూ రాకపోయేసరికి రాత్రిపాఠశాల ఎదుగుబొదుగూ లేకుండా ఉందని, వాళ్ళు పంచాయితీలు పెట్టుకుంటారుగాని తమజీవితాలను బాగుచేసుకొనే దృష్టివారికి లేదని చెప్పాడు. వయోజనవిద్యా కేంద్రం మూతపడలేదుకాని ఇంటింటికి వెళ్ళి పిలిచినా పట్టుమని పదిమందికూడా రారని, విసుగొచ్చి తాము చిన్నపిల్లల స్కూలును ప్రారంభించినట్టు చెప్పాడు. మూడేళ్ళక్రితం ప్రారంభించగా ప్రస్తుతం ఎనిమిదవ తరగతి వరకు ఉందని, మూడొందలమంది చదువుతున్నారని, జానకమ్మగారు ప్రభుత్వంనుండి స్థలం యిప్పించగా దానిలో పాకలువేసామని, స్కూల్ ని అందులోకి మార్చబోతున్నట్టు చెప్పి, కొత్తస్కూల్ ని గోపాలరావు ప్రారంభించాలని సూర్యారావు కోరాడు. గోపాలరావు పదవులున్న విద్యామంత్రివంటివారిని పిలిస్తే బాగుంటుందని చెప్పగా, కాలంతోపాటు అందరూ కొట్టుకుపోకుండా గోపాలరావులాంటి కొంతమందైనా కాలాన్ని ఎదుర్కోవాలని సూర్యారావు అన్నాడు.

గోపాలరావు తాను కాలాన్ని ఎదుర్కోవటంలేదుకాని, పరిస్థితులతో రాజీపడలేక సహాయనిరాకరణ చేస్తున్నట్టుగా భావించాడు. ఒకరోజు స్వరాజ్యం గోపాలంతో కోరుకున్న క్రమశిక్షణ ఇందిరాగాంధి పరిపాలనలో ఉందని, కూరగాయలధరలు తగ్గాయని అంటుంటే, గోపాలానికి ఏమిఅనాలో తోచలేదు. చివరికి తాను ఎమర్జన్సీని[48] హర్షించలేనని అలహాబాదు కోర్టుతీర్పును పక్కకుతోసిపుచ్చి అత్యవసరపరిస్థితి అనటం బాగాలేదని, ప్రజాస్వామ్యంలో ప్రజలహక్కులను తుంచిపారెయ్యటం మంచిది కాదని అన్నాడు. దానికి స్వరాజ్యం నైతికవాదం, గాంధేయవాదం అంటూ చేతులు ముడుచుకొని కూర్చోకూడదని, ఏ మంచిపని తలపెట్టినా సమ్మెలు, బంద్‌లు అంటుంటే క్రమశిక్షణ అవసరం అని అంది. ఇందిరాగాంధి క్రమశిక్షణపేరుతో క్లీన్ అడ్మినిస్ట్రేషన్ తేగలిగిందా అని గోపాలరావు అనగా ఆమె చుట్టూరఉన్న వాళ్ళవల్ల వీలవటంలేదని స్వరాజ్యలక్ష్మి

అంది. గోపాలరావు స్వతంత్రంవచ్చి ముప్పై ఏళ్ళు అయినా అవిద్య, దారిద్ర్యం, జనాభా పెరుగుదలవంటి విషయాలలో విజయాలు సాధించలేకపోయినా ప్రపంచం సిగ్గుపడే విషయంఎప్పుడు జరగలేదనీ, కాని ఇప్పుడు ఎమర్జెన్సీవల్ల ప్రపంచం ముందు తలదించుకోవలసి వస్తోందని అన్నాడు. మునుపెప్పుడూ మనదేశంలో ఇంటర్నల్ ఎమర్జెన్సీ రాలేదనీ, మూడు సరిహద్దు యుద్ధాల్ని ఎదుర్కొన్నప్పుడు తాత్కాలిక ఎమర్జెన్సీ అమలుచేసారుకాని, ఇక్కడ ఇందిరాగాంధి కోర్టుతీర్పును తప్పించుకోవటానికి ఎమర్జన్సీ పెట్టటంతో దేశానికి పెద్ద మచ్చ ఏర్పడిందని గోపాలరావు అన్నాడు. దానికి స్వరాజ్యం దేశం బాగుపడాలంటే మిలటరి రూల్ గాని ఎమర్జన్సీగాని ఉండాలని, లేకపోతే స్టూడెంట్లు, లేబర్ల తిరుగుబాట్లుగా జయప్రకాశ్ నారాయణ ప్రత్యక్షతిరుగుబాటు చేయమంటున్నాడని అంది. దానికి గోపాలరావు పరిస్థితులనుపట్టి ఉద్యమాలు మారతాయని, తాము బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమంచేసామని, అది పరాయిపాలన అయినా నైతికంగా మనంచేస్తున్నది సబబా కాదా అన్నది ఆలోచించాలని, ఎమర్జన్సీ ముసుగులో ఎన్నో అక్రమాలు జరుగుతున్నాయని, పత్రికల నోరు నొక్కేస్తున్నారని, అధికార దాహంచెడ్డదని, అది మనుషులప్రాణాలను తీయటానికైనా వెనకాడదని అన్నాడు. పైపెచ్చు ప్రజలహక్కులను కాలరాస్తూ ఫామిలి ప్లానింగ్ ఆపరేషన్లు చేసున్నారనీ, తాత్కాలిక ప్రయోజనాలకోసం మానవవిలువలను పోగొట్టుకోకూడదని గోపాలరావు అనగా, స్వరాజ్యలక్ష్మి ఆడది పరిపాలన చేయటాన్ని యిష్టపడటంలేదు అంది. దానికి గోపాలరావు నైతికదృక్పథానికి ఆడామగ తేడా ఉండదనీ, ఆమె అంటే వ్యక్తిగతంగా తనకి గౌరవమేనని, కాని ఆమె చుట్టూ ఉన్న దూరదృష్టిలేని మనుషులవల్లనే బాధ అని అన్నాడు. దానికి స్వరాజ్యలక్ష్మి ఆర్నెల్ల తరువాత ఎమర్జన్సీని తీసేస్తారంటే గోపాలరావు ఒకసారి నరమాంసాన్ని రుచిచూసిన పులిలా అధికారంకోసం ఏమయినాచేస్తారంటూ గోపాలరావు, స్వరాజ్యం ఎమర్జన్సీని గురించి వాదోపవాదాలు చేసుకున్నారు. బుచ్చి పనిమనిషి వచ్చి సుబ్బమ్మను ఎవరో గొంతునులిపి చంపారనే వార్తను తెచ్చింది. వెంటనే గోపాలరావు వెళ్లేసరికే ఆ తల్లి బొడ్లోని నగలు మాయమయ్యాయని తెలిసింది. కేసు పెట్టినా, పోలీసుఫైళ్ళలో ఆ కేసు శాశ్వతంగా నిద్రపోతుందని అతనికి తెలుసు. తల్లి బలవన్మరణంతో గోపాలరావుకు మనుష్యులమీద నమ్మకంపోయింది.

ఎమర్జన్సీవల్ల బయటిప్రపంచం అల్లకల్లోలంగా ఉంది. నోరుతెరచినవారిని కటకటాల వెనకతోసే అధికారం, జులుమ్ ఎమర్జన్సీ పేరుతో ఎందరో ఆఫీసర్లను బలవంతాన రిటైర్ చేయించినది పరిపాలనా యంత్రాంగం. ఆఫీసులో పత్రిక ఏరోజువస్తుందో ఏరోజు రాదో అన్న అనిశ్చితస్థితి. సెన్సారింగ్ పర్మిషన్ ఆలస్యం అవటంచేత ప్రతిరోజు పత్రిక ఆలస్యంగా వెలువడుతోంది. ప్రధానిని,

ఆమె ప్రభుత్వాన్ని విమర్శించే పత్రిక అవటంతో కట్టడి ఎక్కువై సర్కులేషన్, అడ్వర్‌టైజ్ మెంట్లు తగ్గి సిబ్బందికి జీతాలు యివ్వలేని స్థితి ఏర్పడింది. కొన్ని మేనేజ్మెంట్లు జీతాలు యివ్వలేక సిబ్బందితో కావాలంటే రిటైర్ అవమని చెపుతున్నాయి. తనలాంటివారికి యిల్లుగడిచే పరిస్థితి ఎలా అని గోపాలానికి దేశం అంధకారంలోకా, లేదా కాంతివలయంలోకి వెడుతోందో అర్థం కాక అతనికి రాత్రిళ్ళు నిద్రపట్టటంలేదు.

ఎమర్జెన్సీ వచ్చి ఆరునెలలు దాటింది. స్వరాజ్యం ఎమ్.ఏ. ఎకనమిక్స్ రెండవ సంవత్సరంలోకి వచ్చింది. శ్రద్ధగా చదువుకుంటుంది. ఎక్కడ అన్యాయం జరిగినా భరించలేని స్వరాజ్యలక్ష్మి బాగాచదివే తన స్నేహితురాలైన శ్యామలకు తక్కువ మార్కులు వచ్చేసరికి సంగతి తేల్చుకుందామంటూ ఆమెను తీసుకొని ప్రొఫెసర్ దగ్గరకు వెళ్ళింది. పరిష్కారం లభించక చివరికి రిజిస్ట్రార్, వి.సి వరకు వెళ్ళింది. ఫలితం లేకపోయింది. ఇది తెలుసుకున్న మగస్టూడెంట్లు కొందరు అన్యాయం, అక్రమం అని నినాదాలుచేయటం, ఎమర్జన్సీకాలం అవటంతో పోలీసులు రావటం, స్వరాజ్యలక్ష్మితో సహా వారిని జీపులో ఎక్కించి తీసుకెళ్ళటం జరిగింది. పొరపాటు ఉంటే పేపర్లను తిరిగి దిద్దుతారనుకుందికాని, ఇలాజరుగుతుందని స్వరాజ్యలక్ష్మి ఊహించలేకపోయింది. ఆ సాయంకాలం గోపాలానికి ఆమె స్నేహితుడి ద్వారా విషయం తెలిసి గోపాలరావు నిల్చోలేక నేలకి వరిగిపోయాడు. ఎడిటర్ వచ్చి గోపాలరావుతో కలిసి పోలీసు అధికారిని కలవగా, ఆతడు ఎమర్జెన్సీలో ఏమి జరుగుతుందో తెలియదా అంటూ లాకప్‌లో ఉన్న స్వరాజ్యలక్ష్మి వాళ్ళను చూడటానికి అనుమతిని యిచ్చాడు. ఎడిటర్ జైల్లో వారిని వంటరిగా కాక గుంపుగా తిరగమని, ఆడపిల్లలిద్దరిని ఒకచోట ఒకరికొకరు తోడుగా ఉండమని చెప్పాడు. గోపాలంతో రూల్స్ అని వాదించినా న్యాయం ఉండదని, వాళ్ళకు నక్సలైట్లు అనే ముద్రవేసి జైలుకు పంపకమునుపే వారిని విడిపించే మార్గాన్ని వెతకాలని, బుచ్చిని ఢిల్లీనుండి రప్పించి ఆతని పరపతిని ఉపయోగించుకోవాలని ఎడిటర్ చెప్పాడు. ఇంటికెళ్ళగానే విషయం తెలిసిన పార్వతి అలా జరగటానికి గోపాలరావే కారణం అంటూ శివంగిలా అరుస్తుంటే, తప్పుచేసిన వాడిలా గోపాలరావు తలవంచుకున్నాడు. జైలుకు వెళ్లివచ్చిన దానికి పెళ్ళి ఎలా అవుతుందంటూ పార్వతి ఊరిలోనే ఉన్న బుచ్చిని అడిగి విడిపిద్దామంటే, ఎడిటర్ కూడా గోపాలరావును మొహమాటపడవద్దని చెప్పి వారిద్దరిని బుచ్చి యింటిదగ్గర కారులోదింపి వెళ్లాడు.

పార్వతి స్వరాజ్యంగురించి చెప్పగానే బుచ్చి దానికి నోరు ఎక్కువ, తాను ఝాన్సిరాణిని అనుకొంది, అందుకే ఇలా జరిగిందని, నాకు కూడా ఫోనువచ్చిందని అతడు చెప్పటంతో, బుచ్చికి స్వరాజ్యలక్ష్మి సంగతి తెలిసికూడా పట్టించుకోలేదని గోపాలరావుకు అర్థమైంది. ఇంటి ఆడపిల్ల

జైల్లో ఉంటే పట్టించుకోలేదా అని గోపాలరావు బుచ్చిని అడిగితే దానికి బుచ్చి స్వరాజ్యలక్ష్మి తమని చెడిపోయినవారి కిందచూసేదని అన్నాడు. పార్వతి స్వరాజ్యాన్ని కూతురనుకొని విడిపించమని ప్రాధేయపడగా, బుచ్చి తన కూతురైతే కాళ్ళు విరగగొట్టి పెళ్ళిచేసేవాడిని కాని ఇలాతిరగనిచ్చేవాడిని కాననిఅన్నాడు. పైగా పోలీసు కస్టడీలో ఉన్న ఆ చెడిపోయిన పిల్లను ఎవరూ పెళ్ళిచేసుకోరని అన్నాడు. గోపాలరావు పార్వతిని బయటకుపొమ్మని చెప్పి, తాను బుచ్చితో స్వరాజ్యలక్ష్మి అంటే నీకు ఇంతద్వేషమని తెలియలేదనీ, నువ్వు తలచుకుంటే స్వరాజ్యాన్ని విడిపించగలవని, మనమార్గాలు కలవవనీ, తల్లినగలు ఏమయ్యాయో, ఆమెను చంపినవారెవరో తనకు తెలుసనీ, అన్నీ తిరగతోడుతానని, నిన్ను దించాలని చూసేవారున్నారని అన్నాడు. ఇలా మాటలాడినందుకు నన్ను ఎమర్జెన్సీలో జైల్లోపెట్టించగలవనికూడా తెలుసుననీ, తోటిపిల్లకు అన్యాయం జరుగుతుంటే ఆ అన్యాయాన్ని ప్రశ్నించటానికి స్వరాజ్యలక్ష్మి వెళ్ళిందని, స్వరాజ్యానికి జైల్లోగడపగల మానసికశక్తి ఉందని, రేపటిమధ్యాహ్నంలోగా స్వరాజ్యాన్ని వదిలిపెట్టించమని చెప్పి వచ్చాడు. ఆ మర్నాడు బుచ్చి స్వరాజ్యాన్ని విడిపించి కారులో యింటిదగ్గరదింపి వెళ్లాడు. పార్వతి స్వరాజ్యాన్ని తిట్టింది. బుచ్చిని బెదిరించి తానుకూడా నేరస్థుడయ్యానని గోపాలరావు బాధపడ్డాడు.

పార్వతి ఊరువదిలి వెళ్ళిపోదామంటే దేశం అంతా ఎమర్జన్సీ ఉందని, అయినా ఎవరిజోలికి వెళ్ళకపోతే గొడవలు ఉండవని, న్యాయరక్షణకు కంకణం కట్టుకొని ముసలాళ్ళయిన తమని బాధపెట్టవద్దని స్వరాజ్యానికి చెప్పాడు. దానికి ఆశ్చర్యపడుతూ స్వరాజ్యలక్ష్మి గోపాలరావుతో లాఠీదెబ్బలు తిని ఏళ్ళకుఏళ్ళు జైల్లోఉన్న గోపాలరావుయొక్క ధైర్యసాహసాలు, న్యాయరక్షణ ఎక్కడికిపోయాయని, కళ్ళముందు అన్యాయం జరిగితే కళ్ళుమూసుకొని ఉండమనటం బాగుందా అని ప్రశ్నించింది. గోపాలరావు స్వాతంత్ర్యానికి పూర్వం అందరికీ ఒకే న్యాయం ఉండేదని, ఈరోజుల్లో కొందరికే న్యాయం జరుగుతోందని, అడవిలో ఉన్నప్పుడు వేటగాడి బాణం నుండి న్యాయం ఆశించటం తెలివితక్కువతనమని, వేటగాడి అస్త్రాలన్నీ ఖాళీ అయ్యేంతవరకు వేచి ఉండక తప్పదని అన్నాడు. స్వరాజ్యానికి కాలేజివారు టి.సి ఇచ్చిపంపారు. స్వరాజ్యం ఉద్యోగం చేస్తానంటే పార్వతి పెళ్ళిచేసి పంపుతామంటుంది. తాను తన ఆదర్శాలను, ఉద్దేశ్యాలను అర్థంచేసుకునేవాడు, కట్నం తీసుకోని అబ్బాయి దొరికేంతవరకు పెళ్ళిచేసుకోదలచుకోలేదని స్వరాజ్యలక్ష్మి నిష్కర్షగా చెప్పింది. ఎమర్జన్సీలో తమచుట్టూ ఉన్న మనుష్యులు మాయమౌతున్న విషయం గ్రహిస్తున్న గోపాలరావు, ప్రతిపక్ష నాయకులను నిర్బంధంలోకి తీసుకున్నప్పటికంటె జబ్బుతో ప్రమాదస్థితిలో ఉన్న స్నేహలతారెడ్డిని విడుదలచేయగానే ఆమె చచ్చిపోయిందని తెలుసుకొన్న గోపాలరావు బాధపడ్డాడు. పట్టాభి దంపతులను

గురించి విన్నాడు. గోపాలరావుతో స్వరాజ్యం ప్రజలచేత అమ్మా అని పిలిపించుకునే ఇందిరా గాంధి ఇంతక్రూరంగా ప్రవర్తిస్తుందని అనుకోలేదంటే అతడు రాజకీయాలలో అమ్మలు, అక్కలు, అందరూ ఒకటేనని, నిన్ను జైల్లోపెట్టించినా ఇందిరాగాంధి మీద కోపం రావటంలేదా అని అడిగాడు. దేశాన్ని అదుపులో పెట్టడానికి ఎమర్జన్సీ డిక్లేర్ చేయటం సరియైన మార్గంకాదని, వ్యక్తిగా ఆమె గెలిచినా పార్టీ ఓడిపోకతప్పదని గోపాలరావు అంటే స్వరాజ్యానికి తనని జైల్లోపెట్టించినా ఇందిరాగాంది మీద తనకు ఆరాధన తగ్గలేదన్నట్టుగా ఆమె ఓడిపోదని అంది. కాని కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఓడిపోయింది. బుచ్చికూడా ఓడిపోయాడు. కాంగ్రెస్ సభలకు అంతమంది హాజరైనా ఎలా ఓడిపోయిందని స్వరాజ్యం గోపాలరావుని అడగగా అతడు మీటింగులకు కిరాయి యిచ్చి జనాలను పిలిపిస్తారని చెప్పాడు. దానికి స్వరాజ్యం ఇందిరాగాంధి వచ్చినప్పుడు ప్రజలు తమంతట తాము వచ్చారని మీ పత్రికలలోనే రాసారుగా అని అడిగింది. నిజమేనని ఒప్పుకొన్న గోపాలరావు వారంతా ఎమర్జన్సీ ప్రకటించిన ఇందిరాగాంధి ఎలా ఉంటుందోనని చూడటానికి వచ్చారని, వాళ్ళు వోట్లు వేయటానికి రాలేదని, ఖైదీని, నేరస్థుని జైలుకు తీసుకెడుతుంటే జనం ఎలాచూస్తారో అలా ఆమెను చూడటానికి వచ్చి ఉంటారని చెప్పాడు.

జనతాప్రభుత్వం[49] పదవీస్వీకారం చేసేరోజు గోపాలరావు ఇంట్లో పాయసం చేయమంటే, స్వరాజ్యలక్ష్మి అతనితో కాంగ్రెస్ వాడివై ఉండి ఇలా అంటున్నావని అడిగితే, ఇది జనతాపార్టి విజయంకాదని, పార్టీలనన్నింటిని ఒకే తాటిపైకి తెచ్చి ప్రజాస్వామ్యానికి ప్రాణంపోసిన జయప్రకాశ్‌ది అని అన్నాడు. దానికి స్వరాజ్యం ప్రాణంపోసింది ఆయనకాదని ప్రజలు అని అంది. దానికి గోపాలరావు ప్రజలను ఒకతాటిపైకితెచ్చి ప్రపంచంధృష్టిలో దేశాన్ని నవ్వులపాలుకాకుండా అతడు కాపాడాడని, ఉప్పుసత్యాగ్రహ ఉద్యమసమయంలో ఆవేశాన్ని చూపినట్లు ప్రజలు ఇప్పుడుకూడా అంత ఆవేశంతో కొత్తప్రభుత్వాన్ని ఎన్నుకొన్నారని అన్నాడు.

భారతప్రజలందరిలాగే గోపాలరావుకూడా జనతాప్రభుత్వంలో ఆశాభంగం పొందాల్సి వచ్చింది. పదవిలోకి వచ్చిన తరువాత నాయకులు తమలోతాము దెబ్బలాడుకుంటూ, మాజీ ప్రధానిని వేటాడటమే తమ ధ్యేయంగా పెట్టుకొని ప్రజలసంగతి మర్చిపోయారనీ, టైమ్ క్యాప్స్యూల్‌ను తవ్వితీసి అందులో చారిత్రక అసత్యాలున్నాయని అన్నాడు. ఇందిరాగాంధి నేరాలుచేసిందంటూ అతిస్వల్పవిషయాలను బయటపెట్టి అల్లరిచేసి, తాము అల్లరిపడి ఆమెను జైల్లోపెట్టి జనతా ప్రభుత్వం అభాసుపాలయ్యిందని అన్నాడు.

జనతా పాలనలోనే స్వరాజ్యలక్ష్మి ఉద్యోగాలవేటలోని మెలికలను భరించలేక చిన్నపిల్లలకు చెప్పే ఇంగ్లీషుమీడియమ్ స్కూల్లో చేరింది. కాని అక్కడ యాజమాన్యం ఫీజులు దోచుకుంటూ,

సరియైన మరుగుదొడ్లుకూడా లేకుండా యూనిఫారమ్ రూల్సుపెడుతూ పాకల్లో చదువు చెప్పమన్నందుకు వివాదం పెట్టుకున్న స్వరాజ్యం ఉద్యోగానికి రాజీనామాచేసింది. అదే సమయానికి జనతాప్రభుత్వం పడిపోవటంకూడా జరిగింది. జనతాప్రభుత్వంలో ప్రధాని చరణ్ సింగ్ దిగిపోగానే మళ్ళీ ఎన్నికలు జరుగుతాయా అని స్వరాజ్యం అడిగింది. ఆ ఎన్నికలలో ఇందిరాగాంధి గెలిచి తిరిగి ప్రధానమంత్రి అయింది[50]. పార్వతి స్వరాజ్యానికి పెళ్ళిచేయమనగానే గోపాలరావుకూడా ఆ సంగతిని ఎత్తి, తనకి రెండుసార్లు ఉద్యోగానికి ఎక్సటెన్షన్ యిచ్చారని ఇక ఇవ్వక పోవచ్చని చెప్పి, స్వరాజ్యానికి ఇష్టమైనవ్యక్తితో పెళ్ళి జరిపిస్తానని అన్నాడు. స్వరాజ్యంకూడా తనకి పెద్దవాళ్ళని కనిపెట్టుకు చూసుకోవాల్సిన బాధ్యత ఉందనిచెప్పి, తానేమి ఉద్యోగంలేకుండా ఉండనని, తానేమి చేయాలో ఆలోచిస్తానని అంది. నాలుగురోజులు గడిచే సరికి జానకమ్మ దగ్గరనుండి ఆమె గోపాలరావును ఆఖరుసారిగా చూడాలనుకుంటున్నట్టు ఉత్తరం వచ్చింది.

స్వరాజ్యం తానుకూడా గోపాలరావుతో వస్తానని చెప్పి బయలుదేరింది. జానకమ్మను చూడగానే స్వరాజ్యానికి వృద్ధాప్యం భయంకరంగా ఉంటుందని అర్థమైంది. జానకమ్మగారు దేశంకోసం, తన చుట్టూ ఉన్నవారికోసం ఇంత త్యాగం చేసినా, ఆమె తాను ఇలా ఒంటరిగా గడపటాన్ని గురించి బాధపడింది. సూర్యారావు ఆమెను చూడటానికి తామంతా ఉన్నా కూడా ఆమె వయసువారు లేకపోవటం, ఆమె తమకాలంలో జరిగిన విషయాలు చెపుతుంటే విని అర్థంచేసుకునేవాళ్లు లేకపోవటంతో ఆమెకు చాలా బాధగా ఉంటుందని చెప్పాడు. జానకమ్మకు నూరేళ్ళు నిండుతున్నా జ్ఞాపకశక్తి తగ్గలేదు, చెవులు వినిపిస్తున్నాయిగాని చేతులు మాత్రం కాస్త వొణుకుతు, తన రోజులు అయిపోతున్నాయని, నేటికాలంవాళ్లు ఎలా ఉన్నారని అడగింది. ఆమెతో గోపాలరావు నిరుద్యోగం, అవినీతి, ఆకాశానికి అంటిన ధరలు, పెళ్ళికాని ఆడపిల్లలు, పెళ్ళయి కష్టాలుపడుతున్న మహిళలు, స్మగ్లింగ్, అవినీతి టెర్రరిజం వంటివి ఏవీ అవినీతి కావనే స్థితిలో నేటి యువత ఉంది చెప్పగా, ఆమె ఆతని వాదాన్ని వొప్పుకోనని అంది. స్వరాజ్యం దీనికంతటికి కారణం కాంగ్రెస్ వారని అని, జానకమ్మతో తాను పనికోసం వెదుకుతున్నానని అంటే దానికి ప్రత్యుత్తరంగా జానకమ్మ గోపాలం చేతిలో రాముడత్తయ్యయొక్క ఇంటి కాగితాలు చేతిలో పెట్టి, మరొకపదివేలు చేతికి ఇచ్చి మంచిపనికి ఉపయోగించమని చెప్పింది. ఆ డబ్బులు మందులకు ఉపయోగపడతాయని ఆమెనే ఉంచుకోమని స్వరాజ్యలక్ష్మి అంటే, ఆమె దేశంలో తనలాంటి ముసలి వాళ్లు ఎందరో ఉన్నారని అందరికి డబ్బు ఇవ్వగలవా, మందులు ఇప్పించగలవా అని అంది. స్వరాజ్యం ఆ డబ్బును మంచిపనికి ఉపయోగిస్తామని జానకమ్మకు భరోసా ఇచ్చింది. స్వరాజ్యం,

గోపాలరావు తిరిగి మద్రాసు వచ్చిన రెండునెలలకు ఇందిరాగాంధి ఎన్నికలలో ఘనవిజయం సాధించినప్పుడు స్వరాజ్యం సంతోషపడింది. గోపాలరావుమాత్రం రిటైర్ అయి ఎన్నికలకు తనకు సంబంధం లేనట్టు ఉన్నాడు.

ఒక రోజు ఇందిరాగాంధి[51] హత్యచేయబడిన వార్త రేడియోలో వినపడగానే స్వరాజ్యానికి దుఃఖం వచ్చింది. మూడోరోజు ఇందిరాగాంధి అంత్యక్రియలు జరిగిన తరువాత స్వరాజ్యలక్ష్మి గోపాలరావుతో ఊరు వదిలిపెట్టి చీరాలవెళ్దామనీ, గోపాలరావు ఎక్కడైతే జీవితపు తొలివెలుగును చూసాడో అక్కడికే వెళ్ళి మంచిపనులుచేపట్టటం తన జీవితలక్ష్యంగా చేసుకున్నట్టు చెప్పింది. రాముడత్తయ్యయింట్లో ప్రభుత్వం పట్టించుకోని జానకమ్మగారిలాంటి రక్షణలేని వృద్ధులకు ఒక ఆశ్రమాన్ని నడపాలనుకుంటున్నట్టు చెప్పింది. గోపాలరావు తలకుమించిన భారమవుతుందని అంటే జానకమ్మగారి డబ్బుతో మొదలుపెడితే డబ్బు దానంతట అదే వస్తుందని అంది. పార్వతమ్మ పెళ్లిచేసుకోకుండా ముసలాళ్ళను పోషిస్తుందట అని వెక్కిరించగా, స్వరాజ్యలక్ష్మి ఆమెతో జీవితానికి పెళ్ళే గమ్యంకాదని అంతకుమించి ఆదర్శాలు ఉంటాయని, మంచివ్యక్తి లభించినప్పుడు పెళ్ళిచేసుకుంటానని చెప్పింది. పెద్దల జీవితాలను సుఖప్రదం చేయాలనుకోవటం తప్పుకాదని, చీరాలవెళ్ళి జానకమ్మగారు, మరికొంతమంది వృద్ధులతో కలిసి ఉందామని చెప్పింది. భవిష్యవాణిని గుర్తించగల జానకమ్మగారి యొక్క అపూర్వశక్తిని, ఆమె కలగన్నదానిని స్వరాజ్యలక్ష్మి తన హృదయనేత్రంతో చూస్తున్నట్టనిపించింది గోపాలరావుకు. దేశభవితవ్యాన్ని యువతచేతిలో పెడితే దాన్ని ఫలవంతంచేయటం వారిమీదున్న బాధ్యత అని స్వరాజ్యానికి చెప్పి విజయాన్ని సాధించగలవమ్మా అంటూ తన ఆకాంక్షను వెలిబుచ్చాడు. పార్వతీగోపాలరావులు స్వరాజ్యలక్ష్మితో చీరాల ప్రయాణానికి తయారవ్వటంతో నవలా కథేతివృత్తం ముగిసింది.

6. దేశస్వాతంత్ర్యానంతర పరిస్థితులు

'హృదయనేత్రి' నవలలో ప్రతిఫలించిన సామాజిక, ఆర్థిక-రాజకీయవిషయాలలో స్వాతంత్ర్యానికి పూర్వం దేశంలో ఉన్న పరిస్థితులు, ఆనాటి జాతీయోద్యమకారుల దేశభక్తి, త్యాగాలు, స్వాతంత్ర్యానంతర పరిస్థితులలో వచ్చిన రాజకీయాల అవినీతి, అధికారం, స్వార్థపరశక్తులను స్పష్టంచేస్తూ, తెలుగు జాతి కర్తవ్యాన్ని స్ఫురింపచేసేటటువంటిది ఈ నవల. కాబట్టి ఆయాకాలాలలోని పరిస్థితులను ప్రతిఫలించిన దేశచరిత్రను క్షుణ్ణంగా పరిశీలించి నవలలోని వాస్తవికతను తెలుసుకోవాల్సిన అవసరముంది. 1947 సం. ఆగస్టు 15 వ తారీఖున బ్రిటిష్ వారి చెరనుండి విముక్తి చెంది భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందింది. బ్రిటిష్ పరిపాలనలోని ఆర్థిక-రాజకీయదోపిడి, నిరంకుశాధికారం, అవినీతి, ఆశ్రితపక్షపాతం, స్వార్థశక్తుల దోపిడీకి అంతిమయాత్ర జరిగిందను కొన్నారు. ఏ విషయాలు భారతీయులను బానిసలుగా చేసాయో ఆ యావిషయాలు లేకుండాచేసుకొని ప్రజలందరూ భౌతిక, బౌద్ధిక స్వేచ్ఛాస్వాతంత్ర్యాలతో జీవించగలుగుతామని అనుకొన్నారు. వర్తకరూపేణా వచ్చిన బ్రిటిష్ వారు తమ వస్త్రాలను చౌకగా అమ్మి ఆ లాభాల సొమ్మును లండనుకు తీసుకెళ్ళటానికై భారతదేశంలోని నేతపరిశ్రమను కుదేలయ్యేటట్లుచేసారు.

ఆ ఆర్థికదోపిడి వారి అధికారాన్ని మరింతగా బలపడేటట్లు చేసింది కాబట్టి దానినుండి విముక్తి అయినప్పుడే దేశస్వాతంత్ర్యానికి మార్గం ఏర్పడుతుందని భావించి, ఖద్దరు తయారీని సత్యాగ్రహ ఉద్యమంలో భాగం చేసుకోవాలని గాంధి పిలుపునిచ్చాడు. ప్రజాఉద్యమంలో భాగంగా ఆబాలగోపాలం ఖద్దరుతయారీకై ఇంటింటా రాట్నం వడికి నూలుతీసేవారు. భారతీయులకు ఖద్దరువస్త్రధారణ వ్యక్తిస్వాతంత్ర్య చిహ్నమైంది. ఉద్యమంలో విదేశీవస్త్ర బహిష్కరణ ప్రధాన భాగస్వామ్యాన్ని వహించింది. ఆ రకంగా బ్రిటిష్ వారి ఆర్థిక దోపిడీని తగ్గించగలిగి తమ దారిద్ర్యాన్ని తగ్గించుకున్నారు. కాని స్వాతంత్ర్యానంతరం విదేశీ వస్త్రధారణ గొప్పతనానికి చిహ్నం చేసుకుంటు న్నామంటే పొందిన స్వాతంత్ర్యాన్ని పోగొట్టుకుంటున్నామని అర్థమవ్వాలి. సత్యాగ్రహ ఉద్యమనిర్మాణ కార్యక్రమాలలో భాగంగా మద్యపాన నిషేధం ముఖ్యమైనది. బ్రిటిష్ వారు భారతీయులను మత్తులో ముంచి బలహీనులను కావించటానికై విచ్చలవిడిగా కల్లుదుకాణాలను పెట్టి సొమ్ముచేసుకునేవారు.

అందుకే ఉద్యమంలో భాగంగా కల్లుదుకాణాలను మూయించటానికి వాటిముందు సత్యాగ్రహులైన స్త్రీపురుషులు పికెటింగ్ చేసి దేశంకోసం జైళ్ళపాలయినవారు ఉన్నారు. కాని స్వాతంత్ర్యానంతరం దేశమంతటా సారాను ప్రధాన ఆదాయపు వనరుగా మలచుకొని ప్రజల కుటుంబ ఆర్థికవ్యవస్థను, ఆరోగ్యాలను, కుటుంబంలోని మానవసంబంధాలను నాశనంచేయటం అందరికి తెలిసిన విషయమే. అంతేకాదు, విదేశీమద్యమ విక్రయాలు ఎక్కువయ్యాయంటే భారతదేశపు సొమ్ము విదేశాలకు తరలిపోవటంతో, మన ఆర్థికగవ్యవస్థను మనమే నాశనం చేసుకోవటం జరుగుతుంది.

అది దేశ ఆర్థికవ్యవస్థకు సవాలుగా పరిణమించి, వచ్చిన స్వాతంత్ర్యానికి పెనుముప్పు కలిగిస్తుందని అర్థంచేసుకోవాలి. అంతేకాక, భారతదేశసంస్కృతికి, వాతావరణానికి వీలుగా అవసరమైన వనరులను ఉపయోగించుకోవటానికి తగిన వృత్తివిద్యలు, సంస్కారజ్ఞానాన్ని అందించే ఆధ్యాత్మిక విద్యలకు నిలయమైన భారతదేశం. కాని బ్రిటిష్ వారు భారతదేశంలో తమపరిపాలనకోసం అధికారులకు గుమాస్తాలుగా సహకరించటానికి ఇంగ్లీషు విద్యను ప్రవేశపెట్టారు. దానితో మాతృదేశభక్తి జాతీయాభివృద్ధి కొరవడుతుందని భావించిన ఉద్యమకారులు స్వాతంత్ర్యసాధనలో జాతీయవిద్యను బోధించే పాఠశాలలను సొంతంగా అభివృద్ధి చేసుకున్నారు. జాతీయవిద్యలో సత్యాగ్రహఉద్యమ నిర్మాణకార్యక్రమాలను ప్రబోధించేవారు. స్వాతంత్ర్యానంతరం విదేశీవిద్యల మోజుతో పిల్లలను కాన్వెంటులలో ఇంగ్లీషుభాషలో చదివించటం గొప్పస్థితి అని అనుకుంటున్నారు. భాషాదారిద్ర్యం భావదారిద్ర్యానికి దారితీయటం, విదేశీయనాగరికత వంటబట్టటం, మాతృభూమిమీద అభిమానం తగ్గటంవంటివి ఆంగ్లవిద్యా పరిణామాల పరంపర ఫలితాలు.

దానితో భారతజాతి సంరక్షణాదృక్పథం తగ్గి భారతదేశమేధాశక్తి విదేశాల అభివృద్ధికి వినియోగింపబడుతోందంటే భారతదేశస్వాతంత్ర్యానికి, అభివృద్ధికి రక్షణ కరువవటమే అని గ్రహించాలి. బ్రిటిషు వారు తమ విభజించిపాలించెడి రాజనీతిలో భాగంగా ప్రజల ఐక్యతకు తూట్లుపొడుస్తూ భారతదేశంలో తమ పరిపాలనకు ఢోకాలేదని భావించి 1919, బ్రిటిష్ భారతదేశ చట్టంలో ముస్లిములకు ప్రత్యేకనియోజకాలను కేటాయించారు. అందుకే హిందూముస్లిముల సమైక్యతకు జాతీయోద్యమంలో పెద్దపీట వేయాల్సివచ్చింది. అదేవిధంగా భారతదేశ చట్టం, 1935 లో కూడా అధికసంఖ్యలో ముస్లిములకు స్థానాలను కేటాయించారు. దానితో హిందూవులు, ముస్లిములు అన్నదమ్ముల్లాగా ఉండాల్సినవారిలో స్వార్థపూరిత అధికారం కావాలనే ఆలోచనలు పెరిగింది. స్వాతంత్ర్యప్రకటన సమయంలోనే హిందూముస్లిముల సమైక్యతకు భిన్నంగా ముస్లిమ్ లీగ్ నాయకుడైన జిన్నా అభిప్రాయంతో పాకిస్థాన్ ఏర్పడింది. భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రకటించే

సందర్భంలో బ్రిటిష్ వారు చేసిన స్వాతంత్ర్య చట్టం, 1947[1] దేశానికి స్వాతంత్ర్యం యిస్తున్నట్లు బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటించింది. కాని స్వాతంత్ర్యప్రకటన సమయంలోనే హిందూముస్లిములు కాందిశీకులుగా మారటం మతకల్లోలాల మారణహోమం జరగటంతో గాంధి నిరాహారదీక్ష తాత్కాలిక ఉపశమనం కలిగించింది. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో హిందువులు, ముస్లిములమధ్య మతవిద్వేషాలు రోజురోజుకు తీవ్రతరం అవటం జరుగుతున్న చరిత్ర. అది బ్రిటిష్ వాళ్ళు అంటించిన రాజకీయరావణకాష్ఠంలా చల్లారటంలేదు.

హిందూ ముస్లిములమధ్య అంతరాలు పెరిగిపోతూనే ఉన్నాయి. జాతిసమైక్యతకు భంగంకలిగితే విదేశీశక్తులకు ఆహ్వానం పలకటంవంటిది. దానిని విస్మరిస్తే భారతదేశస్వాతంత్ర్యం పరులచేతిలోకి వెళ్ళే అవకాశం ఏర్పడితే స్వాతంత్ర్యరక్షణ కరవవుతుందని మరవరాదు. ముఖ్యంగా సత్యాగ్రహ ఉద్యమంలో భారతీయులందరూ కలిసి ఐకమత్యంతో పోరాడాల్సిన అవసరాన్ని గుర్తించి అస్పృశ్యతా నివారణ, హరిజనోద్ధరణ ముఖ్యమని భావించారు. ఆ రోజులలో సత్యాగ్రహులు హరిజనులను తమ యిళ్ళల్లో పెట్టుకొని తమతో కలుపుకొని వారిని చదివించి ఉద్ధరించాలనుకొన్నారు. ప్రత్యేకంగా వారి అభివృద్ధికి ప్రణాళికను రాజ్యాంగంలో ఏర్పాటుచేసుకున్నా స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళుదాటినా, వారి అభివృద్ధి సంపూర్ణంగా జరగలేదంటే స్వార్థపూరిత ఓటుబ్యాంకు రాజకీయాలు ఒక కారణమైతే, రిజర్వేషన్ల సౌకర్యాలను పొందినవారు తాముపైకొచ్చినా తమకులం వారి అభివృద్ధిని కోరుకోకపోవటం మరొక కారణమని నవలలో స్పష్టమౌతుంది.

'అనైక్యతతో అంబేతద్కరీయులు, అంబేద్కరీయులకే ఆగర్భశత్రువులుగా మారుతున్నారని' అని రావూరి ఏకాంబరం రాసిన కవితా పంక్తులు ఇందులేని నందయ్య పాత్రకు సరిగ్గా సరిపోతాయి. అధికార రాజకీయాలు, ఆశ్రితపక్షపాత ధోరణులు, స్వార్థరాజకీయాలు, పదవీవ్యామోహాలుతప్ప ప్రజాసంక్షేమం శూన్యమవటం కనపడుతోంది. స్వరాజ్యంకోసం సత్యాగ్రహ ఉద్యమంలో భాగంగా సహాయనిరాకరణ చేస్తూ ప్రజలు బ్రిటిష్ వారికింద పనిచేయటం యిష్టంలేక తమఉద్యోగాలకు రాజీనామాలు చేసారు. ఆనాడు స్వాతంత్ర్యసాధనకోసం చేస్తే, స్వాతంత్ర్యానంతరం రాజకీయకాలుష్యం ఎక్కువై కాలాన్ని ఎదుర్కొలేక సహాయనిరాకరణ చేస్తున్నట్టు గోపాలరావుపాత్రచేత అనిపించడం జరిగింది. ఆనాడు ఉన్నతపదవుల ఆశచూపించినా లొంగలేదు. స్వాతంత్ర్యంకోసం పోరాడిన గాంధి ఏ పదవులను ఆశించలేదు. కాని స్వాతంత్ర్యానంతరం ప్రతిభలేకపోయినా ఆశ్రితపక్షపాతం కులరాజకీయాలు రాజ్యమేలుతుంటే రాజకీయనాయకుల అండదండలతో దొడ్డిదారిన ఉద్యోగాలు పొందటం నేటి భారతదేశస్థితి. ఆఖరుకి రక్షణరంగంలో ఉన్నవారుకూడా రహస్యసమాచారాన్ని

విదేశీయులకు అందచేస్తూ రాజద్రోహానికి పాల్పడుతుంటే దేశస్వాతంత్ర్యం గాలిలో దీపం అవుతుంది. ఆనాటి భారతీయస్త్రీపురుషుల మానప్రాణత్యాగాలకు విలువలేకుండా పోతోంది. భారతదేశ అంతర్గతశత్రువులను ఏరిపారేయటానికి నేటి యువశక్తి ఆనాటి స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తినిపొంది, దేశస్వాతంత్ర్యాన్ని రక్షించుకోవటానికి మరోమంచి స్వాతంత్ర్యోద్యమానికి సంసిద్ధులుకావటానికి ఈ హృదయనేత్రి నవల అవశ్యపఠనీయం. శ్రీశ్రీ “స్వాతంత్ర్యం ఒకసున్నితమైన పువ్వు, వాడియైనకత్తి, విలువైన వజ్రం” అని[2] 1948 సం.లోనే చెప్పాడు. భారతదేశ స్వాతంత్ర్యాన్ని అపురూపంగా, సుకుమారంగా చూసుకుంటూనే, అవసరమైతే ఆయుధంగా చేసుకుంటూ, దాన్ని విలువైన విషయంగా భావించగలిగితేనే స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకునే బాధ్యత అందరిలో ఉంటుంది. స్వతంత్రభారత దేశంలో ప్రజాస్వామ్యపు ఎన్నికలుగల ప్రజాసంక్షేమరాజ్యంకోసం భారతరాజ్యాంగాన్ని రూపొందించుకున్నారు. స్వాతంత్ర్యంకోసం తపించిన స్ఫూర్తి మెల్లమెల్లగా మటుమాయం కాజొచ్చింది. అధికారప్రవృత్తి, స్వార్థం, అవినీతి, ఆశ్రితపక్షపాతం మరింతగా పెరగసాగింది. స్వాతంత్ర్యంకోసం జైళ్ళపాలయిన పెద్దలు అలసిపోయారు. జాతీయోద్యమంలో భాగస్వాములైన యువతలో ఏకొద్దిమందిలోనో నిజాయితి, నిబద్ధత ఉన్నా వారికి బతుకుతెరువు కరువై ఆనాటి నాయకస్ఫూర్తిలేక ఉత్సాహం తగ్గిపోయింది. నిరాశానిస్పృహలు చోటుచేసుకున్నాయి. కొద్దిమంది దేశాభివృద్ధికి పాటుపడుతున్నారు. దేశం ఎటుపోతోందో అనే అయోమయంలో పడిపోయారు. దేశంలో ధనవంతులకు, పేదలకు అంతరాలుపెరిగి రాజ్యాంగంలో రాసుకున్న సమానత్వం నేతిబీరకాయచందమై స్వాతంత్ర్యం మేడిపండులా కనపడుతోంది. కులరాజకీయాలు, ఓట్ల కొనుగోళ్ళతో ప్రజాస్వామ్యం కుప్పకూలిపోతోంది.

మానవసంబంధాలు, కుటుంబసంబంధాలు బలహీనమవుతూ విచ్ఛిన్నం అవుతున్నాయి. స్వాతంత్ర్యసాధనలో చేసిన ప్రాణత్యాగాలను మరిచిపోయి ప్రజాస్వామ్య రాజ్యాంగానికి విలువ లేకుండాచేస్తూ అవినీతితో అధికారాన్ని హస్తగతం చేసుకోవాలనుకొనే స్వార్థపరశక్తులు రాజ్యమేలాలను కుంటున్నారు. కొంతమంది అవినీతి రాజకీయాలలో రాటుతేలుతుంటే మరికొంతమంది పేదరికం రూపుమాపటానికి వర్గరహితసమాజంకోసం తీవ్రవాదాన్ని ఎన్నుకున్నారు. స్వాతంత్ర్యానంతర రాజకీయాలకు, తీవ్రవాదశక్తులకు సంఘర్షణ అనివార్యమైంది. అవినీతిని, ఆశ్రితపక్షపాతాన్ని, నిరంకుశత్వాన్ని ఎదుర్కోవాలనుకొని ప్రశ్నించటం జరిగితే వారిని అన్యాయంగా అరెస్టులుచేయటం రివాజుగా మారింది. స్వాతంత్ర్యం అనేది సామాన్యులపాలిటి ముళ్ళకిరీటమైంది. నైతికవిలువలుగల వ్యక్తులు కొంతమంది ప్రజాసంక్షేమం గురించి పట్టించుకోవటానికి ముందుకువచ్చి, సమాజసేవతో

కొంతవరకు ప్రజాస్వామ్య ప్రత్యామ్నాయాలను అన్వేషించారు. వారిశాతం తక్కువ. శాంతియుత ప్రజాస్వామ్య సమాజానికై ప్రజాసేవలో యువత చేయూతను యివ్వటానికి గాంధేయదృక్పథం అవసరమని నవలలో అడుగడుగునా ప్రతిపాదించటం జరిగింది. వ్యాపారసంస్కృతి పెచ్చుపెరగటంతో స్వాతంత్ర్యపరిరక్షణకై భావి కర్తవ్యోన్ముఖులు కావలసిన అవసరం ఏర్పడింది. అందుకే నాటి స్వాతంత్ర్యస్ఫూర్తిని యువత తిరిగిపొంది, సహృదయనేత్రాలను సారించాల్సిన అవసరం ఏర్పడిందనేది నిర్వివాదాంశం. అటువంటిస్ఫూర్తిని కలిగించి యువతను చైతన్యపరచగలిగే నవలా సాహిత్యం 'హృదయనేత్రి'.

7. 'హృదయనేత్రి' రచనాశిల్పం

7.1 పాత్రచిత్రణ

రచయిత సజీవపాత్రచిత్రణలో సామాజిక పాత్రల స్వభావాలకు అనుగుణమైన సంభాషణలు, ప్రవర్తనలతో కథావస్తువు దానంతట అదే ముందుకు సాగేటట్లుగా రచన చేస్తారు. అవసరమైనచోట్ల రచయిత ముందుకువచ్చి ఆయాచారిత్రక సంఘటనలను, పాత్రలు చెప్పలేని మానవస్వభావాలను పాఠకులకు తెలిపేవిధంగా నిస్సందేహతను సమకూర్చాల్సిన అవసరం ఉంటుంది. హృదయనేత్రి నవలా నేపథ్యమంతా భారతదేశ స్వాతంత్రపోరాటపు స్ఫూర్తితో నిండి ఉంటుంది. కాబట్టి పాత్రలన్నీ దేశస్వాతంత్రచరిత్రనుండి పుట్టుకొచ్చాయి. అంతేకాదు యథాతథచరిత్రను వివరించేటప్పుడు నాటి చారిత్రకవ్యక్తులైన మహాత్మాగాంధి, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, దేశభక్త కొండా వెంకటప్పయ్య, ఉన్నవ లక్ష్మీనారాయణ, అపరగాంధిగా చెప్పుకోబడిన వావిలాల గోపాలకృష్ణయ్య[1], అప్పటి మద్రాసురాష్ట్ర ముఖ్యమంత్రి రాజగోపాలాచారి, ఆయన మంత్రివర్గంలోని వ్యవహారాల శాఖమంత్రి బెజవాడ గోపాలరెడ్డి మరియు ఆంధ్రరాష్ట్ర ఉద్యమకారుడైన పొట్టిశ్రీరాములు వంటి చారిత్రకవ్యక్తులు సహజపాత్రలుగా సందర్భానుసారంగా తటస్థించటంతో నవల చారిత్రక వాస్తవికతను ప్రతిబింబించింది. దానిచుట్టూ అల్లుకొన్నపాత్రలు కూడా సహజపాత్రలు అనిపించేలా చిత్రించినప్పుడు పాఠకులకు ఎరుకలో ఉన్న స్వాతంత్ర్యోద్యమ సమరశీలురు దృశ్యమానమవుతారు. అప్పుడే హృదయనేత్రాలు విచ్చుకుంటాయి.

ఈ నవలలోని దేశసేవకులైన రామలక్ష్మి, వాసుదేవరావు, జానకమ్మ, గోపాలరావుల పాత్రలు పాఠకులు తాము కన్న, విన్న స్వాతంత్ర్యోద్యమ కార్యకర్తలను స్మరించుకునేటట్టు చేస్తాయి. నవల ఆసాంతం వారియొక్క స్ఫూర్తి నిండి ఉండటంతో అవి చిరస్మరణీయతను సంతరించుకున్నాయి. అంతేకాదు స్వాతంత్ర్యోద్యమం నాటి యువశక్తికి ప్రతీకగా నిలిచిన గోపాలరావు యొక్క దేశభక్తికి వారసులుగా స్వాతంత్ర్యానంతరం దేశాభిమానంగల యువత యొక్క హృదయనేత్రాలకు ప్రాతినిధ్యం వహించిన స్వరాజ్యలక్ష్మి, సూర్యారావులు కళ్ళముందు కనపడతారు. నేటి యువత అధికారం, అవినీతి, ఆశ్రితపక్షపాతం, కులాభిమానంగల రాజకీయాలకు బలికాకుండా భారతదేశస్వాతంత్ర్య

పరిరక్షణకై అభివృద్ధిలో బాధ్యతాయుత భాగస్వాములు కాగలిగేటట్లుగా చైతన్యాన్ని కలిగించే పాత్రలు కనువిప్పును కలిగిస్తాయి. నవలావస్తువులోని సంఘటనలలో ఆయాపాత్రల స్పందనలలో విభిన్న స్వభావాలచిత్రణ పాఠకుల అనుభూతులకు ఊపిరులు ఊదుతాయి. ఇందులోని ప్రతిపాత్ర ప్రవేశం స్వాతంత్ర్యోద్యమఘట్టాలతో అనుసంధానింపబడి ఉంటుంది. 'హృదయనేత్రి' నవలలో స్వాతంత్ర్యానికి పూర్వమున్న స్వభావాలు, స్వాతంత్ర్యానంతరం అధికారం, అవినీతి, ఆశ్రితపక్షపాతం, కులతత్వ రాజకీయంగల స్వార్థపరశక్తుల మనస్తత్వాలు వాస్తవికతను ప్రతిబింబించటంతో నేటి సామాజిక, ఆర్థిక-రాజకీయాల పరాకాష్ఠస్థితి పాఠకుల మనస్సులను తట్టిలేపి కర్తవ్యోన్ముఖులను చేస్తుంది. అందుకే సహజ, సజీవపాత్రచిత్రణ నవలకు ఆయువుపట్టువంటిది. ఈ నవలావస్తువులో స్వదేశీయ స్వతంత్రతకు పట్టంకట్టే రామలక్ష్మి, బాల్యంలోనే దేశస్వాతంత్ర్యంపట్ల జిజ్ఞాసను పెంపొందించుకున్న గోపాలరావుల పాత్రలప్రవేశంతో కథావస్తువు ఆరంభమవటంతో వారి ఉద్యమస్వాతంత్ర్యస్ఫూర్తి చివరివరకు ఉంటూ పాఠకుల మనస్సులను తాకి స్వాతంత్ర్యచరిత్రలోకి చొచ్చుకొని వెళ్ళగలిగేటట్లుచేసి, నవలను ఆసాంతం చదివింపచేస్తాయి. స్వాతంత్ర్యధ్యేయానికి, దానిసాధన, పరిరక్షణ విషయంలో సానుకూల, వ్యతిరేక దృక్పథాలుగల పాత్రలు పాఠకుల హృదయాల సంఘర్షణకు కారణభూతమై హృదయనేత్రాలకు చైతన్యాన్ని రంగరిస్తాయి. అదే నవలాశిల్పానికి ఆధారం.

7.1.1 రామలక్ష్మి

నవలాప్రారంభమే దేశసేవికగా 'వందేమాతరం' అంటూ ఖద్దరువస్త్రధారణతో స్వాతంత్ర సమరశీలుడైన గాంధిమహాత్ముని గురించిన కథనంతో, నవలలోని ప్రధానపాత్రయైన గోపాలరావుకే కాక పాఠకులకుకూడా స్ఫూర్తివంతమైనపాత్రగా రామలక్ష్మిపాత్రప్రవేశం జరిగింది. నవల ఆసాంతం తరతరాలకు దేశభక్తి స్ఫూర్తిని కలిగించిన పాత్ర. ఆనాటి పదేళ్ళ గోపాలరావు అటువంటి నలభైఏళ్ళ రాముడత్తయ్యతో వాళ్ళ ఊరైన చీరాలకు వెళ్ళిపోవాలనుకున్నాడు. పుట్టింట్లో ఎనిమిదేళ్ళవరకే పెరిగిన రామలక్ష్మికి నోములు, పూజలుమాత్రమే తెలుసిన రామలక్ష్మికి గాంధేయవాదియు, కాంగ్రెస్ కార్యకర్తయైన వాసుదేవరావుతో వివాహం జరిగింది. వినాహానంతరం ఆమెకు భర్త చదువునేర్పటం, హిందీభాషను ఆమె నేర్చుకోవటం జరిగింది. నాటి స్త్రీలు గుమ్మందాటి బయటకు వచ్చేవారుకారు కాని రామలక్ష్మిని ఆమె భర్త తనతోకూడా స్వాతంత్ర్యోద్యమ కార్యక్రమాలలో పాల్గొనేటట్లు చేసాడు. భర్తతో కాంగ్రెస్ మీటింగులకు వెళ్ళినప్పుడు అక్కడకు వచ్చి ఉపన్యాసాలను యిస్తున్న సరోజినీదేవి, ఉన్నవ లక్ష్మిబాయి వంటి వారినిచూసి ఉద్యమస్ఫూర్తిని పొంది, తాను ప్రచారకార్యక్రమాలలో పాల్గొని ఉపన్యసించటం చేసేది. రామలక్ష్మి రాట్నం వడికి నూలుతీయటం[1], ఊరూర ఉపన్యాసాలు యిస్తూ

సంచరిస్తూ ఉండేదని ఆమెయొక్క వదిన సుబ్బమ్మ అయిష్టంగా చెప్పిన మాటల్లో అర్థమౌతుంది. రామలక్ష్మి కడజాతివ్యక్తిని యింట్లో పెట్టుకుందని కూడా విమర్శచేసింది. రామలక్ష్మి హరిజనబాలుడ్ని యింట్లో తోటమాలిగా పెట్టుకొని, అతనిచేత అక్షరాలను దిద్దించి చదువును నేర్పించింది. స్వాతంత్ర్యోద్యమ కార్యకర్తలందరికీ కాంగ్రెస్ ఒక్కటే కులం[2]. వర్తకరూపేణా వచ్చిన బ్రిటిష్ వారి వ్యాపారానికి గండికొడితేనే వారు దేశంనుండి పలాయనం చిత్తగిస్తారని, విదేశీవస్త్ర బహిష్కరణకై స్వదేశీదీక్షలో భాగంగా ఖద్దరు తయారీ ప్రాధాన్యతను రామలక్ష్మి వహించింది. ఐకమత్యంతో స్త్రీపురుషభేదం లేకుండా ప్రజలందరూ పాల్గొని స్వాతంత్ర్యదీక్షను పొందగల ఉద్యమమార్గంకూడా. దేశస్వరాజ్యసాధనకై గాంధిపిలుపును అనుసరించి చేపట్టిన సత్యాగ్రహ నిర్మాణకార్యక్రమాలలో భాగంగా ఖద్దరు, మద్యపాన నిషేధం, అస్పృశ్యతానివారణ, న్యాయస్థానాల బహిష్కరణవంటి ప్రభుత్వ సహకారవృత్తుల నిరసన ముఖ్యమైనవి. రెండువేల గజాల నూలుదారాన్ని రాట్నంతో వడికిన వారికి కాంగ్రెస్ సభ్యత్వం ఉంటుంది.

అత్తయ్య ఆమెకోసం వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలతో ఆడామొగ భేదంలేకుండా వారితో సమంగా మాట్లాడటం, ఊరూరా తిరిగి ఉపన్యాసాలు యివ్వటం, పత్రికలు చదవటం, కల్లుదుకాణాలదగ్గర పికెటింగ్ వంటి సత్యాగ్రహ కార్యక్రమాలలో రామలక్ష్మి పాల్గొనటం, ఆమె పుట్టింటివారికి యిష్టంలేకపోయినా గోపాలరావుకు మాత్రం రాముడత్తయ్యను చూస్తే గర్వంగా అనిపించేది. ఆమె భర్త వాసుదేవరావు న్యాయవాది. అతడు సత్యాగ్రాహిగా న్యాయవాదవృత్తిని వదిలి జాతీయవాదిగా స్వాతంత్ర్యదీక్షను పట్టినవాడే. స్త్రీలు ముందుగా చదువుకొని యింట్లోని బానిసత్వంనుండి విడుదల అయినప్పుడే స్వాతంత్ర్యసాధన సులువవుతుందని వీరేశలింగంగారి[3] మాటలను ఆచరణలో పెట్టాలనుకొన్న వ్యక్తి కావటంతో భర్తగా రామలక్ష్మికి చదువు నేర్పాడు. ఈమె జ్ఞానవంతురాలై దేశబానిసత్వ విముక్తికై కాంగ్రెస్ కార్యకర్తగా జాతీయోద్యమభాగస్వామి అయింది. చీరాలకు వెళ్ళటానికి రైలెక్కిన రామలక్ష్మికి చుట్టూర ఉన్న ప్రదేశం కనపడ్డప్పుడు ఆ భూమి తమది కాకుండాచేస్తూ బ్రిటిష్ వారు తమజాతిపై అధికారాన్ని చెలాయిస్తున్నారని భావించి తమ అస్వతంత్రతను తరచి చూసుకుంది. ఏ పనిచేస్తున్నా, ఎక్కడికి వెళ్ళినా స్వరాజ్యదీక్ష నరనరాల్లో ఉండటం దేశసేవికల అస్తిత్వచైతన్యమని రామలక్ష్మిపాత్ర తెలియచేస్తుంది.

రామలక్ష్మికోసం స్టేషన్‌కి వెళ్ళిన ఆమె భర్త వాసుదేవరావు దారిలోనే ఈమెకు చీరాల ఉద్యమాన్ని గురించి చెపుతూ గాంధిగారి సలహాను అనుసరించి, సత్యాగ్రహమా లేదా చీరాలను వదిలిపెట్టటమా అని చర్చించుకుంటున్నారని చెప్పాడు. తమ యింటికి వచ్చిన దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారికి

రామలక్ష్మి తన మేనల్లుడైన గోపాలరావును చూపించగా, ఆయన పిల్లవాడిని జాతీయపాఠశాలలో చేర్పించమనటంతో గోపాలరావును తనబిడ్డగా భావించి ఆమె తన దేశసేవక వారసత్వాన్ని కట్టపెట్టాలనుకుంది. బెజవాడసభకు గాంధివచ్చిన సందర్భంగా రామలక్ష్మి గోపాలరావును తీసుకొనివెళ్ళి దూరంనుంచి అయినా గాంధిని ఆతడికి చూపించి స్వాతంత్ర్యస్ఫూర్తిని కలిగించటానికి ప్రయత్నించింది. తమ తరువాతి తరాన్ని దేశసేవకుడిగా, స్వాతంత్ర్యవీరుడిగా తయారుచేయాలనే సంకల్పం ఆమెది. అధిక పన్నుల రాబడికై చీరాలను మున్సిపాలిటిగా చేస్తున్న బ్రిటిష్ ప్రభుత్వ నిర్ణయానికి నిరసనను చూపించాలని భావించిన చీరాలప్రజలు ఇల్లువదిలి పిల్లాజెల్లతో గొడ్డూగాదెంతో ఊరువదిలిపెట్టి దూరంగా శిబిరాలలో ఉండి పన్నుల నిరాకరణ ఉద్యమాన్ని సాగించారు. ఇళ్ళూ వాకిళ్ళు ధ్వంసంచేసినా పన్నులు కట్టకూడదని, తెల్లవాళ్ళకు బుద్ధివచ్చి మున్సిపాలిటి నిర్ణయం రద్దు అయ్యేంతవరకు తిరిగి రాకూడదని తమ ఆస్తులను పణంగాపెట్టి, జానకమ్మ నాయకత్వంలో ఉద్యమాన్ని చేపట్టాలనుకున్న దేశసేవిక రామలక్ష్మి.

చీరాల ప్రజల ఉద్యమ శిబిరాలను సందర్శించటానికి గాంధి వచ్చినప్పుడు జానకమ్మస్ఫూర్తితో రామలక్ష్మి తిరిగి తాను నగలను చేయించుకోనని గాంధికి మాటయిచ్చి తన నగలను స్వరాజ్యనిధికి సమర్పించిన త్యాగశీలి. చీరాల ఉద్యమ ప్రచారానికి ఊరంతా తిరుగుతూ ఉపన్యాసాలను యిస్తున్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారిని అరెస్టుచేసి జైల్లోపెట్టారు. ప్రజలు ఉద్యమాన్ని తీవ్రతరం చేయటంతో పోలీసులు చీరాలలోని యిళ్ళను కాల్చివేసారు. శిబిరాలను చెల్లాచెదరుచేయాలని భావించిన పోలీసులు వారిపై ప్యూనిటివ్ టాక్సువేసి వారి ఆహారపదార్థాలను దోచుకొనివెళ్ళేవారు. వారిని అడ్డుకున్న వాసుదేవరావును, జానకమ్మను అరెస్టుచేసి జైలుకుపంపారు. భర్తను పోలీసులు అరెస్టుచేసి తీసుకొని వెళ్ళినా రామలక్ష్మి భయపడలేదు. ఆ ఉద్యమాన్ని కొనసాగించింది. ఆ భీతావహ వాతావరణంలోనే పది నెలలపాటు సాగిన చీరాల ప్రజలు చేసిన ఉద్యమాన్ని గురించి ప్రభుత్వంవారు తాము ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని అనేసరికి, నాయకత్వలేమితో రోజురోజుకు ప్రజలలో ఉద్యమస్ఫూర్తి నీరుకారిపోవటంతో ప్రజలు తిరిగి చీరాల చేరుకొన్నారు.

రామలక్ష్మిలో మాత్రం చీరాల ఉద్యమస్ఫూర్తి చల్లారలేదు. ఉద్యమకాలంలో తమయిళ్లు కాలిపోవటానికి కారణంగా కులాల ప్రత్యేకతలు లేకుండా పోవటమేనని చీరాల ప్రజలలో అజ్ఞానులైన కొందరు గాంధిని తిడుతున్నారు. ఆ విషయాన్ని చెప్పిన గోపాలరావుతో రాముడత్తయ్య అటువంటి వారంతా దేశద్రోహులని, వారివల్లనే దేశానికి స్వాతంత్ర్యం రావటంలేదనీ, దేశంకోసం అవసరమైన త్యాగాలు చేయాలని అంది. ఆ సందర్భంలోనే గోపాలరావులో దేశస్వాతంత్ర్యంపట్ల నిస్వార్థత

ఉండాలనే ఆశయాలకు బీజం వేసింది రామలక్ష్మి. శిబిరాలలో ఉన్నప్పుడు అంతా కలిసికట్టుగా ఉన్నా తిరిగి చీరాల రాగానే ఎవరి కులాలు వారివిగా ఉండటం, పైపెచ్చు ఉద్యమసమయంలో తమయిల్లు కాలిపోయినందుకు గాంధి యిల్లుకట్టిస్తాడా అని సీతమ్మవంటివారు అన్నమాటలను గోపాలరావు చెప్పినప్పుడు, సీతమ్మలాంటివారు దేశద్రోహులని, స్వాతంత్ర్యంకోసం అవసరమైతే యిళ్ళూ వాకిళ్ళు త్యాగాలు చెయ్యాలని రామలక్ష్మి చెప్పింది. గోపాలరావు దేశానికి స్వరాజ్యం వస్తే ఎలా ఉంటుందని అడగగా రామలక్ష్మి స్వరాజ్యం యొక్క తత్వాన్ని గురించి చెప్తూ భారతదేశాన్ని భారతీయులే పాలించుకోవటం, ప్రజలందరికి తిండి, బట్టకు దరిద్రంలేకపోవటం, పిల్లలు స్వేచ్ఛగా ధైర్యంగా పెరగటం అనిచెప్పింది. గోపాలరావు పోలీసులు ధ్వంసంచేసిన మొండిగోడలను చూపించి భయంగా ఉందంటే రామలక్ష్మి, ఆ గోడలకు భయపడకూడదనీ, ఆ విధ్వంసమైన గోడల వెనకాల ఉన్న దౌర్జన్యాన్ని తెలుసుకోమనిచెప్పింది. అంటే శత్రువుల అరాచకత్వంయొక్క స్వభావాన్ని గ్రహించమని ఆమె బోధన.

ఆంధ్రపత్రికలో గాంధిని అరెస్టుచేసిన వార్త చదివిన రామలక్ష్మి కేకపెట్టుకుంటూ ఆ వార్తను ఊరందరికీ చేరవేసేసరికి ప్రజలు తమయింట్లో శవంలేచినంతగా బాధపడ్డారు. రాత్రి పాతికమంది కాంగ్రెస్ కార్యకర్తలు రామలక్ష్మియింట్లో గుమికూడి రహస్యంగా పల్నాడులో పశువులమేతకై అటవీసంపదను వాడుకుంటున్న ఆటవికులపై పుల్లరిపన్నును వేసినందుకు, వారు నిరసిస్తూ ఉద్యమంచేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఆ ఉద్యమ సమయంలో వారికి నాయకత్వం వహించిన కన్నెగంటి హనుమంతును బ్రిటిష్ అధికారులు నక్కజిత్తులతో పిలిచి మోసంచేసి తుపాకులకు బలిపెట్టటం జరిగిందన్న విషయాలను మాట్లాడుకుంటూ చందాలు యివ్వగా, ఆమె వాటిని బీదకుటుంబాల గ్రాసానికి యివ్వాలనుకొంది.

చీరాల ఉద్యమం చల్లారిందని గ్రహించిన ప్రభుత్వం వాసుదేవరావును, జానకమ్మను జైలునుండి విడుదలచేసింది. గోపాలరావుకు తాను తయారుచేసిన నూలుమాలతో జైలునుండి విడుదలై వస్తున్న మామయ్యకు స్వాగతం చెప్పాలనుకుని ఉవ్విళ్ళూరుతున్నా, ఆతనిలో నిస్వార్థత ఏర్పడేవిధంగాను, దాన్ని ఆచరణసాధ్యంచేయిస్తూ రామలక్ష్మి ఆ మాలను జానకమ్మ మెడలోనే వేయించింది. వసతులుండని జైల్లో అనారోగ్యంపాలయి, దగ్గు, ఆయాసంతో ఎముకలగూడుగా వంగినడుస్తూ వస్తున్న వాసుదేవరావును, చిక్కి శల్యమై గుర్తుపట్టలేనంతగా స్ట్రెచర్ మీద దింపిన జానకమ్మను చూసింది రామలక్ష్మి, ఆమెకు జైల్లో జబ్బుతెప్పించారని, దేశసేవకురాలిగా స్వాతంత్ర్యంకోసం పోరాడుతున్న యోధురాలిని పూజించటం మాని, హింసించటం దారుణం అని

ప్రజలకు అర్థమయ్యేటట్లు చెప్పింది. స్వాతంత్రపోరాటశీలురకున్న విలువలను గుర్తించేటట్టు చేసినపాత్ర.

జైలునుండి విడుదలయి యింటికి వచ్చిన వాసుదేవరావుకు జబ్బుతగ్గకపోయేసరికి ఆతనిని ప్రకృతిచికిత్సకై రాజమండ్రిలోని సీతానగరం అనే ఆశ్రమానికి భర్తని తీసుకొని వెళ్ళాలనుకొని రామలక్ష్మి అక్కడ ఉన్న జాతీయపాఠశాలలో గోపాలరావును చేర్పించాలనుకుంది. అతనిని ఒక స్వాతంత్రవీరుడిగా తీర్చిదిద్దాలనుకొంది. కాని ఆమె కల వాసుదేవరావు ఆరోగ్యంమీద, ఆర్థికపరిస్థితిమీద ఆధారపడి ఉంది. తన కల కల్లలు కాకూడదని తాను ఓడిపోతున్నా గడ్డిపోచను పట్టుకున్నట్టుగ ఉంది ఆమె పరిస్థితి. వాసుదేవరావు జబ్బువిషయం తెలిసి, అంటురోగమనే భావనతో కొడుకుని తీసుకొనిపోవటానికి వచ్చిన గోపాలరావుతల్లి సుబ్బమ్మతో, కనీసం గోపాలరావును బందరులోని జాతీయపాఠశాలలో చేర్పించమని రామలక్ష్మి చెప్పింది. బందరు జాతీయపాఠశాలలో చేర్పిస్తానని చెప్పి గోపాలరావును ఆమె తీసుకెళ్ళింది. భర్తకు అనారోగ్యంగా ఉన్నా గోపాలరావు భవిష్యత్తులో గొప్ప దేశసేవికుడుగా అవ్వాలనే ఆమె తన లక్ష్యాన్ని వీడలేదు. ఇల్లుగడవటం కష్టమవుతున్నా, పొలాన్ని కుదువపెట్టియైనా రామలక్ష్మి వాసుదేవరావును సీతానగరానికి తీసుకొని వెళ్ళి వైద్యం చేయించాలనుకొంది.

పదమూడేళ్ళ గోపాలరావు బందరులోని జాతీయపాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్నాడు. అక్కడ దేశస్వాతంత్ర్య విషయాలబోధన, రోజూ రాట్నం తిప్పి నూలువడకటం వంటివి అభ్యాసవిషయాలుగా ఉండేవి. అలా అక్కడ గోపాలరావు దేశసేవకుడుగా ఎదగగల వాతావరణం ఉండటంతో రామలక్ష్మియొక్క కల కొంతవరకు నెరవేరుతోంది. బందరురోడ్డుపై నడుస్తున్న గోపాలరావుకు కృష్ణాపత్రిక ఆఫీసు కనపడేసరికి ఆ పత్రికలను చదివే రాముడత్తయ్య చెప్పిన పత్రికాస్థాపకులు ముట్నూరి కృష్ణారావు[4], పట్టభిరామయ్యలు[5] గుర్తుకువచ్చి ఆ ఆఫీసు కార్యాలయాన్ని చూడాలనుకొంటాడు. గోపాలరావుకు ఎక్కడకువెళ్ళినా ఆతనివెంట ఎప్పుడూ రాముడత్తయ్య స్ఫూర్తి ఉంటూనే ఉండేది. అందుకే నవలలో గోపాలరావు పాత్ర బతికినన్నాళ్ళు రామలక్ష్మిస్ఫూర్తికూడా జీవించే ఉంది. బందరులోని పాఠశాలలో విద్యార్థులు నందయ్య అనే హరిజన విద్యార్థిని దూరంగా ఉంచినా, గోపాలరావు మాత్రం నందయ్యను కలుపుకోగలిగాడంటే అదంతా రామలక్ష్మి యింట్లో గోపాలరావు ఉన్నప్పుడు, ఆ యింటిలో ఆమె కడజాతి వ్యక్తిని ఉంచుకోవటం, ఆతడితో గోపాలరావు కలిసిమెలిసి తిరగటంచేతనే అని అర్థమై, ఆమె స్ఫూర్తిప్రభావం గోపాలరావు ఎక్కడకువెళ్ళినా ఆతనిపై ఉందన్నవిషయం స్పష్టమౌతుంది.

ఒకరోజు నందయ్య 'మాలపల్లి' అనే నవలను చేతిలో పెట్టుకున్నందుకు, నందయ్యను పోలీసులు అరెస్టుచేసినప్పుడు గోపాలరావుకు రాముడత్తయ్య చెప్పిన స్వాతంత్ర్యం అంటే పిల్లలు స్వేచ్ఛగా, ధైర్యంగా తిరగటం అనే మాటలు గుర్తుకువచ్చి స్వాతంత్ర్యం అంటే ఏమిటో అనుభవ జ్ఞానానికి అందింది. ఆ రకంగా రామలక్ష్మిస్ఫూర్తిని నిరంతరం గోపాలరావు గుర్తుకు తెచ్చుకుంటు న్నాడంటే ఆమె తన తరువాతి తరానికి చెందిన స్వాతంత్ర్యసాధనా వారసుడిలో స్వాతంత్ర్యపిపాసను నరనరాల్లో జీర్ణింపచేసుకునేటట్టు చేసిందని అర్థమౌతుంది. శారదాచట్టం వస్తే రజస్వలకాని కన్య దొరకటం కష్టమని, రామలక్ష్మి రాజమండ్రిలోని కందుకూరివారి వితంతుశరణాలయంలోని ఒక వితంతుపిల్లను తెచ్చి పెళ్ళిచేస్తుందనే భయంతోను, దానికంటే మునుపే గోపాలరావు తల్లి ఆతనికి పెళ్ళి చేయాలనుకుంది. పదహారేళ్ళవయసు వచ్చిన గోపాలానికి తల్లిదండ్రులు ఆతనికి తెలియకుండానే పెళ్ళిని నిశ్చయం చేసారు. ఇంకా మెట్రిక్యులేషన్ చదవటానికి తల్లిదండ్రులమీద ఆధారపడ్డ గోపాలరావు, తనకు పెళ్ళి యిష్టంలేదని వారికి చెప్పినా వినిపించకోక పోయేసరికి గోపాలరావు తన పెళ్ళివిషయంలో ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో ఉన్నాడు. తన పెళ్ళి శుభలేఖను రాముడత్తయ్యకు యివ్వటానికి గోపాలరావు రాజమండ్రిలోని సీతానగరం ఆశ్రమానికి వెళలాడు.

రాముడత్తయ్య దగ్గరకుచేరిన గోపాలరావులో కొత్తశక్తి చోటుచేసుకున్నట్టు అనిపించిందంటే రాముడత్తయ్య ఉనికి ఎంతవిలువైనదో గోపాలరావుకు అర్థమైంది. వాసుదేవరావు పిల్లను చూడకుండా చదువు పూర్తికాకుండా పెళ్ళిచేసుకుంటున్నందుకు విమర్శించినా రామలక్ష్మిమాత్రం గోపాలరావుతో పెళ్ళి తరువాత చేయాల్సిన కర్తవ్యాన్ని ఆలోచించమని అంది. ఆశ్రమంలోని రావిచెట్టు దగ్గర కూర్చొన్న రామలక్ష్మి గోపాలరావుతో తాను తన భర్తను అనాధగా చేసి ముందుగా పోవాలనుకొనే స్వార్థపరురాలినికానని, తనకి చావంటే భయంలేదనీ, తానుపోతే ఆతనిని చూసేవాళ్ళులేరనీ, తాను గుండె రాయిచేసుకొని బతుకుతున్నానని చెప్పింది. అంతేకాదు, తన భర్త తనకి వివాహానంతరం చదువుచెప్పిన గురువని, విశాలలోకాన్ని చూపించిన స్నేహితుడని, మహావ్యక్తి అనిచెపుతూ దుఃఖపడింది. రామలక్ష్మి అంటే గిట్టనివాళ్ళుమాత్రం ఆమె తన భర్త జబ్బుతో ఉన్నా ఉపన్యాసాలంటూ ఊళ్ళుపట్టుకు తిరుగుతోందని పుట్టించిన మాటలు ఆ సత్యాలని గోపాలరావుకు అర్థమైంది. అంతేకాదు ఆమె వీలుచూసుకొని వెళ్ళి స్థానికంగా ఉపన్యాసాలు యిస్తోందంటే రామలక్ష్మికి భర్త అంటే ఎంత గౌరవం ఉందో, అంతేభక్తి మాతృభూమిమీద కూడా ఉందని అర్థమౌతుంది. శుభకార్యాలప్పుడుగాని, కార్యక్రమాలప్పుడుగాని కాంగ్రెస్ వారు ఆమెను ముందుగా గౌరవించటం జరిగేది. కాని గోపాలరావుపెళ్లికి ఆడబడుచు రానందుకు సుబ్బమ్మ సంతోషపడ్డా, గోపాలరావుకు పెళ్ళప్పుడు

తనమెడలో చంద్రహారం వేస్తున్నప్పుడు రాముడత్తయ్య తనమెళ్ళోవేసిన విషయం గుర్తుకువచ్చి ఆమె దగ్గరకు వెళ్ళాలనే ఆలోచన కలిగింది. గోపాలరావుకు ఏ పనిలోనైనా, ఏ సందర్భంలోనైనా రాముడత్తయ్యను మరిచిపోలేనంతగా ఆమె మూర్తిమత్వం స్ఫురిస్తూనే ఉంటుందని అర్థమౌతుంది. గోపాలరావుకు పెళ్ళయిన కొత్తల్లోనే వాసుదేవరావు చనిపోయిన విషయాన్ని రాముడత్తయ్య టెలిగ్రామ్ ద్వారా తెలియచేసింది. ఆశ్రమానికి వెళ్లిన గోపాలరావు తాను దహనసంస్కారం చేస్తానన్నా, తల్లిదండ్రులు ఉన్నవారు చేయకూడదని అతడిని వద్దనేసరికి కాంగ్రెస్ యువత తాము చేస్తామని ముందుకువచ్చారు. రాముడత్తయ్యకూడా తమదంతా కాంగ్రెస్ కులమని, వాసుదేవరావుకు కర్మకాండలపై నమ్మకంలేదని చెప్పింది. దానికి గోపాలరావు తల్లిదండ్రులు తమ వియ్యాలవారు విమర్శిస్తారంటే రామలక్ష్మి తాను బతికున్నంతవరకు పుట్టింటికి రానని చెప్పింది.

నలుగురు నవ్వుతారనే భయం తనకులేదనీ, వాసుదేవరావు యిష్టప్రకారం ఆ పదిరోజులకు ఖర్చుఅయ్యే డబ్బును హరిజననిధికి యిస్తానని చెప్పింది. తనకు మూఢాచారాలమీద నమ్మకంలేదనీ, నలభైఏళ్ళుదాటిన తనకు ఆడామగ భేదంలేదని, తనదొక ప్రాణమున్నదేహమని, ఆ దేహంలో ఆలోచనలున్నంతవరకూ తన బతుకుకు దేశసేవచేసే గమ్యం ఒక్కటే మిగిలిందని, స్వాతంత్రేచ్ఛ తన ఆశయమనీ, తన ఆశయాలకు గోపాలరావు రూపమిస్తే తన బిడ్డగా భావిస్తానని, తనకు మిగిలింది దేశమే అని చెప్పింది. సమాజంలో అందరి వితంతువులవలె కాకుండా రామలక్ష్మి తనభర్త చనిపోయినా తానెందుకు పనికిరాననే ఆలోచనలతో సమాజానికి దూరం అవదలచుకోలేదు. ఆమె తన శరీరం ఉన్నంతవరకు స్వాతంత్ర్యంకోసం పోరాడాలనుకునే ఆమె ధ్యేయంముందు తరతరాలనుండి వస్తున్న సామాజిక సంస్కృతికూడా తలవంచేటట్టు చేసిన ధీశాలి రామలక్ష్మి. ఆమె విప్లవాత్మక ఆలోచనలు ముందుతరాలకు కూడా స్ఫూర్తి నింపగలిగేవి. ఆ తరువాత గోపాలరావు రామలక్ష్మి కలిసి దుగ్గిరాలవారు పోయిన విషయాన్నిగురించి మాట్లాడుకున్నారు. రామలక్ష్మి తనకు ఎవరితో సంబంధం ఉండకూడదని, తనకు ఎవరూ లేఖలుకూడా రాయవద్దని, తాను సత్యాగ్రహ ఆశ్రమాలలో ఉండి దేశసేవకు అంకితమవుతానని గోపాలరావుకు చెప్పింది. అంటే దేశసేవకు 'మమ' అనే బంధనాలు లేకుండా చేసుకోవాలనుకొన్న దేశసేవికురాలైన రామలక్ష్మి స్ఫూర్తి శాశ్వతత్వాన్ని సంతరించుకుంది.

గోపాలరావు నాగపూర్ లో మెట్రిక్యులేషన్ కోసం ప్రయాణమవుతున్న సమయంలో గాంధి ఉప్పుసత్యాగ్రహానికి పిలుపునివ్వగా గాంధివెంట అశేషజనం అనుసరించి దేశంమొత్తం ఉప్పుసత్యాగ్రహంలో భాగస్వాములయ్యారు. ఎక్కడివారిని అక్కడ అరెస్టుచేసింది ప్రభుత్వం. గాంధితో

కూడా పాల్గొన్న రామలక్ష్మి తన ఉప్పుసత్యాగ్రహ ఉద్యమాన్ని గోపాలరావుకు తెలియచేస్తూ రాసిన లేఖలో తాను బంధువులందరితో సంబంధంలేకుండా ఉండటం వల్లనే తనలో ఆత్మధృతి, జీవితం పట్ల అవగాహన కలిగిందని రాసింది. అంతేకాదు, ప్రస్తుతం తాను మహాత్ముని వెంట వాలంటీరుగా ఉన్నానని, గాంధి ఉపన్యసిస్తుంటే దానిని తాను తెలుగులోకి తర్జుమాచేస్తున్నానని, జీవితానికి ఒక ఆలంబన, ప్రయోజనం కలిగిందని, గోపాలరావు కూడా ఉంటే గాంధి ఆశీస్సులు మరొకసారి దక్కేవని, తన పూర్వజన్మ సుకృతం వల్ల గాంధి మహాత్ముని బృందంలో ఉండగల భాగ్యం దక్కిందని రాసింది. ఆ లేఖను చదివిన గోపాలరావుకు తాను వాసుదేవరావు చనిపోయినప్పుడు వెళ్ళిన సందర్భంలో, ఆనాడు తన అత్తయ్య తనని ఉత్తరాలుకూడా రాయవద్దని చెప్పి తనకి ఏకాంతం మనోనిబ్బరం కావాలని చెప్పటానికి కారణం అతనికి అర్థమైంది. అంటే స్వార్థపరత్వాన్ని పూర్తిగా వదుల్చుకోగలిగితేనే దేశంకోసం పాటుపడగల శక్తి, ఆత్మధృతి కలుగుతుందని రాముడత్తయ్యవల్ల అవగాహన ఏర్పడిన గోపాలరావుకు ఆతని భవిష్యత్తులోని జీవితానికి మార్గదర్శకమైన స్ఫూర్తిని రామలక్ష్మి యివ్వగలిగిందని అర్థమౌతుంది. జైల్లో రామలక్ష్మికి క్షయ అంటుకోవటంతో ఆమె సబర్మతి ఆశ్రమం నుండి తిరిగి సీతానగరంలోని ఆశ్రమానికి చేరుకుంది.

రామలక్ష్మి మహాత్మునితో కూడా శాసనోల్లంఘనంలో (1931సం.) పాల్గొన్నదని ఆమెకు మూడేళ్ళజైలు శిక్షను వేసారు. ఆమెను అరెస్టుచేసిన సమయంలో రామలక్ష్మి యిల్లు, పొలం ప్రభుత్వం జప్తుచేసిందని తెలుసుకున్న గోపాలరావు జైలునుండి విడుదలయై వచ్చిన రాముడత్తయ్యను కలవాలని సీతానగరానికి వెళ్ళాడు. అక్కడ పోలీసులు చెల్లాచెదరుచేసిన ఆశ్రమంలో రామలక్ష్మి దైన్యావస్థలో ఉన్నప్పటికీ, ఆమె కళ్ళు తేజస్సుతో ఆత్మస్థైర్యంతో ఉన్నట్టు గోపాలరావుకు అనిపించింది. రామలక్ష్మి గోపాలరావుతో ప్రజలభవిష్యత్తు దేశభవిష్యత్తుపై ఆధారపడి ఉందని చెప్పింది. శాసనోల్లంఘన సమయంలో జైలుశిక్షను అనుభవించిన గోపాలరావుతో 'కేవలం జైలుకు వెళ్ళివస్తే సరిపోదనీ, యింకా సత్యాగ్రహకార్యక్రమాలు చెయ్యాలని, గాంధిబాటలో నడవటానికి తొలిసారిగా నువ్వు దేశంపట్ల కళ్ళుతెరచిన చోటికివెళ్ళి అక్కడి పల్లెల్లో తిరిగి ప్రజలకు స్వాతంత్ర్యేచ్ఛను బోధించమ'ని చెప్పింది. బాపూజీ మాటలుగా అక్కడ ఉన్నవారిని అక్కచెల్లెళ్ళు అన్నదమ్ములుగా[6] భావించి వారితో కలిసి నడవమని చెప్పింది. ఆ రకంగా స్వాతంత్ర్యోద్యమంలో ముందుకు నడవమని గాంధేయవాద ప్రేరణను కలిగించింది. రామలక్ష్మికి గాంధి అంటే అహింస అనీ, గాంధి అంటే ప్రజాహితసేవ అనే భావనలు ఆమె నరనరాలలో జీర్ణింపచేసుకోవటంచేత ప్రజలంతా గాంధిబాటలో నడవాలనే ఆశయస్ఫూర్తిగల దేశసేవిక రామలక్ష్మి అని అర్థమౌతుంది.

గోపాలరావు క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో విద్యార్థులు రాళ్ళురువ్వుతున్నప్పుడు అక్కడకువెళ్ళి అహింసావాదిగా దూరంగా నిలబడి చూస్తున్నందుకు గోపాలరావును అరెస్టుచేసి మూడేళ్ళపాటు కఠినకారాగార శిక్షనువేసి తిరిగి కడలూరు జైలుకు పంపారు. గోపాలరావు జైల్లో ఉన్నప్పుడు రామలక్ష్మి చనిపోయిన కబురు అందింది. రాముడత్తయ్యయొక్క చివరిక్షణాలలో ఆమె దగ్గర తాను లేనందుకు, ఎవరూలేకుండా ఒంటరిగా వెళ్ళిపోయినందుకు రాత్రంతా నిద్రపోక చింతించాడు.

నవలలో రామలక్ష్మిపాత్ర ఆనాటి దేశసేవికల ప్రతిరూపం. రామలక్ష్మి వంటివారి జీవితకథనాలు నేటికీ స్ఫూర్తిదాయకాలు. స్వాతంత్ర్యోద్యమానికి నిస్వార్థంగా తమజీవితాలను, ఆస్తులను పణంగా పెట్టిన త్యాగశీలురుని గురించి తెలుసుకుంటేనే స్వాతంత్ర్యానికి ఉన్నవిలువ అర్థమౌతుంది. పూర్వీకులైన దేశసేవికలలో రామలక్ష్మిని దర్శించుకుంటూ తెలుసుకుంటుంటే నేటి యువతకు కుపతూహలం పెరిగి, వారు దేశసేవకు పునరంకితులు కావటానికి వీలుగా స్ఫూర్తినిచ్చే పాత్రగా రామలక్ష్మి సాహిత్యంలో చిరస్మరణీయంగా ఉంటుంది. స్వాతంత్ర్య సాధనకై సమరశీలియైన రామలక్ష్మిపాత్ర భరతమాత కన్నబిడ్డగా భావింపబడి సజీవత్వాన్ని పొందిన ధన్యజీవిగా పాఠకుల మనస్సులలో శాశ్వతత్వాన్ని సంతరించుకుంది. స్వాతంత్ర్యపరిరక్షణకై బాధ్యతవహించాల్సిన నేటి యువతకు స్ఫూర్తిమంతంగా పాఠక హృదయాలలో చిరంజీవత్వాన్ని పొందిన పాత్ర. దేశభక్తికి నమూనయైన మూర్తిమత్వం ఆమెది. స్వాతంత్ర్యోద్యమ సమయంలో పుట్టని నేటి యువతకు ఉద్యమశీలుర స్వభావం, వారి త్యాగం దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చిపెట్టిందనే పాఠకస్పృహను కల్గించి, స్వాతంత్ర్యపు విలువను గుర్తింపచేయగలిగిన పాత్ర ఈ రామలక్ష్మి.

7.1.2. వాసుదేవరావు

నవలలోని వాసుదేవరావు జాతీయవాది. కాంగ్రెస్ కార్యకర్త. రామలక్ష్మి భర్త. వృత్తి న్యాయవాది. కాని గాంధి పిలుపుతో సత్యాగ్రహ ఉద్యమనిర్మాణ కార్యక్రమాలలో ఒకటైన న్యాయస్థానాల బహిష్కరణను[7] పాటించి వృత్తిని వదిలిపెట్టి బ్రిటిష్ ప్రభుత్వంపట్ల తన సహాయ నిరాకరణను వ్యక్తంచేసినవాడు. గాంధిగారికి ఏకలవ్యశిష్యుడు. నూలువడకటం, తనువడికిన నూలుతో నేసిన బట్టలను ధరించడం, విదేశీవస్తుబహిష్కరణ వంటి స్వాతంత్ర్యోద్యమ కార్యక్రమాలలో భార్యయైన రామలక్ష్మితోసహా పాల్గొనేవాడు. కాంగ్రెస్ సభలకు రామలక్ష్మిని కూడా తీసుకెళ్ళటంతో ఆమె అక్కడకు వచ్చిన సరొజినీదేవి, ఉన్నవ లక్ష్మిబాయమ్మవంటి వారిని చూసి స్ఫూర్తిని పొందగలిగేటట్లు చేసాడు. అన్నిమతాలు, కులాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలను తన యింటికి తీసుకొని వచ్చేవాడు.

ఆతనితోపాటు తన యింటికి వచ్చిన వారికులం కాంగ్రెస్. వారి ధ్యేయం స్వరాజ్యస్థాపన. వారి యింట్లో హరిజనబాలుని తోటమాలిగా[8] పెట్టుకున్నారు. ఆతనికి అక్షరాలునేర్పి చదువు నేర్పించే వాళ్ళు. ఆ దంపతులను కొందరు విమర్శించినా, మిగిలినవారు వారిని ఆదర్శదంపతులని కొనియాడేవారు. పుట్టింటినుండి వస్తున్న రామలక్ష్మికోసం చీరాలరైలుస్టేషన్ కి వెళ్ళి, ఎదురేగి తీసుకొని వస్తూ దారిలోనే అధికపన్నులు విధించటానికై చీరాలను మున్సిపాలిటిగా చేస్తున్న బ్రిటిష్ వారి నిర్ణయాన్ని ప్రస్తావించాడు. దాన్ని వ్యతిరేకించేవిధంగా గాంధిగారి సలహాను అనుసరించి కార్యప్రణాళిక ఉంటుందని, చీరాలప్రజలు దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి ఆధ్వర్యంలో మొదలుపెట్టబోతున్న ఉద్యమాన్నిగురించి చెప్తూ, ఆడవారికి జానకమ్మగారు నాయకత్వం వహించాలనుకుంటున్నారని, ఆమెకు సహాయకురాలిగా రామలక్ష్మిని వేసినట్లు చెప్పాడు. నిరంతరం వాసుదేవరావుయొక్క దృష్టి దేశపరిస్థితులను గురించి ఆలోచించటం, ఊరినుండి వచ్చినవెంటనే ఆ విషయాలను భార్యతో చర్చించాలనుకోవటంలోనే ఆతని నిబద్ధత, నిజాయతీగల ఉద్యమశక్తి, దేశాభిమానం అర్థమౌతుంది. ఆతని యింటికి ఖద్దరుకట్టిన మనుష్యలువచ్చి నెమ్మదిగాను, గట్టిగాను, తీవ్రంగాను మాట్లాడటాన్ని గోపాలరావు గమనించాడంటే వాసుదేవరావుగారి యింట్లో కాంగ్రెస్ కార్యకర్తలువచ్చి ఉద్యమానికి చెందిన చర్చలు జరపటానికి అవకాశమున్న యిల్లని అర్థమౌతుంది. ఎందుకంటే వీరి యింట్లో కాంగ్రెస్ వారి సమావేశాలు జరుగుతున్నాయని తెలిస్తే పోలీసులు వచ్చి అరెస్టుచేసే రోజులవి. ఇక్కడ వాసుదేవరావుయొక్క నిర్భయత్వం బ్రిటిష్ ప్రభుత్వపు ఆర్థిక దోపిడియెడలగల నిరసన స్పష్టమౌతోంది.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా చీరాలప్రజలు ఊరికి దూరంగా శిబిరాలు వేసుకొని నిరసన ఉద్యమాన్ని మొదలుపెట్టినప్పుడు దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారిని అరెస్టుచేసినందుకు భయపడవద్దనీ, చీరాల మున్సిపాలిటి రద్దు అయ్యేవరకు అక్కడనుండి ఎవరూ కదలవద్దని చెప్పాడు. ఆవిధంగా గాంధికి మాటయిచ్చామని, పన్నులనిరాకరణ ఉద్యమాన్ని ఆపవద్దనీ, తామొక్కరమే పన్నులనిరాకరణ ఉద్యమానికి పూనుకోలేదని, పక్కనే ఉన్న పల్నాడులోని పల్లెల్లోకూడా పశువుల మేతకోసం పన్నులు వేసారని అక్కడ నిరసనలు ప్రారంభమైనాయని, చివరివరకూ నిరసనను సాగించాలని చెప్పాడు. దీన్నిబట్టి అవసరమైన సమయంలో బయటకువచ్చిన వాసుదేవరావుయొక్క ఉద్యమ నాయకత్వ లక్షణాలు, నిరంతర దేశభక్తి, గాంధేయవాదం స్పష్టమౌతుంది. అయితే పోలీసులు వచ్చి ఆ భూమి ప్రభుత్వంవారిదని, ఖాళీచేయమంటూ అక్కడే తిష్ఠవేసి వారి ఆహారపదార్థాలకు ఖర్చు భరించాలని, 'ప్యూనిటివ్ టాక్సు'ను వేయటమేకాక, వారు తెచ్చుకున్న ఆహారపదార్థాలన్నింటిని తిని, చెల్లాచెదరుచేసి

బీభత్సాన్ని సృష్టించినప్పుడు వారిని అడ్డుకున్నందుకు వాసుదేవరావును అరెస్టుచేసి జైల్లో పెట్టారు. ఆ తర్వాత ప్రభుత్వం చీరాల మున్సిపాలిటి రద్దుగురించి ఆలోచిస్తామని హామి యివ్వటం జరిగింది. నాయకత్వలేమితోను ప్రజానిరసన నీరుకారటం, అందరూ పదినెలల తరువాత శిబిరాలనుండి తిరిగి చీరాలను చేరుకోవటం జరిగింది. ఆ తరువాతనే వాసుదేవరావు జైల్లోనుండి విడుదల అయ్యాడు. కాని జైల్లో వసతులు లేకపోవటం, కఠినమైనపనులు చేయించటం, సరైన తిండి లేకపోవటంతో జబ్బుతో తిరిగి వచ్చాడు. ఆతనికి చీరాల ప్రజలు ఖద్దరుమాలలతో స్వాగతంపలికారు. కొన్నాళ్లు పార్టీపనులలో తిరిగినా సాయంకాలం అయ్యేటప్పటికి చలిజ్వరం రావటంతో ఆతనికి క్షయవచ్చిందని వైద్యులు నిర్ధారించారు. దానితో వాసుదేవరావు యింటికే పరిమితమయ్యాడు. మొత్తంమీద చీరాల మున్సిపాలిటి పన్నులనిరాకరణ ఉద్యమం వాసుదేవరావు ఆరోగ్యాన్ని బలికొందని అర్థమౌతుంది. కాని ఆయనగాని, రామలక్ష్మిగాని జరిగిన దానికి ఎవరినీ నిందించలేదు. ఎందుకంటే జాతీయ వాదులుగా వారు దేశంకోసం తమ ప్రాణాలనుకూడా త్యాగంచేయగల స్థితిలో ఉన్నారని అర్థమౌతుంది. ఎన్నాళ్ళైనా ఎన్ని మందులువాడినా జబ్బు తగ్గకపోవటంతో భార్యరామలక్ష్మి అతనిని రాజమండ్రి తీసుకొనివెళ్ళి ప్రకృతివైద్యం చేయించాలనుకొని అక్కడ ఉన్న సీతానగరంలోని ఆశ్రమానికి తీసుకువెళ్ళింది.

ఆశ్రమంలో వాసుదేవరావుకు కొంత ఉపశమనం కలిగిందని తన పెళ్ళి శుభలేఖను యివ్వటానికి వెళ్ళి ఆయనను చూసిన గోపాలరావుయొక్క స్వగతంలో అనుకొన్న మాటలవల్ల అర్థమౌతుంది. కాని బలహీనత వదలలేదు. అయినా గోపాలరావు యిచ్చిన శుభలేఖనుచూసి, పెళ్ళికూతురు చదువుకుందా అనీ, పిల్లను చూసావా అని, మెట్రిక్యులేషన్ పూర్తిచేయకుండా పెళ్ళిచేసుకుంటున్నావని అడిగి, పెళ్ళి అయినా ఆ అమ్మాయిని వెంటనే కాపురానికి తీసుకురావద్దని సలహా యిచ్చాడు. ఆ అమ్మాయిని చదివించమని, యిల్లాలు చదువుకుంటే కుటుంబం, పిల్లలు అంతా బాగుంటారని చెప్పి గోపాలరావులో ధైర్యాన్ని చైతన్యాన్ని కలిగించాడు. అంతేకాదు పెళ్ళిలో భోగం మేళం పెట్టించవద్దని, దాని ఖర్చుకుపెట్టే డబ్బును హరిజననిధికి డొనేషన్ గా యివ్వమని అలకపాన్పుమీద పెళ్ళికొడుకు కోరికగా పెళ్ళివారితో చెప్పమన్నాడు. అంతేకాక గోపాలరావు తనకి పెళ్లియిష్టం లేకపోయినా ఎదురుచెప్పలేకపోయాడని గ్రహించి, గోపాలరావుతో 'నీమనసుకు నచ్చింది–నీవు నమ్మింది–మనస్ఫూర్తిగా చెయ్యమని'అంటూ ఆతనితో గాంధిచెప్పిన ప్రథమసూత్రంగా 'ఎవరికీ భయపడవద్దని, అంతరాత్మకు వ్యతిరేకమైనపని ఏమీచెయ్యవద్దని' చెప్పి ఆతని వ్యక్తిత్వాన్ని తట్టిలేపాడు. ఆతర్వాత దుగ్గిరాల గోపాలకృష్ణయ్యకు ఆరోగ్యం సరిగా లేదని తెలిసిందని, గోపాలరావు

చిన్నతనంలోనే ఆతనికి గుమాస్తాచదువులు (ఇంగ్లీషువిద్య) చెప్పించవద్దని చెప్పిన విషయాలను గుర్తుచేసాడు. దుగ్గిరాలవారు చీరాలకోసం తన ఆరోగ్యాన్ని అర్పించాడని, మనిషి తనకోసం బతకటం గొప్పకాదని, యితరులకోసం బతకటమే ఉత్తమమని, గురజాడ చెప్పిన 'స్వంతలాభం కొంతమానుకొని, పొరుగువాడికి సాయపడమన్నాడనే సూక్తులను[9] చెప్పి గోపాలరావును గుమాస్తాగా కాకుండా దేశసేవలో పునీతం కమ్మని చెప్పాడు. దేశంకోసం తమతరం వారు పోలీసుల లాఠీడెబ్బలు తిన్నామని, జైల్లోరాళ్ళుకొట్టామని, బరువులుమోసామని, ఎద్దులబదులుగా తమచేత గానుగలను తిప్పించి నూనె తీయించారని చెప్పాడు. మట్టిమూకుళ్ళలో పురుగులతిండి పడేసేవారని, కప్పుకోను గొంగళీలు యిచ్చేవారుకాదని, దోమలు, నల్లులు, బొద్దింకలతో[10] జైల్లో సహజీవనం సాగించగల శక్తిని గాంధి మహాత్ముడు ప్రసాదించాడని, బాధలుపడ్డా దేశస్వాతంత్ర్యాన్ని కళ్ళారా చూడాలను కుంటున్నట్టు చెప్పాడు. ఇవన్నీ వాసుదేవరావు పెద్దవాడవుతున్న గోపాలరావుతో చెప్పటంలోని ఆంతర్యం గోపాలరావు భవిష్యత్తులో కష్టాలకు భయపడకుండా దేశంకోసం పోరాడాలనే తత్త్వాన్ని అతనిలో కలిగేటట్లుచేయడమని అర్థమౌతుంది.

అందుకే ఆ తర్వాత గోపాలరావు వాసుదేవరావుయొక్క స్ఫూర్తితోనే దేశంకోసం జైలుకు వెళ్లటానికైనా తెగించగలిగాడని ఈనవలా పాఠకులకు అర్థమౌతుంది. బ్రిటిష్ వారి చెరలో చిక్కుకున్న భారతదేశానికి స్వాతంత్ర్యం ఒకరోజులో ఒకతరంవారు సాధించగలిగేది కాదని తమ తరువాతి తరంవారిని తయారుచేసి, చైతన్యపరచటమంటే, తాను మరణించినా తన ఆశయం సిద్ధించాలని కోరుకున్నాడు. అమరుడైన దేశభక్తుడిగా వాసుదేవరావు పాఠకుల మనస్సులలో స్థిరంగా చోటుచేసుకొని స్వాతంత్ర్యపరిరక్షణకై నేటి యవతను కర్తవ్యోన్ముఖుడిని చేసినట్లుగా భావించవచ్చు. వాసుదేవరావు యొక్క చివరి కోరిక దేశస్వాతంత్ర్యాన్ని చూడాలనుకోవటంగా అర్థమై, అతడు అనారోగ్యంతో ఉన్నాకూడా చివరివరకూ దేశవిముక్తిని గురించే ఆలోచించేవాడని అర్థమౌతుంది. ఆ తరువాత కొన్నాళ్ళకు వాసుదేవరావు ఆ అనారోగ్యంతోనే మరణించటం జరిగింది.

పిల్లలులేనందుకు వాసుదేవరావు యొక్క దహనక్రియలు తాము చేస్తామని కాంగ్రెస్ కార్యకర్తలు ముందుకు వచ్చి ఆయన అంతిమయాత్రను సగౌరవంగా జరిపించారంటే వాసుదేవరావు ఒక దేశభక్తుడిగా స్వాతంత్ర్యసమరశీలునిగా తన ప్రాణాలనుపణంగా పెట్టటమే నని అర్థమౌతుంది. వాసుదేవరావు తన మరణానికి ముందుగానే రామలక్ష్మితో తనకు దశదిన కర్మలమీద నమ్మకంలేదని, ఆ ఖర్చును హరిజననిధికి యిమ్మని చెప్పటంలోనే ఆతని చివరి ఊపిరికూడా దేశీయప్రజల సంక్షేమాన్నే కోరుకుందని అర్థమౌతుంది. వాసుదేవరావుది దేశభక్తి ప్రపూరితమైన చిరస్మరణీయమైన స్ఫూర్తిమంతమైన పాత్రగా పాఠకుల మనస్సులో ముద్రవేయగలుగుతుందని అనటంలో సందేహంలేదు.

7.1.3 జానకమ్మ

'హృదయనేత్రి' నవలలో ప్రతిఫలించిన 20 శతాబ్దపు చరిత్రలో చివరివరకు జీవితాన్ని గడిపి యువతను ప్రజాసేవపట్ల కర్తవ్యోన్ముఖులను చేసిన స్ఫూర్తిదాయకమైన సజీవమైనపాత్ర జానకమ్మ. గాంధి పిలుపును అనుసరించి ఖద్దరు ఉద్యమం, బ్రాహ్మణకుటుంబ స్త్రీగా కడజాతివారిని కలుపుకోవటంవంటి క్రియాశీలక సత్యాగ్రహ ఉద్యమ భాగస్వామి జానకమ్మ. బ్రిటిష్ ప్రభుత్వం హెచ్చుపన్నుల రాబడికై చీరాలను మున్సిపాలిటీగా చేస్తూన్నప్పుడు దానిని నిరసిస్తూ దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారితో కలిసి స్త్రీలకు నాయకత్వం వహించిన పాత్రగా జానకమ్మ పరిచయం అవుతుంది. జానకమ్మ ఆ ఊళ్ళో అందరికి తలలో నాలికవంటి బాలవితంతువు. భర్తపోయినందుకు యుక్తవయసురాగానే ఆమెకు జుట్టుతీయించి వంటయింటికి పరిమితంచేసి, గాంధిగారి బోధనలు, ఊళ్ళోని గోపాలకృష్ణయ్యగారి ప్రభావానికి లోనయి ఖద్దరు కట్టటం మొదలుపెట్టింది. ఇంటింటికి ఖద్దరుమూటలను నెత్తిన పెట్టుకొని అమ్మేది. హిందీభాషను నేర్చుకుంది. చేతిలో తఖిలీ పట్టుకొని బారులుబులుగా నూలు తీస్తుంది. మంచికీ చెడుకూ ప్రజలను ఆదుకొనే కరుణామూర్తి. కడజాతి, అగ్రజాతి అనే భేదంలేకుండా వారియింటికి వెళ్ళి పురుళ్లుపోసేది. ఆమెను వెలివేసినాకూడా గురజాడ చెప్పినట్లుగా ఆమె మంచిమాల అయితే తాను మాలనేనవుతానని అనేది[11]. ఆమె బంధువులు ఆమెకు దొడ్డి వసారాలో అన్నంపెట్టబోయిన నాటినుండి ఆమె నానపెట్టిన శెనగలు, పెసలువంటి అపక్వఆహారం తీసుకుంటూ దేవుడిగుళ్ళో నిద్రపోతూ ఉండేది.

చీరాల ప్రజలు ఊరికి దూరంగా శిబిరాలువేసుకొని ఉద్యమాన్ని నిర్వహిస్తున్నప్పుడు గాంధి శిబిర సందర్శనానికి వచ్చాడు. వెనకాల తన బతుకు తెరువుకు డబ్బులేకపోయినా అక్కడ మొదటి స్త్రీగా తన నగలను స్వరాజ్యనిధికోసం గాంధిగారి పాదాలముందు పెట్టిన త్యాగశీలి జానకమ్మ. ఆమె స్ఫూర్తితో వెంటనే రామలక్ష్మికూడా తనవంటిమీది నగలను తీసి గాంధిగారికి ఇచ్చింది. తన త్యాగంతో తోటివాళ్ళనుకూడా ప్రభావితం చేయగల ఆమె యొక్క దేశస్వరాజ్యకాంక్ష అర్థమౌతుంది. బంధువులుమాత్రం తమకు యివ్వకుండా ఇన్నాళ్ళూ నగలను దాచిపెట్టి గాంధికి యిచ్చినందుకు తిట్టిపోసారు. శిబిరాలకు వచ్చి చెల్లాచెదరు చేసిన పోలీసులను ఎదుర్కొన్నందుకు జానకమ్మను అరెస్టుచేసి జైలుకు తరలించారు. బాలవితంతుస్త్రీగా సామాజిక సంస్కృతి ఆమెశక్తిని అణచిపెట్టినా, దానిని అధిగమించి ఆమె ప్రజలకోసం పోలీసులను ఎదిరించిన ధైర్యశాలిగా జానకమ్మ అర్థమౌతుంది.

పదినెలలపాటు కొనసాగిన చీరాల ఉద్యమం చల్లారిన తరువాత జానకమ్మ విడుదల అయింది. కాని జైల్లో ఆమెకు రాళ్ళయిసుకగల పప్పులుసు ఆహారాన్ని ఇవ్వటంతో ఆమె తినలేక నీరసించి

ఎముకలగూడుగా మారటంతో ఆమెను స్ట్రెచర్ మీద పడుకోపెట్టి రైల్లోనుండి దింపాల్సివచ్చింది. చీరాలప్రజలు పోలీసుల పహారాలో నిశ్శబ్దంగా ఖద్దరుమాలలతో ఆమెకు స్వాగతం పలికారు. జానకమ్మ ప్రజలకోసం తన ఆరోగ్యాన్ని పణంగా పెట్టి జైలుజీవితాన్ని గడిపినట్టు అర్థమౌతుంది.

జానకమ్మ జైలునుండి వచ్చాక కొన్నాళ్ళపాటు నీరసంగా ఉన్నాకూడా తిరిగి తెల్లవారుజామున మొదలుపెట్టిన చన్నీటి స్నానంవంటి తన దినచర్యల అలవాట్లతోను, అపక్వాహారపు అలవాటుతోను, ఖద్దరుమూటల అమ్మకంతోను మామూలుమనిషి కాగలిగారు. ఊళ్ళోనివ్యక్తులచేత రాట్నం వడికించి రెండువేలగజాల నూలుదారాన్ని తీయించి వారికి కాంగ్రెస్ సభ్యత్వాన్ని యిప్పించేది. ఆరోజుల్లో కాంగ్రెస్ సభ్యత్వపు పత్రం పట్టభద్రపత్రంకంటె విలువైనదిగా భావించేవారు. కాకినాడలో జరిగిన కాంగ్రెస్ సభలకువెళ్ళింది. ఆ సభలో ప్రముఖంగా కష్టపడ్డ దుగ్గిరాలవారిని గురించి, కొడుకుపోయిన దుఃఖాన్ని దిగమింగుకొని కార్యదర్శిగా సభను విజయవంతంగా నడిపినందుకు బులుసు సాంబమూర్తి గారు అని శ్లాఘించిన సరోజినీదేవి నాయుడు[12] గురించి, ఆసభలో వాలంటీరుగా పనిచేసిన గుమ్మడిదల దుర్గాబాయి[13] గురించిన సభావిశేషాలను చీరాలశ్రోతలకు చెప్పి వారిని ఉత్సాహవంతుల్ని చేసింది. అంటే జానకమ్మ తనను జైల్లోపెట్టినా వెరవక రవాణాసౌకర్యంలేని ఆ రోజుల్లో ఒక వితంతువుగా ఒంటరిగా కాకినాడవెళ్ళి సభలలో పాల్గొనగలగటం అంటే ఆషామాషి విషయంగాదు. ఎంతోశక్తి, ఓపిక, నిర్భయత్వం, దేశంపట్ల నిబద్ధత, స్వాతంత్ర్యకాంక్ష ఉంటేగాని స్త్రీలు నాడు దూరప్రాంత సభలకు వెళ్ళలేరని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పైగా కాంగ్రెస్ సభలలో పాల్గొంటేకూడా ప్రజలను అరెస్టుచేసే రోజులవి. అయినా జైలుశిక్షలంటే భయపడని జానకమ్మ దూరప్రాంతమైన కాకినాడవెళ్ళి సభలో పాల్గొనగలిగిందంటే జానకమ్మ స్త్రీలలోను, సమాజంలోను ప్రత్యేక వ్యక్తిత్వంతోకూడిన సజీవమైన పాత్రగా కనపడుతుంది.

స్వాతంత్ర్యసమరశీలియైన జానకమ్మ తనజీవితాన్ని నిస్సారంగా గడిపేందుకు యిష్టపడేదికాదు. ఆమె స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలైన ఉప్పుసత్యాగ్రహం, వ్యక్తిసత్యాగ్రహంవంటి ఉద్యమాలతో అలసిపోయి, స్వాతంత్ర్యనంతరం వృద్ధాప్యదశను చేరుకుంది. తనని ఆదరించి పోషించకపోయినా ఫరవాలేదనుకొని బంధువులెవరికీ ప్రభుత్వం వారిచ్చిన ఐదు ఎకరాలభూమిని యివ్వకుండా, చీరాలలోని బీదలు ఆ పొలంలో తోటలువేసుకొని జీవించే ఉపాధిని వారికి కలిగించిన నిస్వార్థజీవి. వైద్యులసలహాతో చిన్నపాకలో కుంపటిమీద ఆహారాన్ని వండుకొని తిని వంటరిగా జీవితాన్ని వెళ్ళబుచ్చుతోంది. ఆ ఊరిలో చీరాలఉద్యమ సమయంలో యిల్లు కాలిపోతున్నప్పుడు తల సాలెమగ్గాలను తెచ్చుకోవాలని తపనపడి, ఆ మంటల్లో చనిపోయిన శివయ్యకొడుకు సూర్యారావు. సాలెకులస్థుడైన సూర్యారావు

మాలపిల్ల పరస్పర యిష్టంతో పెళ్ళిచేసుకున్నందుకు యిరుకులాలవారు వీరిని వెలివేస్తే, జానకమ్మ తనదగ్గరపెట్టుకొని వారికి ఉపాధిని చూపించి, వారి కాపురాన్ని నిలపెట్టింది.

వృద్ధాప్యాన్ని పొందిన దశలో జానకమ్మ, చీరాల ఉద్యమ శిబిరాలనాటినుంటి రామలక్ష్మి మేనల్లుడిగా తనకు తెలిసిన కాంగ్రెస్ వ్యక్తి, స్వాతంత్ర్యపోరాటశీలియైన గోపాలరావుకు తనకు ఆరోగ్యంబాగలేదని ఒకసారి చూసివెళ్ళమని ఉత్తరం రాసి యిచ్చి ఆతనిని రమ్మని సూర్యారావును పంపించి పిలుపించుకుంది. గోపాలరావు స్వరాజ్యాన్ని తీసుకొని జానకమ్మదగ్గరకు వెళ్ళటంతో స్వరాజ్యలక్ష్మిని చూసిన జానకమ్మ ఆ పిల్లకళ్ళు రామలక్ష్మి కళ్ళులాగా ఉన్నాయని చెప్పింది. అంతేకాక, తన జీవితం ముగింపుకు వచ్చిందని, తానింకా చేయాల్సిన పని ఒకటున్నదని చెప్పి, రామలక్ష్మి పొలం అమ్మినడబ్బుతో తన యింటిని తనఖానుండి విడిపించి ఆ యింటి కాగితాలను గోపాలరావుకు యిమ్మని తనకు యిచ్చిందని చెప్పి ఆ కాగితాలను భద్రంగా అప్పగించింది. ఆ సందర్భంలో గోపాలరావుతో స్వాతంత్ర్యానంతర పరిస్థితులనుగురించి మాట్లాడుతూ స్వాతంత్ర్యంకోసం సత్యాగ్రహోద్యమంలో భాగంగా, 'కల్లుమానండి' అంటూ కల్లుదుకాణాలదగ్గర తాము పికెటింగ్[14] చేసిన విషయాలను చెప్పింది. స్వాతంత్ర్యానంతరం కల్లును వేలంపాడి ఆ డబ్బుతో ఓట్లను కొంటున్నారని తమ ఆదర్శాలు, త్యాగాలు ఎవరికి అక్కరలేకుండా పోతున్నాయని చెప్పింది. అంతేకాదు, హరిజనోద్ధరణ, అస్పృశ్యతా నివారణవంటి ఉద్యమ లక్ష్యాలను మరచిపోయారని, గాంధి బతికుండి ఇటువంటిపరిస్థితులను చూస్తే దేశానికి స్వాతంత్ర్యం వద్దని హిమాలయాలకు వెళ్ళిపోయేవారని అంది. యువకులు స్వాతంత్ర్యానంతరం దేశపరిస్థితులను పట్టించుకోక పోవటంవల్లనే వచ్చిన స్వాతంత్ర్యానికి రక్షణలేకుండా పోతోందనిచెప్పి, దిగజారుతున్న పరిస్థితులకు ఆవేదన చెందింది. అంతేకాక, నాడు పరాయిప్రభుత్వాన్ని తరిమి కొట్టాలనుకున్నట్టే, స్వాతంత్ర్యానంతరం కూడా పెరిగిపోతున్న రాజకీయ దురహంకారం, కులతత్వాలను తరిమికొట్టే లక్ష్యంతో మరొకసారి దుష్టశక్తులను తరిమికొట్టే పోరాటం చెయ్యాల్సిన అవసరాన్ని నొక్కి వక్కాణించింది. బ్రిటిష్ పాలనలో ఏ విషయాలను వ్యతిరేకిస్తూ స్వాతంత్ర్యంకోసం పోరాడి సంపాదించుకున్నారో ఆయావిషయాలు స్వాతంత్ర్యానంతరం తలకిందులవుతూ తిరిగి స్వాతంత్ర్యాన్ని పోగొట్టుకునే పరిస్థితులు వస్తాయనే ఆమెయొక్క క్రాంతదర్శనం అర్థమౌతుంది. అంతేకాదు దేశంలోని రాజకీయాల అవినీతి, అన్యాయాలు చూస్తుంటే భారతీయులకు స్వరాజ్యంపొందే హక్కులేదనిపిస్తోందని అనుకొన్న జానకమ్మ స్వాతంత్ర్యానంతర దేశపరిస్థితులను తన చరమదశకు ముందుగానే భావించగలిగింది.

అంతేకాక, జానకమ్మ గోపాలరావుతో నందయ్య తన రాజకీయ అధికారంతో అవినీతికి పాల్పడుతున్న విషయాలను మునుపే తాను విని ఉన్నానని చెప్పింది. అయినా నందయ్య వచ్చి

స్వాతంత్ర్యసమరశీలురుకి యిచ్చే పొలానికి తన చేత అప్లికేషన్ పెట్టించాలనుకొన్నాడని, ఆ పొలాన్ని తరువాత ముసలిదానినుండి తాను పొందవచ్చని అనుకున్నాడని అంది. ఆదర్శాలకుపోయి గోపాలరావులాగా తాను వద్దనుకోలేదని, ప్రభుత్వం యిచ్చిన భూమిని తీసుకొని బీదలకిచ్చి సాగుచేసుకొని బతకమని యిచ్చానని చెప్పిందంటే దేశాభివృద్ధి విషయంలో ఆచరణసాధ్యమైన ఆదర్శం ఆమెకు ఉన్నదని అర్థమౌతుంది. దానికై బంధువులు వృద్ధాప్యపుదశలో ఉన్న తనని దూరంచేసినా పట్టించుకోలేదని చెప్పింది. గోపాలరావు తనకి కర్తవ్యాన్ని సూచించమనగా జానకమ్మ రాముడత్తయ్య వాసుదేవరావుల యింటిని రామలక్ష్మి గోపాలరావు తన యిష్టంవచ్చినట్లుగా చేసుకొనే హక్కునుయిస్తూ విల్లు రాసిన విషయాన్ని గుర్తుచేసింది. ఆ యింట్లో సూర్యారావు దంపతులు వసతిని ఏర్పాటుచేసుకొని వయోజన విద్యాలయాన్ని, రాత్రిపాఠశాలను నడిపేటట్టుగా గోపాలరావు యొక్క అనుమతిని రాసిమ్మని అడిగింది. విద్యాభివృద్ధికై పాటుపడటం ఆమెయొక్క వ్యవహారదక్షతకు నిదర్శనంగా ఉంది. అంతేకాదు, జానకమ్మ ప్రభుత్వంతో మాట్లాడి సూర్యారావుకు స్వంత స్థలం యిప్పించి, అక్కడ ఆతడు ప్రాథమికోన్నత పాఠశాలను అభివృద్ధి చేయగలిగేటట్లుగా చేయటం, స్వాతంత్ర్యానంతరం దేశంలో మానవాభివృద్ధికి అవసరమైన విద్యాభివృద్ధికి కృషిచేసిన దేశభక్తురాలుగా స్పష్టమౌతుంది.

కొన్నాళ్ళకు జానకమ్మ తన ఆఖరికోరికగా గోపాలరావును పిలిపించుకొని, ఆతనితో గోపాలరావుతో ప్రస్తుతం యువత ఎలా ఉందని అడిగింది. గాంధియుగం మారి సారాయుగం వచ్చిందని, స్మగ్లింగ్, అవినీతి, టెర్రరిజమ్ వంటివి నేరాలుకావనే స్థితిలో యువకులు ఉన్నారని గోపాలరావు ఆమెతో చెప్పాడు. గోపాలరావుతోకూడా వచ్చిన యువతి స్వరాజ్యలక్ష్మిని చూసి ఏమిచేస్తున్నావని అడిగితే, ఏంచెయ్యాలో చీకట్లో వెదుకుతున్నానని చెప్పిన స్వరాజ్యలక్ష్మిమాటలకు గోపాలరావుకు రామలక్ష్మి యింటికాగితాలను యిచ్చింది. తనదగ్గర ఉన్న పదివేలరూపాయలను స్వరాజ్యలక్ష్మికి యిచ్చినప్పుడు, ఆమె మందులకు ఉంచుకోమనగా, తనలాంటి వృద్ధులైన ఎంతోమందికి మందులను యిప్పించగలవా అంటూ స్వరాజ్యలక్ష్మి చేయాల్సిన పనిని అన్యాపదేశంగా సూచించింది. స్వరాజ్యలక్ష్మిచేతిలో డబ్బును పెట్టగా, ఆ డబ్బును మంచి పనులకు ఉపయోగిస్తానని భరోసా యిచ్చింది. అందుకే ఆ తరవాత స్వరాజ్యలక్ష్మి అవినీతిపరులదగ్గర ఉద్యోగంచేయటంకంటేకూడా ఆనాడు తనతో జానకమ్మ తనలాంటి ముసలాళ్ళ విషయం పట్టించుకోగలవా అన్న మాటలు గుర్తుకువచ్చి స్వరాజ్యలక్ష్మి వృద్ధాప్యదశలో ఉన్న జానకమ్మలాంటి వృద్ధులసేవకోసం వృద్ధాశ్రమం పెట్టాలనుకోవటం జరిగింది. ఆవిధంగా స్వాతంత్ర్యానంతరం యువతలో సేవాధర్మ స్ఫూర్తిని

నింపేవిధంగా జానకమ్మ ముందుగానే దేశభవిష్యత్తును దర్శించి యువనేత్రాలను తెరిపించి ప్రజాసేవకై కర్తవ్యోన్ముఖులను చేసిన చిరస్మరణీయురాలిగా, దేశస్వాతంత్ర్య పరిరక్షణలో పాఠక హృదయనేత్రాలను విశాలంచేసిందని అనంటంలో ఎటువంటి సందేహంలేదు.

7.1.4 గోపాలరావు

గాంధి స్వరాజ్యాన్ని తెచ్చిపెడతాడనే రాముడత్తయ్య చెప్పిన కథలు వింటున్నవాడుగా పదేళ్ళ గోపాలం నవలలో పాఠకులకు పరిచయం అవుతాడు. 'వందేమాతరం' అంటూ ఉండే రాముడత్తయ్య అంటే గోపాలరావుకు ప్రాణం. తన చిన్నతనంలోనే దేశం అన్నా దేశవిషయాలన్నా, దేశనాయకులన్నా అభిమానం ఉన్నవాడిగా గోపాలం అర్థమౌతాడు. అందుకే గోపాలం దేశస్వాతంత్ర్యోద్యమ కథలుచెప్పే రాముడత్తయ్యతో వాళ్ళ ఊరైన చీరాలకు వెడతానని పట్టుపడతాడు. నిరంతరం రాట్నం వడుకుతుండే రాముడత్తయ్యతో 'రాట్నం వడికితే దేశానికి స్వరాజ్యం వస్తుందా' అని అడిగాడు. పెద్దచదువు చదువుకొని గాంధిగారి అంతటివాడివైతే దేశానికి స్వరాజ్యం వస్తుందని, ముందు రాట్నం వడకటం నేర్చుకోమని రాముడత్తయ్య చెప్పిన మాటలు గోపాలరావులో బాగా నాటుకున్నాయి. తల్లిదండ్రులదగ్గర ఉన్నప్పుడు గోపాలరావులో పిరికి తనం ఉండేదని, రైలుస్టేషనులో అతడిని రామలక్ష్మిచీరాలవెళ్ళే రైలు ఎప్పుడువస్తుందో స్టేషన్ మాస్టారిని అడిగి రమన్నప్పుడు, అతడు వెళ్ళి కనుక్కోవటానికి కూడా తటపటాయించిన సందర్భంలో అర్థమైతుంది. అటువంటి గోపాలం చీరాలలో గోపాలరావుగా ఎదిగిన విషయం తెలుసుకోవాలి.

రాముడత్తయ్యతో చీరాలకు ప్రయాణమైన గోపాలం రైలు రాగానే ఆగిఉన్న ఫస్టక్లాస్ పెట్టెలోకి ఎక్కుదామంటే రాముడత్తయ్య వద్దని వారించి, అలా దక్షిణాఫ్రికాలో గాంధి ఎక్కినందుకే అతడ్ని రైలునుండి తోసేసారని చెప్పింది. అంతేకాదు, గాంధిగురించి ప్రస్తావించి భారతదేశంలో కూడా ప్రజలకు అదేగతి అని, తమతిండి, తమ బట్టలమీద మనకు హక్కులేకుండా బ్రిటిష్ ప్రభుత్వం భారతీయలమీద అధికారం చెలాయిస్తోందని గోపాలానికి చెప్పింది. అతనికి రాముడత్తయ్యకు అన్నివిషయాలు తెలుసనే భావన ఏర్పడి, అత్తయ్య అంటే మరీ గౌరవం పెరిగింది. రాముడత్తయ్య ఖద్దరు వస్త్రధారణ, ఆమెకు దేశవిషయాలు బాగాతెలుసనే భావన గోపాలంయొక్క చిన్నిమనసులో దేశభక్తికి బీజంపడేటట్లుచేసింది. చీరాలలో రాముడత్తయ్య యింట్లో ఖద్దరు కట్టిన మనుషులు వస్తూపోతూ ఉంటారు. మామయ్య వాసుదేవరావుతో పాటు తన అత్తయ్యకూడా వారితోధైర్యంగా ఆడా, మగతో సమంగా మాట్లాడుతుంటే అత్తయ్యను చూసిన గోపాలానికి గర్వంగా ఉండేది. ఒకరోజు అత్తయ్యవాళ్ళింటికి కావిరంగు బట్టలు, మెడలో రుద్రాక్షమాలతో వచ్చిన ఒక పెద్దాయన

(దుగ్గిరాల గోపాలకృష్ణయ్య) వచ్చి తన అత్తయ్యతో పిల్లవాడికి ఇంగ్లీషుచదువును చెప్పించి గుమాస్తాని చేయవద్దని, జాతీయపాఠశాలలో చేర్పించమని చెప్పినమాటలు చురుకుగా ఉండే గోపాలరావులో బాగా నాటుకున్నాయి. రాముడత్తయ్య యింట్లో గోపాలరావుకు హాయిగా, స్వేచ్ఛగా ఉంది. చిన్నప్పటినుంచి పెరిగిన జుట్టును కట్ చేయించి తనకు యిష్టమైన క్రాఫ్ చేయించుకున్నాడు. రాముడత్తయ్య యింట్లోనే గోపాలం వ్యక్తిత్వపుఉనికిగల గోపాలరావుగా ఎదగటం మొదలుపెట్టాడు.

గోపాలరావు తన అత్తయ్య, మామయ్యలతో కలిసి బెజవాడలోని కాంగ్రెస్ సమావేశానికి వెళ్ళి, అక్కడ అందరూ అంటున్న 'మహాత్మాగాంధికి జై, భారతమాతాకి'[15] అనే నినాదాలు చెవులలో మారుమ్రోగుతుంటే, గాంధిని దూరంనుండి చూసాడు. పొట్టిగా చిన్నగొంతుతో మాట్లాడిన గాంధినా దేశానికి స్వరాజ్య తెప్పించగలిగేది అనీ, అసలు స్వతంత్రంఅంటే ఏమిటీ అనే జిజ్ఞాసతో కూడిన సందేహాలు గోపాలరావులో ఏర్పడ్డాయి. రాముడత్తయ్య సాన్నిధ్యంలో గోపాలరావుకి చిన్నప్పుడే దేశంగురించిన ఆలోచనలు మెదడులో చోటుచేసుకున్నాయని అర్థమౌతుంది.

బ్రిటిష్ ప్రభుత్వం అధికపన్నుల రాబడికై చీరాలను మున్సిపాలిటిగా చేసినందుకు చీరాలప్రజలు దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి నాయకత్వంలో గాంధిగారి సలహాను అనుసరించి తమ నిరసనను తెలియచేయాలనుకొన్నారు. దానికై అందరూ యిళ్ళూవాకిళ్ళూ వదిలి చీరాలకు దూరంగా శిబిరాలువేసుకొని ఉంటున్న సమయంలో, గోపాలరావుకు అక్కడివారంతా కులమతాలకు అతీతంగా కలిసిపోయి ఉండటం చాలా ఉత్సాహంగా అనిపించింది. నెలరోజులు దాటిన తరువాత, ఆతని అన్న చనిపోయినప్పుడు అత్తయ్యతో వెళ్ళినా, అక్కడ ఉండటం యిష్టమనిపించక, తిరిగి అత్తయ్యతో వెళ్ళిపోతానని తల్లితో గొడవపడి మరీ, రాముడత్తయ్యతో గోపాలరావు చీరాల శిబిరాలకు చేరుకుంటాడు. గోపాలరావుకు తమ ఇంటికంటే అందరితో కలిసిమెలిసి ఉండే శిబిరాలే నచ్చాయని అర్థమౌతుంది. అంటే అతనిలో చిన్నప్పుడే ఐక్యతాభావంకూడా అభివృద్ధిచెందిందని తెలుస్తుంది.

రామ్ నగర్‌లో ఏర్పాటుచేసుకున్న చీరాలఉద్యమ శిబిరాల సందర్శనంకోసం గాంధి వచ్చినప్పుడు రాముడత్తయ్య అతనని గాంధి దగ్గరకు తీసికెళ్ళింది. గాంధి ఆతనితలమీద చేయివేసినప్పుడు, ఆ స్పర్శవల్ల చిన్నవాడైన గోపాలరావులో అతనికి తెలియని ప్రకంపనలు కలిగాయి. చిన్నప్పుడు అత్తయ్య తనమెడలో అప్పుడప్పుడు వేసే చంద్రహారాన్ని ఆమె యిప్పుడు స్వరాజ్యనిధికై గాంధిగారికి యిచ్చినందుకు ఆతని పసిమనసు కలుక్కుమన్నా, మరొకపక్క గోపాలరావులో చిన్నప్పటినుండి దేశంకోసం త్యాగంచెయ్యాలనే ఆలోచనకు బీజం పడటం జరిగింది. రామశిబిరానికి సహాయపడుతూ రక్షించే పనులు చేయటానికి పద్దెనిమిదేళ్ళు నిండినవారితో ఏర్పాటుచేసుకున్న

'రామదండు'లో గోపాలరావు తాను చిన్నవాడవటంతో చేరలేక పోయినందుకు బాధపడ్డాడు. అప్పటినుండే గోపాలరావులో దేశస్వరాజ్యంకోసం సేవ చేయాలనే తపన ఏర్పడి, గోపాలరావు దేశభక్తుడిగా, కాంగ్రెస్ కార్యకర్తగా ఎదగటానికి ఈ చీరాల ఉద్యమ శిబిరం దోహదపడిందని అర్థమౌతుంది. అందుకే రామలక్ష్మి గోపాలరావును ఒక స్వాతంత్ర్యవీరుడిగా తీర్చిదిద్దాలనుకోవటం జరిగింది. ప్రభుత్వాన్ని నిరసిస్తూ వేసిన శిబిరాలకు పోలీసులు వచ్చి బీభత్సాన్ని సృష్టించగా, వారిని ఎదుర్కొన్న వాసుదేవరావును, జానకమ్మను, మరొకపదిమందిని పోలీసులు అరెస్టుచేసి జైలుకు తీసుకెళ్ళేటప్పుడు చిన్నవాడైన గోపాలరావుకు ఏడుపు వచ్చింది. బ్రిటిష్ అధికారులు చీరాల మున్సిపాలిటి రద్దువిషయం ఆలోచిస్తామని హామి ఇవ్వటంతోపాటు, నాయకత్వలేమితోను చీరాలప్రజలు పదినెలలపాటు కొనసాగించిన నిరసనను ఆపి, తిరిగి చీరాలచేరుకోవటం జరిగింది.

పదినెలలపాటు జరిగిన చీరాలపన్నుల నిరాకరణ ఉద్యమం గోపాలరావుపై చెరగని ముద్రను వేసింది. చీరాలకు తిరిగి వచ్చిన వెంటనే ప్రజలలో కులాలు మాములయిపోగా గోపాలరావు ఆశ్చర్యపోయాడు. సీతమ్మ కాలిపోయిన తన యిల్లుని గాంధి కట్టిస్తాడా అని అన్నమాటలను రాముదత్తయ్యతో చెప్పగా, అలా అనేవారందరూ స్వాతంత్ర్య ద్రోహులని, స్వరాజ్యంకోసం అవసరమైతే యిళ్ళువాకిళ్లనుకూడా త్యాగంచేయాలని ఆమె చెప్పింది. అంత త్యాగాలుచేసి పొందే స్వరాజ్యం అంటే ఏమిటో తెలుసుకోవాలనే జిజ్ఞాసతో తనఅత్తయ్యను అడగగా ఆమె నీలాంటి పిల్లలు స్వేచ్ఛగా, ధైర్యంగా యిష్టమొచ్చిన విధంగా ఉండటమే స్వరాజ్యం అని అతనికి చెప్పింది. ఆ మాటలు గోపాలరావు మనసులో చక్కగా నాటుకున్నాయి.

చీరాల ఉద్యమం చల్లారటంతో వాసుదేవరావును, జానకమ్మని జైలునుంచి విడుదలచేయగా గోపాలరావు ఎదురేగి తాను స్వయంగా ఖద్దరుతీసి అల్లినమాలను తన మామయ్యమెడలో వేసి స్వాగతం పలకాలనుకొన్నాడు. కాని రాముదత్తయ్య ఆతనిలో స్వార్థం ఉండకూడదనే భావనను పోగొట్టటానికి ఆ మాలను ఎముకలగూడుగా మారి స్ట్రెచర్ మీదనుండి దింపిన జానకమ్మమెడలో వేయించింది. గోపాలరావుకు జైలునుండి జబ్బుతో తిరిగి వచ్చిన తన మామయ్యను, జానకమ్మను చూసిన తరువాత స్వరాజ్యంయొక్క విలువ కొద్దిగా అర్థమైంది. గోపాలరావు చిన్నప్పటినుండి సత్యాగ్రహ ఉద్యమం నిర్మాణకార్యక్రమాలలో ఒకటైన ఖద్దరు తయారీని మొదలుపెట్టిన చిన్ని దేశభక్తుడిగా పాఠకులకు కనపడతాడు. వాసుదేవరావు ఆరోగ్యంకోసం ప్రకృతిచికిత్సకై రాజమండ్రి లోని సీతానగరంలోని ఆశ్రమానికి రామలక్ష్మి తీసుకెళ్ళేటప్పుడే అక్కడ గోపాలరావును జాతీయపాఠశాలలో చేర్పించి, ఆతనిని స్వతంత్రవీరుడిగా, భావిపౌరుడిగా తీర్చిదిద్దాలనే నిర్ణయానికి వచ్చింది. కాని

అదే సమయంలోనే గోపాలరావు తల్లిదండ్రులు వచ్చి అతనిని బందరులోని జాతీయ పాఠశాలలో చేర్పిస్తామని రామలక్ష్మికి హామి యిచ్చి, అతనిని తీసుకొని వెళ్ళి బందరులోని జాతీయ పాఠశాలలో చేర్పించారు. ఆ పాఠశాలలో రోజు ఒకగంటసేపు చర్ఖాతో వడకటం, చేతిపనులైన వడ్రంగం, భారతదేశచరిత్ర, ప్రాచీన భారతదేశ నాగరికతను బోధించేవారు. ఇంగ్లీషుభాష నేర్చుకోవాలనే నిర్బంధం ఉండేదికాదు. కాని భారతజాతిలో భాషాసమైక్యత ఏర్పడటానికి హిందీక్లాసులు తప్పనిసరిగా ఉండేవి. ఎవరు ఎక్కువ నూలుతీస్తే వారికి గాంధగారిచేత యోగ్యతాపత్రాలను యిప్పించేవారు. విద్యార్థులందరూ 'మాకొద్దీతెల్లదొరతనం' అని పాడుకుంటూ నూలుతీసేవారు. గోపాలరావు ఆపాటలోని అనుపల్లవిలో వచ్చిన 'నాలుగుపరకల పిలక, నాట్యమాడే పిలక' అని గాంధి గురించి ముద్దుగా పాడుతుంటే గోపాలరావుకు, చిన్నప్పుడు తాను చీరాల శిబిరంలో దగ్గరనుండి చూసిన గాంధి గుర్తుకువచ్చేవాడు. అంటే గోపాలరావుకి చిన్నప్పటినుండే అతనిమీద గాంధి ప్రభావం ఉందని అర్థమౌతుంది. ప్రాథమిక విద్యనుండి కళాశాల తరగతుల వరకు ఉన్న విద్యార్థులందరు ఖద్దరు మట్టలాగూలు, చొక్కాలు ధరించేవారు. నెలకు రెండువేల గజాలనూలును తీసితే వారికి కాంగ్రెస్ సభ్యత్వపు సర్టిఫికెట్ యిచ్చేవారు. దానిని దేశభక్తులు పట్టభద్రపత్తకంటె గొప్పగా అనుకునేవారు. ఎందుకంటే అది సత్యాగ్రహ నిర్మాణకార్యక్రమాలలో ఒకటైన ఖద్దరు ఉద్యమానికి సంబంధించిన విషయం. కాబట్టి ఆ పని స్వాతంత్ర్యోద్యమకారులకు కాంగ్రెస్ సంస్థలో ప్రవేశార్హతను కలిగించేది. గోపాలరావుయొక్క జాతీయపాఠశాలలోని విద్యాభ్యాసం అతనిని రాముడత్తయ్య కలలుకన్న స్వాతంత్రవీరుడిగా, ఒకదేశభక్తుడిగా తీర్చిదిద్దుతున్నదని పాఠకులస్పృహకు అందుతున్న విషయానికి నిదర్శనం.

తొమ్మిదోతరగతి చదువుతున్న పద్నాలుగేళ్ళ గోపాలరావు ఒకరోజు బందరురోడ్డుమీద నడుస్తుంటే కనిపించిన తన అత్తయ్య చదువుతుండే కృష్ణాపత్రిక కార్యాలయంలోకి వెళ్ళాలనుకున్నాడు. ఆ రోజుల్లో జరుగుతున్న స్వాతంత్ర్యోద్యమ విశేషాలను ఏరోజుకారోజు ప్రచురించే పత్రికగా 'కృష్ణాపత్రిక' బందరునుండి వెలువడేది. ఆతనికి అత్తయ్యఅన్నా, ఆమె చదివే పత్రికలన్నా అమిత యిష్టమని అర్థమౌతుంది. అందుకే రాముడత్తయ్య స్ఫూర్తి గోపాలరావుని నిరంతరం నడిపించిందని అర్థమౌతుంది. ఆ పత్రికా కార్యాలయాన్ని చూడాలన్న ఆశ తోటివిద్యార్థియైన నందయ్యద్వారా అతనికి తీరింది.

నందయ్య హరిజనవిద్యార్థి అని మిగిలిన విద్యార్థులు ఏకపంక్తిని కూర్చోనీయకపోతే గోపాలరావు వారికి గాంధేయతత్వాన్ని బోధించి యిటువంటి కులాల పట్టింపులు స్వాతంత్ర్యం

కోరుకునే జాతీయకాంగ్రెస్ సభ్యులకు ఉండకూడదనటంతో అందరూ నందయ్యను తమతోపాటు తిననిచ్చారు. రాముడత్తయ్య యింట్లో గోపాలరావు హరిజనునితో కలిసి ఆడుకునేవాడు కాబట్టి నందయ్యను మిగిలిన విద్యార్థులతోపాటు సమానంగా చూసేవాడు. అంటే గోపాలరావుకి సత్యాగ్రహఉ ద్యమ నిర్మాణకార్యక్రమాలలో ఒకటైన అస్పృశ్యతా నివారణ అనేది చిన్నప్పటినుండి వంటపట్టిందని అర్థమౌతుంది. నందయ్య తాను ఆ పాఠశాలలో చేరటానికి తమ పంతులుగారైన కొండా వెంకటప్పయ్యగారి దయవల్ల జరిగిందని చెప్పాడు.

ఒకరోజు నందయ్య చదవటానికి 'మాలపల్లి' అనే పుస్తకాన్ని తెచ్చాడు. పల్నాడులో పుల్లరి పన్నుకు వ్యతిరేకంగా నిరసన చూపించినందుకు ఉన్నవ లక్ష్మీనారాయణగారిని అరెస్టుచేసి జైల్లోపెట్టగా వారు జైల్లోనే 'మాలపల్లి' అనే నవలను రాసి బయటకు వచ్చిన తరువాత దానిని ప్రచురించినందుకు, ఆ పుస్తకాన్ని బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. ఆ పుస్తకం పంచమోద్ధరణకు సంబంధించినది. నందయ్యను అడిగి ఆతనిదగ్గరున్న ఆ పుస్తకాన్ని ఇంటికి తెచ్చుకొని గోపాలరావు ఆ రాత్రంతా వదిలిపెట్టకుండా ఎవరూ చూడకుండా చదివాడు. అందులోని పౌలుయొక్క దౌర్జన్యానికి గోపాలరావు ఏడుపొచ్చింది. నేరస్థజాతులనబడేవారు నేరస్థజాతుల చట్టం, 1861 కింద బందీలైనప్పుడు వారిచేత కొండరాళ్ళనుకొట్టించి వ్యసాయానికి అనువుగా చేసే కఠినమైన పనులను చేయయించటానికి, వారిని సెటిల్ మెంట్ల వంటి గుడారాలలో, పాకలలో పెట్టి వారు పారిపోకుండా పహారా కాచేవారు. వారిని పర్యవేక్షించేవాడు నవలలోని పౌలు అనబడే వ్యక్తి. అందులోని పరస్పరం ఆరాధనతప్ప శారీరకవాంఛలులేని జ్యోతి, అప్పాదాసులు అమరప్రేమికులుగా చనిపోవటం నచ్చినా రైతుకూలీల కోసం, పంచమోద్ధరణకు పూనుకున్న సంగదాసు బతికుంటే బాగుండేదని, గోపాలరావు తాను పెద్దయినతర్వాత తక్కెళ్ళజగ్గడిలా ఘనకార్యాలు చేయాలనుకొన్నాడు.

సంగదాసు తండ్రియైన రామదాసు అహింసావాది, గాంధేయతత్వాన్ని వంటబట్టించుకున్నవాడు. ఆయనభార్య మాలక్ష్మిపాత్రలు గోపాలరావుకు రాత్రిపూట కలలోకి వచ్చేవారు. అంటే అంతగా వారి చైతన్యస్ఫూర్తి గోపాలరావుపైన ఉందని అర్థం. ఆ మర్నాడు మాలపల్లి నవలను నందయ్యకు యివ్వగా, ఆతడు ఆ పుస్తకాన్ని చేతిలో పెట్టుకొని వెడుతుంటే పోలీసులు నందయ్యను అరెస్టుచేసారు. అప్పుడు గోపాలరావుకు తన చిన్నప్పుడు 'స్వరాజ్యం అంటే నీలాంటి పిల్లలు తమ యిష్టానుసారం స్వేచ్ఛగా, ధైర్యంగా బ్రతకటం' అని రాముడత్తయ్య చెప్పిన మాటలు గుర్తుకువచ్చాయి. దానితో గోపాలరావుకి దేశంలో మనుష్యులు కనీసం తమకు యిష్టమైన పుస్తకమ చదివే స్వేచ్ఛకూడా లేదని బాగా అవగాహనకు వచ్చింది. ఇదంతా

గోపాలరావు దేశభక్తుడిగా ఎదగటానికి దోహదం చేసిన విషయాలుగా బలమైన పునాదులతో రచయిత్రి పాత్రచిత్రణచేసిన విషయంగా పాఠకుల మనసులను హత్తుకుంటుంది.

సత్యాగ్రహఉద్యమంలో గాంధికి ఆరుఏళ్ళు జైలుశిక్షవేసినా మధ్యలో అపెండిసైటిస్ ఆపరేషన్ చేయించటంతో ఆతనిని అనారోగ్య కారణాలతో విడిచిపెట్టారు. అయినా గాంధి తన శిక్షాకాలం ముగిసేవరకు బయట ఉన్నాకూడా ఉద్యమంలో పాల్గొనదలచుకోలేదు. అందుకే హిందూ, ముస్లిముల సమైక్యతకోసం నిరాహారదీక్షకు పూనుకొన్నాడు. గాంధి నిరాహారదీక్షకు మతమాత్సర్యాలు సిగ్గుతో తలవంచుకున్నరోజుల్లోనే, గోపాలరావు తల్లి శారదాబిల్లు వస్తే పెళ్లిచేయటానికి రజస్వలకాని ఆడపిల్లలు దొరకరనే భావనతో గోపాలరావుకు పెళ్లిని నిశ్చయించింది. గోపాలరావు తనకు యింకా చదువుకోవాలని, దేశసేవ చేయాలని ఉన్నదని చెప్పినా వినకుండా పెళ్ళితరువాత అన్నీచేసుకోవచ్చులే అని తల్లిదండ్రులు చెప్పి పెళ్ళిముహూర్తం పెట్టించారు. ఇంకా స్థిరమైన, ధైర్యంగల వ్యక్తిత్వాన్ని పొందలేకపోవటంచేతను, ఆర్థికంగా స్వతంత్రుడు కాకపోవటంచేతను గోపాలరావు తల్లిదండ్రులను ఎదిరించలేకపోయాడు. తనపెళ్ళి శుభలేఖను రాముడత్తయ్యకు యివ్వటానికి గోపాలరావు, ఆమె ఉన్న రాజమండ్రిలోని సీతానగరం ఆశ్రమానికి వెళ్ళాడు.

అక్కడ వాసుదేవరావు ఆ అమ్మాయిని చదివించమని, పెళ్ళిలో భోగంమేళం పెట్టించవద్దని, ఆడబ్బును హరిజననిధికి కట్టించమని గోపాలరావుతో చెప్పాడు. అంతేకాక, 'నీ మనసుకు నచ్చినదానిని నీవు నమ్మినదానిని మనస్ఫూర్తిగా చేయమని, ఎవరికీ భయపడకూడదని' చెప్పి, మహాత్ముని బోధనలలో చెప్పిన ప్రథమసూత్రంగా 'అంతరాత్మకు వ్యతిరేకమైన పని ఏమీచెయ్యవద్దని' చదువును కొనసాగించమని గోపాలరావుతో చెప్పాడు. మామయ్యఅత్తయ్యలతో మాట్లాడిన గోపాలరావులో ధైర్యం, చైతన్యం కలిగింది. చివరగా వాసుదేవరావు మామయ్య దుగ్గిరాలవారు గోపాలానికి చిన్నప్పుడు చెప్పిన 'గుమాస్తాచదువులు చదవద్దన్న' మాటలను గుర్తుచేసి చీరాల ప్రజలకోసం ఆయన తన ఆరోగ్యాన్ని అర్పణ చేసాడనిచెప్పి, తనకోసంకాక యితరులకోసం బతికే వాడే ఉత్తముడని, 'స్వంతలాభం కొంతమానుకొని పొరుగువాడికి సాయపడమని' చెప్పిన గురజాడవారి సూక్తులను చెప్పాడు. అంతేకాదు, చీరాలశిబిరంలో మహాత్ముడి ఆశీస్సులు పొందిన గోపాలరావు దేశసేవలో పునీతుడు కావాలని కోరుకున్నాడు. మామయ్యచెప్పిన మాటలు గోపాలరావు మనసులో చక్కగా నాటుకొని, ఆతని జీవితధ్యేయానికి పునాదులు వేయబడ్డాయి. కాని అప్పుడు యిక చేసేది ఏమీలేక గోపాలరావు తప్పనిపరిస్థితిలో పెళ్ళి చేసుకున్నాడు. తలమీద జీలకర్రబెల్లం పెడుతున్నప్పుడు గోపాలరావుకు మొదటిసారి స్త్రీస్పర్శతో అనుభూతిని పొందాడు. భార్యపార్వతితో మాట్లాడాలని వయోసహజధర్మంతో ఉవ్విళ్లూరాడు.

గోపాలరావుకి అత్తవారింట్లో అటు బావమరిది, ఇటు తన తమ్ముడు బుచ్చికి తల్లి ఇంగ్లీషుచదువు చెప్పించేసరికి, వారు ఇంగ్లీషు పుస్తకాలగురించి మాట్లాడుకుంటుంటే గోపాలరావుకు చిన్నతనమనిపించింది. అందుకే పెళ్ళితరువాత గోపాలరావు జాతీయకళాశాలకు తిరిగి వెళ్ళగానే ఇంగ్లీషుస్పెషల్ క్లాసులకు వెళ్ళి ఆ భాషను పట్టుదలతో నేర్చుకున్న సాధకుడు గోపాలరావు. జాతీయకళాశాలకు వెళ్ళిన నాలుగురోజులకు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గుంటూరులో మరణించిన వార్త గోపాలరావుకు తెలిసి, ఆయన అంతిమదర్శనంకోసం వెళ్ళాడు. గుంటూరు నుండి ఊరేగింపులో నలభైమైళ్ళదూరం పాల్గొని నాటి రామ్ నగరుకు వెళ్ళి, వారి దహనక్రియలవరకు ఉండి తిరిగి కళాశాలకు చేరుకున్నాడు. ఒకరోజు వాసుదేవరావు మరణించినట్టు సీతానగరంలోని అత్తయ్య నుండి టెలిగ్రామ్ వచ్చింది. గోపాలరావువెళ్లి అత్తయ్యను ఓదార్చబోయి తానే ఆమె ఒడిలో చేరిపోయాడు. గోపాలరావులో చిన్నపిల్లాడి మనస్తత్వం ఇంకా పోలేదని అర్థమౌతుంది. అత్తయ్యవాళ్ళకు పిల్లలులేనందుకు తాను మామయ్యకు తలకొరివిపెడతానన్నా, తల్లిదండ్రులు ఉన్నవారు తలకొరివి పెట్టకూడదని అంటారు కాబట్టి మరదలువాళ్ళు ఏమైనా అనవచ్చని రామలక్ష్మి భావించి, అతడిని వద్దని తమ కులం కాంగ్రెస్ అని చెప్పగా, కాంగ్రెస్ యువత తామంటే తామని ముందుకువచ్చి వాసుదేవరావు దహనక్రియలను జరిపించారు.

వాసుదేవరావు మరణానంతరం అత్తయ్యను తమతో రమ్మన్నా రాదని తెలిసి, ఆమెను సీతానగరంలో వదిలిపెట్టి వెడుతుంటే, తనలో ఒకభాగాన్ని వదిలిపెట్టి వెడుతున్నట్టు గోపాలరావుకు అనిపించింది. అంటే ఆతని మనస్సు దేశసేవికయైన రాముదత్తయ్య జీవితంతో పెనవేసుకొని ఉండటంతో ఆమెను వదిలి రాలేకపోయిందని అర్థమౌతుంది. మామయ్య మరణంతో మమతాను బంధం తెగినట్టుగా గోపాలరావుకు అనిపించింది. ఇంటికి వచ్చిన గోపాలరావు ప్రైవేటుగా మెట్రిక్యులేషన్ చదివి ఆతరువాత ఇంటరుమీడియేట్‌లో చేరాలనుకొని తండ్రికి చెప్పాడు. నాగపూర్‌లో మెట్రిక్ పరీక్షలు రాయటానికి వెళ్ళాలనుకుంటుంటే సైమన్ కమిషన్ రావటం జరిగింది. భారతీయులకు స్వరాజ్యాన్ని పొందే అర్హత వచ్చిందా లేదా అని భారతదేశమంతటా పర్యటించి తెలుసుకోవటానికి బ్రిటిష్ ప్రభుత్వం సైమన్ అనే వ్యక్తి ఆధ్వర్యంలో కమిటీని వేసింది. అతడు రైల్లో విజయవాడమీదుగా రాజమండ్రి వెడుతుంటే ఆతని రాకను బహిష్కరిస్తూ కాళేశ్వరరావుగారు గోపాలరావువంటి వాలంటీర్లను తీసుకొని రైలు స్టేషనుకు చేరుకున్నాడు. విజయవాడ రైలుస్టేషనులో రైలును ఆపించి 'సైమన్ గో బ్యాక్' అంటూ ఆతనిని వెనక్కి వెళ్లిపొమ్మని రాసినలేఖను స్వయంగా సైమన్ కి అందించినప్పుడు, గోపావరావుకు దేశభక్తుడియొక్క ధైర్యం ఎలా ఉంటుందో, ఎలా

ఉండాలో కూడా అర్థమైంది. హాస్టలుకు తిరిగివచ్చిన గోపాలరావుకు తండ్రి, మామగారు ఎదురుగా కనపడి రాజకీయాలువద్దని, చదువుకోమనిచెప్పి, అతనిని నాగపూర్ పోనీయకుండా చేయటానికి ఆతని ప్రమేయంలేకుండానే మామగారు గోపాలరావును కాశీలోని బెనారస్ విశ్వవిద్యాలయంలో చేర్పించాడు. మదన్ మోహన్ మాలవ్యా పర్యవేక్షణలో మొగ్గతొడిగిన ఆ విశ్వవిద్యాలయం క్రమశిక్షణకు, భారతీయదృక్పథానికి ప్రాముఖ్యతని యిచ్చే విద్యాలయం. అక్కడ వెళ్ళిన గోపాలరావుకు అక్కడ చదువుకుంటున్న నందయ్యను తిరిగి చూడటం ఆనందాన్ని కలిగించింది. ఆ రోజు మాలపల్లి నవలచేతిలో పెట్టుకున్నందుకు అరెస్టు కాబడిన నందయ్య తాను చిన్నపిల్లవాడు అవటంతో (బాలనేరస్థుడు) తనని బోర్డర్స్ స్కూల్ లో చదివించారని, విద్రోహరకరమైన పుస్తకాలు చదవనని రాసిచ్చి, తాను విడుదలయై బయటకు వచ్చానని నందయ్య చెప్పాడు. కాని తాను విద్రోహకరచర్యలు చేపట్టనని మాత్రం రాసియ్యలేదనికూడా చెప్పాడు. నందయ్యను తన రూములోనే ఉండమన్నాడు. కాని నందయ్య తాను హరిజనుడవటంచేత కాశీ విద్యాలయంలో చేరటానికి ఎన్నో సిఫార్సులతో సీటును పొందినట్టును, తాను వేరుగా తిని ఉంటానని చెప్పటంచేతనే హాస్టల్ లో ఉండనిచ్చారని చెప్పాడు.

గోపాలరావు కాశీలో ఉండగానే పార్లమెంటుమీద బాంబు విసిరాడని భగత్ సింగ్ పై కుట్రకేసు పెట్టారు. ఆతడు ఆ పనిచేయటానికి లాలాలజపతిరాయ్ కారకుడని భావించి అతడిని అరెస్టుచేసి పక్కటెముకలు విరగగొట్టి, ఆతని చావుకు కారణభూతుడైన ఆ సార్జెంటు సాండర్సును భగత్ సింగ్ హత్యచేసాడు. దాన్ని కొంతమంది సమర్థించారు. అలా విద్యార్థులమధ్యన వాదోపవాదాలు జరుగుతుండేవి. వారిలో నందయ్య, త్రిపాఠి వంటివారు రాజకీయఖైదీలను నేరస్థులతో కలిపి చూడకూడదని, భగత్ సింగ్ ఉన్న జైల్లోనే ఉన్న జితేంద్ర నాథ్ దాస్ నిరాహారదీక్ష చేస్తున్నాడని చెప్పుకుంటూ, బ్రిటిష్ అధికారులను చంపివేయాలని ఆవేశంగా వారు అన్నారు. దానికి గోపాలరావు బ్రిటిష్ అధికారులను చంపితే తిరిగి వారు చంపటం జరుగుతుంది కాని, దానివల్ల దేశానికి స్వాతంత్ర్యం రాదని అన్నందుకు అందరూ ఆతని శాంతిప్రవచనాలను హేళనచేసారు. ఇక్కడ గోపాలరావు యువకుడైనప్పటికి, ఆ వయస్సులో సహజంగా ఉండే ఉద్రేకాలు లేకుండా గాంధిపథమైన అహింసనే కోరుకోవటంజరిగింది. అంటే గోపాలరావుకు నరనరాలలో గాంధి అహింసాసిద్ధాంతం వంటబట్టినట్లు అనిపిస్తుంది. కొన్నిరోజుల ఉపవాసానంతరం జితేంద్రనాథ్ మరణించటంతో విద్యార్థులందరూ ఆతని ఊరేగింపులో పాల్గొనటానికి కలకత్తావెళ్లారు. కాని వారితో గోపాలరావు వెళ్ళలేకపోయాడు.

గాంధి స్వరాజ్యనిధికి డబ్బు పోగేస్తుంటే తాను మహాత్ముడితో వెళ్ళాలనుకున్నా, పార్వతి రజస్వల అయిన కబురుతెలిసి ఆమెను చూడాలనే యవ్వనసహజపు కోరిక గోపాలరావులో కలిగి భార్యదగ్గరకు వెళ్ళాడు. తనకు ఆశలు ఆశయాలులేక తాను పాతాళంలోకి పడిపోతున్నట్టుగా కొట్టుమిట్టాడుతూ ఉద్రేకం, ఉద్వేగాలకు లోనయ్యాడు. వెళ్లినతరువాత తాను గాంధితోకూడా వెళ్ళనందుకు బాధపడ్డాడు. గోపాలరావుకు యింకా స్థిరమైన వ్యక్తిత్వం పూర్తిగా ఏర్పడక పోవటంచేతనే అటు వ్యక్తిగతకుటుంబం, ఇటు దేశభక్తి మధ్యన ఊగిసలాడాడు.

బ్రిటిష్ వారి దమనశక్తిని ఆయుధాలతో, విప్లవాలతో ఎదుర్కొనలేమని తెలిసిన గాంధి వారి ఆదాయానికి గండికొట్టాలని అనుకొన్నాడు. భారతీయులు తమ ఉప్పును తాము తయారు చేసుకుంటున్నా ఆ ఉప్పుపై వేసిన పన్నును మూడుశాతంనుండి ఎనిమిది శాతానికి పెంచారు. దానిని వ్యతిరేకిస్తూ ఉప్పుసత్యాగ్రహ ఉద్యమానికి పిలుపునిచ్చాడు. అయితే అల్లర్లుకాకుండా శాంతియుతంగా చేయాలనిచెప్పాడు. ఆ ఉద్యమ గొడవల్లో గోపాలరావు పాల్గొనకుండా ఉండటానికే అత్తవారు గోపాలరావుకు పార్వతితో శోభనాన్ని జరిపించారు. అయితే ఉద్యమంలో పాల్గొంటుంటే తాను సంసారపుమాయలో చిక్కుకోవటం సిగ్గు అనిపించి తిరిగి కాశివిద్యాలయానికి వచ్చాడు. ఒకరోజు రాముడత్తయ్య దగ్గర నుండి గోపాలానికి ఉత్తరం వచ్చింది. దానిలో తాను బంధువులతో ఉత్తరప్రత్యుత్తరాలతో కూడా సంబంధంలేకుండా ఒంటరిగా ఉండటంతో తనలో ఆత్మధృతి, జీవితంపట్ల అవగాహన కలిగిందని, ఉప్పుసత్యాగ్రహ ఉద్యమప్రచారానికి వచ్చిన గాంధి బృందంలో తాను వాలంటీరుగా ఉన్నట్టును రాసింది. అంతేకాదు, గాంధి మారుమూలపల్లెల్లోకూడా పర్యటిస్తూ ఉపన్యసిస్తుంటే తాను దానిని తెలుగులో తర్జుమాచేస్తుంటే తన జీవితానికి ఒక ఆలంబన, ఒక ప్రయోజనం కలిగినట్లును, నీవుకూడా ఉంటే గాంధి ఆశీస్సులు ఉండేవని, గాంధిగారి బృందంలో ఉండటం తన పూర్వజన్మ సుకృతమని తెలుపుతూ రామలక్ష్మి గోపాలరావుకు ఉత్తరం రాసింది. రాముడత్తయ్య రాసిన ఉత్తరాన్ని గోపాలరావు తోటి విద్యార్థులకు చూపించగా వారు చదివినప్పటినుండి గోపాలరావును గౌరవించటం మొదలుపెట్టారు. అంటే గాంధిమహాత్ముని వెంట పాల్గొనే ఉద్యమప్రచార భాగస్వామ్యం వహించగలిగిన రాముడత్తయ్య గొప్పతనంయొక్క ప్రభావం గోపాలరావుమీద ఉండటంచేతనే ఆ తరువాత ఆతడు శాసనోల్లంఘనంలో పాల్గొనటానికి ప్రేరణ కాగలిగిందని అనిపిస్తుంది.

కొన్నాళ్ళకు గాంధి మహాత్ముడు శాసనోల్లంఘనానికి పూనుకొని ఉప్పుతయారీకి సిద్ధపడి దండితీరాన్ని చేరుకున్నవార్త గోపాలరావుకు తెలిసింది. 1930సం. మార్చిలో గాంధి తనతోపాటు

సత్యాగ్రహులుండే సబర్మతీ ఆశ్రమంనుండి బయలుదేరి గుజరాత్ లోని సముద్రప్రాంతమైన దండితీరం దగ్గరకు ర్యాలీగా వెళ్ళీ ఏప్రిల్ 6వ తారీఖుకు చేరుకొని 10 తేదిన అక్కడ బ్రిటిష్ వారిచట్టాలకు వ్యతిరేకంగా ఉప్పుతయారీని చేపట్టటమే ఉప్పుసత్యాగ్రహం. అయితే పరీక్షలు పదిరోజులలో ఉండటంతో గోపాలరావుయొక్క భార్య పార్వతి ఆతనిని ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొనవద్దని మాటతీసుకోవటంతో గోపాలరావు తాను ఆ ఉద్యమంలో పాల్గొనలేకపోయినందుకు బాధపడ్డాడు. విద్యార్థులు చాలామంది పాల్గొని అరెస్టచేయబడ్డారు. పరీక్షలు రాసివచ్చిన తరువాత గోపాలరావు తానుకూడా కొనసాగుతున్న ఉద్యమంలో పాల్గొనాలనుకొన్నాడు. సముద్రతీర ప్రాంతవాసులకు ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొనే అవకాశం ఉంటుంది కాబట్టి మిగిలిన వారు ఉద్యమభాగస్వాములు అవటానికై విదేశీవస్తుబహిష్కరణ, కల్లుదుకాణాల దగ్గర పికెటింగ్ వంటి ఉద్యమ కార్యక్రమాలను వ్యక్తిసత్యాగ్రహంలో భాగంచేసారు.

ఇవన్నీ శాసనోల్లంఘన కార్యక్రమాలే. ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొన్నవారిని విడిపిస్తామని, భారతీయులు ఉప్పుచేసుకునే స్వతంత్రం, ఖద్దరువస్త్ర విక్రయం, కల్లుకొట్లదగ్గర పికెటింగ్ వంటివిచేయటాని వీలుగా బ్రిటిష్ మంత్రి ఇర్విన్‌తో చేసుకున్న ఒడంబడికగా గాంధి-ఇర్విన్ మధ్య ఒప్పందం జరిగినా, దానిని అమలులో పెట్టనందుకు గాంధి సామూహిక సత్యాగ్రహంకంటే, వ్యక్తిసత్యాగ్రహాన్ని చేయమని పిలుపునిచ్చాడు. 1931 సం.లో మూడు తఫాలుగా సమావేశాలు జరిగి ఆ ఒప్పందం కుదిరింది. మొదటిసారి గాంధి వెళ్ళలేదు. రెండవసారి గాంధి వెళ్ళినా విఫలంకాగా మూడవసారి లో గాంధి-ఇర్విన్ మధ్యన ఒడంబడిక జరిగింది. అదే గాంధి-ఇర్విన్ ఒప్పందం. 1931సం.లో వ్యక్తిసత్యాగ్రహం తీవ్రతను పొందింది. దానితో పోలీసులదౌర్జన్యం ఎక్కువైంది. గోపాలరావు కల్లకొట్టుదగ్గర పికెటింగ్ చేస్తున్న సందర్భంలో అరెస్టుకాబడి మూడేళ్లపాటు 'సి' క్లాసు కఠిన శిక్ష వేయబడి కడలూరుజైలుకు తరలింపబడ్డాడు.

ఆ జైలులో శుభ్రతలేని పరిస్థితులలో రాజకీయ ఖైదీలు తమవంట తాముచేసుకోవటానికి అనుమతిని పొందారు. వంటచేసుకోవటం, పుస్తకాలు చదువుకోవటంతో గడిపిన గోపాలరావు మూడేళ్ళజైలుశిక్ష గడిపి విడుదలై బయటకు వచ్చాడు. గోపాలరావు జైలుకు వచ్చేసమయంలో భార్యపార్వతి మూడునెలల గర్భవతి. పార్వతి తన మూడేళ్ళకొడుకుతో జైలు దగ్గరకు వచ్చేసరికి, తాను భార్యాబిడ్డల బాధ్యతను నిర్వర్తించలేదని అనిపించినా మాతృదేశంకోసం పోరాడుతున్నాననే గర్వం, తృప్తి, పరిపూర్ణత అతనిలో తొణికిసలాడినాయి. అంటే యిక్కడనుండి గోపాలరావులో సంపూర్ణవ్యక్తిత్వం ఏర్పడుతోందని అర్థమౌతుంది. పార్వతి తనతో తీసుకెళ్ళి భర్తని యిక ఉద్యమంలో

పాల్గొనని రాసిస్తే గోపాలరావు తమ్ముడు బుచ్చి ఉద్యోగం వేయిస్తాడని చెప్పగా, వారందరిలో గోపాలరావుకు ఆనాటి చీరాల ఉద్యమం తరువాత పోలీసులచర్యతో తన యిల్లు కాలిపోయినందుకు గాంధిని విమర్శించిన సీతమ్మలాంటివారు గుర్తుకువచ్చి, అటువంటివారే స్వాతంత్ర్యానికి ఆటంకం కలిగిస్తున్న దేశద్రోహులని రాముడత్తయ్య చెప్పిన వారి స్వభావం కనపడ్డది. నిరంతరం దేశస్వాతంత్ర్య విషయంలో రాముడత్తయ్య అన్న మాటలు గోపాలరావుకు గుర్తుకు వస్తున్నాయంటే ఆమె ఆశయస్ఫూర్తి గోపాలరావుపై చెరగని ముద్రవేసిందని అర్థమౌతుంది. పరిపూర్ణవ్యక్తిత్వాన్ని సంతరించుకున్న గోపాలరావు అక్కడ ఉండలేకపోయాడు.

గోపాలరావుకు తండ్రి చెప్పటంచేత రాముడత్తయ్యకు అనారోగ్యమని తెలిసి అతడు సీతానగరానికి వెళ్ళాడు. అక్కడ పోలీసులు చెల్లాచెదరుచేసిన ఆశ్రమంలో దైన్యావస్థలో ఉన్నా కళ్ళల్లో ఆత్మస్థైర్యంగల రామలక్ష్మిని చూసి పసిపిల్లవాడిలా ఆమె వడిలోకిచేరాడు. రాముడత్తయ్య స్పర్శ గోపాలరావుకి ధైర్యాన్ని ఆత్మశక్తిని అందించినట్టు అనిపించింది. గోపాలరావు తన భావికర్తవ్యాన్ని చెప్పమని అడగగా, రాముడత్తయ్య జైలుకెళ్లి సత్యాగ్రాహివయితే సరిపోదని, మహాత్ముని బాటలో నడవటానికి చీరాలవెళ్ళి సమీపప్రాంతాలలోని పల్లెప్రాంతాలలో తిరిగి అక్కడి ప్రజలను అక్క చెల్లెళ్ళు, అన్నదమ్ములుగా భావించి, స్వాతంత్ర్యేచ్ఛను ప్రబోధించే ఉద్యమనిర్మాణ కార్యక్రమాన్ని కొనసాగించమని చెప్పింది. రాముడత్తయ్య చెప్పినట్లుగా గోపాలరావు వెంటనే చీరాలను చేరుకున్నాడు. అక్కడ చిన్నపాకవేసుకొని ఆశ్రమజీవితాన్ని గడుపుతూ అక్కడున్నవారికి విద్యను నేర్పుతూ కాయకష్టంచేస్తూ ఆత్మగౌరవాన్ని పూర్తిగా ఆచరణ సాధ్యంచేసుకున్నాడు. అంటే గోపాలరావులో పరిపూర్ణవ్యక్తిత్వం ఏర్పడిందని అర్థమౌతుంది.

బ్రిటిష్ ప్రభుత్వపు చట్టం, 1935 ప్రకారం రాష్ట్రీయస్వాతంత్ర్యం రావటంతో మద్రాసుప్రావిన్సు రాష్ట్రానికి 1937సం. లోఎన్నికలు జరిగాయి. నందయ్య గోపాలరావును ఎన్నికలలో నిలబడమన్నా ఒప్పుకోలేదు. నందయ్య ఎన్నికలలో గెలిచి హరిజనశాఖామంత్రి అయ్యాడు. రాజగోపాలాచారి ముఖ్యమంత్రి కాగా కాంగ్రెస్ వారు అస్పృశ్యతానివారణ, ఋణవిమోచనం, సత్యాగ్రహుల ఆస్తిపాస్తులను తిరిగి యిప్పించటంవంటివి చేయటం జరిగింది. అంతేకాదు, మంత్రివర్గంలో స్థానిక వ్యహారాలమంత్రిగా బెజవాడ గోపాలరెడ్డిగారు చీరాలపేరాలను మళ్ళీపంచాయితీగా మార్చారు.

ప్రధానంగా జర్మనీ-జపాను కూటమికి, ఇంగ్లండు, ఫ్రాన్సు, అమెరికా కూటమివారికి రెండవప్రపంచ యుద్ధం1938 సం.లో ప్రారంభమైంది. భారతీయులతో చర్చించకుండానే భారతసైన్యాన్ని పంపించాలనుకునే సరికి గాంధి వారి అభిప్రాయాన్ని నిరసించాడు. భారతీయసైన్యం

నిజాయితీగా పోరాడుతుందనే నమ్మకంతో బ్రిటిష్ ప్రభుత్వం భారతీయులను యుద్ధంలో దింపాలనుకుంది. అంతేకాదు, అహింసావాదిగా గాంధి యుద్ధవ్యతిరేకి. కాని ఊరుకుంటే, జర్మని నియంత ఆటలుసాగితే హింసాకాండ పెరిగిపోయే అవకాశాలుకూడా ఉన్నాయి. ఈవార్తలన్ని పత్రికద్వారా తెలుసుకుంటున్న గోపాలరావుకు పరిస్థితులు ఎటుపోతున్నాయో అనే ఆందోళనకు గురిఅయ్యాడు. ఆ సందర్భంలో వ్యక్తిసత్యాగ్రహాన్ని శాంతియుతంగా చేయాలి అని గాంధి పిలుపునిచ్చిన సమయంలో గోపాలరావు తాను ఉద్యమంలో పాల్గొనాలని అనుకొన్నాడు. ఇంట్లోని వారంతా గోపాలరావువల్ల ప్రభుత్వం తరఫున తమకు కష్టాలు వస్తున్నాయని చెప్పినా పట్టించుకోకుండా స్థిరమైన వ్యక్తిత్వాన్ని పొందిన గోపాలరావు దేశసేవ కర్తవ్యనిర్వహణకై తాను ఒక కూడలివద్ద శాంతియుతంగా వ్యక్తిసత్యాగ్రహాన్ని ప్రారంభించాలనుకొన్న విషయాన్ని కలెక్టరుకు తెలియచేయటానికి వెళ్ళాడు. అక్కడ ప్రజలహక్కులగురించి మాట్లాడి, ఆంగ్లేయుల యుద్ధసైన్యంకోసం రైతులనుండి ముందే ధాన్యాన్ని దౌర్జన్యంగా తీసుకొని సామాన్యప్రజలకు తిండిలేకుండా చేస్తున్న ప్రభుత్వ చర్యలను ప్రశ్నించాడు. గోపాలరావు ఆ యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ ఫలానారోజున తాను వ్యక్తిసత్యాగ్రహంలో పాల్గొంటున్నట్టు జిల్లాకలెక్టరుకు లేఖ పంపించాడు. తెల్లవారిలేచి నూలువడికి, వంటచేసుకొని వ్యక్తిసత్యాగ్రహానికి బయలుదేరుతున్న సమయంలో మామగారు, తమ్ముడు బుచ్చి వచ్చి గోపాలరావు కారణంగా తమ కాంట్రాక్టులను కలెక్టరు రద్దుచేస్తామంటున్నాడనీ, గోపాలరావు తన భార్యాపిల్లవాడిని పట్టించుకోవటంలేదని నిష్ఠురం ఆడి సత్యాగ్రహాన్ని వదిలిపెట్టమన్నారు.

గోపాలరావుమాత్రం పెళ్ళాంబిడ్డలకోసం తన ఆశయాన్ని వదలనన్నాడు. నాలుగురోడ్ల కూడలిలో వ్యక్తిసత్యాగ్రహం చేస్తున్న గోపాలరావును ఆరోజు మధ్యాహ్నమే అరెస్టుచేసి పదినెలల జైలుశిక్షను వేసారు. పదినెలల తర్వాత జైలునుండి విడుదలై బయటకు వచ్చిన గోపాలరావుకు తిండిగింజలు, కిరసనాయిలుకూడా దొరకకపోతుంటే ప్రజలు పడుతున్న యిబ్బందులు అర్థమయ్యాయి. ఒకపక్క యుద్ధం, మరోపక్క కరువు. వార్తాపత్రికలకు పేపరు కరువు. అన్నీ ధరలు పెరిగిపోయాయి. ఆ పరిస్థితులలో సామ్రాజ్యవాదులైన ప్రభుత్వోద్యోగులను తరిమికొట్టండి అని అంటూ 'కార్యసాధన లేక మరణమా' (డు ఆర్ డై) అని తేల్చుకోవాలని, తీవ్రమైన క్విట్ ఇండియా ఉద్యమానికి గాంధి తన హరిజన్ పత్రిక ద్వారా పిలుపునిచ్చాడు. 1942 సం.లో డు ఆర్ డై అనే అనే నినాదంతో జరిగినది క్విట్ ఇండియా / బ్రిటిష్ నిష్క్రమణ ఉద్యమం. ఒకనాటి చీకటివేళలో గాంధిని, కాంగ్రెస్ కార్యకర్తలను ఎక్కడికో తీసుకొని వెళ్ళారని తెలిసి ప్రజలు రైళ్ళను ఆపి, ఆందోళన చేస్తుంటే దానిని దూరంనుండి గమనిస్తున్న గోపాలరావును అరెస్టుచేసారు. జైల్లో ఉన్నప్పుడు

గోపాలరావుకు రాముడత్తయ్య చనిపోయిన వార్త అందింది. రాముడత్తయ్య చివరిక్షణాలలో తాను వంటరిదైనందుకు, ఆమెదగ్గర తానులేనందుకు గోపాలరావు ఆ రాత్రంతా నిద్రపోకుండా ఆమె స్మృతులతో గడిపాడు.

క్విట్ ఇండియా ఉద్యమ ఫలితంగా బ్రిటిష్ ప్రభుత్వం యుద్ధానంతరం భారతీయులకు స్వాతంత్ర్యం యిస్తామన్న హామిమేరకు భారతసైన్యం యుద్ధంలో ఆంగ్లేయులకు సహకారాన్ని అందించింది. రెండవప్రపంచ యుద్ధంలో జర్మని, జపానుమీద ఆంగ్లేయులకు విజయం లభించింది. (బ్రిటిష్ వారికి చావుతప్పి కన్నులొట్టపోయినవిధంగా జర్మనీకూటమిపై విజయాన్ని సాధించింది. కాని వారి ఆర్థికవ్యవస్థ కుదేలయ్యేసరికి ఇక భారతదేశాన్ని తమ అధికారంతో అణచిపెట్టలేమని గ్రహించిన బ్రిటిష్ ప్రభుత్వంభారతీయులకు స్వాతంత్ర్యం ఇస్తామని ప్రకటన చేసింది. కాని ఒకపక్క స్వాతంత్ర్యప్రకటన చేసినప్పటికీ మరొకపక్కన నాటి బ్రిటిష్ ప్రధాని చర్చిల్ ముస్లిములు, భారతీయులలో ఒకరికే భారతదేశస్వాతంత్ర్యాన్ని కట్టపెడతామనే మెలికిపెట్టి తాత్సారం చేయాలనుకొన్నాడు. అయితే తరువాత బ్రిటిష్ ప్రభుత్వానికి ఎన్నికలు జరిగి, లేబరుపార్టీ నాయకుడైన అట్లీ బ్రిటిష్ ప్రధానికావటం జరిగింది.) నాలుగేళ్ళపాటు జైలుజీవితాన్ని గడిపిన గోపాలరావు విడుదల అయ్యాడు. రాముడత్తయ్య చివరి క్షణాలలో గడిపిన చోటువద్ద ఉన్న భూమిని స్పర్శించాలనుకొన్న ఆతని ఆలోచనలను తారుమారుచేస్తూ తమవాళ్ళూ, నందయ్య బ్రిటిష్ భారతదేశంలో జరిగే ఎన్నికలలో గోపాలరావుని నిలబడమని అడిగారు. (స్వాతంత్ర్య ప్రకటనకు పూర్వం జరిగిన చివరి కేంద్ర, రాష్ట్ర శాసనలభలకు ఎన్నికలు ఇవి. స్వాతంత్ర్యాన్ని యిస్తామని ఒప్పుకొని ఆనాటి బ్రిటిష్ ప్రధాని అట్లీచేసిన ప్రకటన తరువాత 1946 సం.లో జరిగిన ఎన్నికలు) గోపాలరావు చీరాలనుండీ శాసనసభ్యుడిగా నిలబడాలనుకొన్నాడు. కాని డబ్బు ఖర్చు పెట్టదలచుకోక రిక్షా బండిమీద ప్రచారంచేసుకొని నిజాయితీతో ఎన్నికలలో విజయంసాధించాడు. ఇంట్లో వాళ్ళు మంత్రిపదవికి సిఫార్సు చేసుకొమ్మన్నా వినలేదు. పదవికంటె ప్రజాసేవ ముఖ్యమనుకొన్నాడు.

భారతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వాలనుకుంటే జిన్నా మొండిపట్టుదలవల్ల ఇండియా, పాకిస్థాన్‌గా భారతదేశం విభజింపబడి స్వాతంత్ర్యాన్ని యివ్వటం జరిగింది. 1947, ఆగస్టు15 న జవహర్ లాల్ నెహ్రూ స్వతంత్రభారతదేశానికి మొదటి ప్రధానమంత్రిగా భారతదేశ జెండాను ఎగరవేసాడు. గాంధి ఏ పదవులు వద్దనుకొన్నాడు. విభజనానంతరం హిందూవులు ముస్లిముల మధ్యవిద్వేషాలు రగిలిపోతుంటే మతవిద్వేషాన్ని తగ్గించి కాందిశీకులైన ముస్లిమ్ సోదరులను వెనక్కి రప్పించటంకోసం గాంధి ఢిల్లీలో నిరాహారదీక్షను చేపట్టాడు. భారతదేశాన్ని గమనిస్తున్న గోపాలరావు

భారతదేశానికి స్వాతంత్ర్యం రావటం విజయమో, పరాజయమో అర్థంకాని స్థితిలోకి వెళ్ళాడు. భారతదేశానికి మొదటి స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు జరుగుతున్నప్పుడు ప్రజాప్రతినిధిగా పాల్గొన్నా, గోపాలరావుకు ప్రశాంతత కరువైంది. నిరాహారదీక్షలో ఉన్న గాంధిని దూరంగా నిలబడియైనా చూడటానికి గోపాలరావు ఢిల్లీ వెళ్ళాడు. హిందూ ముస్లిములు సమైక్యతతో ఉంటామని మాట యివ్వటంతో జనవరి 18 న తన నిరాహారదీక్షను విరమించాడు. గాంధేయవాదిగా గోపాలరావుకు కూడా ప్రజాసేవ తప్ప పదవులమీద ఆశలేదు. అహింసతో స్వాతంత్ర్యాన్ని సాధించినా, మతపరమైన అశాంతి చోటుచేసుకోవటంతో గాంధిలాగా గోపాలరావుకూడా విచారపడ్డాడు. జనవరి ముప్పైవతేదీన సాయంత్రం ప్రార్థనా మందిరానికి గాంధి వెడుతుంటే మతోన్మాదుల తుపాకీగుండ్లకు గాంధి బలి అయ్యాడు. దీనిని కళ్లారా చూసిన గోపాలరావు ఆ నాటినుండి పాదరక్షలను త్యజించాడు. అంటే రచయిత్రి ఉద్దేశ్యంలో దేశంకోసం ప్రాణాలను త్యాగంచేసిన గాంధీకి గుర్తుగా గోపాలరావు శాశ్వతంగా తన చెప్పులను వదిలిపెట్టాలని అనుకున్నాడని అర్థమౌతుంది.

ఒకరోజు గోపాలరావు గతపదేళ్ళకాలంలోని తనజీవితకాలాన్ని గురించి ఆలోచిస్తూ తానెందుకు చుట్టూర ఉన్న పరిస్థితులలో యిమడలేకపోతున్నానని, భార్యాబిడ్డలతో సన్నిహితత్వాన్ని పొందలేక పోయానని భావించాడు. డబ్బు, అధికారానికి తప్ప ప్రశాంతజీవితానికి ఆదర్శాలకు విలువలేదా అని, తనేమి చేసాడని, తనలోపం ఎక్కడ ఉందని ఆలోచించటం మొదలుపెట్టాడు. మనిషి అంతర్ముఖుడవటం గొప్పవ్యక్తిత్వానికి చిహ్నం. కొడుకు బి.ఏ. పాసయినరోజు తండ్రిగా అతడికి బి.ఇడి చదివితే భావిపౌరులను తీర్చిదిద్దే అవకాశం ఉంటుందని సలహాయిచ్చినా, కొడుకు మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. స్వాతంత్ర్యానంతర రాజకీయాలు తనకు కొరుకుడు పడవని రెండవసారి ఎన్నికలలో గోపాలరావు నిలబడదలచుకోలేదు. (స్వతంత్రభారతదేశం రాజ్యాంగాన్ని రూపొందించుకున్న తరువాత మొదటగా 1952సం.లో జరిగిన ఎన్నికలు) స్వాతంత్ర్యానంతరం గోపాలరావు హిందీప్రచారసభలో టీచరుగా చేరినందుకు పార్వతికి చులకన భావం ఏర్పడింది. నందయ్యలాగా మళ్ళీరాజకీయాలలో చేరి దేశాన్ని బాగుచేయవచ్చని, ఆనాడు నందయ్యతోపాటు గోపాలరావు కలిసి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలు శిక్షనుకూడా అనుభవించారుకదా అని తమ్ముడు బుచ్చి అడిగాడు.

దానికి సమాధానంగా గోపాలరావు ఆనాడు తామందరం స్వాతంత్ర్య లక్ష్యంకోసం పోరాటం సాగించామని, దేశస్వాతంత్ర్యం వచ్చినతరువాత గాంధి అన్నట్లుగా కాంగ్రెస్ పార్టీని రద్దుచేసి ఖద్దరుటోపీలను తీసివెయ్యటం మంచిదని అన్నాడు. అంటే గాంధిదృష్టిలో ఒకప్పుడు హిందూ

ముస్లిములు కలిసి దేశస్వాతంత్ర్యసాధనా లక్ష్యంతో ఐక్యంగా ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ, స్వాతంత్ర్యానంతరం కూడా ప్రజలంతా సహోదరులవలె ఉండి స్వేచ్ఛగా ఉంటారని అనుకొన్నాడు. కాని అటువంటి మతసమైక్యత సన్నగిల్లి లక్ష్యాలను పట్టించుకోక వచ్చిన స్వాతంత్ర్యానికి విలువలేకుండా చేసినందుకు గాంధి అలా అని ఉంటాడని గోపాలరావు భావించాడు. ఖద్దరుటోపీని అడ్డుపెట్టుకొని రాజకీయాలలలోకి దిగి డబ్బు సంపాదించటం తన అభిమతంగాదని పార్వతికి స్పష్టంచేసాడు. పరులను విమర్శించటం గోపాలరావుకు యిష్టం ఉండదు కాబట్టి పార్వతి నందయ్య అటువంటి రాజకీయనాయకుడా అని రెచ్చగొట్టినా నందయ్యను విమర్శించలేదు. గాంధేయదృక్పథంలో ఒకటైన పరనింద కూడదనే భావన గోపాలరావు యొక్క వ్యక్తిత్వంలో ఉన్నదని అర్థమౌతుంది.

నందయ్య రెండవసారి హరిజన మంత్రియైనప్పుడు కాలేజిలో సీటుకోసం ఒక హరిజన విద్యార్థిని వెంటపెట్టుకొని గోపాలరావు వెడితే, అతనిని వెంటనే కలుసుకోనీయక కారెక్కుతున్నప్పుడు ముక్తసరిగా మాట్లాడి తరువాత రమ్మనమనిచెప్పాడు. గోపాలరావు ఆ హరిజన విద్యార్థికోసం మూడవనాడు వెళ్ళి కలవగా నందయ్యకు అతని చదువుకోసం సహాయాన్ని అందించిన కొండా వెంకటప్పయ్యను గుర్తుచేయాల్సి వచ్చింది. అయినప్పటికి స్వాతంత్ర్యానంతరం అధికారం, స్వార్థం ఎక్కువైన నందయ్య గోపాలరావుతో మాట్లాడుతూ తాను మునుపు సాయంచేసిన తన కులస్థులే తిరిగి తన దగ్గరకు రాకుండా మోసంచేసారని అన్నాడు. అంతేకాదు, చదువుకోని తన కూతురును ఆ పిల్లవాడు పెళ్ళిచేసుకునేటట్లయితే కాలేజిలో సీటు యిప్పించి తరువాత చదువులు చెప్పిస్తానని, తన ఊళ్ళో బంధువులకు తాగపోయించి క్లుప్తంగా పెళ్ళిచేస్తానని, గోపాలరావువలె తనకు ఆత్మనిగ్రహంలేదని చెప్పాడు. నందయ్య తాను మొదటిసారి మంత్రి అయినప్పుడు (స్వాతంత్ర్యానికి పూర్వం) ఆదర్శంగా ఉన్నానని, కాని రెండవసారి మంత్రి అయినప్పుడు (స్వాతంత్ర్యానంతరం) తన ఆదర్శాలు రాజకీయాలకింద నుజ్జునుజ్జు అయ్యాయి అని, తాను తెలివిమీరి పైవాళ్ళుపైన, కిందవాళ్ళుకింద ఉండటమే మంచిదనే స్థితికి వచ్చాననిచెప్పాడు. గోపాలరావు నందయ్య తనజాతిని, కులాన్ని చిమ్మచీకటినుంచి పైకిలేవనెత్తటంపోయి తనబాగు తానుచూసుకొని, కిందవాళ్ళు మరింతగా అణగతొక్కుతున్నాడని భావించిన గోపాలరావుకు అశాంతిగా గుబులుగా అనిపించింది.

అంతేకాక, స్వాతంత్ర్యం వచ్చిన కొన్నాళ్ళకే వచ్చిన ఈ మార్పు ప్రకృతిలో విపరీతమైన సంక్షోభాన్ని కలిగిస్తుందనే భయం ఏర్పడింది. స్వాతంత్ర్యం వస్తే ధైర్యంగా ఉంటుందనుకుంటే తిరిగి భయాలను కలిగిస్తోందని అతనికి అర్థమైంది. గోపాలరరావుకు అధికారం, డబ్బు, స్వార్థం అనే ఈ మూడింటికి తప్ప ప్రపంచంలో మరిదేనికి విలువలేదని అనిపించింది. పెళ్లి అనే ఎరవేసి

ఉచ్చులో బిగించి యువకునికి విద్యావకాశాలు కల్పించటం న్యాయమా అని గోపాలరావు హృదయం ఘోషించింది. ఆ పిల్లవాడు తిరిగి సీటుకావాలని తనదగ్గరకు రాకపోవటంతో సమాధానం చెప్పలేనిస్థితిలో ఉన్న గోపాలరావు తనకు ఆ సమస్య తీరిందని సంతోషపడ్డాడు.

గతమూడేళ్ళుగా గోపాలరావు పౌనార్ లోని వినోబాభావే ఆశ్రమంలో ప్రింటింగ్ ప్రెస్ లో పనిచేస్తున్నాడు. సాయంత్రంపూట గీతాప్రవచనాలతో గడుపుతూ ప్రశాంతంగా ఉంటున్నాడు. ఒకరోజు పార్వతికి సీరియస్ అని వెంటనే బయలుదేరి రమ్మని బావమరిది యిచ్చిన టెలిగ్రామ్ చూసుకొని వెళ్ళగా, అక్కడ పార్వతి బాగానే ఉంది అనిచెప్పి బావమరిది గోపాలరావుకు కొడుకైన శ్రీనివాస్ పంపిన లేఖను యిచ్చాడు. గతంలో కొడుకు యింటినుండి వెళ్ళిపోయిన మూడునెలలతరువాత ఒకరోజు అతని దగ్గరనుండి తనకు వచ్చిన లేఖలో 'తాను ఆశయసిద్ధికోసం పోరాడుతున్నానని, తనకోసం వెతికించవద్దని' రాసిన విషయాలు గుర్తుకువచ్చాయి. ఆ రోజు ఏడుస్తున్న పార్వతిని తాను ఓదార్చినా, విదిలించికొట్టింది. కొడుకు విషయంలో తనకు తనమరిది, తమ్ముడుతప్ప దిక్కులేదని అనేసరికి తనని తాను నిగ్రహించుకొని గోపాలరావు ఆ మర్నాడే నాగపూరుచేరుకొని, అప్పటినుండి ఆశ్రమంలో ఉంటున్నాడు. టెలిగ్రామ్ చూసుకొని యిప్పుడు యింటికి వచ్చాడు. ఇన్నాళ్ళకు మళ్ళీకొడుకు పంపిన లేఖలో అన్నార్తుల ఆకలిని తీర్చటానికి సమసమాజ స్థాపనకోసం తాను ఆయుధాన్ని పట్టినట్లును, తాను తన సహచరియైన కామ్రేడ్ రమను జీవితభాగస్వామిని చేసుకున్నట్టును రాసాడు.

అంతేకాదు, తమబిడ్డ సమసమాజంలో బతకాలని తాను తండ్రిపై చూపించని ప్రేమను తన బిడ్డ ద్వారా పొందమని, తనవల్లఏర్పడిన శూన్యాన్ని బిడ్డపూరిస్తుందని తన రక్తంతో పుట్టిన బిడ్డను అప్పగిస్తున్నట్టును, తమజీవితాలు ఏక్షణంలోనైనా ముగియవచ్చని, వార్తతెలిసినా తనకు నమ్మకంలేని లాస్టురైట్స్ చేయవద్దని రాసాడు. పార్వతి పాలుపడుతుంటే ఏడుస్తున్న పసిబిడ్డను తీసుకొని హృదయానికి హత్తుకున్నాడు. అంతవరకు గుక్కపట్టి ఏడుస్తున్న పాప ఏడుపు ఆపి తనవంకచూస్తుంటే రాముడత్తయ్యకళ్ళు ఆ పిల్లకళ్ళల్లో గోపాలరావుకు కనపడ్డాయి. పార్వతికి అకస్మాత్తుగా పడిపోయేరోగం వచ్చి పడిపోగా గోపాలరావే ఆ పాపకు పాలుపట్టి పడుకోపెట్టాడు. ఆ పిల్లకు స్వరాజ్యలక్ష్మి అని పేరుపెట్టుకొన్నాడు. తన జీవితానికి ఒక ఆలంబన ఏర్పడిందని అనుకొన్నాడు. అటు పార్వతి, ఇటు స్వరాజ్యలక్ష్మి తనకు యిద్దరుబిడ్డలని భావించి వాళ్ళ ఆలనాపాలనా చూడాలనుకొన్నాడు. స్వరాజ్యానికి ఏడాదివయసు వచ్చేసరికి తనకి కుటుంబపోషణ అవసరంఏర్పడి ఆ ఊళ్ళో ఉన్నపత్రిక ఆఫీసులో ఉద్యోగంలో చేరాడు. అందులో ప్రూఫ్ రీడర్‌గా చేరి, సబ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నాడు. ప్రతివారం గాంధేయదృక్పథం అంటూ వ్యాసాలను పత్రికలో రాయటం

మొదలుపెట్టాడు. స్వరాజ్యలక్ష్మిరావటంతో గోపాలరావుజీవితంలో స్థిరత్వం, ఆర్థికసుస్థిరత్వం ఏర్పడింది. భార్యాభర్తలమధ్య కొద్దిగా సామరస్యం కూడా పెరిగింది. స్వరాజ్యలక్ష్మిని చూసుకుంటుంటే గోపాలరావుకు కొద్దికొద్దిగా కొడుకులేని లోటు తగ్గుతోంది.

పార్వతి తమకు ఒక సొంత కొంప లేనందుకు పరోక్షంగా విమర్శిస్తుంటే గోపాలరావుకు 'నేను, నాకు, నాస్వంతం అనే ప్రలోభాలనుండి మనుషులు బయటపడలేరా అని, తనరాష్ట్రం తన భాష అని (భాషాప్రయుక్తరాష్ట్రాల విభజనగా విశాలాంధ్ర ప్రత్యేకరాష్ట్రఉద్యమం) తన నియోజకవర్గం, సంకుచితంగా ఆలోచిస్తున్నారని, తిండికి బట్టకు సంపాదన ఉంటే సంతృప్తిపడవచ్చుకదా అని ఆలోచిస్తూ ఉండేవాడు. 'నా అన్న పరిధిలేని కోర్కెలతో రాజీపడలేకుండా ఉన్నారని, నా అన్న భావనలోనే స్వార్థం ఉందని, నా అనేది వేరుపురుగని, అందుకే ప్రజలందరూ భిన్నాభిప్రాయాలతో గింజుకుంటున్నారని' అనుకొన్నాడు. పరాయి పాలననుండి విముక్తికోసం, ఆత్మగౌరవంకోసం తాము సాగించిన పోరాటంలో కూడా స్వయంచింతన ఉందని, త్యాగం అని చెప్పుకుంటున్నామని, కాని అవి హక్కులనే భావనకు వచ్చాడు. అందుకే పార్వతి సొంతయిల్లు కావాలనుకుంటోందని అనుకొన్నాడు. ఆ రకంగా గోపాలరావు పార్వతిని అర్థంచేసుకోవాల్సి వచ్చింది. అందరిని సమానంగా చూస్తామంటూనే పత్రిక ఎడిటర్ ఆంధ్రరాష్ట్ర పరిరక్షణకు అఖండ భారతదేశమని చేతులు ముడుచుకొని కూర్చోలేమని అన్న, అతనితో వ్యక్తుల స్వార్థంవల్ల రాష్ట్రాలు విభజింపబడి జల్లెడలామారినప్పుడు జల్లెడలో మిగిలినరాళ్ళవంటి గడ్డుసమస్యలే భాషాప్రయుక్తరాష్ట్రాలవల్ల మిగులుతాయని అన్నాడు. నిరాహారదీక్షతో మరణించిన పొట్టిశ్రీరాములుగారిది గాంధికంటె గొప్పత్యాగమని ఎడిటర్ అంటే వీరు వ్యక్తిని, సమస్యను, పనిమనిషినీ విడదీసి చూడలేని వీళ్ళు ప్రజాహోహుళ్యం యొక్క సమస్యలను ఎలా తీరుస్తారని ప్రశ్నించుకొనేసరికి గోపాలరావులో నిస్పృహ కలిగింది. అతనికి తాను బెనారస్ విశ్వవిద్యాలయంలో ఉన్నప్పుడు జైల్లో రాజకీయఖైదీలను, నేరస్థులను ఒకేరకంగా చూస్తున్నారని నిరాహారదీక్ష చేసి మరణించిన జితేంద్రనాథ్ గుర్తుకువచ్చాడు. గోపాలరావుకు గాంధేయవాదియైన పొట్టిశ్రీరాములుగారంటే అభిమానం, గౌరవం ఉన్నాయిగాని, ఆయన ఏ ఆశయంతో పోరాటం చేస్తున్నాడో ఆ ఆశయం మంచి ఫలితాలను యిస్తుందో లేదోనని ఆతనికి అనుమానం.

స్వాతంత్ర్యపోరాటంలో జైలుకు వెళ్ళి శిక్షను అనుభవించిన వారికి ఐదు ఎకరాల భూమిని ఇస్తున్నారని పార్వతితో పాటు తన తమ్ముడు బుచ్చికూడావచ్చి తీసుకోమని చెప్పినా, తాను స్వార్థం కోసం జైలుకెళ్ళలేదని, దానిని తీసుకోవటం స్వార్థమని భావించాడు. తెలంగాణా ఉద్యమ సమయంలో నందయ్య తన భార్యాబిడ్డలను, సొంతఊరికి పంపి, అక్కడ తన ఆస్తులకు కాపలా పెట్టి తెలంగాణాను

వదిలిపెట్టి ఆంధ్రాప్రాంతానికి వచ్చాడు. నందయ్యకు తెలంగాణా ఉద్యమం ఒక రాజకీయ ఆట. అందుకే ఆంధ్రావాళ్ళకు ముల్కి సర్టిఫికెట్లు (1956 నాటికి తెలంగాణాప్రాంతంలో అభ్యర్థుల తల్లిదండ్రులు పుట్టి ఉండాలి) పుట్టించి లక్షలు గడించాడు. నందయ్యజీవితం, ఆతని చుట్టూ ఉన్న పరిసరాలన్నీ కూడా కాలుష్యమయ్యాయని గ్రహించాడు. భూతకాలంలో బతికేవాడికి భవిష్యత్తు ఉండదని లోపలినుండి పార్వతి అన్న మాటలకు అర్థంచెప్పమని రాముడత్తయ్య కళ్ళతో ప్రశ్నిస్తున్న స్వరాజ్యలక్ష్మికి, కుళ్ళురాజకీయాలను చెప్పటంకంటె నీతి, నిజాయితి గల మహనీయుల జీవితచరిత్రలను పాఠాలుగా చెప్పాలని అకున్నాడు. స్వరాజ్యానికి భారతజాతీయ సమరం గురించిన తొలిపాఠాలతో ఆమెకు ఓనమాలు దిద్దాలనుకున్నాడు.

రాష్ట్రవిభజన సరియైనదికాదని అనుకుంటున్న గోపాలరావుతో పత్రికా సంపాదకులు ప్రత్యేక ఆంధ్రరాష్ట్రానికి కమిషన్‌ని వేయాలని పత్రికలో వేద్దామంటే అది దండగ అని భావించాడు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రానికి సంబంధించిన వార్తను మొదటి పేజీలో వేయాలని ఎడిటర్ అంటే ప్రజలు ముందుచూపులేకుండా చేస్తున్న ఉద్యమానికి పత్రికలు మార్గదర్శకంగా ఉండాలని గోపాలరావు అన్నాడు. దానికి ప్రత్యేకఆంధ్రరాష్ట్రం వస్తే విద్యాఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని, తమిళులు సవతిప్రేమను చూపిస్తున్నారని ఎడిటర్ అంటే గోపాలరావు ఖద్దరుటోపీలు యిప్పుడు అవినీతి చిహ్నాలుగా మారటంతో గౌరవంపోయిందని, ఇదంతా అవినీతికాంగ్రెస్ రాజకీయవాదుల స్వయంకృతాపరాధమని అన్నాడు. బుచ్చి, పార్వతి కలిసి గోపాలరావును స్వాతంత్ర్యపోరాట యోధులకు యిచ్చే భూమికి అప్లికేషన్ యివ్వమంటే తాను భూమికోసం కాక దేశంకోసం పోరాడానని, జన్మనిచ్చిన తల్లివంటిది భారతదేశమని, తల్లికి అన్నంపెట్టి డబ్బులు తీసుకోవటంలాంటిదని అన్నాడు. పొలాన్ని అలా తీసుకుంటున్నందుకే ఖద్దరు టోపీలు అవహేళనకు గురిఅవుతున్నాయని, స్వాతంత్ర్యా నంతరం త్యాగం, దేశభక్తివంటి మాటలు చెద్దమాటలుగా చెలామణి అవుతున్నాయని అంటూ గోపాలరావు ఆవేశపూరితుడు అయ్యాడు. కొన్నాళ్ళకు ఆ పొలాలన్ని ఇళ్ళస్థలాలకిందమారితే చాలా విలువచేస్తాయని బుచ్చి తనకు నందయ్య చెప్పాడనేసరికి, గోపాలరావు నందయ్య తనతో చదువుకున్నాడని చెప్పాలంటే సిగ్గుగా ఉందంటాడు. గోపాలరావు ఆ నందయ్యనే నిజాయితి గలవాడుగా ఉన్నప్పుడు హరిజనుడైన స్నేహితుడిగా గౌరవించాడు. స్వాతంత్ర్యానంతరం అవినీతి పరుడైనందుకు నందయ్యను స్నేహితుడని చెప్పుకోవాలంటే సిగ్గుపడుతున్నాడు. నలుగురుతో పాటే మనం అని పార్వతి స్వరాజ్యంకోసంగాని, యింటినిగాని కొనుకోవచ్చని అనగా అంతకు మునుపే తాను హౌసింగ్ బోర్డులో యిల్లుకట్టిచ్చి యిస్తామని, అలాట్ చేసిన కాగితాలుచూపి, ఆరు నెలలలోపు

యిల్లుకట్టించి యిస్తానుగాని, పొలానికి అప్లికేషన్ మాత్రం పెట్టనని ఖరాఖండిగా చెప్పాడు. లోయర్ ఇన్ కమ్ గ్రూపు హౌసింగ్ ఇచ్చారు. పార్వతి ఉబలాటపడ్డా గృహప్రవేశం వంటి ఆర్భాటాలులేకుండా స్వరాజ్యలక్ష్మిని గాంధిపటం పట్టుకొని ముందుగా కాలుపెట్టి యింట్లోకి ప్రవేశించమన్నాడు. మంత్రాలు లేకుండా బంధువులకు, స్నేహితులకు భోజనాలు పెట్టారు.

జానకమ్మగారు గోపాలరావును రమ్మని కబురుచేయగా స్వరాజ్యాన్ని వెంటపెట్టుకొని చీరాలకు రైలులో ప్రయాణమయ్యాడు. రైల్లోని తోటిప్రయాణికుడు తన భార్యపోరుపడలేక పిల్లలను ఇంగ్లీషుకాన్వెంటులో చదివిస్తున్నానని, అక్కడ ఫీజులు తీసుకుంటున్నా మరుగుదొడ్ల వసతులు లేకపోగా, చీకటిపడగానే లైట్లను ఆపేయటంతోను దోమలబాధ భరించలేక నిద్ర మాత్రలువేసుకొని నిద్రపోతున్నారని చెప్పాడు. అంతేకాదు, నిద్రమాత్రలకు విద్యార్థులు అలవాటుపడుతున్నారని, క్లాసులలో నిద్రపోతున్నారని, చదువుకూడా సరిగా వంటపట్టటంలేదని చెడు అలవాట్లు నేర్చుకుంటున్నారని చెప్పాడు. గోపాలరావు ఆ ఇంగ్లీషుచదువులు బానిసత్వానికి పనికివచ్చే చదువులనికదా ఒకప్పుడు ఆ స్కూళ్ళు వద్దని, జాతీయవిద్యాలయాలు నెలకొల్పారని అన్నాడు. స్వరాజ్యలక్ష్మి తాను ప్రభుత్వపాఠశాలలో చదువుతున్నానని చెప్పగా, ఆమె చక్కటి ఇంగ్లీషులో మాట్లాడగలుగుతోందని ఆ ప్రయాణికుడు గుర్తించాడు. కేవలం గొప్పకోసమే తల్లులు తమ పిల్లలు ఇంగ్లీషు కాన్వెంటులలోనే చదివించాలని పోరుపెడుతున్నారని ఆ ప్రయాణికుడు అంటాడు. అది స్టేటస్ సింబలయిందని, విదేశీవ్యామోహానికి మొదటిమెట్టు కాన్వెంటు చదువులని గోపాలరావు అంటాడు. స్వాతంత్ర్యానంతరం దేశచదువులు బ్రిటిష్ వాళ్ళునేర్పిన గుమాస్తా ఉద్యోగాల చదువులుగా మారుతు తిరోగమనం పట్టినట్లుగా అర్థమౌతుంది.

గోపాలరావు, స్వరాజ్యలక్ష్మి చీరాల చేరుకున్నారు. ఆనాటి చీరాల మారిపోయింది. జానకమ్మ యింటికి తీసుకొని వెడతానని గోపాలరావును గుర్తుపట్టిన రిక్షా అతను వచ్చి అడిగాడు. గోపాలరావు తాను నడిచి వెడతానన్నా ఒప్పుకోకుండా రిక్షాఎక్కించుకొని వెడుతుంటే గోపాలరావుకు దారిలో సినిమాహాళ్ళు, సారాకొట్టు, కొట్లముందర జనం కనపడ్డారు. ఆడవాళ్ళకి సినిమాపిచ్చి అనీ, భర్త తాగొచ్చి కొడతాడని ఆ బాధ తీరటానికి ఆడవాళ్ళు సినిమాలకు వెడతారని రిక్షా అతను చెప్పాడు. గోపాలరావుకు స్వాతంత్ర్యానికి పూర్వం సత్యాగ్రహ ఉద్యమశీలురున్న చీరాలకు, నేటి దుస్థితికి తేడా కొట్టొచ్చినట్టుగా కనపడింది. దారిలో జానకమ్మగురించి చెబుతూ, ఆమెకు ప్రభుత్వం ఐదెకరాలభూమిని యిచ్చిందని చెప్పాడు. జానకమ్మకూడా స్వార్థంగా పొలాన్ని తీసుకుందా అని గోపాలరావు బాధపడ్డాడు. గోపాలరావు ఆతని ముప్ఫైలవయసులో తిరిగిన వీధిలోఉన్న కుటీరం

ముందు రిక్షా అతను ఆపాడు. జానకమ్మ అందులోనే ఉంటోంది. ఆమె స్వరాజ్యం గురించి విన్నానని చెప్పి, స్వరాజ్యలక్ష్మి కళ్ళు రాముడత్తయ్య కళ్లులాగా ఉన్నాయని జానకమ్మకూడా అంది. తానుపోయే ముందు కొన్ని పనులు పూర్తిచేయటానికి గోపాలరావును పిలిపించానని, రోజులు మారిపోతున్నాయని, తాము ఒకప్పుడు కల్లుకొట్లదగ్గర పికెటింగ్ చేసి జైళ్ళపాలయ్యామని, కానినేడు కల్లుకొట్లను వేలంపాడి ఆ డబ్బుతో ఓట్లుకొంటున్నారని చెప్పింది. నాటి తమ త్యాగాలవల్ల ఫలితంలేకుండా పోయిందని, నాడు అస్పృశ్యతానివారణ ఉండాలని ప్రచారంచేస్తే, యిప్పుడు వారికి దూరంగా కాలనీలను కట్టించి వేరుగా చూస్తున్నారని, గాంధి ఉంటే స్వాతంత్ర్యం వద్దని తపస్సుకై హిమాలయాలకు వెళ్ళేవాడని అంది. గోపాలరావువంటివారు పూనుకొని మంత్రులు చేస్తున్న అన్యాయాలను ప్రజలకు తెలియ చేయాలని, ఆనాడు కార్యకర్తలు చీకట్లో రహస్యాలుగా ఉద్యమాన్ని మాట్లాడుకునేవారని, వారిది పరాయివారైన బ్రిటిష్ వారిని తరిమికొట్టి స్వాతంత్ర్యసాధనలక్ష్యమని, నేడు అటువంటిదే మరో లక్ష్యాన్నిపెట్టుకొని రాజకీయ అవినీతిని, దురహంకారాన్ని తరిమి కొట్టాలనే లక్ష్యాన్ని పెట్టుకొని గోపాలరావు వంటి వారు పూనుకోవాలని చెప్పింది.

కొన్నాళ్ళనుండి కుటుంబం గురించి తప్ప దేశం గురించి పట్టించుకోని గోపాలరావుకు కర్తవ్యబోధ చేసింది. అంతేకాక గోపాలరావుతో నీవు పొలం వద్దని అన్నావని నందయ్య చెప్పాడని, నీకులాగా నేనుకూడా వద్దంటే తాను మోసంతో హస్తగతం చేసుకోవాలనుకున్నాడని, అందుకే తాను పొలాన్ని తీసుకొని బీదలకిచ్చానని, దానిలో ఐదుకుటుంబాలవారు కొబ్బరితోటను వేసుకుని జీవనోపాధిని పొందారని, వైద్యులసలహాప్రకారం తాను పక్వాహారాన్ని తీసుకుంటున్నానని, తన బంధువులకు ఆ పొలాన్ని యివ్వనందుకు తనకు తిండిపెట్టకపోతే, తానే వండుకుంటున్నానని చెప్పింది. రామలక్ష్మి తన యిల్లును గోపాలరావు యిష్టమొచ్చినట్లు చేసుకోవచ్చని వీలునామా రాసిన విషయాన్ని అతనికి గుర్తుచేసింది.

చీరాలఉద్యమంలో సాలెశివయ్య యింటిని పోలీసులు కాల్చగా, యింట్లో వస్తువులకోసం వెళ్ళి కాలిమాడిపోయిన శివయ్య కొడుకే ఈ సూర్యారావని చెప్పి, ఆతడు మాలపిల్లను పెళ్ళి చేసుకున్నందుకు కులం నుండి వెలివేసారని చెప్పింది. వారిని తనదగ్గరే పెట్టుకున్నానని భార్యాభర్తలు కలిసి రాముడత్తయ్య యింట్లో రాత్రిపాఠశాల పెట్టటానికి అనుమతిని రాసియ్యమని, ఆ యింట్లో గొడ్లశాల ఉందని, దాన్ని బాగుచేయించి యిస్తే వారు ఉండగలరని చెప్పింది. అలాచేయకపోతే స్థానికరాజకీయ నాయకులు ఊరిబయట పెట్టమన్నా వినకుండా, రామలక్ష్మియింటిని స్వాధీన పరచుకొని, ఇందులో దుగ్గిరాల పఠనమందిరం పేరుతో పెద్దలైబ్రరీ పెడతామంటున్నారని చెప్పింది.

దానికి అసలు కారణం కులాలపోరాటం అని, వీరు ఇక్కడ మల్లెతోట పెంచుకుంటున్నారని కోపం కూడా ఉందని చెప్పింది. స్వాతంత్ర్యానికి పూర్వం త్యాగాలకు సిద్ధపడ్డ సత్యాగ్రహ ఉద్యమశీలురున్న చీరాలకు, నేటి రాజకీయఅవినీతి పరులున్న చీరాలకు తేడా కొట్టొచ్చినట్టుగా గోపాలరావుకు కనపడింది. ఆ మంచిపనికి సంతోషంగా గోపాలరావు ఒప్పుకున్నాడు. చీరాలలో నిరక్షరాస్యుల విద్యాభివృద్ధికి స్వార్థంలేని గోపాలరావు తనవంతు సహకారాన్ని యివ్వటానికి ముందుకొచ్చాడని అర్థమౌతుంది. అంతేకాదు, కులాలకు అతీతంగా బీదలకు తన సహకారాన్ని అందించటంలో గురజాడ చెప్పిన 'సొంతలాభం కొంతమానుకొని తోటివాడికి సాయపడవోయ్' అన్న మాటలను నిజంచేస్తూ ఆచరణాత్మక దేశభక్తుడిలా అర్థమౌతాడు. అంతేకాదు వాసుదేవరావు చివరగా చెప్పిన గురజాడ సందేశాన్ని ఆచరణలో పెట్టమన్నదానినికూడా ఆయన యింటివిషయంలోనే నిజంచేసి చూపించిన వాడయ్యాడు గోపాలరావు.

బుచ్చిభార్య తనను అవమానిస్తోందని చెప్పిన తన తల్లి కాలం మారిందని అనుకుంటుంది కాని చిన్నికొడుకు డబ్బుకు విలువయిస్తూ చెడిపోయిన విషయాన్ని తనతల్లి అర్థంచేసుకోవటంలేదని గోపాలరావు అనుకుంటాడు. కాలంమారిందని, కాలం చెడిపోయిందని అనుకుంటారుగాని, కాలం ఎప్పుడూ ఒకేలాగా ఉంటుందని, మారింది కాలంకాదని, మనుష్యుల చుట్టూ ఉన్న పరిస్థితులలో మార్పువచ్చి విలువలు తలకిందులవటంతో ప్రలోభాలకు లొంగిపోయి, తమ బలహీనతలను మనుషులు కాలానికి అంటగడుతున్నాడని గోపాలరావు అనుకుంటాడు. తనతల్లికి ప్రాణాలకంటె నగలే ఎక్కువ అని, వాటిని దాచిపెట్టుకున్నందుకు చిన్నకోడలు, కొడకు బుచ్చి ఆ నగలమీద ఆశపడ్డారని తల్లి చెప్పినప్పుడు డబ్బు అన్ని అనర్థాలకు మూలమని ఆమె గ్రహించటంలేదని అనుకొన్నాడు. బుచ్చి మొదటినుండి డబ్బుకు విలువ యిచ్చాడుగాని, మనుషులకు విలువ యివ్వలేదని తల్లి గ్రహించలేకపోయిందని, తనకంటె తమ్ముడే ప్రయోజకుడని అనుకుందని, తానుమాత్రం తనవంట్లో ప్రాణం ఉన్నంతవరకు తల్లికి ఊరికే అన్నం పెడతానని, ఆ నగలను తమ్ముడికి యిచ్చేయమని చెప్పాడు. గోపాలరావుకు డబ్బు ఆశలేదని, తనని తల్లి యిష్టంగా చూడకపోయినా, ఆమెను తాను చూసుకోవాలని అనుకున్నాడని అర్థమై అతనిలోని మానవసంస్కారం పాఠకులను వెన్నుతట్టి చైతన్యపరచకమానదు.

బుచ్చి ఎప్పుడూ తన యింటి ఛాయలకు రానివాడు ఒకరోజువచ్చి దేశంలో అవినీతి, లంచగొండితనం పెరిగిపోయిందని, వ్యాపారస్థులు దొంగలెక్కలుచూపి ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారని, అది ప్రజలడబ్బు అని అంటుంటే గోపాలరావుకు మసిపట్టిన కుండ కెటిల్ ని నీవు

నల్లగా ఉన్నావని అన్నచందంగా అనిపించింది. దయ్యాలు వేదాలను వల్లిస్తున్నట్టుగా బుచ్చి అవినీతిని కూకటివేళ్లతో సహా పెకిలించాలని, రాజకీయ కాలుష్యాన్ని వదిలించి స్వచ్ఛపాలనను అందించాలని, ఎన్నికలలో లక్షలు ఖర్చుపెట్టాలని అన్నాడు. గోపాలరావు వంటివారు ప్రస్తుత రాజకీయాలలో యిమడలేరని, తాను టికెట్టు పొందటానికి రాజకీయాలలో నీతిమంతుడనే గౌరవంగల గోపాలరావు యొక్క సిఫార్సు హైకమాండుకు అవసరమని చెప్పాడు. దానికి గోపాలం డబ్బుపెట్టి ఓట్లు కొనుక్కోకూడదని, ప్రజలు యిష్టపడి ఎన్నుకోవాలని, అతడు ప్రజాసేవ చేయాలని, ఎలక్షన్లు ప్రజాస్వామ్యానికి పునాదిరాళ్ళని, కొన్న ఓట్లతో ప్రజాస్వామ్యం కూలిపోతుందని అన్నాడు. దానికి బుచ్చి నేడు నోట్లకు విలువ ఉంది కాని గాంధి సిద్ధాంతాలు ఎవరికీ అక్కరలేదని, ఇందిరాగాంధి ఎవరంటే గాంధి కూతురని చెప్పే మేధావులైన శాసనసభ్యులు ఉంటున్నారని చెప్పి వెళ్లిపోయాడు. బుచ్చి ఎలక్షన్నలలో గెలిచి పూలదండలతో ఊరేగుతూ ప్రజలకు వంగివంగి నమస్కరిస్తుంటే, గోపాలరావుకు మాత్రం ఆ దండలోని ప్రతిపూవు లంచగొండికి ప్రతీకగా అనిపించింది. గోపాలరావు తన తమ్ముడి విషయంలోనే రాజకీయ అవినీతియొక్క స్వరూపాన్ని కళ్ళారా చూడగలిగాడు. అటువంటి వాతావరణంలోకూడా గోపాలరావు రాజకీయ అధికారానికిగాని, అవినీతికిగాని ప్రలోభపడలేదంటే గోపాలరావు వ్యక్తిత్వం ఎంత స్థిరమైనదో అర్థమౌతుంది. పైగా డబ్బు అధికారం ఉన్నా యింకా బుచ్చికి తల్లినగలమీద ఆశ అని బాధపడ్డాడు.

స్వరాజ్యం క్వీన్ మేరీస్ ప్రభుత్వ కళాశాలలో చదువుకుంటోంది. ఒకరోజు కాలేజిలో ఇంటర్ కాలేజి డిబేట్స్ పోటీలు ఉండటంతో తెలుగువిభాగపు సెక్రటరిగాచేసే పనులువల్ల స్వరాజ్య రావటం ఆలస్యమయినప్పుడు, పార్వతి భర్తతో స్వరాజ్యలక్ష్మి ఆడపిల్ల అని కాలేజినుండి సరాసరి యింటికి రావటంలేదని చెప్పింది. దానికి గోపాలరావు 'స్వరాజ్యం తెలుగు విభాగానికి స్టూడెంటు సెక్రటరిగా పనిచేస్తున్నట్టు నీతో చెప్పితే నువ్వు వొప్పుకోవని, స్వాతంత్ర్యోద్యమ సమయంలో ఆడపిల్లలు మగపిల్లలతో సరిసమానంగా చదువుకోవాలని తాము కలలు కన్నామని, దానికోసమైనా ఆడపిల్లలు చదువుకుంటుంటే సంతోషపడాలని' అన్నాడు. అంతేకాదు, 'ఆడపిల్లలు మగపిల్లలవలె స్వేచ్ఛను దుర్వినియోగం చేయరని, ఈకాలం పిల్లలు తమ చదువుల గురించి లోతుగా, బాధ్యతతో ఆలోచిస్తున్నారని, వివక్ష ఉండకూడదని, చదువు ఆడపిల్లకి విచక్షణాజ్ఞానం, ఆత్మస్థైర్యం యిచ్చేందుకు కారణం అవ్వాలని, స్వరాజ్యలక్ష్మి అర్థరాత్రయినా ధైర్యంగా యింటికి రాగలదని అన్నాడు. గోపాలరావు దృష్టిలో ఆడపిల్లలచదువు వల్ల వాళ్ళల్లో ధైర్యస్థైర్యాలు పెరుగుతాయని[16] నమ్మకం.

ఒకరోజు సూర్యారావు వచ్చి పదేళ్ళనుండి నైటుస్కూలును నడుపుతున్నా ప్రజలు రావటంలేదని, వయోజనవిద్యనుపెట్టినా ఎగ్గొడుతున్నారని, వారికి తగాదాలు, పంచాయితీలమీద ఉన్న శ్రద్ధ

చదువుకొని జీవితాలను బాగు చేసుకుందామనుకొనే దృష్టిలేదని చెప్పాడు. అందుకనే గత మూడేళ్ళుగా చిన్నపిల్లల స్కూల్ ని నడుపుతున్నానని, విద్యార్థులసంఖ్య క్రమక్రమంగా పెరుగుతుంటే స్కూల్ సరిపోకపోయేసరికి జానకమ్మగారు ప్రభుత్వంతో మాట్లాడి స్థలం యిప్పించారని చెప్పాడు. అక్కడ చిన్నచిన్నపాకలు వేసామని కొత్తస్కూల్ ని మీచేతులమీద ప్రారంభించాలని ఆహ్వానించటానికి వచ్చానని చెప్పగా, గోపాలరావు తనలాంటివాడికన్నా కాలాన్నిపట్టి పదవిలో ఉండే విద్యామంత్రిని పిలిస్తే ప్రయోజనం ఉంటుందని అన్నాడు. పదవులు ఆశించని గోపాలరావు పదవులను గురించి మాట్లాడుతున్న మాటలకు ఆశ్చర్యపోయిన సూర్యారావు 'కాలంలో కొట్టుకుపోని మీలాంటివారుంటారు' అని అనగా, గోపాలరావుకి తాను కాలాన్ని ఎదుర్కోలేక సహాయనిరాకరణ చేస్తున్నట్టు అనిపించింది. స్వాతంత్ర్యానంతరం రాజకీయఅధికారానికి, అవినీతికి విలువయిస్తుంటే చేసేదిలేక గోపాలరావు నిస్సహాయస్థితిలో గాంధేయవాదిగా ఉంటూ అహింసాయుతంగా సహాయనిరాకరణను పాటిస్తున్నట్టుగా తనని తాను భావించుకుంటాడు.

1975 లో ప్రజాస్వామ్యం మచ్చుకైనా కనపడని రోజులవి. ప్రజలకు భావప్రకటన స్వేచ్ఛగాని, పత్రికలలో ప్రభుత్వాన్ని విమర్శిస్తూ రాయటానికిగాని స్వేచ్ఛలేకుండా చేయటంకోసం ప్రభుత్వం ఎమర్జన్సీని ప్రకటించింది. ప్రభుత్వంలో ప్రధానమంత్రిగా ఉన్న ఇందిరాగాంధి, తనమీద ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తూ వ్యతిరేకతను పెంచుకుంటుంటే, దాన్ని అణచటానికి, తనతప్పు కప్పిపుచ్చుకోవటానికి, హైకోర్టు జడ్జిమెంటునుండి తప్పించుకోవటానికి, అధికారదాహంతో దేశంలో ఎమర్జెన్సీని ప్రకటించిందని గోపాలరావు స్వరాజ్యలక్ష్మితో అన్నాడు. ఆ సమయంలో ఎవరైనా న్యాయాన్ని ప్రశ్నిస్తే వారిని అరెస్టుచేసి జైలుకు పంపేవారు. ప్రజాస్వామ్యంలో ఎమర్జెన్సీపేరుతో ప్రజలహక్కులను కాలరాస్తుంటే గోపాలరావు సహించలేకపోయాడు. బలవంతపు ఫ్యామిలీప్లానింగు ఆపరేషన్లు చేసేవారు. తాత్కాలిక ప్రయోజనం కోసం మానవవిలువలను మర్చిపోకూడదంటాడు. ఇక్కడ గోపాలరావు ఒక మానవతావాదిగా, ప్రజాస్వామ్యవాదిగా స్పష్టమవుతాడు. స్వరాజ్యలక్ష్మి మాత్రం ఆమె క్రమశిక్షణకోసం ఎమర్జన్సీని పెట్టిందనీ, చుట్టూఉన్నవాళ్ళే దానికి కారణమని అనగా, గోపాలరావు ఆమె వ్యక్తిగతంగా క్లీన్ అడ్మినిస్ట్రేషన్ ని అందిచటంలేదని, దేశంలో అవిద్య, దారిద్ర్యం ఉన్నా మునుపెప్పుడూ ఎమర్జెన్సీని ప్రకటించలేదని, ఇది ప్రపంచం ముందు సిగ్గుపడే విషయమని, యుద్ధాలప్పుడు ఎమర్జెన్సీని పెట్టవచ్చుగాని, అంతర్గతవ్యహారాలను పరిష్కరించలేక ఎమర్జెన్సీని ప్రకటించటం తప్పని అంటాడు. స్వరాజ్యం స్త్రీ పాలన యిష్టంలేక ఆమెను వ్యతిరేకిస్తున్నారని అంటే గోపాలరావు నైతికదృక్పథానికి, మానవతావిలువలకు ఆడామగ భేదం లేదని అంటూ ఎమర్జెన్సీ

ప్రభావాన్ని వారిద్దరు తీవ్రంగా చర్చించుకున్నారు. ఇక్కడ గోపాలరావు తనకు వ్యక్తిగతంగా ఇందిరాగాంధి అంటే గౌరవం ఉందని చెప్పాడంటే రాజకీయపాలనలోని పొరపాట్లకు ఆడామగ భేదం ఉండకూడదని గోపాలరావు అభిప్రాయం. అతడు కాంగ్రెస్ వాదిగా పెరగటంతో ఆ పార్టీయెడల అభిమానం ఉందనీ, స్వరాజ్యం మాటలలో గోపాలరావు కాంగ్రెస్ కే ఓటువేసినా దేశరక్షణకోసం ఆ స్థానంలో మరొకరు వచ్చినా సంతోషించాడని అర్థమై, గోపాలరావులో స్వాతంత్ర్యపోరాటంనుండి ఉన్న మౌలికభావనలు స్వాతంత్ర్యానంతరం కూడా అతనిలో చెక్కుచెదరలేదని అర్థమౌతుంది.

గోపాలరావు తల్లి సుబ్బమ్మకు చిన్నకొడుకుమీద గాలిమళ్ళి అతనింటికి వెళ్ళి ఉంటోంది. ఒకరోజు సుబ్బమ్మను హత్యచేసి, ఆమె నగలను ఎవరో ఎత్తుకుపోయారనే కబురు తెలిసి గోపాలరావు, పార్వతి, స్వరాజ్యలక్ష్మి వెళ్ళారు. పార్వతి నగలను తీసుకున్నది బయటవారి పనిగాదని, తమ్ముడు బుచ్చే తల్లిని హత్యచేసి నగలను తీసుకున్నాడని గోపాలరావుకు అనిపించినా, చూడనిది ఎవరిని నిందించ కూడదనుకొంటాడు. పోలీసు కేసుపెట్టినా అది ఫైళ్ళల్లో నిద్రపోతూ ఉంటుందిగాని, సత్యంమాత్రం అధికారంకింద మరుగున పడుతుందని అనుకుంటాడు. తల్లి బలవన్మరణంతో గోపాలరావుకు మనుష్యులమీద నమ్మకంపోయింది.

ఎమర్జెన్సీని విమర్శిస్తూ రాసినందుకు పత్రిక సర్కులేషన్ తగ్గి జీతాలు యివ్వలేక యాజమాన్యం ఉద్యోగస్తులను కావాలంటే రిటైర్ మెంటును తీసుకోవచ్చని చెప్పింది. స్వాతంత్ర్యానంతరం దేశం అంధకారంలోకి వెడుతోందా, కాంతివలయంలోకా అని అనిపిస్తుంటే గోపాలరావుకు నిద్రపట్టేదికాదు. ఎమర్జెన్సీని ప్రకటించి ఏడాది గడిచింది. అప్పుడు స్వరాజ్యం ఎమ్.ఎ. రెండవసంవత్సరంలోకి వచ్చింది. ఒకరోజు తోటివిద్యార్థి బాగారాసినా మార్కులు తక్కువ వచ్చినందుకు స్నేహితురాతోపాటు విషయాన్ని ప్రొఫెసర్లవద్ద సమస్యపరిష్కారం కాకపోయేసరికి వైస్ ఛాన్సర్ తో చెప్పటానికి వెళ్ళింది. ఆవిషయాన్ని తెలిసి మరికొంతమంది విద్యార్థులు గుంపుగా వచ్చి మాట్లాడుతుంటే పోలీసులు వచ్చి స్వరాజ్యలక్ష్మిని మరోఐదుగురిని అరెస్టుచేసి పోలీసుస్టేషన్ లో ఉంచారు. ఎమర్జెన్సీ అవటంవల్ల ఆ విషయాన్ని చాలా రహస్యంగా ఒకవిద్యార్థి గోపాలరావుకు చేరవేయగా అతడు కుప్పకూలిపోయాడు. ఎడిటర్ లేవదీసి, అతనితో బుచ్చి సహాయంతో స్వరాజ్యలక్ష్మిని విడిపించకపోతే నక్సలైట్ అంటూ శాశ్వతంగా జైలుపాలు చేస్తారు కాబట్టి బుచ్చి రికమండేషన్‌తో విడిపించమంటాడు. చేసేదిలేక గోపాలరావు అభిమానాన్ని చంపుకొని తమ్ముడైన బుచ్చి దగ్గరకువెళ్ళగా, అతడు నిర్లక్ష్యంగా మాట్లాడేసరికి గోపాలరావు స్వరాజ్యాన్ని విడిపించకపోతే తల్లిని చంపిన కేసును తిరగతోడుతానని బెదిరించేసరికి, బుచ్చి తన ఎమ్.పి. పదవి పరపతితో స్వరాజ్యలక్ష్మిని విడిపించాడు. కాని గోపాలరావు

తాను బుచ్చిని బెదిరించటం నేరమని, పరిస్థితులకు తాను నేరస్థుడు కావాల్సివచ్చిందని బాధ పడ్డాడు. స్వరాజ్యంతో ఎవరిజోలికి వెళ్ళకపోతే ఏగొడవ ఉండదని అంటాడు. దానికి స్వరాజ్యం తనకు ఊహ తెలిసినప్పటినుండి అన్యాయాన్ని ఎదిరించటంలో అధైర్యపడకని చెప్పిన తాతయ్యవేనా అని, లాఠీదెబ్బలు తిని జైళ్లో ఉండిన తాతయ్యవేనా మాట్లాడేది అని అడిగింది. గోపాలరావు తమ రోజుల్లో (అంటే స్వాతంత్రక్యోద్యమకాలంలో) అందరికి ఒకే న్యాయం ఉండేదని, కాని ఈరోజుల్లో (అంటే స్వాతంత్ర్యానంతరం) కొద్దిమందికే న్యాయం జరుగుతోందని, అడవిలో ఉండి వేటగాడి బాణంనుండి న్యాయం అడగటం తెలివితక్కువతనమని అంటాడు. వేటగాడి అస్త్రాలన్నీ ఖాళీఅయ్యేంతవరకు ఎన్నాళ్లైనా పడి ఉండాల్సిందేనని చెప్పాడు. ఇందిరాగాంధి ఎమర్జెన్సీని కొనసాగిస్తూండటం చేతనే నీవు కటకటాలపాలయ్యే దుస్థితి వచ్చిందని స్వరాజ్యలక్ష్మికి చెప్పినా, తనకు అపకారం జరిగినా దేన్ని ద్వేషించనంత మానసిక పరిపక్వత స్వరాజ్యంలో ఏర్పడిందని గోపాలరావుకు అర్థమైంది. ఇదంతా గోపాలరావుయొక్క పెంపకంలోని గొప్పతనమని పాఠకుల స్ఫృహకు అందుతుంది.

ఇందిరాగాంధి ఎమర్జెన్సీని రద్దుచేసింది. ఎలక్షన్‌లు వచ్చాయి. ఎమర్జెన్సీపెట్టడం వల్ల ఆమె ఎన్నికలలో ఓడిపోయింది. జనతాప్రభుత్వం పాలనలోకి వచ్చింది. కాని ప్రభుత్వానికి ప్రజాపాలన మీదకన్నా ఇందిరాగాంధిని కేసులలో యిరికించి జైల్లో పెట్టించాలనే దృష్టి ఎక్కువై కోడిపెట్టను దొంగిలించిదనే ఆరోపణలతో చిన్నకేసుపెట్టి జైల్లో పెట్టించారని గోపాలరావు ఇందిరాగాంధిని సమర్థిస్తుంటే, స్వరాజ్యలక్ష్మి ఆశ్చర్యపోతుంది. గోపాలరావు ఇందిరాగాంధి అంటే తనకూ అభిమానమేనని, కాని ఆమె చుట్టూ ఉన్నకోటరీవల్ల ఆమె ఎమర్జెన్సీప్రకటించడం వంటి తప్పులు చేసిందని అంటాడు. గోపాలరావుకు స్వరాజ్యకోసం పోరాడిన కాంగ్రెస్ అంటే అభిమానం. జనతా ప్రభుత్వ సమయంలోనే స్వరాజ్యం ఎమ్.ఏ. పూర్తిచేసి ప్రైవేటుస్కూల్ లో టీచరుగా చేరింది. అక్కడ విద్యార్థులనుండి ఎక్కువఫీజులు తీసుకుంటున్నాకూడా వారికి తరగతి లోను, బాత్ రూమువంటి సదుపాయాలు లేకపోయేసరికి అన్యాయమని యాజమాన్యంతో వివాదంపెట్టుకొని ఆ ఉద్యోగానికి రాజీనామా చేసింది. అంటే ఏ ప్రభుత్వం ఉన్నా అన్యాయపుదోపిడి ఒకటిగానే ఉంటుందని అర్థమౌతుంది. అదే సమయంలో అధికార రాజకీయాలతో అసంతృప్తిగల సభ్యుల అసమ్మతితోను జనతాప్రభుత్వం కుప్పకూలిపోవటం జరిగి తిరిగి ఎన్నికలు రావటం, ఇందిరాగాంధి ప్రధానమంత్రి కావటం జరిగింది.

గోపాలరావు రిటైర్ అవటంతో స్వరాజ్యానికి నచ్చినవ్యక్తితో పెళ్లి జరిపించితే తనబాధ్యత తీరుతుందనుకొన్నాడు. కాని గోపాలరావుకు తనపెళ్లిచేసే బాధ్యత ఉన్నట్లే స్వరాజ్యలక్ష్మికూడా తనకు

వాళ్ళను చూడాల్సిన బాధ్యత ఉందని, తనకు నచ్చినవ్యక్తి తటస్థించినప్పుడు పెళ్ళిచేసుకుంటానని చెప్పింది. ఇంతలో ఒకరోజు ఇందిరాగాంధి హత్యచేయబడిందనే వార్తవచ్చింది. స్వరాజ్యానికి ఏడుపువచ్చింది. ఆ ఊరిని వదిలి చీరాల వెళ్ళిపోదామంది. స్వాతంత్ర్యోద్యమంలో పోరాడినవారిని, జీవితంలో అలిసిన వృద్ధులను చూసుకోవాల్సిన అవసరం ఉందని భావించిన స్వరాజ్యలక్ష్మి అక్కడకువెళ్ళి జానకమ్మలాంటి వారితోను, మీతోను వృద్ధాశ్రమాన్ని మొదలుపెట్టి సేవచేయాలని అనుకుంటున్నట్టుచెప్పింది. పెళ్ళే తనకు గమ్యంకాదని జానకమ్మగారిచ్చిన పదివేలరూపాయలతో మొదలుపెడితే ఆ తర్వాత డబ్బు దానంతట అదే సమకూరుతుందని భరోసా యివ్వగలిగింది. అప్పుడు గోపాలరావుకు జానకమ్మగారికున్న దూరదృష్టితో ఆమెకు భవిష్యత్ వాణిని గుర్తించగల అపూర్వశక్తి ఉన్నదని అనిపించి, ఆమె కలగన్నదానిని స్వరాజ్యలక్ష్మి తన హృదయనేత్రంతో చూస్తోందనే విస్మయానికి గురి అయ్యాడు. దేశభవిష్యత్తు బాధ్యతను ఫలవంతంచేయటం యువతచేతిలో ఉందని, అందులో స్వరాజ్యలక్ష్మి విజయంపొందాలని ఆకాంక్షిస్తూ గోపాలరావు చీరాలకు ప్రయాణం సాగించాడు. బ్రిటిష్ పరిపాలననుండి దేశాన్ని విముక్తిచెందించి స్వాతంత్ర్యాన్ని పొంది ప్రజాప్రభుత్వం ఏర్పాటుచేసుకొనే లక్ష్యం ఆనాడు తమదైతే, స్వాతంత్ర్యానంతరం రాజకీయాలకు అతీతంగా స్వచ్ఛందంగా ప్రజాసేవకు పూనుకోవటం ప్రస్తుత యువత ధ్యేయమని భారతదేశస్వాతంత్ర్యానికి సంరక్షణ అని గోపాలరావు భావించాడు. గోపాలరావుపాత్ర నవల మొదటినుండి చివరివరకూ గాంధీదృక్పథంతో పెరిగి అహింసనే పాటిస్తూ జీవించిన ప్రధానపాత్ర. ఒక దేశభక్తుడిగా గోపాలరావు పాఠకులలో దేశాభిమానం ఏర్పడేవిధంగా చైతన్యపరిచే చిరస్మరణీయమైన శాంతమూర్తిగా, త్యాగమూర్తిగా స్పష్టమౌతాడు. భారతదేశపు జెండా కాంతిలో దేశభక్తిగల యువతకు చిరస్థాయిగా దృశ్యమాన మవుతూనే ఉండే నవలలోని ప్రధానపాత్ర పాత్ర గోపాలరావుది.

7.1.5. నందయ్య

నందయ్య ఒకహరిజన విద్యార్థి. సత్తెనపల్లి వాస్తవ్యుడు. తండ్రిది చెప్పులుకుట్టే కులవృత్తి. ఆరుగురు తమ్ముళ్ళు, ముగ్గురు అప్పచెల్లెళ్ళు గల మాలదాసరి కుటుంబానికి చెదినవాడు. నందయ్యవాళ్ళనాన్న గురువుదగ్గర నేర్చుకున్న తత్వాలు, రామాయణ, భారతాలలోని పద్యాలు పాడతాడని, తాముస్నానం చేయనిది అన్నంతినమని, నీచు తినమని నందయ్య గోపాలరావుతో చెప్పాడు. ఈతని తెలివితేటలను గుర్తించిన దేశభక్త కొండా వెంకటప్పయ్యగారి సహాయసహకారాలతో బందరులోని జాతీయపాఠశాలలో నందయ్య చేరాడు. క్లాసులోను, భోజనశాలలోను అగ్రకులాల వాళ్ళు అతడ్ని దూరంపెట్టినా, రాముడత్తయ్య దగ్గర గాంధేయదృక్పథంతో పెరగిన తోటి విద్యార్థియైన

గోపాలరావు ఇతనికి అండగా ఉన్నాడు. అంతేకాక మిగిలిన వారికి కులమతాలు స్వాతంత్ర్యసాధనకు అడ్డుగోడలని, కాంగ్రెస్ జాతీయవాదులకు ఉండకూడదని తన స్నేహితుడైన గోపాలరావు గాంధేయ దృక్పథాన్ని బోధించటంతో విద్యార్థులందరూ నందయ్యను తమతో కలుపుకున్నారు. అందరిలోకి మొహమాటస్థుడైన అయిన నందయ్య విద్యార్థిగా ఉన్నప్పుడు బిగుతైన ఖద్దరు బట్టలతో, బాగా నూనెపట్టించిన తలతో, చురుకైన కళ్ళతో చదువులో, చేతిపనులలో చురుకుగా ఉండేవాడు. చాకుతో కర్రముక్కను బొమ్మకింద చెక్కేవాడు. నందయ్యలో ఉన్న శిల్పకళాచాతుర్యం తోటి విద్యార్థులను ఆకర్షించటంతో అతడంటే వ్యతిరేకభావంపోయి నందయ్యతో అందరూ స్నేహంచేసారు.

నందయ్యకు తెలివితేటలు, గ్రహణశక్తి ఎక్కువ. సర్కారువారిచేత నిషేధింపబడినప్పటికీ, పంచముల స్వీయోద్ధరణను గురించి ఉన్నవ లక్ష్మీనారాయణగారు రాసిన 'మాలపల్లి' అనే నవల ఆతనికి యిష్టం కాబట్టి అప్పటికే ఆరుసార్లు చదివాడు. అందుకే గోపాలరావుకూడా ఆ నవలను తీసుకొని చదివాడు. ఒకరోజు నందయ్యచేతిలో మాలపల్లి నవలను చూసిన పోలీసులు ప్రభుత్వవ్యతిరేక చర్యగా భావించి రెండేళ్ళ జైలుశిక్షను వేసి చిన్నవాడైన నందయ్యను బోర్డర్సు[17] స్కూల్ లో వేసారు.

నందయ్యను విడుదలచేయగా బెనారస్ వచ్చి హిందూ విశ్వవిద్యాలయంలో చేరాడు. గోపాలరావు కూడా మామగారు చేర్పించగా అదే విద్యాలయాలంలో చేరి, అక్కడే చదవుకుంటున్న నందయ్య కనపడేసరికి ఆనందపడ్డాడు. గోపాలరావు నందయ్యను జైలుకెళ్ళి విడుదలయైన విషయాలను అడగగా, నందయ్య తాను ఇకనుంచి విప్లవకరసాహిత్యం చదవనని రాసిస్తే వదిలిపెట్టారని, కాని తాను ప్రభుత్వవ్యతిరేకమైన చర్యలు చేయనని రాసియ్యలేదని చెప్పాడు. అంటే చదువుకునే రోజులలో నందయ్యకు దేశభక్తి పుష్కలంగా ఉండేదని అర్థమౌతుంది. గోపాలరావు తన రూములోనే ఉండమంటే నందయ్య తాను హరిజనుడు అవటంచేత సీటురావటానికే పెద్దసిఫారసు కావాల్సి వచ్చిందని, తన సీటువిషయంలో బెనారసు విశ్వవిద్యాలయ స్థాపకుడైన మాలవ్య అంగీకరించినా సంస్కృతపండితులు, విద్యార్థులు, లెక్చరర్లు ఆటంకపెట్టారని చెప్పాడు. కాని హరిజనోద్ధరణకై పాటుపడే దేశభక్త కొండా వెంకటప్పయ్య వారితో వాదించి తాను ఉచితంగా చదువుకోవటానికి ఏర్పాట్లుచేసినట్టును, తాను క్లాసులోగాని హాస్టలులోగాని వారికి దూరంగా కూర్చునేటట్లయితేనే ఇందులో చేరి చదవటానికి ఒప్పుకున్నారని చెప్పాడు. ఇక యిప్పుడు అగ్రవర్ణాలగదిలో ఉంటానంటే ఒప్పుకుంటారో లేదో అని సందేహమని, నీలాంటి ఒకరిద్దరు ఒప్పుకున్నా, హరిజనులకు పేరుమారినా వారిని అస్పృశ్యులుగానే చూస్తున్నారని చెప్పాడు. అంతేకాదు,

తనకు మెట్రిక్‌లో 85 శాతం మార్కులు వచ్చినా, తాను హరిజనుడు కావటంచేత మెరిట్ మీద సీటు యివ్వలేదని, తమకులం అంటే అసహ్యంతప్ప చేయూతనిచ్చి పైకితీసుకురావాలని ప్రయత్నించటం లేదని అన్నాడు. దానికి గోపాలరావు నందయ్య కలెక్టరు అయితే అందరూ నెత్తినపెట్టుకుంటారని అంటే, బ్రిటిష్‌వాళ్ళ ప్రభుత్వంలో అటువంటి బానిస ఉద్యోగం తాను చేయనని నందయ్య అన్నాడు. అయితే రాజకీయాలలో మునిగి మంత్రివి అయినప్పుడు జనం బ్రహ్మరథం పడతారని గోపాలరావు అంటే, అది వ్యక్తిగా తనకు కాదని, తన పదవికి బ్రహ్మరథం పడతారని భవిష్యత్తువాణిలా పలికాడు. నందయ్యకు పదవి ఎంతగొప్పదో విద్యార్థిదశలోనే ఆకళింపు చేసుకున్నాడు. ఒక హరిజనుడికి మెరిట్ ఉన్నా అందరిలా చదువుకోవాలంటే ఎంతకష్టమైన విషయమో, తమ జీవితాలు బాగుపడాలంటే పరిస్థితులు ఎలా ఉండాలో నందయ్యకు చిన్నప్పుడే అర్థమైంది. గోపాలరావు వచ్చి నందయ్యరూమ్ లో ఉండటంతో మిగిలిన విద్యార్థులు మెల్లమెల్లగా నందయ్యతో కలిసి పోయారు.

నందయ్య, గోపాలరావు కాశీవిశ్వవిద్యాలయంలో చదువుకుంటున్నప్పుడే లాలాలజపతి రాయ్ మరణానికి కారణమైన సార్జెంటు సాండర్సుని హత్యచేయటానికి పార్లమెంటుపై బాంబు విసిరిన భగత్ సింగ్ కుట్రగురించి వాదోపవాదాలు జరుగుతుండేవి. ఆ కేసు జరుగుతున్నప్పుడే రాజకీయఖైదీలు నేరస్థులు కారనే వివాదం చెలరేగింది. ఇద్దరిని జైళ్ళల్లో ఒకే రకంగా చూస్తున్నందుకు రాజకీయ ఖైదీలు జైలు అధికారులకు, బ్రిటిష్ ప్రభుత్వానికి బుద్ధి రావటానికి సత్యాగ్రహం చేస్తున్నారంటే, అవసరమైతే నిరాహారదీక్ష చెయ్యాలని నందయ్య అన్నాడు. ఎన్నాళ్ళు నిరాహారదీక్షను చేస్తారని అన్న తోటి విద్యార్థి త్రిపాఠితో నందయ్య ఎన్నాళ్ళైనా చెయ్యాలి అని, దేశస్వాతంత్ర్యంకోసం ప్రాణాలకు తెగించి ఒక సిద్ధాంతంతో పవిత్ర ఆశయంతో పోరాడుతున్న రాజకీయఖైదీలను, నేరస్థులను జైల్లో ఒకే చోట ఉంచటం దారుణం అని అన్నాడు. అంతేకాదు, జలియన్ వాలా బాగ్ లో మారణకాండకు పూనుకున్న డయ్యరును, పచ్చి నెత్తురుతాగే సార్జంటును నేరస్థులుగా చూస్తే బ్రిటిష్ వాళ్ళు ఒప్పుకుంటారా అని, వర్తకం చేసుకుంటామని వచ్చి మెల్లిమెల్లిగా భారతదేశాన్ని ఆక్రమించుకొని, మనజాతి మీద దురహంకారం ప్రదర్శిస్తున్న వాళ్ళకు, నీతి, న్యాయం ఎక్కడున్నాయని అని నందయ్య క్రోధంతో అన్నాడు. విద్యార్థి దశలో ఉన్న నందయ్య ఆర్థికదోపిడికై దేశాన్ని ఆక్రమించుకున్న బ్రిటిష్ వారికి వ్యతిరేకిగా, గొప్ప దేశభక్తుడిలా ఉన్నట్టు స్పష్టమైంది. జితేంద్రనాథ్ దాస్ అరవైమూడు రోజుల నిరాహారానంతరం అశువులను కోల్పోయాడు. ఆ స్వాతంత్ర్యయోధుని ఊరేగింపులో పాల్గొనటానికి కలకత్తాకూడా వెళ్ళివచ్చిన దేశభక్తుడు నందయ్య అని అర్థమౌతుంది.

ఉప్పుసత్యాగ్రహ ఉద్యమంలో నందయ్యకూడా అరెస్టుకు గురి అయినట్టు పార్వతి మాటలలో అర్థమౌతుంది. కాని నందయ్య ఎక్కడా ప్రత్యేకంగా ఆ విషయాన్ని వ్యక్తీకరించలేదు. దేశంలో 1937సం. లో ఎన్నికలు జరిగినప్పుడు మద్రాసు ప్రావిన్స్ రాష్ట్రశాసనసభకు హరిజన నియోజక శాసనసభ్యుడిగా[18] నందయ్య ఎన్నికయ్యాడు. కాంగ్రెస్ శాసనసభ్యులు ప్రభుత్వంలో ఎక్కువరోజులు కొనసాగలేదు[19]. 1946 లో తిరిగి ఎన్నికలు[20] జరిగాయి. అప్పుడు జైల్లో ఉన్న గోపాలరావు తరపునకూడా నామినేషన్లను నందయ్య వేసాడు. అదే సమయంలో జైలునుండి విడుదలయి యింటికి వచ్చిన గోపాలరావును, అదే రోజు నందయ్య కలిసి మద్రాసు రాష్ట్రశాసనసభకు త్వరలో జరగబోయే ఎలక్షన్లలో తామిద్దరు పాల్గొనాలని చెప్పాడు. దేశంకోసం జైలుకెళ్ళటంచేత గోపాలరావు అంటే ప్రజలలో గౌరవం ఏర్పడిందని, గెలుస్తావని అనగా, గోపాలరావు తాను ఆలోచించుకోవాలని చెప్పాడు. నందయ్య వ్యవధిలేదని నాలుగు రోజులపాటు విశ్రాంతి తీసుకోమని, చీరాల నియోజకవర్గంలో గోపాలరావును నిలబెట్టాలని అతనికోసం ఎదురుచూస్తున్న జానకమ్మను కలవమని చెప్పాడు. ఎన్నికలలో నిలబడి దేశానికి సేవ చేయవచ్చని భావించి చివరకు గోపాలరావు ఎలక్షన్లలో నిలపడతాడు. నందయ్య, గోపాలరావు యిద్దరూ ఎన్నికలలో గెలుస్తారు. మంత్రి పదవికి గోపాలరావు ఎటువంటి రికమండేషను చేసుకోనంటాడు. నందయ్యకు మాత్రం హరిజనశాఖామంత్రి పదవిని యిచ్చారు. నందయ్య తన విజిటింగ్ కార్డు యిచ్చి గోపాలరావు మద్రాసు వచ్చినప్పుడల్లా తనని కలవమని చెప్పాడు. స్వాతంత్ర్యానికి పూర్వం వరకు నందయ్య నిజాయితీయైన దేశభక్తుడు. స్నేహితుడైన గోపాలరావంటే అభిమానం. అయితే స్వాతంత్ర్యానికి పూర్వంనుంచి నందయ్యకు రాజకీయ పదవులంటే యిష్టమని అర్థమౌతుంది.

దేశస్వాతంత్ర్యానంతరం 1952 సం.లో మొదటిసారిగా ఎన్నికలు జరిగి నందయ్య రెండవసారి మినిష్టరు అయ్యాడు. ప్రజాసేవకి పదవి అవసరంలేదనుకొని గోపాలరావు ఈ సారి ఎన్నికలలో నిలబడలేదు. ఒకరోజు గోపాలరావు ఒక హరిజనవిద్యార్థికి కాలేజిలో సీటుకోసం, అతనికి హాస్టల్‌లో ఉచిత వసతి, భోజన సౌకర్యాలకై హరిజనమంత్రిగా ఉన్న నందయ్య దగ్గరికి ఆ విద్యార్థిని కూడా పెట్టుకొని తీసుకొని వెళ్ళాడు. గోపాలరావు లోపలికి కబురు పంపినా ఎంతసేపటికి నందయ్య దర్శనం కాలేదు. చివరికి బయటకు వెళ్ళటానికి కారుదగ్గరకు వచ్చిన నందయ్యను గోపాలరావు కలిస్తే, నందయ్య తాను అర్జెంటు పనిమీద వెడుతున్నానని, తర్వాత కలవమని చెప్పేసరికి నందయ్యలో ప్రవేశించిన అధికార రాజకీయనాయకుని తత్వం గోపాలరావుకు బోధపడింది. హరిజన విద్యార్థికోసం మూడురోజుల తర్వాత గోపాలరావు ఈ సారి ఒంటరిగా నందయ్యను కలిసి ఆ విద్యార్థి సీటుకోసం

అర్థించాడు. దానికి నందయ్య ఆ పిల్లవాడు తన కూతురిని పెళ్ళిచేసుకుంటే చదువు చెప్పిస్తానని అంటాడు. సాతంత్ర్యానంతరం స్త్రీపురుషులకు సమానహక్కులని భారతరాజ్యాంగాన్ని రాసుకుంటే, ఒక మంత్రిగా తన కూతురుని చదివించలేనివాడు, యిక దేశప్రగతికై ఉపయోగపడే స్త్రీవిద్యకు ప్రాధాన్యత యివ్వలేని ప్రజాస్వామ్యఅధిపతి, దేశానికి ఎటువంటి సేవచేయగలడో గోపాలరావుకు స్పష్టమైంది. పైగా పూర్వం తాను తమ కులంవారిని చదివించిన తరువాత, పిల్లలు తనకు అల్లుడవటానికి ఒప్పుకోక తనని మోసంచేసినట్టు వాపోయాడు. తన అధికారంతో స్వార్థంతో తన కులంలోని మగపిల్లలమీద ఆధిపత్యాన్ని కోరుకోవటమేమిటని భావించిన గోపాలరావుకు నందయ్య కొద్ది కొద్దిగా అర్థం అవుతున్నాడు. పైపెచ్చు అగ్రకులాలవారు తమని యింకా అంటరాని వారుగానే చూస్తున్నారని, తాను మొదటిసారి మంత్రి అయినప్పుడు ఆదర్శాలు వల్లిస్తూ కూర్చొన్నానని, కాని రాజకీయాలకిందపడి ఆదర్శాలు నుజ్జు నుజ్జయినాయని చెప్పాడు. పైకి ఆదర్శాలు వల్లిస్తామని, అందుకే తాను ఈసారి తెలివి మీరానని, పైనవాళ్ళు పైనే ఉండాలని, కిందవాళ్లు కిందే ఉండాలనేదే న్యాయమని నిర్ణయానికి వచ్చినట్టు చెప్పాడు. తనలాంటివారు చెడిపోవటానికి రాజకీయాలే కారణమని నందయ్య అనేసరికి, స్వాతంత్ర్యానంతరం రాజకీయాలు నందయ్యలో అధికారాన్ని, స్వార్థాన్ని పెంచాయని గోపాలరావుకి అర్థమైంది. కనీసం తన కులంవారిని ఉద్ధరించటానికి కూడా అతడు తన రాజకీయపదవిని సద్వినియోగించటం చేయటం లేదని గోపాలరావుకి అర్థమైంది. అందుకే యిక్కడ రావూరి ఏకాంబరం అనే కవి 'అంబేద్కరీయులకు అంబేద్కరీయులే ఆగర్భశత్రువులని' రాసిన కవితాపంక్తులు పాఠకులకు గుర్తుకు రాకమానవు[21]. అటువంటి నందయ్యను ఇక ఆ హరిజన పిల్లవాడివిషయంలో గోపాలరావు కలుసుకోలేదు.

తెలంగాణా ఉద్యమంవచ్చేసరికి తన భార్యాబిడ్డలను సొంతూరికి పంపి తెలంగాణానుండి నందయ్య ఆంధ్రప్రాంతానికి ఊడిపడ్డాడు. ఒకరోజు కలుసుకోవటానికి వచ్చిన నందయ్యతో గోపాలరావు తాను విశాలాంధ్ర ఉద్యమమప్పుడే రాష్ట్రం ముక్కలవుతుందని చెప్పానుగా అన్నాడు. దానికి నందయ్య కోస్తావాళ్ళందరూ చదువుకున్నారని, తెలివైనవారని, ఉద్యోగాలన్నీ ఆంధ్రావాళ్లు కొట్టుకుపోతున్నారని తెలంగాణావాళ్ళ ఏడుపు అని తనని తాను సమర్థించుకొన్నాడు. తమయింట్లో జొరబడి అన్నీ ధ్వంసం చేసారని, తనకు హైద్రాబాదులో ఎన్ని ఇళ్ళున్నా కట్టుబట్టలతో వచ్చేసామని, తన అల్లుడికోసం అక్కడ ద్రాక్షతోటలు కొన్నానని, తెలంగాణాలోని తన ఆస్తిపాస్తులనుగురించి గోపాలరావు ముందు ఏకరువు పెట్టాడు. పైపెచ్చు తెలంగాణా ఉద్యమం రాజకీయాలలోని చిన్న ఆట అన్నాడు. పొట్టి శ్రీరాములు చనిపోయినప్పుడు పక్కపక్కనే తిరిగిన నందయ్య తెలంగాణా

ఉద్యమం వచ్చినప్పుడు కోస్తాంధ్రవారికి ముల్కీసర్టిఫికెట్లను[22] యిప్పించి లక్షలు సంపాదించాడని అందుకే ఈతని యింటినే వారు ధ్వంసంచేసారని నందయ్యమాటల్లో గోపాలరావుకు అర్థమైంది. స్కాలర్‌షిప్‌తో, ఆశయాలతో జీవితం ప్రారంభించిన నందయ్య కరుడుకట్టిన రాజకీయవాదిగా మారిపోయినట్టు అనిపించింది గోపాలరావుకు. నందయ్య జీవితవిధానం, ఆతని చుట్టూ పకరిసరాలు ఏనాడో కుళ్ళిపోయాయని, అతనిని బాగుపరచటం తనకి అసాధ్యమని, నందయ్యకు స్నేహితుడైన గోపాలరావుకి అనిపించింది.

ఒకరోజు గోపాలరావు తమ్ముడైన బుచ్చి వచ్చి గుంటూరు-విజయవాడమధ్యన భూమిని ప్రభుత్వం స్వాధీనపరచుకొని స్వాతంత్ర్యోద్యమ సమయంలో జైలుకువెళ్ళిన రాజకీయబాధితులకు అప్లికేషన్ పెట్టుకుంటే ఐదెకరాలభూమిని రిజిష్టరు చేస్తున్నారని చెప్పాడు. ఆ పొలాలను కొన్నాళ్లకు ఇంటిస్థలాలుగా మారుస్తారని, అప్పుడు అమ్మితే చాలా డబ్బు వస్తుందని, అప్లికేషన్ రాసిస్తే తనతిప్పలు తాను పడి పొలాన్ని గోపాలరావుకు ఇప్పిస్తానని తనతో నందయ్య చెప్పాడని బుచ్చిచెప్పాడు. ఒకానొకప్పుడు నందయ్యను అక్కున చేర్చుకున్న గోపాలరావు స్వాతంత్ర్యానంతరం నందయ్యలో వచ్చిన అవినీతిరాజకీయాలకు అసహ్యపడుతూ నందయ్యను తనతో పాటు చదువుకున్నాడని, స్నేహితుడని చెప్పుకోవటానికి సిగ్గుపడుతున్నట్టు చెప్పాడు. స్వాతంత్ర్యానికి పూర్వం దేశభక్తుడిగా ఉన్న నందయ్య స్వాతంత్ర్యానంతరం రాజకీయ అవినీతిపరుడైన ప్రజానాయకుడిగా మారినందుకు చిన్నప్పటినుంచి స్నేహితుడైన గోపాలరావు ఆతనివ్యక్తిత్వాన్ని అసహ్యపడేస్థితిలో నందయ్య ఉన్నట్టు అర్థమౌతుంది.

గోపాలరావు చీరాలవెళ్ళి జానకమ్మను కలిసినప్పుడు ఆమె నందయ్యవచ్చి తనని కలిసి, స్వాతంత్ర్యోద్యమ సమయంలో జైలుకెళ్ళిన వారికి ఐదెకరాలభూమిని ఇస్తున్నారని చెప్పి అప్లికేషన్ పూర్తిచేసి యిమ్మని అడిగాడని చెప్పింది. అయతే అప్పటికే ఆతని అవినీతినిగురించి తాను వినటంచేత, నందయ్య తనచేత సంతకం పెట్టించుకొని ఆపొలాన్ని కాజెయ్యాలని చూస్తున్నాడని అర్థమై యివ్వలేదని చెప్పింది. కాని ఆతర్వాత తాను ఆ పొలాన్ని పొంది, బీదలు ఉపయోగించు కునేటట్టు చేసానని చెప్పింది. ఇక్కడ నందయ్య ప్రజలదృష్టిలో అవినీతిపరుడనే ముద్రను వేయించుకున్నట్టు అర్థమౌతాడు. అంటే నందయ్య ప్రజాసేవలక్ష్యంగా రాజకీయపదవిని పొందలేదని, స్వార్థంకోసమే మంత్రిపదవిని ఆశించాడని అర్థమౌతుంది. ఇలాంటి రాజకీయనాయకుల చేతిలోకి ప్రజాస్వామ్యం వెళ్ళిపోవటమే దేశదారిద్ర్యానికి దారితీసిందని, ప్రజాస్వామ్య మనుగడకు ముప్పును తెస్తుందని ఆ సందర్భంలో పాఠకుల మనసులు ఆవేదనచెందుతాయి అనటంలో అతిశయోక్తిలేదు.

నవలలో నందయ్య స్వాతంత్ర్యానికి పూర్వం యువకుడిగా ఆదర్శవంతుడైన హరిజనవిద్యార్థి అని, సాతంత్ర్యానంతరం రాజకీయాలలో రాటుతేలి అధికారం, డబ్బు, స్వార్థం అనే అవినీతి గుండంలో దిగజారిపోయాడని అర్థమౌతాడు. తాను ఎక్కిన నిచ్చెనమెట్లను మరిచిపోయి, కింది స్థాయిలో ఉన్న తన హరిజనకులంలోని వారు ఎప్పటికీ అణచబడే స్థితిలో ఉండటానికి కారకుడైన రాజకీయనాయకుడిగా స్పష్టమౌతాడు. తన స్నేహితుడు, తనను విద్యార్థిసమాజం వెలివేసినప్పుడు తనను ఆదరించి అక్కున చేర్చుకున్న గాంధేయవాది అయిన గోపాలరావుకూడా అసహ్యపడే స్థితిలోకి నందయ్య చేరినట్టు అర్థమౌతాడు. మంత్రి పదవి పొందిన హరిజనుడిగా నందయ్య స్వాతంత్రంకోసం ఏర్పరచుకొన్న లక్ష్యాలలో ఒకటైన సత్యాగ్రహఉద్యమంలో ముఖ్యమైన హరిజనోద్ధరణకు తూట్లుపొడిచినవాడిగాను, దేశప్రగతికి అడ్డుపడిన అవినీతి రాజకీయనాయకుడికి నమూనాగాను, పాఠకుల మనస్సులలో నిలబడతాడు. నందయ్యలాంటి అవినీతి రాజకీయ నాయకులను ప్రజాస్వామ్యంలో ఎన్నుకోకూడదని, వీలయితే ఏరిపారెయ్యాలనే స్పృహ కలిగేటట్లుగా నేటి యువపాఠకులు చైతన్యవంతులు కాగలుగుతారు.

7.1.6.బుచ్చి

గోపాలరావుకు తమ్ముడు ఈ బుచ్చి అనే పాత్ర. అవినీతికి నిలువెత్తు పాత్ర. గోపాలరావు జాతీయపాఠశాలలో చదువుకుంటే బుచ్చిని మాత్రం వాళ్ళ అమ్మ సుబ్బమ్మ అతనిని ఇంగ్లీషు కాన్వెంటులో చేర్పించింది. దానితో కాస్త ఆంగ్ల అక్షరాలు గుర్తుపట్టి పుస్తకాలను చదివే స్థాయికి చేరుకున్నట్టు ఆతని అన్న గోపాలరావు పెళ్ళి సందర్భంలో అర్థమౌతుంది. గోపాలరావు అత్తవారింట్లో బుచ్చి తన వదిన పార్వతితో, పార్వతివాళ్ళ అన్నతో కలిసి ఆంగ్లపుస్తకాలను చూడటంతో, ఆ యింట్లోవారు తమ అల్లుడు గోపాలరావుకంటె బుచ్చినే ఎక్కువగా యిష్టపడేవారు. అంటే బుచ్చికి పాశ్చాత్య నాగరికత అంటే యిష్టంకాబట్టి మొదట్లోనే ఆ పాత్రకు దేశభక్తి శూన్యమని అర్థమవుతుంది. శాసనోల్లంఘన ఉద్యమంలో మూడేళ్ళజైలుశిక్ష అనుభవించి యింటికి వచ్చిన గోపాలరావుకి బుచ్చి వైభోగం అర్థమౌతుంది. బుచ్చి బి.ఏ.పాసయి రెవిన్యూబోర్డులో పనిచేసున్నాడని తరువాత తాసిల్దారు కూడా అవుతాడని బుచ్చికి ఒకధనవంతుడు తన బిడ్డనిచ్చి పెళ్ళిచేసాడు. దానితో యింట్లో బుచ్చికి ఎక్కువ మర్యాద. బుచ్చి యోగ్యుడని భావించిన ఆతని తండ్రి గోపాలరావుతో, అతడు ఉద్యమంలో పాల్గొనలేదని రాసిస్తే బుచ్చి ఉద్యోగం వేయిస్తాడని అంటాడు. బ్రిటిష్ వారి పరాయిపాలనను నిరసిస్తూ భారతీయులు దేశంలో చేపట్టిన సత్యాగ్రహ నిర్మాణ కార్యక్రమాలలో ఒకటి ప్రభుత్వ ఉద్యోగాలకు రాజీనామాచేయటం. కాని దేశభక్తిలేని బుచ్చి అదేసమయంలో తాను ప్రభుత్వ ఉద్యోగం చేస్తుండటమే

కాక, గోపాలరావుని కూడా ప్రభుత్వఉద్యోగంలో వేయిస్తాననడం ఒకరకంగా ఆనాటి కాంగ్రెస్ కార్యకర్తల దృష్టిలో ఇది దేశద్రోహచర్య. రామలక్ష్మి సుబ్బమ్మవిషయంలో చెప్పినట్లుగా తన స్వార్థం చూసుకొన్న బుచ్చి కూడా దేశద్రోహియే.

గోపాలరావు రెండవప్రపంచయుద్ధం జరుగుతున్న రోజులలో భారతీయసైన్యాన్ని సంప్రదించకుండా వారు యుద్ధంలో పాల్గొనాలని నిర్ణయించినందుకు, భారతీయులపై బ్రిటిష్ వారి పెత్తనానికి నిరసనగా గాంధి యిచ్చిన పిలుపును అనుసరించి గోపాలరావు వ్యక్తిసత్యాగ్రహానికి పూనుకున్నాడు. ఆ సమయంలో గోపాలరావు యొక్క మామగారితో కలిసి తహసిల్దారైన బుచ్చి నెత్తిన దొరటోపీతో, ఫుల్ సూటులో తళ తళమెరిసే బూట్లతో, వెండిపొన్నుకర్రతో ఆంగ్లేయుల నాగరికత ఉట్టిపడే నల్లదొరగా అనిపించేవిధంగా వచ్చాడు. గోపాలరావు వ్యక్తిసత్యాగ్రహంలో పాల్గొంటున్నందుకు మామగారు తమ కాంట్రాక్టులను ప్రభుత్వంవారు రద్దుచేస్తామన్నారని చెప్పాడు. దేశసేవకుడైన గోపాలరావుతో బుచ్చి ఆతనిని తన అన్న అని చెప్పుకోవటానికి సిగ్గుగా ఉందని అన్నాడు. అంతేకాక, తాను కుటుబంకోసం కష్టపడి కాపాడుకొస్తున్నానని, గోపాలరావు కుటుంబానికి ఉపకారం చేయకపోయినా ఫరవాలేదుకాని అపకారం మాత్రం చేయవద్దని, కలెక్టరు యిస్తున్న మిలిటరీ కాంట్రాక్టువల్ల పదికాలాలపాటు జమీందార్లలాగా హాయిగా బతకవచ్చని అంటాడు. అదే రోజులలో యుద్ధసైనికులకోసం రైతులు పండించుకున్న ఆహారధాన్యాలను వారిని అనుభవించనీయకుండా, ఆకలితో అలమటిస్తున్నా పట్టించుకోకుండా రెంవప్రపంచయుద్ధ సైనికులకోసం బ్రిటిష్ అధికారులు బలవంతంగా తహసిల్దార్లచేత ధాన్య సేకరణచేసి పంపించేవారు. అటువంటి కాంట్రాక్టు పనులు బుచ్చి తీసుకోవాలనుకోవటం, బుచ్చి స్థానికులైన భారతీయులపాలిటి చేస్తున్న దేశవిద్రోహచర్యగా అర్థమౌతుంది. గోపాలరావు వారిమాటలను పట్టించుకోకపోయేసరికి అతనితో వాగివాగి వెళ్ళిపోయారు.

వ్యక్తిసత్యాగ్రహంలోను, క్విట్ ఇండియా ఉద్యమసమయంలోను (1941సం., 1942సం.లలో) నాలుగేళ్ళజైలుశిక్షను అనుభవించి మిడుదలై బయటకు వచ్చిన గోపాలరావుతో, బుచ్చి జరగబోతున్న రాష్ట్రశాసనసభల ఎన్నికలలో(1946 సం.లో) పాల్గొనమని, పదవికోసం కాకుండా దేశంకోసం నిలబడాలని, బ్రిటిష్ వారు ఛిన్నాభిన్నంచేసిన దేశఆర్థికపరిస్థితి బాగుపడాలంటే, దేశానికి ఆర్థిక సుస్థిరత కలగాలంటే గోపాలరావువంటి జాతీయనాయకులు ప్రజాప్రతినిధులు కావాలని అంటాడు. గోపాలరావు జైల్లో ఉన్నప్పుడే ముందుగానే ఆతని నామినేషన్‌ను నందయ్య వేసాడు. గోపాలరావు యొక్క పదవిని అట్టుపెట్టుకొని మరింతగా సంపాదించాలనుకొన్న బుచ్చి నందయ్యతో కలిసి

గోపాలరావు యొక్క ఎన్నికల ప్రచారప్రణాళిక అంతా తయారుచేసాడు. పైగా బుచ్చి గోపాలరావుకు గీతోపదేశం చేస్తుట్టుగా యుద్ధసమయంలో బ్లాక్ మార్కెట్లో సరకులు అమ్మి లక్షలు గడించి అందరూ ఏడిళ్లను కొనుక్కుంటే తాను మాత్రం రెండేయిళ్ళు కొనుక్కోగలిగానని చెప్పాడు. ఆ మాటలకు గోపాలరావుకు అప్పటికే బుచ్చి యింట్లో ఉన్న సంపద, వంటవాళ్ళు, నౌకర్లతో సంసారం నడుపుతుండటాన్ని చూసేసరికి, కలెక్టరును అపరభగవంతుడిలా కొలిచే బుచ్చి ఉద్యోగం పోవటానికి కారణం ఆతని అవినీతి సంపాదన అని అర్థమైంది. రైతులపొట్టకొట్టి పైకొచ్చినవాడు బుచ్చి అని గోపాలరావుకు అర్థమయింది.

విశాలాంధ్ర ప్రత్యేకరాష్ట్రంకోసం పొట్టి శ్రీరాములు ఆత్మత్యాగంచేసిన రోజులవి. ఆ సమయంలోనే ఒకరోజు బుచ్చి వచ్చి రాజకీయ బాధితులకు ఐదేసి ఎకరాల భూమిని ఉచితంగా పంచిపెడుతున్నారనీ, గుంటూరు–విజయవాడమధ్యన పొలాలను యిస్తున్నారని, ఆ తర్వాత వాటిని ఇళ్ళస్థలాలకింద మార్చి అమ్మితే డబ్బు చాలా వస్తుందని చెప్పాడు. దానికి గోపాలరావు తాను పొలంకోసం ఉద్యమంచేసి జైలుకు వెళ్ళలేదని, తనది ఆనాడుస్వాతంత్ర్యసాధన ధ్యేయమని, అది నెరవేరింది చాలని సమాధానమివ్వగా వెళ్ళిపోయాడు.

మొదటినుండి తల్లి సుబ్బమ్మ తనకొడుకు బుచ్చి యోగ్యుడు, సమర్థుడు అని భావించేది. కాని కొడుకుకీ, కోడలికి తన నగలమీద ఆశ అని తెలుసుకొని పెట్టాబేడా సర్దుకొని, పెద్దకొడుకైన గోపాలరావు యింటికి వచ్చింది. తన హోదాకి తక్కువదనమని, గోపాలరావు యింటి ఛాయలకుకూడా రాని బుచ్చి, ఒకరోజు హఠాత్తుగా కారులోనుండి దిగి గోపాలరావు యింటికి వచ్చి అతనితో దేశంలోని రాజకీయకాలుష్యాన్ని పోగొట్టటానికి రాబోయే ఎన్నికలలో తాను నిలబడాలని అనుకున్నట్టు చెప్పాడు. కాంగ్రెస్ లో అవినీతికి వ్యతిరేకుడైన గోపాలరావంటే అభిమానం ఉందని, ఆతడు సిఫారసుచేస్తే తనకు టికెట్టు యిస్తారని అంటాడు. రాజకీయ అధికారం ఉంటేగాని అవినీతిని అరికట్టలేమని, ఆ అధికారంకోసం తాను ఎన్నికలలో లక్షలు కుమ్మరించాలని అనుకుంటున్నట్టును, సిద్ధాంతాలు, గాంధి నీతులు యిప్పుడు ఎవరికీ పట్టటంలేదని, ఇందిరాగాంధి గురించి కనీస జ్ఞానంలేనివారు నేడు పార్లమెంటులో ఉన్నారని చెప్పి బుచ్చి వెళ్ళిపోయాడు. ఆ తర్వాత బుచ్చి ఎమ్.పి.గా గెలిచి విజయోత్సవాలు జరుపుకుంటూ ఊరేగుతుంటే, ఆతని మెడలోని పూలమాలలో ఒక్కొక్కపువ్వు బుచ్చి అవినీతికి ప్రతీకగా గోపాలరావుకు అనిపించిందంటే బుచ్చిశరీరమంతటా అవినీతి కంపుకొడుతోందని అర్థమౌతుంది.

బుచ్చి ఒకరోజు గోపాలరావు యింటికి వచ్చి తల్లితో బాగా మాట్లాడుతుంటే ఆమెకు బుచ్చి ప్రయోజకత్వం మీద నమ్మకం కలిగింది. అప్పటివరకు బుచ్చి మీదకోపంతో ఆతని యింటికి

వెళ్ళనని భీష్మించుకొని ఉన్న తల్లి, ఆ యింటికి మెల్లగా రాకపోకలు మొదలుపెట్టింది. ఇలా ఉన్న సమయంలో ఒకరోజు బుచ్చి యింట్లో ఆతని తల్లి మెడలోని నగలకోసం ఎవరో తెలియని దుండగులచేతిలో ఆమె హత్యకు గురికాబడ్డదని కబురు తెలిసిన గోపాలరావుకు, ఆ హత్య జరగటానికి తన తమ్ముడికి తల్లినగలపై ఉన్న అత్యాశ అని గుర్తించాడు. కేసు పెట్టినా లాభంలేదనే అధికార వ్యవస్థగుర్తుకువచ్చి ఊరుకుంటాడు.

1975సం. లో ఇందిరాగాంధి తనమీద ప్రతిపక్షాలు, విప్లవవాదులు చేస్తున్న విమర్శలను, కప్పిపుచ్చుకోవటానికి ఎమర్జన్సీని ప్రకటించేసరికి, పోలీసు అధికార వ్యవస్థ ఏ విధమైన అన్యాయాన్ని ఎవరు ప్రశ్నించినా వారిని జైళ్ళల్లో పెట్టే కాలమది. అదే సమయంలో గోపాలరావు మనమరాలైన స్వరాజ్యలక్ష్మి విశ్వవిద్యాలయంలో పి.జి చదువుతుండేది. తన స్నేహితురాలు పరీక్ష బాగా రాసినా తక్కువ మార్కులు వచ్చినందుకు, ఆమెతోపాటు స్వరాజ్యలక్షికూడా ప్రొఫెసర్ల దగ్గరకు వెళ్ళి అడిగినా సమస్యపరిష్కారం కాకపోయేసరికి, వారు వైస్ ఛాన్సులర్ దగ్గరకు వెళ్ళారు. వారు మాట్లాడుతుండగా మిగిలిన విద్యార్థులు గుంపుగా రావటం, పోలీసులను పిలిపించటం, స్వరాజ్యలక్ష్మిని, ఆమెతో పాటున్న తోటి విద్యార్థులను అరెస్టుచేయటం జరిగింది. ఆ విషయం గోపాలరావుకు తెలిసి కుప్పకూలి పోతుండగా, ఆతడు పనిచేసే పత్రికాఫీసు ఎడిటర్ అతనితో ఎమ్.పి అయిన బుచ్చి సహాయంతో స్వరాజ్యలక్ష్మిని విడిపించుకోమని అన్నాడు. లేకపోతే ఎమర్జన్సీ సమయంలో విద్యార్థులపై నక్సలైట్ అనే ముద్రవేసి శాశ్వతంగా జైల్లో కూర్చోపెడతారని అనేసరికి, వ్యవస్థ స్వభావం తెలిసిన గోపాలరావు బుచ్చి యింటికి వెళ్ళాడు. తన అన్న మనమరాలైన స్వరాజ్యలక్ష్మి అరెస్టుగురించి ముందే తెలిసినా కూడా ఆడపిల్ల అనికూడా పట్టించుకోకుండా బుచ్చి ఉన్నాడు.

గోపాలరావు వచ్చిన విషయాన్ని గ్రహించికూడా అధికారగర్వంతో బుచ్చి పట్టనట్టుగా ఉన్నాకూడా, గోపాలరావు తాను వచ్చిన విషయంచెప్పి స్వరాజ్యలక్ష్మిని విడిపించమంటే బుచ్చి పట్టించుకోనన్నాడు. పైగా అడ్డమైన తిరు గుళ్ళు తిరిగే స్వరాజ్యలక్ష్మికి తానంటే గౌరవంలేదంటూ, అదే తనకూతురైతే కాళ్ళువిరిచి యింట్లో కూర్చోపెట్టేవాడినని అంటూ, ధైర్యంగా బతికే స్వరాజ్యలక్ష్మివంటి ఆడపిల్లలంటే తనకున్న అక్కసునంతా బుచ్చి వెళ్ళకక్కాడు. దానితో కోపం వచ్చిన గోపాలరావు తన ఆయుధాన్ని వాడి, పని అయ్యేటట్టు చేసుకోవాలని భావించి, బుచ్చితో తల్లి నగలు ఏమయినాయోనని, తల్లిని చంపింది ఎవరోకూడా తనకు తెలుసని, కేసును తిరగతోడుతానని అనేసరికి, నిజాలు బయటకువస్తే తన పదవికి గండం అనుకొన్న బుచ్చి మారుమాట్లాడకుండా స్వరాజ్యలక్ష్మిని పోలీసు స్టేషన్ నుంచి విడుదలచేయిస్తాడు. బుచ్చికి స్త్రీలంటే ఏమాత్రంగౌరవంలేదని, అందుకే తల్లినికూడా చంపగలిగాడని అర్థమౌతుంది.

హృదయనేత్రి నవలలో బుచ్చి స్వాతంత్ర్యానికి పూర్వంనుండి బ్రిటిష్ పరిపాలనలో రుచిచూసిన అవినీతిడబ్బును, స్వాతంత్ర్యానంతరంకూడా కొనసాగించి వచ్చిన స్వాతంత్ర్యానికి తూట్లుపొడిచి అవినీతితో అధికారాన్ని కొనుక్కొన్నాడని స్పష్టమౌతుంది. స్వార్థంతో డబ్బుసంపాదన ధ్యేయంగా ప్రజాసేవను విస్మరించిన అవినీతి రాజకీయ నాయకుడికి నిలువెత్తు విగ్రహంగా బుచ్చి పాత్ర అర్థమవుతుంది. నేటి భారతప్రజాస్వామ్యంలో అడుగడుగునా విస్తరించిన రాజకీయనేతల అవినీతియొక్క విరాట్‌స్వరూప స్వభావాన్ని అర్థంచేసుకోవటానికి బుచ్చి పాత్ర ఒకనమూనాగా కనపడుతుంది.

7.1.7 స్వరాజ్యలక్ష్మి

స్వరాజ్యలక్ష్మి స్వాతంత్ర్యంకోసం పోరాటాలు సలిపిన గోపాలరావుయొక్క మనమరాలు, వర్గరహిత సమాజంకోసం పోరాటంచేయాలనుకొని, ఇంటినుండి వెళ్ళిపోయిన గోపాలరావుకొడుకైన శ్రీనివాస్ యొక్కకూతురు. నాగపూర్ దగ్గరలో ఉన్న వినోబాజీ ఆశ్రమంలో ప్రశాంతంగా కాలం గడుపుతున్న గోపాలరావుకు ఆతని భార్య పార్వతికి సీరియస్ గా ఉన్నదనే టెలిగ్రామ్ వచ్చేసరికి, పార్వతి కోసం ఇంటికి వెళ్ళేసరికి, బావమరిది ఒకలేఖను చేతిలో పెట్టాడు. గోపాలరావుకు కొడుకు దగ్గరనుంచి చాలారోజుల తర్వాత వచ్చిన ఆ లేఖలో స్వాతంత్ర్యంవచ్చి ఓటుహక్కు ఉన్న ప్రతిమనిషి కడుపునిండా అన్నంతినలేక పోతున్నాడనీ, వ్యవస్థకుళ్ళిపోయిందని, ఆర్థిక అసమానతను, వర్గపోరాటంతో తప్ప రాజకీయ ప్రణాళికలతో జయించలేమని రాసాడు. గోపాలరావు అహింసతో పోరాడితే తాను మూడేళ్ళుగా తుపాకీని ఆయుధంగా చేసుకొని పోరాటంచేస్తున్నట్టును, తమజీవితాలకు భద్రతలేదని, తన సహచరియైన రమను జీవితభాగస్వామినిగా చేసుకున్న ఫలితంగా పుట్టిన తమ పసిబిడ్డను లేఖతోపాటు పంపుతున్నట్టును రాసాడు. అంతేకాదు, తాను కొడుకుగా బాధ్యతను పట్టించుకోకుండా మిగిల్చిన శూన్యాన్ని తన బిడ్డ పూరిస్తుందని, తనకూతురిని సమసమాజంలో పెరిగేట్టగా చూడమని రాసాడు. పార్వతి కొడుకు రానందుకు మూర్ఛలోకి వెళ్ళింది. అహింస, అభ్యుదయ విప్లవ ఆశయాల ఆనువంశికతను పుణికిపుచ్చుకొని పుట్టినది ఆ పసిబిడ్డ. ఆ బిడ్డ కళ్ళల్లో గోపాలరావుకు రాముడత్తయ్య కళ్ళుకనపడ్డాయి. ఆ పసిబిడ్డకు పాలుపట్టి అక్కున చేర్చుకొన్న గోపాలరావు ఆ పసిపిల్లకు స్వరాజ్యలక్ష్మి (దేశానికి స్వరాజ్యం వచ్చిన తరవాతపుట్టిన బిడ్డ అనియేమో) అని పేరుపెట్టాడు.

స్వరాజ్యలక్ష్మికి ఏడాది వయసు వచ్చేసరికి కుటుంబపోషణ భారం గోపాలరావుమీద పడగా, ఆతడు ఒక తెలుగు దిన పత్రికలో ప్రూఫ్ రీడరుగా ఉద్యోగంలో చేరాడు. స్వరాజ్యలక్ష్మి ఆగమనంతో

గోపాలరావు జీవితంలో స్థిరత్వం, ఆర్థికసుస్థిరత్వం, భార్యాభర్తలమధ్యకొద్దిగా సామరస్యం ఏర్పడ్డాయి. తాత వళ్ళోకూర్చొని తాతయ్య చెప్పే కథలనువింటూ పెరిగింది. గోపాలరావు హౌసింగ్ బోర్డులో లోయర్ ఇన్కమ్ వాళ్ళకు కట్టించిన ఒక యిల్లును కొన్నాడు. స్వరాజ్యలక్ష్మి గాంధిపటం పట్టుకొనిరాగా గృహప్రవేశం చేసాడు. అంటే స్వరాజ్యలక్ష్మికి గాంధీదృక్పథానికి సన్నిహితత్వం చేకూరాలనే గాంధేయవాది అయిన గోపాలరావు అలాచేసి ఉండవచ్చు.

గోపాలరావును ఒకసారి వచ్చి వెళ్ళమని జానకమ్మ ఉత్తరం రాయగా గోపాలరావు స్వరాజ్యలక్ష్మిని కూడా పెట్టుకొని చీరాల ప్రయాణం అయ్యాడు. రైల్లో ఎదురుసీటులో కూర్చొని ఉన్న తోటిప్రయాణికుడు స్వరాజ్యాన్ని పలకరించి ఏమి చదువుతున్నావని అడిగాడు. ఏడేళ్ళుదాటిన స్వరాజ్యం తాను మూడవక్లాసు చదువుతున్నట్టు చెప్పగా ఆ ప్రయాణికుడు ఇంగ్లీషు బాగా మాట్లాడుతున్నావు, ఇంగ్లీషు స్కూల్‌లో చదువుతున్నావా అని అడిగాడు. స్వరాజ్యలక్ష్మి తాను మాములు స్కూలులోనే చదువుతున్నననిచెప్పి, తనకు ఇంగ్లీషును ఇంటిదగ్గర తాతయ్య చెబుతాడని చెప్పింది. ఆతడు స్వరాజ్యలక్ష్మికి యాపిలుపండును కోసియవ్వగా తాతయ్య అనుమతితో తీసుకుంది. జానకమ్మగారింటికి వెళ్ళినతరువాత ఆమె కూడా స్వరాజ్యలక్ష్మియొక్క కళ్ళుచూస్తే రామలక్ష్మికళ్ళు జ్ఞాపకం వస్తున్నయాయని అంది. గోపాలరావుకూడా తనకు స్వరాజ్యలక్ష్మి యింట్లో తిరుగుతూ ఉంటే రాముడత్తయ్య తిరిగినట్టే ఉంటుందని చెప్పాడు. అంటే దేశసేవికయైన రాముడత్తయ్య పోలికలు స్వరాజ్యలక్ష్మిలో ఉండటంతో పాఠకులకు స్వరాజ్యలక్ష్మిలో కూడా ఆ సేవాతత్పరత చోటుచేసుకుందని అభిప్రాయానికి బీజం ఏర్పడుతుంది. ఆ మర్నాడు ముగ్గురూ చీరాలలోని రామలక్ష్మి వాసుదేవరావుల యింటి తాళాలుతీసి చూపించి స్వరాజ్యలక్ష్మికి ఇప్పుడున్న వయసున్నప్పుడు గోపాలరావు రాముడత్తయ్యతో ఆ యింటికి వచ్చినవిషయాన్ని జానకమ్మ గుర్తుచేసింది. అంటే ఉత్తరోత్తరా స్వరాజ్యలక్ష్మికూడా రాముడత్తయ్య యింట్లోపెరిగిన గోపాలరావువలె దేశసేవచేస్తుందనే భావన పాఠకుల మనసులో ఏర్పడుతుంది.

ఒకరోజు గోపాలరావుయొక్క తల్లి సుబ్బమ్మ తన చిన్నకోడలు తన కాసులపేరుమీద ఆశపడుతోందని, దాన్ని స్వరాజ్యలక్ష్మిపెళ్ళికి యిస్తానని అంటుంది. దానికి స్వరాజ్యలక్ష్మి తాను పెళ్ళిచేసుకోనని, తనపెళ్ళిమాట ఎత్తవద్దని, అది తనకు సంబంధించిన విషయమని చెప్పి, ఆ నగలను తాతయ్యచెప్పినట్టు చిన్నతాతయ్యకు యివ్వమనిచెప్పింది. అంటే స్వరాజ్యలక్ష్మికి అందరి ఆడపిల్లలాగా నగలపిచ్చి లేదని అర్థమౌతుంది. తాను పోస్టుగ్రాడ్యుయేట్ అయి ఉద్యోగంలో నిలదొక్కుకునేంతవరకు తన పెళ్ళిమాట ఎత్తవద్దని, తాను పెళ్ళిచూపులకు కూర్చొని కట్నం యిచ్చి

పెళ్ళికొడుకును కొనుక్కొని పెళ్ళిచేసుకోననీ, అది అవమానకరమైనపని అని, ఆత్మాభిమానం వున్న ఏ ఆడపిల్ల చేసుకోదని స్వరాజ్యలక్ష్మి తన అభిప్రాయాన్ని నిక్కచ్చిగా చెప్పింది. సామాన్యంగా ఆ కౌమారదశలోని ఆడపిల్లలు చదువుకంటె కూడా తమకు పెళ్ళిఎప్పుడవుతుందా అని ఆలోచించటం చేస్తారు. దానికి భిన్నంగా సమాజంలో తానొక వ్యక్తిత్వంగల మనిషిగా జీవించాలంటే తనకు చదువు, ఉద్యోగం ముఖ్యమని స్వరాజ్యలక్ష్మి భావించిందంటే, జీవితం యెడల సరైన ఆలోచనలు ఉన్న వ్యక్తిగా ఆమె అర్థమౌతుంది. గోపాలరావుతల్లి కట్నమిచ్చి పెళ్ళిచేసే స్థితి లేదని అన్నందుకు, తాతయ్య తనకు పెద్దలతో గౌరవంగా మాట్లాడాలని చెప్పినమాటలను తాను జీర్ణించుకోవటంచేత ఆమెను అగౌరవపరచటంలేదని చెప్పింది. అంతేకాక, స్వరాజ్యలక్ష్మి తన తాతయ్యతో ఆయన అహింసావాదం అన్నిచోట్ల పనికిరాదని, ఆమె తననగలను ఇక్కడ ఎవ్వరికీ యివ్వనక్కరలేదని, ఆమె నగలను తీసుకోకుండానే ఆమెను చూస్తామనిచెప్పి ఆనగలను బాబాయికి యిప్పించెయి అని గోపాలరావుతో అంది. ఆ మాటలకు ఆ తాతమ్మ స్వరాజ్యలక్ష్మి రామలక్ష్మి నోట్లోనుంచి ఊడిపడ్డది అంది. అంటే రామలక్ష్మివలె స్థిరమైన అభిప్రాయాలుగలది అని అర్థమౌతుంది. గోపాలరావు స్వరాజ్యలక్ష్మిని లోపలికివెళ్ళి చదువుకోమని చెప్పటంతో ఆ విషయం అంతటితో ముగుస్తుంది. కాని పార్వతి అత్తగారికి వత్తాసుపలకటం ప్రారంభించింది.

స్వరాజ్యలక్ష్మి ఇంటరుమీడియెట్‌లో మంచిమార్కులు తెచ్చుకొని స్టేట్ సెకండు వచ్చినా కూడా తాను క్వీన్ మేరీస్[23] కళాశాలలో చేరుతానని అంది. పార్వతి అక్కడ చదువు బాగా చెప్పరని, విద్యార్థులు బీచుల్లో తిరిగితుంటారని అంతేకాక స్లమ్స్ నుంచి వచ్చిన పిల్లలు అక్కడ చదువుకుంటారని, అందుకే తన పిల్లను అక్కడ చేర్చలేదని తోడికోడలు చెప్పిన మాటలు గుర్తుకువచ్చి పార్వతి ఒప్పుకోదు. దానికి స్వరాజ్యలక్ష్మి స్లమ్స్ ఏరియాలో ఉన్న వాళ్ళకి చదువుకునే అర్హతలేదా అని అంటుంది. కాని పార్వతి స్టెల్లాకాలేజీలో ధనవంతులపిల్లలు చదువుతారని, వాళ్ళు బుద్ధిమంతుల్లా ఉంటారని అంది. దానికి స్వరాజ్యలక్ష్మి ధనవంతుడైన బాబాయికొడుకు కిశోర్ అన్నయ్య అక్కడ చదువుతున్నప్పుడే తాగి కారునడపి ఒకరి చావుకు కారణం అయ్యాడని, ఒక ఆడపిల్లను ప్రేమలోకి దింపి ఆమె ఆత్మహత్యకు కారణమయ్యాడంటే, అలా అతడిని పెంచిన బుచ్చితాతయ్యే ఆమె గొంతుకోసినట్లని చెప్పింది. అంతేకాదు, తన జీవితం తనదని, దాన్ని శాసించే హక్కు ఎవరికీ లేదని చెప్పింది. అంటే స్వరాజ్యలక్ష్మికి తన మానవ హక్కులు ఏమిటో తెలుసని అర్థమౌతుంది. అప్పుడు తల్లి క్వీన్ మేరీస్ కళాశాలలో చదివితే బీదవాళ్ళు అని తమను అనుకుంటారని అంటే, స్వరాజ్యలక్ష్మి 'తమ తిండి తాము తింటున్నప్పుడు ఎవరో బీదవాళ్ళమని అన్నంత మాత్రాన సిగ్గుపడాల్సిన పనిలేదని అంది.

క్వీన్ మేరీస్ లో చదువుబాగానే చెప్తారని, అవి చదవని పిల్లలు పుట్టించే మాటలని, ఆ కళాశాలలోనే చదువుకున్న, కమలాదేవి ఛటోపాధ్యాయ, ఆచంట రుక్మిణి, ముత్తు లక్ష్మీరెడ్డి వంటి గొప్పవారు ఆ కళాశాలలోనే చదువుకున్నారని చెప్పింది. గవర్నమెంటు అన్ని సదుపాయాలు చేస్తుంటే హాయిగా అక్కడ చదువుకోక ప్రైవేటువాటిల్లో చదువుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని, టరమ్ ఫీజుల గురించిన ముందుచూపు లేకుండా పక్కవాళ్ళను అనుసరించటం తప్పని, తాతయ్య కష్టపడి సంపాయిస్తుంటే దానిని వృథాచేయటం ఎందుకని' అంది. దానికి తాతమ్మ ఆ కళాశాలలో చదవేటప్పుడు ఖద్దరుచీరెలే కట్టాలికాబట్టి అలాంటి ముతకచీరెలు కద్తావా అని స్వరాజ్యలక్ష్మితో అంటే దానికి ఆమె 'నేతచీరెలు హాయిగా ఉంటాయని, నేతపనివాళ్ళకు తిండి పెట్టినదాన్నవుతానని, దొంగచాటుగా తెచ్చిన స్మగుల్డుచీరెలు కట్టనని' అంది. దానికి ఆమె అమ్మమ్మ (స్వరాజ్యం మొదటినుండి మామ్మ అని కాక అమ్మమ్మ అని పార్వతిని పిలుస్తుంది) 'బర్మా బజారులోని చీరెలుకొని కట్టుకుంటే వాళ్ళకు కూడుదొరుకుతుందికదా'[24] అని అంటే స్వరాజ్యలక్ష్మి 'అలాకొనటం తన పెళ్ళాంబిడ్డలకు అన్నం పెట్టటానికి పక్కింటివాళ్ళమీద ఆధారపడటంలాంటిది' అంది. దానికి పార్వతి 'వితండవాదమని, ఫారెన్ గూడ్స్ అమ్ముకోవటంలో తప్పులేదంటే' దానికి స్వరాజ్యలక్ష్మి 'దొంగ ఒక కుటుంబాన్ని దోచుకుంటే స్మగ్లర్లు దేశాన్ని దోచుకుంటున్నారని, దొంగలలో చిన్నా,పెద్దా తేడా మాత్రమే ఉందని' చెప్పేసరికి పార్వతికి తాను ప్రతిసారి స్వరాజ్యలక్ష్మి చేతిలో ఓడిపోతున్నానని అనిపించి కుతకుతలాడిపోయింది. ఇక్కడ ధనవంతుల స్వభావాన్ని స్వరాజ్యలక్ష్మి స్పష్టంచేసి బీదవాళ్లు తక్కువకాదనే వర్గస్పృహతో మాట్లాడటమే కాక, దేశ ఆర్థికపరిస్థితి దిగజారటానికి విదేశీవస్త్రాల వాడకంతో తాము గొప్పవాళ్ళమని అనుకునేవారిలోని డొల్లతనాన్ని బయటపెట్టింది. వృథాఖర్చులు తగ్గించుకొని కుటుంబ ఆర్థికస్థితికి తగ్గట్టుగా బాధ్యత వహించాల్సిన కర్తవ్యం స్వరాజ్యలక్ష్మి మాటలలో స్ఫురిస్తుంది.

స్వరాజ్యలక్ష్మి తెలుగుశాఖకు సెక్రటరిగా ఉండటంతో కళాశాలలలో పోటీలను నిర్వహించే బాధ్యత స్వరాజ్యలక్ష్మిపై ఉంది. ఆమె కాలేజినుండి రావటం ఆలస్యమవుతుంటే పార్వతి ఆడపిల్లగా స్వరాజ్యలక్ష్మి ఆలస్యంగా వస్తే ఏమిజరుగుతోందో నని భయపడుతున్నానని అంటే గోపాలరావు స్వరాజ్యలక్ష్మి అర్థరాత్రైనా నిర్భయంగా ఇంటికి రాగల ధైర్యస్థురాలని అన్నాడు. అంతేకాక స్వాతంత్ర్యానికి పూర్వమే తాము ఆడపిల్లలను మగపిల్లలతో సమానంగా పెంచాలనుకున్నామని అప్పుడే స్త్రీపురుష సమానత్వం వస్తుందని ఆశించామని గోపాలం పార్వతితో చెప్పాడు. ఎందుకంటే స్త్రీలఅభివృద్ధియే దేశాభివృద్ధి అని, స్త్రీలు అభివృద్ధిచెందాలంటే స్త్రీపురుషసమానత్వం ఉండాలని ఆనాటి స్వాతంత్ర్యోద్యమకారుల[25] లక్ష్యం.

ఇందిరాగాంధి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఆమె విపక్షాల విమర్శకుల నోళ్ళు మూయించాలని, తన తప్పులు కప్పిపుచ్చుకోవటానికి భారతదేశమంతటా ఎమర్జన్సీని ప్రకటించింది. స్వరాజ్యలక్ష్మికి ఒక స్త్రీగా దేశాన్ని పరిపాలిస్తున్న ఇందిరాగాంధి అంటే ఆరాధనా భావం. 'ఎమర్జన్సీలో రైళ్ళు సమయానికి వస్తున్నాయని, దుకాణాలలో ధరలపట్టికని ప్రదర్శనకు పెడుతున్నారని, ఇదంతా ఇందిరాగాంధి ప్రకటించిన ఎమర్జన్సీవల్ల క్రమశిక్షణ ఏర్పడిందని' ధీమాతో స్వరాజ్యలక్ష్మి అంది. దానికి గోపాలరావు 'తాను నైతికంగా ఎమర్జన్సీని హర్షించలేకపోతున్నానని క్రమశిక్షణ కోసంకాక, అలహాబాద్ కోర్టు తీర్పును కప్పిపుచ్చుటానికి ఈ ఎమర్జన్సీని ఇందిరాగాంధి పెట్టిందని' అంటాడు. అప్పుడు స్వరాజ్యలక్ష్మి గోపాలరావుతో 'నీవే మునుపు ప్రతిపక్షాలు ఆమె కాళ్ళుచేతులుకట్టి దిగ్బంధంచేస్తున్నారని అన్నావని' అడగగా, నిజమేనని గోపాలరావు వొప్పుకొన్నాడు. కాని 'ఎమర్జన్సీ ముసుగుకింద ప్రజలహక్కులను తుంచిపారెయ్యటం న్యాయంకాదని, ఆమె ఎమర్జన్సీని ప్రకటించి ప్రపంచదేశాల ముందు భారతీయులు తలవంచుకునేట్టు చేసిందని' అన్నాడు. స్వాతంత్ర్యానికి పూర్వం నుండి కాంగ్రెస్ వాది అయిన గోపాలరావుకుకూడా ఆమె అంటే అభిమానం ఉన్నా ఆతడు ఎమర్జన్సీని సమర్థించలేకపోయాడు. దానికి స్వరాజ్యలక్ష్మి 'సమ్మెలు, ఉద్యమాలుచేస్తుంటే గాంధేయవాదం అంటూ చేతులు ముడుచుకొని కూర్చుంటే క్రమశిక్షణ ఉండదనీ, క్రమశిక్షణలేకపోతే ఆమె ఎలాపరిపాలన చేస్తుందని' అంటే గోపాలరావు 'ఆమె వ్యక్తిగతంగా క్లీన్ అడ్మినిస్ట్రేషన్ అందిస్తోందా' అని ఆలోచించమంటాడు. దానికి స్వరాజ్యలక్ష్మి 'ఆమె చుట్టూ ఉన్నవాళ్లు ఆమెను ముందుకు సాగనీయటంలేదని' అంది.

దానికి గోపాలరావు 'దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ముప్ఫై యేళ్లు వచ్చినా దేశంలో దారిద్ర్యం, అవిద్య ఉన్నప్పటికీ మునుపెన్నడులేనిది, ఇప్పుడు ఎమర్జన్సీతో ప్రపంచంముందు తలవంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది' అని అంటే స్వరాజ్యలక్ష్మి 'ఆసియాలో ఎన్నోదేశాలలో ఎమర్జన్సీ పెట్టారుగా' అని అంది. 'దానిని యుద్ధాలప్పుడు అక్కడ పెట్టారుగాని ఇలా వ్యక్తిగత తప్పులకోసం ఎమర్జన్సీని పెట్టలేదని' గోపాలరావు అంటాడు. ఎన్ని చెప్పినా స్వరాజ్యలక్ష్మి మాత్రం దేశంలో మిలిటరీ రూల్ రావాలని అంది. 'స్టూడెంట్సు, లేబరు తిరుగుబాట్లు, విపక్షానికి చెందిన జయప్రకాశ్ నారాయణ గారు[26] చేస్తున్న ఉద్యమం తప్పుకదా' అని అంటే గోపాలరావు 'తాముకూడా స్వాతంత్ర్యానికి పూర్వం ఉద్యమాలు చేసామని' అన్నాడు. స్వరాజ్యం ఆతని మాటలను ఎక్కడికక్కడ ఖండిస్తూ అది పరాయిపాలన కాబట్టి చేసారంటే, ఉద్యమానికి స్వపరభేదాలు ఉండ వంటాడు గోపాలరావు. అంతేకాక 'ప్రెస్ సెన్సారింగ్ పేరుతో అన్యాయాలను బయటపెట్టే పత్రికల నోరునొక్కేసి హక్కులను,

బాధ్యతలను నొక్కిపెట్టారని' గోపాలరావు బాధపడేసరికి స్వరాజ్యలక్ష్మి 'ఆర్నెల్లు దాటంగానే ఎమర్జన్సీని తీసేస్తారులే' అని స్వరాజ్యలక్ష్మి అంది. దానికి ఆరు నెలలల్లో అధికారదాహం తీరదని, పత్రికలను చదువుతుంటే గుండెలు విలవిలలాడుతున్నాయని, ప్రజల మానవ హక్కుయైన తమ శరీరాలమీద తమకు స్వాతంత్ర్యంలేకుండా చేస్తూ బలవంతాన ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు చేస్తున్నారని, చిన్నపిల్లవు నీకు అర్థంకావటం కష్టమని అన్నాడు. 'ఇందిరాగాంధి ఆడదనే భావన ప్రజలలో ఉందని' స్వరాజ్యలక్ష్మి అంది. దానికి గోపాలరావు 'నైతికదృక్పథానికి, మానవహక్కులకు ఆడామగ భేదం ఉండదని, తనకి ఇందిరాగాంధి అంటే అభిమానమున్నా, ఆమె చట్టూచేరిన మనుషులు దూరదృష్టి లేనివాళ్ళవటమే బాధను కలిగిస్తోందని' అంటాడు. స్వరాజ్యలక్ష్మితో అనుభవశాలియైన గోపాలరావు వాదన పెట్టుకున్నప్పుడే ఎమర్జన్సీ ప్రభావం ఎలా ఉంటుందో, భారతదేశస్థితిని యువతియైన స్వరాజ్యలక్ష్మి తెలుసుకోవటమనే చారిత్రక విషయాలపట్ల అవగాహనను గోపాలరావుకి స్వారాజ్యలక్ష్మికి జరిగిన వాదోపవాదాలవల్ల పాఠకులు కూడా పొందగలుగుతారు. అంతేకాక స్వరాజ్యలక్ష్మికి ఉన్న దేశపరిస్థితులను గురించిన లోకజ్ఞానం, తార్కికదృక్కోణం, వాదనాపటిమ, నిర్భయత్వం,స్వేచ్ఛగా స్వీయఅభిప్రాయ ప్రకటనా సామర్థ్యం స్పష్టమై, ఆడపిల్లలు తమ శక్తిసామర్థ్యాలను, జ్ఞానాన్ని పరిశీలించుకోవటానికై తమలోకి తాము తొంగిచూసుకొనే ప్రేరణ గలిగించిన పాత్రగా స్వరాజ్యలక్ష్మి అర్థమౌతుంది.

ఎమర్జన్సీ ప్రకటించి ఏడాది గడిచినా ముగియలేదు. ఎమర్జన్సీతోపాటు స్వరాజ్యలక్ష్మి కూడా ఎమ్.ఏ. ఎకనామిక్స్ రెండవసంవత్సరంలోకి అడుగుపెట్టింది. స్వరాజ్యలక్ష్మి స్నేహితులతో కలివిడిగా మెలుగుతుంది. అంటే స్వరాజ్యలక్ష్మికి సామాజిక మానవసంబంధాల అభివృద్ధి అంటే యిష్టంమని గుర్తించాలి. ఒకరోజు తన స్నేహితురాలు బాగా పరీక్షరాసినా తక్కువమార్కులు వచ్చినందుకు కారణం తెలుసుకొని పరిష్కరించుతారని ప్రొఫెసరుతో మాట్లాడటానికి స్నేహికురాలితో కూడా వెళ్ళింది. స్వరాజ్యలక్ష్మి ఆ స్నేహితురాలు ప్రొఫెసరును కలిసి, అక్కడినుండి వైస్ ఛాన్సర్‌ని కలవటానికి వెళ్ళినప్పుడు వెనకాల కొంతమంది స్టూడెంట్సు గుంపుగా రావటంతో, పోలీసులువచ్చి స్వరాజ్యలక్ష్మితో మిగిలిన వారిని అరెస్టుచేసి పోలీసుస్టేషన్ కి తీసుకెళ్ళారు. ఈ వార్త తెలిసి కుప్పకూలిన గోపాలరావును లేవదీసిన పత్రికాఫీసులోని ఎడిటర్ ఎమర్జన్సీ సమయంలో విద్యార్థులను నక్సలైట్లని ముద్రవేసి, జైల్లోతోసేస్తే విడుదలకు అతీగతి ఉండదని, ఎమ్.పి. అయిన బుచ్చి సిఫారసుతో విడిపించుకోమని సలహాయిస్తాడు. గోపాలరావుకు తన తమ్ముడైన బుచ్చిని అడగటం యిష్టం లేకపోయినా, ఆత్మాభిమానం చంపుకొని, ఆతని యింటికి వెళ్ళి స్వరాజ్యలక్ష్మియొక్క అరెస్టు గురించి చెప్పాడు. ఆ

విషయం తెలిసినా పట్టనట్టున్న బుచ్చితో అవసరమైతే తల్లి హత్య గురించిన కేసు తిరిగిబయటకు తీస్తానని ఒకరకంగా బ్లాక్‌మెయిల్ చేయగా మొత్తంమీద బుచ్చి స్వరాజ్యలక్ష్మిని[18] గంటల పోలీసుల చెరనుండి స్వరాజ్యలక్ష్మిని విడుదల చేయిస్తాడు. రాజకీయవ్యవస్థను గురించి పూర్తిగా అవగాహనకలేని స్వరాజ్యలక్ష్మి తనని చినతాతయ్య విడిపించి తెచ్చినందుకు కృతజ్ఞతలు చెప్పటానికి ఆతని యింటికివెళ్ళాలనుకున్నా, గోపాలరావు పడనీయలేదు. ఇంటికి వచ్చిన స్వరాజ్యలక్ష్మితో గోపాలరావు 'ఇకనుంచి ఎవరిజోలికి వెళ్ళవద్దనీ, ఆమెమీద ప్రాణాలుపెట్టుకొని బతుకుతున్న తమని క్షోభకు గురిచేయవద్దని' అన్నాడు. అన్యాయాన్ని ఎదిరించాలని చిన్నప్పటినుండి నూరిపోసి పెంచిన గోపాలరావు అలా అనేసరికి స్వరాజ్యలక్ష్మి 'పట్టించుకోకుండా ఉంటే న్యాయరక్షణ ఎలా జరుగుతుందని' ప్రశ్నిస్తుంది. దానికి గోపాలరావు 'తమ రోజులలో (అంటే స్వాతంత్ర్యానికి పూర్వం) అందరికీ ఒకే న్యాయం ఉండేదని, కాని ఇప్పుడు అంటే స్వాతంత్ర్యానంతరం కొంతమందికే న్యాయం జరుగుతోందని, వేటగాడి బాణంనుండి న్యాయం ఆశించటం తెలివితక్కువతనమని' అన్నాడు. దానికి స్వరాజ్యలక్ష్మి 'అలా ఎన్నాళ్ళని అన్యాయాన్ని చూస్తూ కళ్ళుమూసుకొని ఉంటామని' అడిగితే దానికి సమాధానంగా గోపాలరావు 'వేటగాడి బాణాలు ఖాళీకాకతప్పవని అవి అయిపోయేంత వరకు ఎదురుచూడాలని' అంటాడు. ఇక్కడ తనని పోలీసులు అరెస్టుచేసినా భయపడక, యింకా కూడా అన్యాయాన్ని ఎదుర్కోవాలనే భావన ఉందని అర్థమై, స్వరాజ్యలక్ష్మిలోని వ్యక్తిత్వంలోని స్థిరత్వం, చిత్తశుద్ధి స్పష్టమవుతుంది. యువపాఠకులలో ఎటువంటి పరిస్థితులు ఎదురైనా భయపడకుండా అన్యాయాన్ని ప్రతిఘటించే చైతన్యస్పృహపెరుగుతుంది.

స్వరాజ్యలక్ష్మిని తిరిగి కాలేజీలో చేర్చుకోదలచుకోక యూనివర్సిటీవారు టి.సి. యిచ్చి పంపారు. పార్వతి స్వరాజ్యలక్ష్మితో పెళ్ళిచేసి పంపేవరకు ఇల్లుదాటి బయటకు వెళ్ళవద్దంది. 'తాను పెళ్ళి చేసుకోదలచుకోలేదని, అయినా కట్నం ఇవ్వకూడదనుకొన్న తనని ఎవరూ పెళ్ళిచేసుకోరనీ, తనకి ఉద్యోగంకూడా ఇవ్వరని' అంది. ఎమర్జన్సీ స్వభావాన్ని వంటబట్టించుకున్న స్వరాజ్యలక్ష్మి గోపాలరావుతో జయప్రకాష్ నారాయణను అరెస్టుచేయించే పనిని ఇందిరాగాంధి ఎందుకుచేసిందని అంటూనే మళ్ళీ తనే ఆమె చేసినపని మంచిదికాకపోయినా త్వరలోనే విడుదలచేస్తుందని అని స్వరాజ్యం అంది. తనకింత జరిగినా ఇందిరాగాంధిని తిట్టిపోయకుండా ఇంకా ఆమెను అభిమానిస్తోందని గోపాలరావుకు అర్థమై స్వరాజ్యలక్ష్మిలో వచ్చిన మానసిక పరిపక్వతకు ఆశ్చర్యపడ్డాడు.

ప్రజలు ఊహించనిరీతిలో ఎమర్జన్సీని ఎత్తివేస్తున్నామని, త్వరలో ఎన్నికలు జరుగుతాయనే ప్రభుత్వ ప్రకటన వెలువడింది. ఎలక్షన్ల ప్రచారానికై ఇందిరాగాంధి వచ్చినప్పుడు జనం బాగావచ్చారు.

కాని ఇందిరాగాంధి ఆ ఎన్నికలలో ఓడిపోతే స్వరాజ్యలక్ష్మికి ఆశ్చర్యంవేసి గోపాలరావును కారణం అడగగా దొంగలను బజారులో తీసుకొని వెడుతుంటే చూసే జనంలాగా ప్రజలు ఆమెను చూడటానికి వచ్చారుగాని ఆమెకు ఓట్లువేయాలని కాదని చెప్పాడు. స్వరాజ్యలక్ష్మి గోపాలరావును ఎవరికి ఓటేసావని అడిగితే మనసు జనతాపార్టికి వేయమందని, స్వాతంత్ర్యానికి పూర్వం నుండి ఉన్న ఖద్దరుకట్టే అలవాటు కాంగ్రెస్ పార్టీకి వేయమందని అనేసరికి స్వరాజ్యలక్ష్మి అయితే ఇందిరాగాంధి గెలుస్తుందని అంది. దానికి గోపాలరావు ఆమె వ్యక్తిగా గెలుస్తుందిగాని, పార్టీ గెలవదని అన్నాడు. ఎన్నికలలలో జనతాపార్టి విజయంసాధించి మొరార్జీ దేశాయ్ ప్రధాని అయ్యాడు కాని అంతర్గత అసమ్మతులతో ఏడాదికూడా పూర్తికాకుండనే జనతా ప్రభుత్వం పడిపోవటం జరిగింది. జనతాప్రభుత్వం ఇందిరాగాంధిమీద ఆమె కోడిపెట్టను దారిలో దొంగిలించిందనే కేసులు పెట్టి ఆమెను జైల్లో పెట్టగలిగారు కాని ఆమె ప్రజావ్యతిరేక తప్పులను చేసిందని నిరూపించ లేకపోయారు. ప్రభుత్వం పడిపోవటంతో తిరిగి ఎన్నికలు వచ్చి ఇందిరమ్మ రాజ్యానికి రావటం జరిగింది. చివరికి స్వరాజ్యలక్ష్మికి ఇందిరాగాంధిమీద ఉన్న అభిమానం ఆమెను నిలబెట్టిందని అనిపించి పాఠకుల మనసుకు ఊరటకలిగింది.

జనతా పాలన ఉన్నప్పుడే స్వరాజ్యలక్ష్మి ప్రైవేటు స్కూల్‌లో టీచరుగా చేరింది. అక్కడ విద్యార్థుల దగ్గరనుండి అధికఫీజులు కట్టించుకుంటూకూడా వారికి సరియైన మరుగుదొడ్లు కట్టించకపోయేసరికి స్వరాజ్యలక్ష్మి యాజమాన్యాన్ని ప్రశ్నించింది. అయినా వారు పట్టించుకోనందుకు, విద్యను వ్యాపారంగా భావించినచోట తాను అక్కడ చేయలేనని భావించిన స్వరాజ్యలక్ష్మి ఆ ఉద్యోగానికి రాజీనామా చేసింది. గోపాలరావుకి రిటైర్మెంటు వయసువచ్చింది. స్వరాజ్యానికి యిష్టమైన వ్యక్తితో పెళ్లిచేస్తే తన బాధ్యతతీరుతుందని గోపాలరావు ఆమెతో అంటే, ఆతని బాధ్యతలాగా తనకు వారిద్దరియొక్క బాధ్యత ఉందని స్వరాజ్యలక్ష్మి అంది.

జానకమ్మ తన ఆఖరికోరికగా గోపాలరావును చూడాలని చీరాలరమ్మని రాసిన ఉత్తరాన్ని అందుకొన్న గోపాలరావు స్వరాజ్యలక్ష్మితో కలిసి వెడతాడు. జానకమ్మ వృద్ధాప్యంవల్ల స్వయంగా వండుకొని తినలేని పరిస్థితికి చేరుకుంది. ఊరివాళ్లు సేవలుచేసినా తనకాలానికి చెందిన వారులేనందుకు బాధపడుతుంటే ఆమెను అర్థంచేసుకునే వారు లేకపోయారని స్వరాజ్యానికి అర్థమైంది. జానకమ్మ గోపాలరావుచేతిలో రామలక్ష్మి యింటికాగితాలు యిచ్చి ఆ యింటిని పాడుపెట్టక మంచిపనికి ఉపయోగించమని చెప్పింది. అంతేకాక, తన దగ్గర ఉన్న పదివేలరూపాయలనుకూడా యిస్తుంటే, స్వరాజ్యలక్ష్మి ఆమె మందులకోసం అట్టిపెట్టుకోమని అంది. దానికి జానకమ్మ

తనలాంటివారు మందులులేక బతకటంలేదా, అందరితో పాటు తాను అంతే అని అంటుంది. డబ్బును స్వరాజ్యలక్ష్మిచేతిలో పెట్టగా స్వరాజ్యలక్ష్మి ఆ డబ్బును మంచికి వాడే పూచి తనదని చెప్పి జానకమ్మకు హామి యిచ్చింది.

ఊరి నుంచి రాగానే ఇందిరాగాంధి హత్యచేయబడిందనే వార్తవిని స్వరాజ్యం పుట్టిబుద్ధెరిగిన తరువాత మొదటిసారిగా ఏడ్చింది. మూడురోజుల తరువాత స్వరాజ్యలక్ష్మి తన జీవితగమ్యాన్ని ఆలోచించుకున్నానని, తాము చీరాలకు వెళ్లిపోదామని, జానకమ్మలాంటి వృద్ధులకు సేవాశ్రమాన్ని నడపాలనుకుంటున్నట్టు గోపాలరావుతో అంది. ముందుపెట్టుబడిగా జానకమ్మ యిచ్చిన పదివేలతో మొదలుపెడితే తరువాత డబ్బు దానంతటదే సమకూరుతుందని, చీకట్లో వెతుక్కుంటున్న తనకి దీపం కనిపించిందని చెప్పి తన నిర్ణయాన్ని పార్వతిగోపాలరావులకు తెలియచేసింది. పార్వతి స్వరాజ్యలక్ష్మితో పెళ్ళిచేసుకోకుండా వృద్ధులకు సేవచేయటమేమని అన్నా, స్వరాజ్యలక్ష్మి 'ఆడపిల్లకు పెళ్ళితప్ప దారిలేదనుకునే రోజులు పోయాయని, తానుచేస్తున్న పనులు నచ్చిన వ్యక్తి వచ్చి పెళ్లిచేసుకుంటానంటే తానుచేసుకుంటానని చెప్పింది. పెళ్ళేగమ్యం కాదని, దానిని మించిన ఆశయాలు ఉంటాయని, మీతోపాటు పెద్దలజీవితాలను సుఖప్రదం చేయాలనుకుంటున్నానని' స్వరాజ్యలక్ష్మి వారితో చెప్పింది. గోపాలరావు జానకమ్మగారికి దూరదృష్టియే కాకుండా భవిష్యవాణిని గుర్తించగల అపూర్వశక్తి ఆమెకు ఉన్నదనీ, జానకమ్మగారు కలకన్నదానిని స్వరాజ్యలక్ష్మి తన హృదయనేత్రంతో చూస్తున్నదా అని ఆశ్చర్యపోయాడు. దేశభవితవ్యాన్ని యువతచేతిలో పెట్టామని భవిష్యత్తును ఫలవంతంచేసే బాధ్యత స్వరాజ్యలక్ష్మిపై ఉన్నదని ఆ ప్రయత్నంలో ఆమె విజయంసాధించాలని కోరుకుంటూ గోపాలరావు పార్వతి స్వరాజ్యలక్ష్మితోకూడా చీరాల ప్రయాణానికి సిద్ధమయ్యాడు.

దేశానికి స్వాతంత్రం ఉన్నన్నాళ్ళు స్వరాజ్యలక్ష్మిని మరిచిపోని సజీవ పాత్రగా మలచటంతో ఆడపిల్లలకు ఆశయాలమార్గదర్శినిగా రచయిత్రి స్పష్టమౌతారు. నిర్భయంగా బతికగలిగే ధైర్యాన్ని యువతకు యివ్వగలుగుతూ, సమాజాన్ని విప్పారిన జ్ఞాననేత్రాలతో చూడటానికి తగిన స్ఫూర్తిని యిచ్చే మూర్తిమత్వమైన స్వరాజ్యలక్ష్మిపాత్ర చిరస్మరణీయం.

7.1.8 శ్రీనివాస్

పార్వతి, గోపాలరావుల కుమారుడు. ఆతడు తల్లిగర్భంలో పడిన మూడు నెలలకే తండ్రి గోపాలరావు శాసనోల్లంఘన ఉద్యమంలో (1931) పాల్గొన్నందుకు అరెస్టు కాబడతాడు. మూడేళ్ళపాటు జైలుశిక్షను అనుభవించి విడుదలయై బయటకు వచ్చినప్పుడు మూడేళ్ళ శ్రీనివాస్ మొదటిసారిగా తండ్రిని చూడటం జరిగింది. తల్లిపెంపకంలో పెరిగిన శ్రీనివాస్‌కి తండ్రితో

అనుబంధం తక్కువ. అతడు బి.ఏ. పాసయినప్పుడు గోపాలరావు అతనిని బి.ఇడి.లో చేరమని, భావిపౌరులను తీర్చిదిద్దేటటువంటి అవకాశం యివ్వగలిగిన టీచరు వృత్తి చేయవచ్చని సలహా యిచ్చినా పట్టించుకోడు. గోపాలరావుకు కొడుకు స్వభావం అప్పుడు అర్థంకాలేదు. కాని ఒకరోజు శ్రీనివాస్ యింట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోతాడు. అందరూ ఎంతవెతికినా లాభంలేకపోయింది. మూడునెలలు దాటిన తరువాత శ్రీనివాస్ తాను నాన్నగారిలాగా ఒక ఆశయసిద్ధికోసం పోరాడు తున్నానని, తనకోసం వెతికించవద్దని, తన ఆశయం సిద్ధించేవరకు వెనక్కి తిరిగిరానని తెలియచేస్తూ ఒకకార్డుముక్కరాసాడు. తనకొడుకు బతికే ఉన్నాడనే భావనవల్ల గోపాలరావుకు గుండెలలో బరువుతీరినట్టు అనిపించింది.

పార్వతి తన కొడుకు అలా అయినందుకు ఏడ్చి గగ్గోలుపెట్టి, గోపాలరావును తిట్టిపోసి, మరిది బుచ్చితో తన కొడుకును వెదకిపట్టితెచ్చి యివ్వమని అడుగుతుంది. పార్వతికి దూరంగా ఉండటానికి నిశ్చయించుకున్న గోపాలరావు మూడుసంవత్సరాలపాటు నాగపూరు సమీపంలోని పౌనార్ లోని వినోబాభావే ఆశ్రమంలో ఉన్నప్పుడు పార్వతికి బాగాలేదని టెలిగ్రామ్ వచ్చింది. అక్కడకు వెళ్ళిన గోపాలరావుకు శ్రీనివాస్ రాసిన ఆఖరి ఉత్తరాన్ని బావమరిది చేతిలో పెట్టాడు. ఆ లేఖలో శ్రీనివాస్ రాస్తూ 'ఆశయాలు, ఆదర్శాలు ఉంటాయని, అవి కాలగతిలో రూపురేఖలను మార్చుకుంటాయని, మీలాంటివారు ఎందరో మహనీయులు ప్రాణాలను వదలిపెట్టటానికి సిద్ధపడ్డారని, త్యాగాల ఫలితంగా వచ్చిన స్వాతంత్ర్యంతో సమానత్వం రాలేదని రాసాడు. అంతేకాదు, దేశంలో ఓటు ఉన్న ప్రతివ్యక్తికి తిండిబట్టా ఉండటంలేదని, రాజకీయనినాదాలు తప్ప పంచవర్ష ప్రణాళికలు అన్నార్తులకు, శ్రామికులకు ఆకలిని తీర్చటంలేదని, వ్యవస్థ కుళ్ళిపోయిందని, ఆర్థిక అసమానతను వర్గపోరాటంతో తప్ప ఎదుర్కొనలేమని దానికోసం మూడేళ్ళుగా పోరాటంచేస్తున్నానని రాసాడు. తనతండ్రి అహింసను ఆయుధం చేసుకుంటే, తాను తుపాకీని పట్టుకున్నట్టును, కామ్రేడ్స్ లకు ఎవ్వరికి ప్రాణాలమీద ఆశ ఉండదని, తోటి కామ్రేడ్[27] రమను జీవితభాగస్వామిని చేసుకొన్నానని రాసాడు. అంతేకాక, తాను ఒక బిడ్డకు తండ్రిని అయ్యానని, తాను నెరవేర్చలేకపోయిన తండ్రి బాధ్యతను తనబిడ్డద్వారా తీర్చటానికి తమబిడ్డను ఈ లేఖను తెచ్చిన వ్యక్తితో పంపుతున్నానని, తన బిడ్డ సమసమాజంలో పెరగేటట్టుచేయమని' కోరుతూ ఉత్తరంరాసి పంపాడు. దానితో పార్వతి విరుచుకు పడిపోయింది. శ్రీనివాస్ బిడ్డను గోపాలరావు అక్కున చేర్చుకొని, బిడ్డకు పాలుపట్టి స్వరాజ్యలక్ష్మి అనిపేరుపెట్టి ఆ పసిబిడ్డయొక్క ఆలనాపాలనా చూసుకోగా ఆ పిల్ల పెరిగి పెద్దదవుతుంది. స్వరాజ్యలక్ష్మి శ్రీనివాస్ ఆశించినట్టుగానే ఆతని తండ్రి గోపాలరావుయొక్క బాధ్యతలను నిర్వహించ టానికే కాక, వారితోపాటు ఇతరవృద్ధులను చూసుకోవాలనుకుందని నవల తెలియచేసింది.

నవలలో శ్రీనివాస్ పాత్ర దృశ్యాదృశ్యంగా ఉన్న నిడివి తక్కువగల పాత్ర అయినా చాలా శక్తిమంతమైన పాత్ర. వర్గరహిత సమాజంకోసం ప్రాణాలకు తెగించి పోరాటంచేసే కామ్రేడ్ పాత్ర. స్వాతంత్ర్యానంతరం రాజకీయనాయకుల అవినీతి, ఆర్థికదోపిడి మితిమీరి ప్రజాస్వామ్యం, అర్థభూస్వామ్య – అర్థపెట్టుబడిదారీ వ్యవస్థగా మారినప్పుడు, వారికి వ్యతిరేకంగా పుట్టిన నక్సల్బరీ ఉద్యమానికి ఆకర్షితుడైన యువకుడు ఈ శ్రీనివాస్ అని అర్థమౌతుంది. పాఠకులకు తాము విన్న, కన్న విప్లవోద్యమకారులు మదిలో మెదిలి సాహిత్యసహృదయాలను కదిలించటం జరుగుతుంది. స్వాతంత్ర్యానికి పూర్వంనుండి ఉన్న గోపాలరావు అహింసాసిద్ధాంతంతోను స్వాతంత్ర్యానంతరం కుళ్ళిపోయివ్యవస్థను హింసాయుత ఆయుధాలతోగాని సరిదిద్దలేని పరిస్థితులలో శ్రీనివాస్ ఉంటారు. మొత్తం వ్యవస్థను ఒకసారిగా మార్చాలనుకోవటంకంటేకూడా తక్షణ సమాజ అవసరాలను గుర్తించి స్పందించగలగిన యువతకు, నిస్వార్థమైన ప్రజాసేవయే పరిష్కారంగా భావించిన స్వరాజ్యలక్ష్మికి వారధివంటి శ్రీనివాసు పాత్ర పాఠకుల గుండెలకు బరువై, మెరిసిన మెరికలాగా విప్లవచైతన్యాన్ని గలుగిస్తుంది.

'హృదయనేత్రి' అనే ఈ నవలలో మిగిలిన పాత్రలు సామాజిక కుటుంబసంబంధాల చిత్రణలో భాగంగా గోపాలరావు తల్లి సుబ్బమ్మ, తండ్రి వెంకట్రామయ్య, భార్య పార్వతి, గోపాలరావుతోగల చుట్టరికపు సంజ్ఞతోతప్ప అనామకంగా ఉన్న మామగారు, బావమరిది పాత్రలు, సామాజిక మానవసంబంధాలలో భాగంగా సూర్యారావు, త్రిపాఠి, సబ్ ఎడిటర్ పాత్రలు కథావస్తు ప్రయోజనం దృష్ట్యా తమవంతు పాత్రలను నిర్వహించటం కనపడుతుంది. పాతకాలంనాటి ఆలోచనలనే పట్టుకొని వేలాడే సుబ్బమ్మ, అక్షరాస్యత ఉన్న సామాన్యగృహిణిగా పార్వతి స్వార్థపరురాలిగా, తనభర్త గోపాలరావు, కొడుకు శ్రీనివాస్, మనమరాలు స్వరాజ్యలక్ష్మి తనుచెప్పినట్లుగా ఉండాలని ఆమె అనుకోవటంతప్ప, ప్రత్యేకంగా వాళ్ళగురించి తెలుసుకోవాల్సింది ఏమిలేదు. గోపాలరావు మామగారిపాత్రకూడా స్వార్థంతప్ప దేశభక్తిలేని బుచ్చిపాత్రవంటిదే. త్రిపాఠి భోజనప్రియుడు కాని దేశభక్తి కలవాడు. బెనారస్ విశ్వవిద్యాలయంలో గోపాలరావుతోపాటు చర్చలలో పాల్గొన్న తోటి విద్యార్థి. ఎడిటర్, సబ్ ఎడిటర్ గోపాలరావుకు పత్రికా కార్యాలయంలో వృత్తిపరంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయటమేకాక సలహాలను యిచ్చిన స్నేహితులు. చీరాల ఉద్యమంలో పాల్గొన్నప్పుడు పోలీసులు తగలపెట్టిన ఇంటి యజమాని, చేనేత వృత్తికారుడైన శివయ్య కొడుకు సూర్యారావు కథాప్రయోజనానికి అవసరమైన యువశక్తిపాత్రగా సందర్భానుసారం కనిపించే పాత్ర. అతడు ఆదర్శవాదిగా హరిజన అమ్మాయిని యిష్టపడి చేసుకున్నాడు. జానకమ్మ సహాయంతో

వయోజనస్కూలు, రాత్రి పాఠశాల, చిన్నపిల్లలస్కూలును కాలక్రమంలో నిర్వహించి చీరాలప్రజలకు చదువునేర్పటానికి పూనుకున్నవాడు.

'హృదయనేత్రి' నవలలో పాత్రలు చారిత్రక సంఘటనల నేపథ్యంకల ఇతివృత్తాన్ని (కథావస్తువు) వాస్తవికత ఉట్టిపడేటట్లు ముందుకు నడిపించిన పాత్రలు. ఆయాపాత్రల స్వరూప స్వభావాలు, సంఘటనలపట్ల వారి స్పందనలు ప్రతిఫలించిన సంభాషణలలోను కథాప్రయోజనం వ్యక్తమౌతుంది. స్వాతంత్ర్యానికి పూర్వంనుండి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా కొనసాగిన స్థిరమైన దేశభక్తిగల ప్రత్యేకవ్యక్తిత్వంతో గోపాలరావు, జానకమ్మవంటి సజీవపాత్రలు, గాంధేయదృక్పథాన్ని కొనసాగిస్తూ అమరస్ఫూర్తిని మిగిల్చిన దేససేవకులుగా వాసుదేవరావు, రామలక్ష్మి (రాముడత్తయ్య). పాఠకులలో శాశ్వతవిలువలను కలిగించిన పాత్రలు. సామాజిక వ్యవస్థ చిత్రీకరణలో ఏ పాత్రకాపాత్ర మంచికో చెడుకో ప్రతీకలు. సహజస్వభావాన్ని జీర్ణించుకున్న వారిగా మారుతున్న సామాజికవ్యవస్థ ప్రభావంతో మార్పుకు లోనుగాని స్థిరమైన వ్యక్తిత్వంగల పాత్రలు, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమవైఖరిని మార్చుకున్న పాత్రలు, అవినీతికి పరాకాష్ఠగా నిలబడి దేశస్వాతంత్ర్యానికి తూట్లుపొడుస్తున్న వారిగా బుచ్చి, నందయ్య వంటివారు స్వార్థం, అధికారం, డబ్బుసంపాదనకు నిలువెత్తు ఉదాహరణలుగా నిలిచిన రాజకీయపాత్రలు ఉన్నాయి. స్వాతంత్ర్య పరిరక్షణలో భాగంగా రాజకీయాలకు అతీతంగా, ప్రజలకు తమ స్థాయికి తగ్గట్టుగా తాము చేయగల ప్రజాసేవకు అంకితమవ్వాలనుకొన్న యువతయొక్క సహృదయనేత్రాలకు సంధాన ప్రతీకలుగా స్వరాజ్యలక్ష్మి, సూర్యారావుపాత్రలు కనపడతారు. నేటియువతను కర్తవ్యోన్ముఖులు చేయగలిగేటట్లుగా చేసిన సహజ సజీవపాత్రచిత్రణ చేసిన రచయిత్రి మాలతీచందూర్ యొక్క కథనశిల్పానికి ఉన్న కళాత్మకజీవనాడి స్పష్టమౌతుంది. రచయిత్రి తన జీవితకాలంలో జరిగిన ఎమర్జన్సీవంటి చారిత్రక సంఘటనలపట్ల తన స్పందనను, ఉద్దేశాన్ని తెలియచేయటానికి ఆయా సంఘటనలలో, తగిన హృదయసంస్కారంగల పాత్రల సంభాషణలద్వారా వ్యక్తీకరింప చేయాలనుకున్నప్పుడు రచయిత్రి హృదయం స్పష్టాస్పష్టంగా ఆవిష్కరింపబడుతుంది. అది రచయిత్రియొక్క రచనాశిల్పపు సృజనాత్మకశక్తికి గీటురాయి వంటిది. ఆ కథనశిల్పాన్ని హృదయనేత్రాలతో సందర్శించటానికి ముందుకుసాగాలి.

7.2. కథనశిల్పం

సజీవమైన జగత్తుతో పరిచయంచేసే కళాకృతి నవల. ఆ జగత్తు మనచుట్టూరా ఉన్న ప్రపంచాన్ని పోలి ఉంటుంది అని 'లార్డ్ డేవిడ్ సెసిల్ అన్నట్టుగా నవల సామాజికజీవితానికి ప్రతిబింబమని, ఒక కథను చెప్పటం, సంస్కృతిని విదితంచేయడం, పాత్రలవ్యక్తిత్వాలను చిత్రించడం, జీవితంపై ఒక దృక్పథాన్ని ప్రేరేపించడం వంటివి నవలారచన చేస్తుంది. యుగచిత్రణ నవలకు ప్రప్రథమ ధ్యేయంగా' సమకాలీన సమాజంలోని మానవజీవితాల చిత్రణ ఉంటుంది. మానవ సంబంధాలలోని ప్రజాస్వామికత వ్యక్తుల ఆలోచనలను ప్రేరేపించినప్పుడు క్రియాశీలక అనుభూతులై అనుబంధ విషయాలను పటిష్టంచేసే విధంగా పాత్రచిత్రణ ఉంటే అక్కడల్లా అంతర్గత రచనాశిల్పం యిమిడి ఉంటుంది. చారిత్రక వాస్తవజీవితానికి కాల్పనికతను జోడించి కథావస్తువును మలిస్తే రూపొందేది నవల. అందుకే సహజమైన స్వాభావికమైన శైలిలో ఉంటుంది. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సర్వవిషయాలమీద రచయిత వ్యాఖ్యానం ఉంటుంది. కాని, పాత్రలు చెప్పటానికి వీలుకానప్పుడు మాత్రమే రచయిత కనపడటం ఉత్తమ నవలా లక్షణం.

వ్యక్తులకార్యాలు, చారిత్రక కాలానుగుణంగా ఉండి సంభవించిన, సంభావ్యతగల సంఘటనలతో కథాకూర్పు ఉండాలి. కథేతివృత్తంలోని ప్రతి సన్నివేశం కేంద్రకమైన రచనోద్దేశ్యంచుట్టూ అల్లుకొని ఉంటాయి. కథావస్తువు భూత, భవిష్యత్తుకు వారధిలా ఉండి వర్తమానంలో దానిని దర్శిస్తున్నట్టుగా రాయగలిగి పాఠకచైతన్యాన్ని కలిగించటమే రచనా శిల్పం. అటువంటి రచనా శిల్పం కలది మాలతీచందూర్ రాసిన హృదయనేత్రి అనే నవల. ఏపాత్రయైనా తమస్వభావంలోని విభిన్నమైన బలాలను, బలహీనతలను తనంతట తాను చెప్పుకోలేదు, కాబట్టి కథావస్తువు ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని రచయిత తన దృష్టిలో ఉత్తమ సంస్కారంగల ప్రధానపాత్రచేత ఆయాపాత్రల స్వరూప, స్వభావాలను కథాగమనంలో యిమిడి పోయేటట్లుగా వ్యాఖ్యానించేటట్లుగా రచన సాగుతుంది. అప్పుడే పాఠకులు నవలాధ్యేయాన్ని అర్థంచేసుకునే క్రమంలో వారి మనస్సులలో ఆయా పాత్రల మంచి చెడులు చెరగని ముద్రను వేయగలుగుతాయి.

కథాగమనంలో కాలానుగుణ సంఘటనల కూర్పులో ఎన్నో జీవన జటిలత్వాలు చోటుచేసుకుంటూ "పరాకాష్ఠస్థితివరకు చేరి" ఉక్కంఠతను కలిగిస్తున్నప్పుడు, ఆయా జటిలత్వాలన్నీ తేలికచేసుకునే మార్గాన్వేషణ సూచనీయంచేస్తే పాఠకుల మనస్సులలోని చైతన్యస్థాయి ప్రశాంతతను

పొందుతుంది. ఆ విధమైన రచన ఉత్తమ కథాసంవిధానం గల రచనాశిల్పంగా కళాహృదయాలకు స్పష్టమవుతుంది. అప్పుడే నవలకు చదివించే గుణం ఉంటుంది. అటువంటి నవల ఈ హృదయనేత్రి.

మాలతీచందూర్ రచించిన హృదయనేత్రి అనే ఈ నవల చారిత్రక, రాజకీయ–ఆర్థిక, సామాజిక–సాంస్కృతిక సంఘటనల సమాహారపు ఏకరూపత కూర్పుగల నవల. స్వాతంత్ర్యోద్యమ కథను కాలక్రమానుగత చారిత్రక సంఘటనల పరిధిలోనే, రాజకీయ–ఆర్థిక వ్యవస్థను పాత్రోచిత సంభాషణలద్వారా వ్యాఖ్యానింపచేస్తూ, పాత్రలు చెప్పటానికి వీలులేని పరిస్థితులలో రచయిత్రి పరోక్షంగా ముందుకు వచ్చి భావచిత్రాలతో[1] వ్యాఖ్యానించి పాఠకులు ఆగకుండా ఆయా కథాసన్నివేశాలలో జటిలత్వంలేక ముందుకు సాగేటట్లుచేయటం రచయిత్రి రచనా నైపుణ్యానికి చిహ్నమవుతుంది. కాలంమారుతున్నప్పుడు సామాజిక మానవచరిత్రలో మార్పులు చోటుచేసు కుంటాయి. వాటి ప్రభావం సామాజిక మానవసంబంధాలలోను, కుటుంబసంబంధాలలోను మార్పులను తెస్తాయి. అయితే ఆ మార్పులను ఒడిసిపట్టుకుంటూనే, అభివృద్ధిమార్గంలో ప్రయాణంచేయటం ప్రజలబాధ్యత. అలా వీలుకానప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించ గలగాలిగాని బలహీనులై పలాయనం చిత్తగించకుండా నిజాయితీతో, నిబద్ధతతో రెట్టింపు శక్తిని కూడగట్టుకొని ముందుకుసాగాలనే స్పృహను కలిగించింది ఈ నవల. స్వాతంత్ర్యానికి పూర్వమున్న పరాయిపాలనలో మనుషుల స్వభావాలు నీతికి నిజాయితీకి నిధిగా ఉండి దేశభక్తి ప్రపూరితంగా స్వరాజ్యంకోసం స్వేచ్ఛా తపనతో దేశవిముక్తికై తమ జీవితాలనే పణంగా పెట్టాలనుకున్నవారు నవలలో కనపడతారు. స్వాతంత్ర్యానంతరం ఆ మనుషులలో కొంతమంది తమ మూలాలను మరిచి, అవినీతి రాజకీయాలలో రాటుతేలి అధికారం, స్వార్థం, ధనదాహం పరమావధిగా మారటంతో మహనీయుల త్యాగాల ఫలితంగా వచ్చిన స్వాతంత్ర్యానికి రక్షణలేకుండాపోతున్న విషయాన్ని స్ఫురింపచేసే కథావస్తువుగల నవల. అదే నేటి భారతదేశంలో జరుగుతున్న చరిత్ర. అటువంటి అంతర్గత అరాచకత్వం నుంచి దేశాన్ని రక్షించుకోవాలనే తపనకు ప్రేరణగా నిలుస్తుంది ఈ నవల. భారతదేశానికి స్వాతంత్ర్యం ఉన్నన్నాళ్ళు ఈ నవల ప్రతివాళ్ళకు పారాయణం చేయాల్సిన అపరగీత. ఈ నవలలో ప్రతిపదం దేశస్వాతంత్ర్యాన్ని మూర్తీభవించిన గ్రంథశిల్పానికి నగిషీలను అందించటంతో, అటువంటి సార్థకపదాలస్థానంలో సమానార్థకపదాలకు అవకాశం లేనంతగా తగిన పదాలపోహళింపుగల[2] సంభాషణలను ప్రయోజనవంతంగా రచనలో జొప్పించడం చేయితిరిగిన సృజనకారులకే సాధ్యమైనవిషయం. అప్పుడే రచయిత్రి యొక్క రచనా ధ్యేయం సంపూర్ణతను సంతరించుకుంది.

చారిత్రకసంఘటనలను క్రమంగా చెప్పుకుపోతే అది ఒక చరిత్ర పుస్తకం అవుతుంది. కాని ఆ చరిత్రను రచయిత్రి కళాత్మకంగా మానవవికాసం సాధించిన పరమార్థంగా[3] మలచగలిగితేనే పాఠకహృదయాలలో అనుభూతిని కలిగించగలిగి సాహిత్యప్రయోజనాన్ని సిద్ధింపచేస్తుంది. ఆ నాడు భారతీయులు స్వేచ్ఛకై బ్రిటిష్ వాళ్ళ విదేశీ అధికారం, ఆర్థికదోపిడీ నుండి విముక్తికై చేపట్టిన స్వాతంత్ర్యోద్యమంలో ఖద్దరు తయారీగల స్వదేశీ దీక్ష, హరిజనోద్ధరణ, మద్యపాననిషేధం, మాతృభాషాభిమానంవంటి విషయాలను ప్రధానంగా చేసుకొని నాడు సత్యాగ్రహనిర్మాణ కార్యక్రమాలను రూపొందించుకున్నారు. కాని సాతంత్ర్యానంతరం ఆ యావిషయాలపట్లనే కొత్తసీసాలో పాతసారావలె స్వదేశీఅధికారం, రాజకీయ అవినీతి, స్వార్థం ఎక్కువగా చోటుచేసుకోవటం జరిగింది. దానివల్ల వచ్చిన స్వాతంత్ర్యానికి భద్రత కరువవుతున్నప్పుడు, దేశస్వాతంత్ర్య పరిరక్షణకై నేటి యువతకు దిశానిర్దేశం చెయ్యాలి. ఆనాటి సత్యాగ్రహ ఉద్యమంలో ప్రధానమైన స్వదేశీదీక్షను అనుసరించేందుకు స్వదేశీవస్త్ర, వస్తుతయారీని అభివృద్ధి చేయాలి. కులాల, మతాల అంతరాలను పోగొట్టి ప్రజాస్వామ్యంలో సమానభాగస్వామ్యంతో ఉండటానికి, మత్తుపదార్థాలు, మద్యపానాలను వదిలించుకోవటానికి, స్వభాషాభిమానం పెంపొందిపచేయటానికి చర్యలుచేపట్టాలి. రాజకీయ అవినీతి వల్లకలిగే ప్రజాపీడనను, వ్యాపార దోపిడీని వ్యతిరేకిస్తూ నాటి స్వాతంత్ర్యోద్యమస్ఫూర్తిని పొంది దేశస్వాతంత్ర్య పరిరక్షణకై నేటి యువత పునరంకితులు కావాల్సిన అవసరం ఏర్పడింది. దానికై యువతను చైతన్యవంతంగా ఉత్తేజితులు చేయగలిగే కథనశిల్పంగల సాహిత్యరచనగా ఈ హృదయనేత్రి అనే నవలను రూపొదించటంలో రచయిత్రి ఉద్దేశ్యంకూడా అదే అని అర్థమౌతుంది.

హృదయనేత్రి నవలా రచయిత్రి చారిత్రక నేపథ్యంగల కథావస్తువులోని చారిత్రక సంఘటనలలో సజీవశిల్పాలవలె పాత్రలు కదులుతూ తమ సంభాషణలద్వారా కథను ముందుకు నడిపించటం ప్రతి సన్నివేశంలో కనపడుతుంది. అందుకే ప్రధానపాత్రలు అన్నీ స్వాతంత్ర్యోద్యమ ప్రభావంతో పుట్టుకొచ్చినవే. స్వరాజ్యసాధన ధ్యేయంగా సత్యాగ్రహ ఉద్యమ కార్యకర్తలుగా జైలుశిక్షలు అనుభవించి మానప్రాణాలను పణంగాపెట్టిన దేశసేవకులు, నాటి యువశక్తి చేసిన త్యాగాల ఫలితమే దేశస్వాతంత్ర్యం. దాన్ని పాఠకులకు గుర్తుచేసి స్వాతంత్ర్యానంతరం దేశంలోని అంతర్గత అరాచకత్వానికి కారకాంశాలను పాత్రల ప్రవర్తనద్వారా తెలియచేస్తూ రెపరెపలాడుతున్న దేశస్వాతంత్ర్య పరిరక్షణకు పూనుకోవాలి. దానికై స్వాతంత్రసమరశీలురైన పెద్దలు భవిష్యత్తును దర్శించగలిగి, యువత తమ హృదయనేత్రాలను విప్పారించి దేశాన్నిచూడటానికి దిశానిర్దేశంచేసి[4], కర్తవ్యోన్ముఖులను చేయగలిగేటట్లుగా రచనచేయటం, నవలాకథాకథనశిల్పాన్ని[5] కళాత్మకంగా తీర్చిదిద్దటంలో

చేయితిరిగిన రచయిత్రిమాత్రమే చేయగలరు. దేశభక్తి మృగ్యమైన ఈ రోజుల్లో దేశాభిమానం కలిగించి, దేశరక్షణవైపు యువతను కదిలించే రచనచేయటం అంత ఆషామాషికాదు. కాని మాలతీచందూర్ తన రచనాశిల్పంతో పాఠకులు తమంతటతామే కర్తవ్యోన్ముఖులు కాగలిగేటట్లుగా ఈ నవలను రాయగలిగారు. దాన్ని ప్రత్యేకంగా పరిశీలించటంవల్ల మాత్రమే రచయిత్రి రచనాశిల్పం హొపాఠకహృదయాలకు హొదృశ్యమానమౌతుంది.

నవలా ప్రారంభంనుండి నవలచివరివరకు ప్రధానపాత్రలకు స్ఫూర్తిమంతంగా నిలిచి ప్రభావితంచేయగల దేశసేవికగా రామలక్ష్మి పాత్రప్రవేశం జరిగింది. ఖద్దరు వస్త్రధారణతో 'వందేమాతరం' నినాదంతో 'గాంధి బ్రిటిష్ వారిని తరిమికొట్టి దేశానికి స్వరాజ్యం తెస్తాడు' అనే స్వాతంత్ర్యోద్యమ కథలను తన తరువాతి యువతరానికి తెలియచెప్తూ, వారిలో నిరంతరం దేశభక్తిని రగిలించే రామలక్ష్మి పాత్రలో రచనోద్దేశ్యం పాఠకులకు స్ఫురింపచేయటం[6] ఉత్తమ రచనాశిల్పానికి గీటురాయివంటిది. గోపాలరావు తల్లిదండ్రులను వదిలి దేశస్వాతంత్ర్యకథలను చెప్పే తన అత్తయ్య రామలక్ష్మితో వెంటపడి వెళ్ళానుకోవటంలోనే, అతనికి ఉన్న జిజ్ఞాసను పసికట్టిన రామలక్ష్మి ఆతనిని ఒకస్వాతంత్ర్యవీరుడిగా చెయ్యాలనుకోవటం, రాముదత్తయ్య రాట్నంవడికి నూలుతీయటాన్ని గోపాలం భావిదేశభక్తుడిగా[7] పరిశీలించేవిధంగా రచన చేయటం అంటే పాఠకుల మనస్సులు పరాయిపాలన యొక్క చీకట్లలో సినీవాలిని దర్శించేటట్లుగా కళాసృష్టి చేయటానికి ఉపయోగించే ఉలికి పదును పెట్టటంలాంటిది. ఆ ఊరిలో రైలు ఎక్కేటప్పటి నుండి గాంధి దక్షిణాఫ్రికాలో చేసిన సత్యాగ్రహ ఉద్యమానికి నాందియైన తెల్లదొరల దాష్టీకంతో స్వాతంత్ర్యోద్యమ కథను ప్రారంభించి, పరాయిపాలకుల అధికారం, యిష్టానుసారం జీవించే స్వేచ్ఛలేని బానిసత్వాన్ని పోగొట్టి గాంధి స్వరాజ్యం తెస్తాడనే మాటను పాఠకుల మనస్సులలో కూడా నాటుకునేటట్టు రచన సాగింది. దేశాన్నిగురించిన ఆలోచనలను రగిలించటం అంటే పాఠకులు నవలను చదవాలనుకునే ఆసక్తిని కలిగిస్తూ, సాహిత్యసృష్టి ప్రయోజనం నెరవేరటంగా రచనాశిల్పకళ మొదలవుతుంది.

చీరాల రైలుస్టేషన్‌లో దిగిన భార్య రామలక్ష్మిని యింటికి తీసుకువస్తూ దారిలోనే గాంధేయవాదియైన వాసుదేవరావు చీరాలలో అధికపన్నుల రాబడికై చీరాలను మున్సిపాలిటీగా మార్పుచేసిన దానిని నిరసించే ఉద్యమ కార్యాచరణను గురించి ప్రస్తావించినట్లుగా రాయటంలోనే ఆయాపాత్రలు పరాయిపాలనయొక్క ఆర్థిక దోపిడినుండి తమకు తాము విముక్తిచెందాలనుకునే వారియొక్క తపన అర్థమవుతుంది. రచనా ప్రారంభంలోనే పాఠకుల మనస్సులలోకూడా పీడననుండి విముక్తిచెందాలనే స్పృహను కలిగించాలనుకోవటమే నవలారచనోద్దేశ్యాన్ని సాధించేదిశగా తొలిఅడుగుల ముద్రలను నవలలో నిక్షిప్తంచేయటం రచనాశిల్పపు ఆత్మను ఆహ్వానించటమే.

రాముడత్తయ్య తనపెంపకంలో మేనల్లుడైన గోపాలరావుని స్వాతంత్రసమరశీలుడిగా తయారుచేయటానికై తగిన వాతావరణాన్ని ఏర్పరచటానికై గోపాలరావు చీరాలలో ఉన్నప్పుడు ఇంట్లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాలు, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గారి దర్శనం, దేశసేవికవంటి జానకమ్మగారి ఆధ్వర్యంలో చీరాలఉద్యమంలో చిన్నప్పటి గోపాలరావుని భాగస్వామినిచేయటమే రచనోద్దేశ్యానికి మంచిపునాదులు ఏర్పడి రచనాశిల్పానికి భూమిక ఏర్పడుతుంది. చీరాల ఉద్యమ సమయంలోనే గోపాలరావు వంటి యువతకు కులమతాల తేడాలేకుండా కలిసిమెలిసి పరాయిపీడన నుండి విముక్తికై చిన్నాపెద్దా కష్టపడటం, పోలీసువ్యవస్థకు భయపడకుండా అవసరమైతే జైళ్ళకు వెళ్ళగలగటం, దేశ స్వరాజ్యంకోసం అవసరమైతే ఆస్తిని, ఆరోగ్యాన్ని త్యాగంచేయగల మానసికపరిపక్వతను పాఠకులు పొందగలిగేటట్లుగా ఆంధ్రదేశంలో స్వాతంత్ర్యోద్యమానికి పునాదియైన చీరాలఉద్యమ కథను నడిపించటం కథనశిల్పానికి చెక్కుటద్దాలను జోడించటమే.

ఉద్యమంలో భాగంగా మున్సిపాలిటి పన్నులను కట్టటాన్ని ప్రజలు నిషేధించటంతో పోలీసులు వాళ్ళపొలాలలోని పంటను, కూరగాయలను అమ్ముకోనివ్వకుండాచేయటం, చీరాలలోని యిళ్ళను తగలబెట్టటం, సామాన్లను జప్తుచేయటమేకాక, చీరాలఉద్యమ శిబిరాలకువచ్చి పోలీసులు 'ప్యూనిటిన్ టాక్సు'ను వేసి ప్రజలకు ఆహారసరఫరాను దిగ్బంధంచేయటం జరిగింది. వాళ్ళుచేసిన ఆ విధ్వంసకాండను వర్ణించిన సందర్భంలోను, దుగ్గిరాలగోపాలకృష్ణయ్య, వాసుదేవరావు, జానకమ్మలను అరెస్టు చేసిన విషయాన్ని తెలియచేసేటప్పుడు, పదినెలలపాటు ఉద్యమాన్ని సాగించి ప్రజలు తిరిగి చీరాల చేరుకున్న విషయం పాఠకులకు తెలపాల్సిన అవసరం వచ్చినప్పుడు, పాత్రల కదలికలు, వాటి మనస్తత్వాలను పాఠకులకు తెలియచేయాల్సి వచ్చినప్పుడు మాత్రమే రచయిత్రి పరోక్షంగా వ్యాఖ్యానించటం కనపడుతుంది. ఎందుకంటే సైమన్ కమిషన్ వంటి ప్రభుత్వవిధానాలను, ఉప్పుసత్యాగ్రహ ఉద్యమ తీరు, జైళ్ళవర్ణన, రెండవప్రపంచ యుద్ధసందర్భంలో తిండి దొరకక ప్రజలు పడుతున్న యిక్కట్లువంటివి ప్రజలందరికి సంబంధించిన ఏ విషయమైనా ఏ ఒక్కపాత్రచేత చెప్పించిన పరిపూర్ణత సిద్ధించదు కాబట్టి, దానికన్నా రచయిత్రి వర్ణించటం సందర్భానికి బలాన్ని చేకూరుస్తుంది. అటువంటిదే గాంధి నిరాహారదీక్ష, దాని ధ్యేయాన్ని ప్రజలందరికి తెలియాల్సిన అవసరం వచ్చినప్పుడు రచయిత్రి ఒక అదృశ్య వ్యాఖ్యాతగా ఉంది. ఇదే కథనశిల్పానికి అవసరమైన మేలిముసుగు.

గాంధిపిలుపునిచ్చిన చారిత్రక సత్యాగ్రహఉద్యమాన్ని రచయిత్రి ముందుకువచ్చి చెప్పటంకన్నా పాత్రల ఆచరణలో పాఠకులకు అర్థమయ్యేటట్లుగా కథాగమనం ఉంటే వారి మనస్సులపై దాని

ప్రభావం ఎక్కువగా ఉంటుందనే దృష్టితో రచనాశిల్పాన్ని మలచటంలోనే రచయిత్రి ప్రజ్ఞ ఉంది. ఉద్యమ కార్యాచరణలో భాగంగా రాముడత్తయ్య, జానకమ్మ వంటి పెద్దలదృష్టిని నిరంతరం రాట్నం వడకటం, నూలుతీయటం వంటి పనులలో నిమగ్నులనుచేయటం, సత్యాగ్రహఉద్యమంలో ప్రధానమైన ఖద్దరు ఉద్యమాన్ని నడిపించి, యువకులైన గోపాలరావువంటివారికి జాతీయకళాశాల బోధనలో తప్పనిసరి పాఠ్యాంశకార్యక్రమంగా పెట్టటం ఉద్యమాన్ని ప్రయోగాత్మకంగా దర్శనీయంచేయటం జరిగింది. దాని ఫలితంగా స్వాతంత్ర్యానంతరంకూడా పాఠకులు చేతివృత్తుల విలువను తెలుసుకునేటట్లుచేసి వారిలో దేశాభిమానపు గగుర్పాటును గలిగించాలనుకోవటం నవలా ప్రయోజనానికి మలిఅడుగులు వేయించే రచనా శిల్పానికి ఆకృతిని తీర్చిదిద్దటమే.

గోపాలరావు బందరులోని జాతీయపాఠశాలలో చదివేటప్పుడు తోటిస్నేహితుడైన నందయ్యవల్ల సమాజంలో హరిజనులను అస్పృశ్యులుగా చూడటాన్ని గ్రహింపుకు తెచ్చుకొని, తాను హరిజనుడైన నందయ్యను తనరూములో అట్టిపెట్టికొని, సహపంక్తిభోజనంచేసి తోటివిద్యార్థులకు ఆదర్శంగా నిలిచి సత్యాగ్రహఉద్యమంలో ముఖ్యమైన హరిజనోద్ధరణను ఆచరణలో చూపింగలిగేటట్లుగా రచనా శిల్పాన్ని మలచటం దానికి నూతన కళలను అద్దటమే. అంతేకాదు భారతీయులకు స్వరాజ్య అర్హతలేదని విమర్శించినందుకు స్వాతంత్ర్యోద్యమంలో స్వీయసంస్కరణ అవసరమని ఆనాటి దేశనాయకులు భావించి, అస్పృశ్యులుగా భావింపబడే పంచముల స్వీయసంస్కరణలో భాగంగా పంచమోద్ధరణ విధానం అర్థమయేందుకు ఉన్నవ లక్ష్మీనారాయణగారు 'మాలపల్లి' అనే నవలను రాస్తేదానిని ప్రభుత్వం నిషేధించినప్పటికీ, పంచముడైన నందయ్య చదవిన ఆపుస్తకాన్ని హరిజనేతరుడైన గోపాలరావుచేతకూడా చదివింపచేయటం సాహిత్యప్రయోజనంగల రచనాశిల్పానికి పెద్దపీటను వేయటంలాంటిది. పాఠకులకు పంచములయెడ సదభిప్రాయం ఏర్పడేటట్లు చైతన్యపరచటం ప్రజాస్వామ్యంలో ఐక్యతకు పెద్దపీటవేసి, కులపరమైన అంతరాలు లేకుండా, లభించిన దేశస్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకునేటట్లుగా పాఠకహృదయాలను ప్రక్షాళన చేయాలనుకోవటం రచనాశిల్పానికి జీవామృత సదృశమైంది.

గోపాలరావు తన చిన్నప్పుడు రాముడత్తయ్యను స్వరాజ్యమంటే ఏమిటని అడిగినదానికి ఆమె 'పిల్లలు స్వేచ్ఛగా, ధైర్యంగా తిరగటం' అని అర్థం చెప్పింది. సూక్ష్మంలో మోక్షంచూపించటం అంటే యిదే. విస్తృతమైన అర్థంగల స్వరాజ్యం అన్న చిన్నపదాన్ని చిన్నపిల్లవాడు సులభంగా గ్రహించగలిగేటట్లు అల్పాక్షరాలలో అనల్పార్థాన్ని యిచ్చేవిధంగా పాత్రలకు ప్రాణంపోస్తూ రాయటం రచనాశిల్పానికి ఆత్మపదార్థాన్ని అనుసంధానించటమే. గోపాలరావుకు అప్పుడు తెలియకపోయినా

ప్రభుత్వ నిషేధితపుస్తకమైన 'మాలపల్లి' నవలను చేతిలో ఉంచుకొని వెడుతున్నసందర్భంలో నందయ్యను అరెస్టు చేసినప్పుడు గోపాలరావుకు స్వరాజ్యమంటే ఏమిటో సాదృశంగా అవగాహనకు వచ్చేటట్లుగా కథాంశాన్ని ఉపయోగపడేవిధంగా మలచటం, రచయిత్రి ప్రయోగాత్మకంగా నిరూపించే రచనచేయటం రచనాశిల్పానికి జీవకళలను ఆపాదించటమే. జాతీయవిద్యావిధానంవంటి మౌలిక విషయాలనేకాక, హిందూముస్లిములమధ్యన ఏర్పడిన సంఘర్షణల సన్నివేశాలను, ఎమర్జన్సీవంటి జాతీయవిషయాలనుకూడా ప్రయోగాత్మకంగా పాత్రల అనుభవంలోకి వచ్చేటట్టుగా చేసి పాఠకులమెదళ్ళను కదిలించటమే కళాప్రయోజనమనే సౌందర్యాన్ని సంతరించుకొన్న రచనాశిల్పం అవుతుంది. చారిత్రక విషయాలను రచయిత్రిగాని, పాత్రలచేతగాని చెప్పించినప్పుడు పాఠకులు భూతకాలంలోకి వెళ్ళిగతానుభవాలను పోగుచేసుకొని తిరిగి వర్తమానంలోకి వచ్చి భవిష్యత్తుకై నిర్మాణాత్మకదృష్టిని కలిగించుకొనేటట్లుగా రాయటం రచనాశిల్పం మూర్తీభవించిన ఒక వర్తమాన కాలదేవత జ్ఞానపాత్రను అందించటమే.

పాత్రచిత్రణ ఎదుగుదలలో సహజత్వం ఉట్టిపడినప్పుడే ఆ పాత్ర పాఠకులకు దగ్గర కాగలుగుతుంది. మనిషి ఎదుగుదల సామాజిక వాతావరణంలో ఉంటుంది. గోపాలరావు స్వాతంత్ర్యవీరుడిగా ఎదగటానికి వీలుగా చారిత్రక స్వాతంత్ర్యోద్యమ సంఘటనల ప్రభావనేపథ్యాన్ని దోహదంచేసే విధంగా కథాకూర్పును చేయటం కథనశిల్పానికి ఉన్న ప్రత్యేకతగా భావించాలి. ఆ చారిత్రక సంఘటనల కాలక్రమాన్ని యథాతథంగా నడిపిస్తూనే అది ఒక చరిత్ర గ్రంథం కాకుండా కళాత్మక నవలగా మలచటానికే రచయిత్రి కుటుంబ సంఘటనలను వ్యక్తుల ప్రవర్తనలలోను, వ్యక్తుల స్వగతాలలో గతాన్ని గుర్తుచేసుకునేటట్లుగా రచన చేయటం నవలాశిల్పానికి సహజ కళారూపకతను సంతరింప చేయటమే. అందుకే చదువు పూర్తికాక మునుపే అప్పుడప్పుడే యవ్వనంలో అడుగుపెడుతున్న గోపాలరావు వ్యక్తిత్వంలో స్థిరత్వం ఏర్పడక పోవటం సహజం. అందుకే ముందుగా గోపాలరావు తాను వివాహం చేసుకోకుండా దేశసేవికుడిగా ఉండాలనుకొన్న విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పికూడా, వారిని ఎదిరించలేక పోవటమేకాక భార్య పార్వతియొక్క చూపులను తప్పించుకోలేనితనం ఆ పాత్రలో కనపడటమే ఆ పాత్ర సహజత్వానికి చిహ్నం. అయితే ఆతని పెళ్లిలో గోపాలరావులోని సరాజ్యఉద్యమంయొక్క స్వభావ మౌలికతను పోగొట్టకుండా, ఆతడు పెళ్ళిలో వాసుదేవరావుగారు చెప్పిన విషయాన్ని గుర్తుపెట్టుకొని పెళ్ళిలో అలకపాన్పు కట్నంకింద యిచ్చే సొమ్మును హరిజననిధికి పంపేటట్టు చేయటం రచనాశిల్పంలోని సూక్ష్మాంశ కాంతిరేఖలను ప్రసరింపచేయటమే. అంతేకాదు వాసుదేవరావు గోపాలరావుయొక్క వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దటానికే

‘ఎవరిప్రభావం నీమీద ఉండకుండా చూసుకోమని, నీవు నమ్మినదానిని, నీమనస్సుకు నచ్చిందే చేయటానికి ధైర్యంగా బతకాలని’ చెప్పిన గాంధి ప్రభోదాన్ని గుర్తుచేసి, ‘అంతరాత్మకు వ్యతిరేకమైన పనిని చేయద్దని’ చెప్పిన మాటలవల్లనే గోపాలరావు కుటుంబవ్యక్తుల ప్రభావానికి లోనుకాకుండా జాతీయోద్యమంలో భాగస్వామి కావాలనుకోవటం జరిగింది. గోపాలరావు చదువుపూర్తి అయ్యేసరికి అతని వ్యక్తిత్వంలో స్థిరత్వం ఏర్పడేట్లుగా రచయిత్రి పాత్రపోషణచేసి, గోపాలరావు ఉద్యమంలో పాల్గొనగలిగేటట్టుగా ఆ పాత్రను దేశస్వాతంత్ర్యసాధనకై ఆశయాల ఆదర్శపాత్రగా నిలబెట్టడం, పాఠకుల మనస్సులు ఆ పాత్రయెడల సహానుభూతిని పొందేటట్లుగా చేసిన రచనాశిల్ప నైపుణ్యానికి అగ్రతాంబూలం యివ్వాల్సిందే.

యువత ఉద్యమాలలో పాల్గొనాలంటే అరెస్టులు, జైళ్ళు అనే భయం ఉంటుంది. అయితే అది స్వార్థంకోసం కాకుండా దేశప్రయోజనాలకోసం ఉద్యమంలో పాల్గొని అరెస్టుకాబడితే వారిని రాజకీయఖైదీలని అంటారనీ, వారిని నేరస్థులకింద చూడబడకుండా చేసుకొనే ధైర్యాన్ని యువతలో నింపటానికి, అవసరమైతే ప్రాణత్యాగాలకుకూడా వెరవనితనం ఉద్యమకార్యకర్తలో ఏర్పడాలనే జితేంద్రనాథ్ రాయ్ జైలులో నిరాహారదీక్షచేసి మరణించిన సంఘటనను పొందుపరచటం, యువతను ఉద్యమంపట్ల వెన్నుతట్టి ప్రోత్సహించటంలాంటిరచన సహజరచనాశిల్పానికి వెన్నముకను ఆపాదించటమే. కాబట్టే గోపాలరావు తాను సంసారదీక్షలో పడకుండా ఉండాలని భావించి తాను ఉద్యమంలో పాల్గొనాలనే ఆకాంక్షను రేకెత్తించి అతనివ్యక్తిత్వంలోని స్థిరత్వాన్ని ఏర్పడేటట్లు చేయటం జరిగింది. అందుకే ఆతడు శాసనోల్లంఘనంలో పాల్గొని మూడేళ్ళపాటు జైలుశిక్షను అనుభవించడం, వ్యక్తిసత్యాగ్రహంలో పాల్గొన్నందుకు అతనిని అరెస్టుచేసి నాలుగేళ్ళపాటు జైల్లోపెట్టినప్పుడు తమతిండి తాము వండుకోవాలని ధైర్యంగా జైలు అధికారులనుండి అనుమతులను పొందటంగా పాత్రచిత్రణచేయటం రచనాశిల్పానికి ఆంగికమైన కళాకాంతులను పొందుపరచటమేకాక రచయిత్రి క్రాంతదర్శనానికి నిదర్శనంగా ఉంది.

గోపాలరావు స్వగతంలో స్వాతంత్ర్యానికి పూర్వం “ఒకప్పుడు దేశానికి నేనేంచెయ్యాలి? ఏవిధంహగా దేశానికి ఉపయోగపడగలను? అని అనుకునే వాళ్ళు ఇప్పుడు దేశం నాకేం చేస్తుంది నాకేంప్రయోజనం జరుగుతుంది అని ప్రతిపనికీ ప్రతిఫలం కోసం ఎదురుచూస్తున్నారు. ఇటువంటివాళ్ళ చేతుల్లోపడి దేశం పురోగమించదు-వెనక్కువెడుతుందే తప్ప” అని అతడు భావించేటట్లు రచనచేయటం స్వాతంత్ర్యనంతర తిరోగమన దృక్పథాన్ని పాఠకులు తమ ఆలోచనలోకి తెచ్చుకునేట్టుగాచేసి మనస్సులను స్పందింపచేయటం సాహిత్యప్రయోజనమనే అంజనాన్ని రచనాశిల్పానికి అద్దటమే.

శ్రీనివాస్ రాసిన ఉత్తరంలో "నాన్నా! ఆశయాలు, ఆదర్శాలు అందరికీ ఉంటాయి. వాటిరూపు కాలగతిలో మారిపోతూ ఉంటుంది. ఒకప్పుడు మీరంతా స్వాతంత్ర్యం సంపాదించటంకోసం ప్రాణాలుబలిపెట్టటానికి సిద్ధపడ్డారు. ఎందరో మహనీయుల త్యాగఫలితంగా మా తరానికి స్వాతంత్ర్యం వచ్చింది. కాని స్వరాజ్యంతోపాటు సమానత్వం రాలేదు. ప్రతివ్యక్తికి ఓటు ఉన్న ఈ దేశంలో ప్రతిమనిషి కడుపునిండా తిని-వంటినిండా బట్టకడుతున్నాడా? దేశమంతాటా లక్షాది అన్నార్తుల ఆకలి, శ్రామికుల హాహాకారాలు, నాన్నా ఒక్కసారి ఆలోచించు, పంచవర్షప్రణాళికలు, ఓటుహక్కు ఇవి ఆకలితో అలమటించే వాడికి అన్నంపెట్టటంలేదు. పెట్టలేకుండా ఉన్నాయి. మనది సమసమాజంకాదు. దీనికి రాజకీయనినాదాల వంచనతప్ప ఆకలితీర్చే శక్తి లేదు. ఈ సమాజం, ఈ వ్యవస్థ కుళ్ళిపోయినాయి. ఆర్థిక అసమానతని, వర్గపోరాటంతో తప్ప ప్రణాళికలతో జయించలేము..... నాన్నా మనమార్గాలు వేరు. నువ్వు అహింసనుచేపడితే నేను తుపాకీని ఆయుధంగా ఎన్నుకొన్నాను. మనధ్యేయాలు ఒకటైనా మార్గాలుమాత్రం ఒకటికాదు...." అంటూ రచయిత్రి హింసా, అహింసల స్వభావాన్ని పాఠకుల ముందుపెట్టి వారు దేన్ని ఎంచుకోవాలా అని పాఠకులకే వదిలేసేవిధంగా రాయటం రచనాశిల్పంలోని చైతన్యవిన్యాసానికి ప్రతీక అవుతుంది.

విశాలాంధ్ర ఉద్యమ సమయంలో ఉద్యమకర్త లక్షణాలను చెపుతూ గోపాలరావు ఉద్యమాలు నిర్వహించే ముందే ఆ వ్యక్తికి అసాధారణమైన ప్రజ్ఞ, భవిష్యత్తులోకి చూడగలిగిన సునిశితదృష్టి, రాజకీయపరిజ్ఞానం, పదునైన శక్తివంటి మేధ - ఇవన్నీ ఉండాలని గోపాలరావు పాత్రచేత చెప్పించటం జరిగింది. ఉద్యకారునుకు ఉండవలసిన సమర్థత, మేధాశక్తిని పాత్రచేతచెప్పించి పాఠకుల ఆలోచనలకు పదునుపెట్టటం, రచనాశిల్పచైతన్యానికి అదనపు హంగును, రంగును అద్దటమే.

రైలులో చీరాలవెడుతున్న గోపాలరావుకు తోటిప్రయాణికుడికి మధ్యన జరిగిన సంభాషణలో భాగంగా "ఇంగ్లీష్ స్కూల్స్ వద్దని, బ్రిటిష్ వాళ్ళతో పోరాడిన మనం ఇరవైఏళ్ళు తిరక్కుండా మళ్ళీ ఆచదువే కావాలని ఎగబడుతున్నాం, మనం వెనక్కివెడుతున్నామా, ముందుకా.... కాన్వెంటుకు పంపడంలో తప్పుందని నేను అనను. అది ఒక స్టేటస్ సింబల్ అయితే మటుకు విచారించాల్సి వస్తుంది. ఏ నిద్యావిధానం సరిగ్గా లేదన్నామో ఆ విద్యనే మనవాళ్లు తిరిగి కోరుకుంటున్నారు.... మన చదువులు కేవలం ఉద్యోగానికి తప్ప వ్యక్తివికాసానికి కాదంటాడు. బ్రిటిష్ వారు గుమాస్తాలని మన యూనివర్శిటీలోంచి ఫ్యాక్టరీ మోడల్స్ లాగా తయారుచేసారని, ఆ విద్యవల్లనే మనలో బానిసత్వం ప్రాణంపోసుకుందనీ - ఒకప్పుడు అటువంటి స్కూల్స్ ని బాయ్ కాట్ చేసాము. ఇప్పుడు అదే స్కూల్స్ని పట్టుకొని వేళ్ళాడుతున్నారు.." అంటూ స్వాతంత్ర్యానంతరం కూడా జాతీయవిద్యావిధానం

ఉండాలనే అభిప్రాయాన్ని గోపాలరావుపాత్రచేత వెల్లడింపచేయటం, మాతృభాషమీదప్రేమయే దేశస్వాతంత్ర్యాన్ని కాపాడుతుందనే భావన కలగటమే. పాశ్చాత్యపు పోకడల భావనతో భాషాదాస్య పాఠకుల మనస్సుల్లో స్వాతంత్ర్యపు విలువలను జొప్పించాలనుకోవటమే రచయిత్రియొక్క ఆత్మికమైన దేశస్వాతంత్ర్యాభిమానం స్పష్టమౌతుంది. జరుగుతున్న చరిత్రను పాఠకుల ముందుపెట్టి వారిని ఆలోచింపచేసే విధమైన రచన సాహిత్యకళాప్రయోజనాన్ని సంతరించుకున్న ఉత్తమ రచనా శిల్పం అవుతుంది. అంతేకాదు మానవాభివృద్ధికి, స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలవిలువలకు ఆటపట్టువైన విద్యావిధానం దేశపురోగమనానికి దారితీస్తోందా లేదా తిరోగమనంవైపు మళ్ళించుతోందా అని పాఠకుల మెదళ్ళకు పట్టిన భాషా, భావదాస్యాలను వదిలించే ప్రయత్నం చేయటం, రచనాశిల్పంలో భారతదేశ స్వాతంత్ర్యకాంతులను ప్రతిఫలింపచేయటమే.

సర్వసామాన్యంగా ప్రజావాణిలో కాలం మారిపోయింది. కాలం చెడిపోయింది అని అనటం హాస్యాస్పదంగా అనిపించి గోపాలరావు పాత్ర ఆ కాలస్వరూపాన్ని విశ్లేషిస్తూ "కాలానికి ప్రాణం ఉందా దానికి రూపం ఉందా కాలానికి గమనం వుంది తప్ప-ప్రాణం లేదు, అటువంటి కాలం మారటం ఏమిటి. మనిషి తనుచేసిన కొన్నింటికి మటుకే బాధ్యత వహించి మిగతావాటిని చుటూ ఉన్నవారిమీద, కాలంమీద నెట్టుతూ వుంటాడు. రైల్లోకూర్చొని రైలు పరిగెడుతుంటే పరుగెత్తుతున్నది రైలుకాదు టెలిఫోన్ స్థంబాలు అనుకొనే చిన్నపిల్లాడిలాగా మానసికభ్రమలో ఉంటాడు.....కాలం అన్నిటినీ మారుస్తుంది. కాలపురుషుడు దైవస్వరూపుడని అంటుంటారు ఆధ్యాత్మికవాదులు. మనిషి మనిషిలా బ్రతకలేక తనలోని ప్రలోభాలను జయించలేక బలహీనతని కాలానికి అంటగడుతున్నాడు. కాలంమారదు. ఉదయనయనాలు రాత్రిబగళ్ళు, ఋతువుల మార్పులు ఇవి సృష్టి ఆదినుంచి క్రమానుగతంగా జరుగుతూనే ఉన్నాయి. మనిషి తీరుమారిపోతూ జ్ఞాన వనరులను దుర్వినియోగపరుస్తూ పరిసరాలను కలుషితంచేసి కాలాన్ని తప్పుపడుతున్నాడు... కాలం ఇప్పుడు అప్పుడు ఒకేలా ఉంది. అందులో మార్పులేదు. చుట్టూ పరిస్థితులలో మార్పు వచ్చి విలువలు తలకిందులవటంతో కాలాన్ని తిడుతున్నారని" గోపాలరావు కాలాన్ని తన తల్లి తిట్టిన సందర్భంలో భావించాడు. ఇదే గోపాలరావు సూర్యారావు వచ్చి స్కూల్ ప్రారంభోత్సవానికి పిలిచినప్పుడు విద్యాశాఖమంత్రిని పిలవమనిచెప్పి స్వాతంత్ర్యానంతరం పదవికితప్ప మనిషికి విలువలేదని, కాలం అలాఉందని, తాను అటు కాలాన్ని ఎదుర్కోలేక ఇటు రాజీపడలేక సహాయనిరాకరణ చేస్తున్నానని అనుకున్నాడు. పాత్రలు స్వగతంలో అంతర్ముఖత్వానికి లోనయ్యేటట్టుచేయటం రచనాశిల్పపు సజీవసంఘర్షణకు నిదర్శనం.

రాజకీయాలలో నిలబడాలనుకొని, సీటు రికమండేషన్ కోసం గోపాలరావు దగ్గరకు వచ్చిన బుచ్చి "ఈ దేశం రష్టుపట్టిపోతోంది. ఎక్కడచూసినా అవినీతి, లంచగొండితనం, మన వాళ్ళు ఏడాదికి నాలుగువందలకోట్లు నల్లధనంగా మారుస్తున్నారు. పెద్దపెద్ద వ్యాపారస్థులు దొంగలెక్కలు చూపించి ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారు. ఏ ఒక్కడికి పన్నుకట్టాలన్న ధ్యాసలేదు. ఇది ప్రజలప్రభుత్వం పన్నులన్నవి ప్రజలడబ్బు- అని ఎవరికీ గుర్తుండటంలేదు.... అవినీతి మర్రిచెట్టులా మహావృక్షమైపోయి వూడలుదిగి గట్టిగా పాతుకుపోయింది. దాన్ని కూకటివేళ్ళతో పెళ్ళగిస్తే తప్ప లాభంలేదు.... ఈ రాజకీయకాలుష్యాన్ని పోగొట్టటానికి మనం ఏదన్నాచేయ్యాలి.... మనతరం ముందుతరాలవారికి స్వచ్ఛమైనపరిపాలన-క్లీన్ అడ్మినిస్ట్రేషన్" అని ఒక అవినీతిపరుడి పాత్రచేత చెప్పించటం దయ్యాలు వేదాలు వల్లించినట్లున్నది. రాజకీయ అధికారం ఎందుకు కావాలోకూడా బుచ్చి చేతనే చెప్పిస్తూ, "అధికారం చేతిలో ఉంటేకాని అవినీతిని అరికట్టలేము. అధికారం కావాలంటే ఎలక్షన్లలో నుల్చోవాలి. పార్టీ టికెట్టుకు డబ్బు వెదజల్లాలి. ఆతర్వాత కాన్వాసింగ్ కి ఖర్చుపెట్టాలి. ఇంత ప్రయత్నం చేస్తే తప్ప అధికారం చేతికిరాదు. అప్పుడు ప్రజాసేవచెయ్యటానికి...." దానికి గోపాలరావు "పార్లమెంటులో కూర్చుంటేతప్ప ప్రజాసేవచేయలేవా... నిజంగా అవినీతిని నిర్మూలించాలని ఉంటే పార్టీటికెట్టు కోసం లంచంపెట్టద్దు... ఎలక్షన్లలో ఖర్చుపెట్టే డబ్బు నల్లడబ్బుకాదా... ఎలక్షన్లంటే డబ్బుపెట్టి ఓట్లుకొనటం కాదు.. ప్రజలు యిష్టపడి ఎన్నుకోవాలి ఆ ఎన్నుకొన్నవ్యక్తి ప్రజాసేవ చేయాలి ప్రజాస్వామ్యానికి ఎన్నికలు పునాదిరాళ్ళు. ఆ పునాదిలోనే ఓట్లను కొనుక్కున్నప్పుడు యిసుకతో కట్టిన పునాదిలా కూలిపోతుంది" అని అంటూ గోపాలరావు "తాను ఎలక్షన్లలో నిబడ్డప్పుడు దమ్మిడీఖర్చుపెట్టలేదని కాన్వాసింగ్ కి కొద్దిగానే ఖర్చవుతుందని, తాను ఎసెంబ్లీసీటును గెల్చుకోలేదా" అని అడిగాడు. గోపాలరావుకి బుచ్చికి మధ్యన జరిగిన ఎన్నికలసంభాషణలు రచనాశిల్పానికి పదునుపెట్టటం వంటివి.

చీరాలలో జానకమ్మపాత్రచేత పాఠకులకు నాడు తాముచేసిన ఉద్యమవిధానాన్ని మరొకసారి గుర్తుచేయించాలనుకొని ఆమెచేత "రోజులు మారిపోతున్నాయి. మా విలువలు మా ఆదర్శాలు ఎవ్వరికీ అక్కరలేదు. ఒకప్పుడు కల్లుదుకాణాలముందుకు వెళ్ళి కల్లుమానండి అని పికెటిగ్ చేసి లాఠీదెబ్బలుతిని జైలుకెళ్ళాము. ఇప్పుడు మనం సర్వస్వతంత్రులమయ్యాం - వీధివీధిన కల్లుకొట్లని వేలంపాడి, ఆ డబ్బుతో ఓట్లు కొనుక్కుంటున్నారు.... హరిజనోద్ధరణ, అస్పృశ్యతా నివారణ అన్నాము. ఇప్పుడేం జరుగుతోంది. ఊరుబయట కాలనీలు కట్టించి-వారిని అంటరానివాళ్ళని చేస్తున్నారు. బాపూజి ఇటువంటివి స్వప్నంలోనైనా వూహించి ఉంటే ఆయన ఎప్పుడో హిమాలయాలకు

వెళ్ళిపోయేవారు – ఈ స్వరాజ్యం వద్దు, స్వాతంత్ర్యం వద్దని– అప్పుడు పరాయి ప్రభుత్వం 'బ్రిటిష్ వాళ్ళని తరిమి కొట్టాలన్న లక్ష్యం... మీరు ప్రజలమధ్యకి వెళ్ళండి ఈ రాజకీయనాయకులు మంత్రులు చేస్తున్న అన్యాయాలు ప్రజలకు చెప్పండి. ప్రజల కళ్ళుతెరిపించండి. ఇప్పుడు మీరు అవినీతి, రాజకీయ దురహంకారం, కులతత్వాలు – వీటిని తరిమికొట్టండి." అంటూ తన తరువాతి తరంవాడైన గోపాలరావుకు స్వాతంత్ర్యానంతర లక్ష్యాలను ముందుంచి దిశానిర్దేశం చేసింది జానకమ్మ. నేటి రాజకీయఅవినీతి, అధికారం, స్వార్థం ఆశ్రితపక్షపాతంతో మానవవిలువలు మృగ్యమవుతున్న వ్యవస్థలో నిరాశా, నిస్పృహలకు లోనయ్యే యువతకు కర్తవ్యోపదేశంచేసి వెన్నుతట్టి ప్రోత్సహించి దీవించే విధమైన రచనా శిల్పానికి దీపకళికలనీరాజనం పట్టాల్సిందే.

స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య భారతదేశంలో ఇందిరాగాంధి 1975 సం. లో ప్రకటించిన ఎమర్జన్సీ కాలంలో ప్రభుత్వవ్యవస్థల అధికారం ప్రజలపై ఆంక్షలనుపెట్టి వారికి బౌద్ధిక, భౌతిక స్వేచ్ఛలేకుండా చేసిన ఎమర్జన్సీయొక్క వికృతరూపాన్ని విషయాన్ని రచయిత్రి తరతరాల పాఠకులకు తెలియచేయాలనుకొంది. అందుకని స్వాతంత్ర్యసమరశీలియైన గోపాలరావుకి ప్రజాస్వామ్యంలో యువతకు ప్రతినిధిగా స్వరాజ్యలక్ష్మికి మధ్యన జరిగిన చర్చలలోను, ఎమర్జన్సీని ప్రయోగాత్మకంగా చూపెట్టటానికి, న్యాయాన్ని ప్రశ్నించిన పాపానికి స్వరాజ్యలక్ష్మి అరెస్టుకు గురికాబడిన సన్నివేశాన్ని దృశ్యమానం చేసిన సంఘటనను ఒక చారిత్రక సన్నివేశంగా పాఠకుల మనస్సులలో హత్తుకునే టట్లుచేసి ప్రజాస్వామ్యపు విలువలను గుర్తించేటట్లు చేసిన నవలాశిల్పానికి దీపాంజలి పట్టకతప్పదు.

ఎమర్జన్సీలో రైళ్ళుసకాలంలో వస్తున్నాయని, కూరలధరలు తగ్గాయని, డ్రైవర్లు బస్సులను వళ్ళుదగ్గరపెట్టుకొని నడుపుతున్నారని ఎమర్జన్సీవల్ల దేశంలో క్రమశిక్షణ పెరిగిందని అన్న స్వరాజ్యలక్ష్మికి, గోపాలరావు క్రమశిక్షణ కోసం ఇందిరాగాంధి ఎమర్జన్సీని పెట్టలేదని, అలహాబాదు హైకోర్టుతీర్పును త్రోసిపుచ్చి అక్రమంగా అత్యవసరపరిస్థితిని పెట్టిందని అంటే, దానికి స్వరాజ్యలక్ష్మి గోపాలరావు మునుపన్న మాటలుగ ప్రతిపక్షాలు ఆమెను దిగ్బంధంచేస్తూ కాళ్ళుచేతులు కట్టిపారే సాయని అన్నావుగా అని గుర్తుచేసింది. దానికి గోపాలరావు "మనది ప్రజాస్వామ్యదేశం. ప్రజాభిప్రాయం ప్రకారం నడుచుకోవాల్సిన ప్రధాని ఎమర్జమన్సీ ముసుగుకింద ప్రజలహక్కులను తుంచిపారెయ్యటం మంచిది కాదమ్మా" అన్నాడు. స్వరాజ్యలక్ష్మి "ఏమిటిమంచి? నైతికవాదం–గాంధేయవాదం అంటూ చేతులు ముడుచుకుని కూచోమంటే ఎట్లా? ఆమె ఏపనితలపెట్టినా ప్రతిపక్షాలు గోలచేస్తున్నాయి ఎక్కడచూసినా సమ్మెలు, బంద్ లు ఉద్యమాలూ... క్రమశిక్షణలేకపోతే ఎలాపరిపాలిస్తుంది?" అంది. దానికి గోపాలరావు సమాధానమిస్తూ "నిజమే, కాని ఇందిరాగాందీ

వ్యక్తిగతంగా క్రమశిక్షణకు లోబడి వుంటున్నదా ఆమె స్వచ్ఛమైన, క్లీన్ అడ్మినిస్ట్రేషన్ తేగలిగిందా... మనకి స్వతంత్రం వచ్చి ముప్ఫై ఏళ్ళు దాటింది. ఈ ముప్ఫైఏళ్ళల్లో అవిద్య, దారిద్ర్యం జనాభా పెరుగుదల వీటన్నిటివల్ల మనం అనుకొన్న విజయాలు సాధించలేకపోవచ్చుకాని సిగ్గుపడే పనులు ఎప్పుడూ చెయ్యలేదు. ఈనాడు ఎమర్జన్సీతో మనదేశం యావత్తూ ప్రపంచంముందు తలవంచుకోవాల్సి వచ్చింది... సరిహద్దుదేశాలతో జరిగే యుద్ధసమయాలలో తాత్కాలిక ఎమర్జన్సీ పెడతారుగాని ఇంతవరకు ఇంటర్నల్ ఎమర్జన్సీని అమలురాలేదు. కాని తనతప్పు కప్పిపుచ్చుకోవటానికి హైకోర్టు జడ్జిమెంటును తప్పించుకునేందుకు మిసెస్ గాంధి ఈ పని చేసింది. ఇది ఆమెకీ, దేశానికీ కూడా పెద్దమచ్చతీసుకొచ్చింది"... అన్నాడు. దానికి స్వరాజ్యలక్ష్మి "నువ్వు ఎన్నిచెప్పు, మనదేశం బాగుపడాలంటే మిలిటరీ రూల్ రావాలి. లేదంటే ఎమర్జన్సీ భయం ఉండాలి. అప్పుడుకాని మనవాళ్ళు బాగుపడరు. స్టూడెంట్స్ తిరుగుబాటు, లేబర్ తిరుగుబాటు జయప్రకాశ్ నారాయణ 'ఓపెన్‌గానే తిరగబడమంటున్నారే అది తప్పుకాదా" అన్నది.

గోపాలరావు "పరిస్థితులనుబట్టి ఉద్యమాలు మారుతుంటాయి ఒకప్పుడు మేమంతా బ్రిటిష్ వాళ్ళమీద తిరుగబడలేదా" అన్నాడు. దానికి స్వరాజ్యం "అది పరాయిపాలనకాబట్టి" అంది. గోపాలరావు పరిపాలన అన్నప్పుడు దానికి స్వపరభేదాలు ఆపాదించకూడదు. నైతికంగా మనంచేస్తున్నది సబబాకాదా అన్నదే చూడాలి, ఎమర్జన్సీ ముసుగులో ఎన్ని అక్రమాలు జరుగుతున్నాయో నీకు తెలియదమ్మా, మా పత్రికల నోరునొక్కేసారు. ఎక్కడ అన్యాయం జరుగుతున్నా దానిని ఎలుగెత్తి చాటే ప్రథమ కర్తవ్యం మా పత్రికలది. అటువంటి హక్కూ, బాధ్యత రెండూ నొక్కేసారు ప్రెస్ సెన్సారింగ్‌తో, ఇది మంచి పనికాదమ్మా" అనిఅంటే దానికి స్వరాజ్యం ఆరునెలల తర్వాత ఎమర్జన్సీ ఎత్తేస్తానని ప్రధాని రేడియోలో చెప్పారు అని అంది. దానికి గోపాలరావు "ఒకసారి నరమాంసం రుచి మరిగిన పులి ఎన్ని జన్మలైనా మర్చిపోదట. అధికారదాహం చాలా చెడ్డదమ్మా దాన్ని రుచిచూసిన మనిషి ప్రాణాలైనా వదులుతాడు కాని అధికారాన్ని జారవిడుచుకోడు". అయితే "ఏంచెయ్యాలంటావ్" అని కొద్దిగా అవగాహన చేసుకుంటున్న స్వరాజ్యలక్ష్మి అడిగింది. దానికి గోపాలం "ఏంచెయ్యాలో నాకు తెలియదు. ఏం చెయ్యకూడదో మటుకు చెప్పగలను నువ్వు ఇంకా చిన్నదానివి. న్యూస్ పేపర్స్‌కి అందుతున్న వార్తలను చదువుతుంటే నా గుండె చెరువై పోతుందమ్మా– వూళ్ళకి ఊళ్ళు వొదిలిపెట్టిపోతున్నారట. కొన్ని గ్రామాల్లో మగవాళ్ళు యింట్లో ఉండక షాపుల్లోనే గడుపుతున్నారట" అన్నాడు."దానికి కారణం ఏమిటి?" అని స్వరాజ్యం అడగగా "ఫ్యామిలీప్లానింగ్ పేరున గ్రామాలపైకి దాడిచేసి కనిపించిన మగవాళ్ళకంతా ఆపరేషన్ చేసేస్తున్నారు. మొగలాయి

కాలంలో జుట్టుపన్నుకంటే ఘోరంగా ఉంది. ఈ ఫ్యామిలీ ప్లానింగ్ దాడులు" అన్నాడు. దానికి స్వరాజ్యలక్ష్మి "ప్రజలు బలవంతంమీద తప్ప ఆపరేషన్లు చేసుకోరని నువ్వే అనేవాడివిగా" అంది." అది నిజమే అనుకో–మనిషికి వ్యక్తిగతమైన స్వతంత్రం ప్రాథమిక హక్కులు కొన్ని ఉన్నాయి, మేడలు, మిద్దెలు, కారులు, ఫ్యాక్టరీలు వీటిని పొందే హక్కులేకపోయినా – మనిషి శరీరం మనిషిది. ఆ శరీరంలో భాగాన్ని ముట్టుకోవటానికి ఎవరికీ హక్కులేదు. నీ చెయ్యి, కాలు విరిస్తే నువ్వు ఊరుకుంటావా" అని గోపాలరావు అనగా స్వరాజ్యలక్ష్మి "అదీ ఇదీ ఒకటే అంటే ఎలా అవుతుంది" అని అంది. "నైతికంగా ఒకటే యిష్టం లేకుండా బలవంతానా చెయ్యడం నేను ఒప్పుకోను.... నీ వయసులో ప్రతిపనికి వెంటవెంటనే ప్రతిఫలం కనిపించాలని అనుకోవటం సహజం. తాత్కాలికమైన ఫలితాలకోసం మానవవిలువలని మరిచిపోకూడదు. ఇందిరాగాంధి ఈ పొరపాటే చేస్తున్నది. ఆవిడ ఈ గండంనుండి బయటపడాలనే దేవుడిని వేడుకుంటున్నాను" అని గోపాలరావు నిస్సహాయస్థితిలో అన్నాడు. దానికి స్వరాజ్యలక్ష్మి "ఆడదని చిన్నచూపుచూస్తున్నారు లాల్ బహదూర్ శాస్త్రి, నెహ్రూ అయితే ఊరుకునేవారుకదూ" అంది. దానికి గోపాలరావు "అది నిజంకాదు వాళ్ళిద్దరూ ఇటువంటి పనిచేయరు. అది చరిత్రచెపుతున్న సత్యం. నైతిక దృక్పథానికి మానవతా విలువలకి ఆడా–మగ భేదం లేదు. ఇప్పుడంటే అన్నావుకాని ఇందిరాగాంధి ఆడదికాబట్టి అన్నమాట మరోసారి అనకు వ్యక్తిగా ఆమె అంటే నాకు గౌరవం, యిష్టంకాని ఆమె చుట్టూచేరిన మనుషులు దూరదృష్టిలేని వాళ్ళు, ఇందుకే బాధ" అన్నాడు గోపాలరావు. స్వరాజ్యలక్ష్మికి గోపాలరావుకు మధ్యన జరిగిన బలమైన, బరువైన సంభాషణలరూపంలో దేశమంతా విస్తరించిన జటిలసమస్యకు కారకులైన వ్యక్తిని న్యాయస్థానంలో నిలబెట్టి న్యాయాన్ని నిగ్గుతేలుస్తున్నట్లుగా వాదోపవాదాలుగా చర్చకుపెట్టి పాఠకుల మనస్సులలో నాటుకునేటట్లుగా శిల్పనైపుణ్యంతో రచనచేయటం ఒక సజీవమూర్తిమంతమైన రచనాశిల్పాన్ని పాఠకుల ముందుంచటమే. వాదనా పటిమకు తగ్గట్టుగా సుదీర్ఘసంభాషణలలో పదాలపోహళింపు రచనాశిల్పంతో స్వరజతులను పలికింపచేయటమే.

ఈ సందర్భంలో ఎమరజన్సీయెడల ప్రజాభిప్రాయాన్ని స్వాతంత్ర్యపోరాటంచేసిన ఆ తరం మనిషిచేత, చదువుకున్న యువతకు ప్రతీకయైన స్వరాజ్యలక్ష్మివంటి పాత్రలచేత చర్చకుపెట్టించి పాఠకులపాలన ఏరూపాన్ని సంతరించుకునే అవకాశం ఉంటుందో తెలియచేసింది. ఎమర్జన్సీయొక్క తీవ్రత పెద్దలకే అవగాహన ఉంది. ఉద్వేగాలు, ఉద్రేకాలకు లోనయ్యే యవ్వనంలో యువత ఆలోచనలను తెలియచేస్తూనే రెండుపాత్రల మధ్య జరిగిన సంభాషణలద్వారా ఎమర్జన్సీ అనే దేశవ్యాప్తంగా కఠినంగా అమలవుతున్న విషయాన్ని అరటిపండు వలచి చేతిలో పెట్టినంతతీరుగా

తరతరాల యువతకు అవగాహన కల్గించాలనుకోవటం నాటకీయతగల రచనా శిల్పానికి ప్రేక్షకపాత్రను వహించిన పాఠకులు విలువలహారతిని పట్టాల్సిందే. ఎమర్జన్సీ కాలంలో ప్రజల ఆలోచనలకు ప్రాతినిధ్యం వహించేవిధంగా ప్రధానమంత్రిపాలనను చర్చించుకునేటట్లు చేయటమే ప్రజాస్వామ్యపరిరక్షణకు బలమైనవిషయం అవుతుంది. ఈ విధంగా రచయిత్రి ఒక పౌరురాలికి ప్రతినిధిగా తన అభిప్రాయాలను దృశ్యాదృశ్యంగా వ్యక్తంచేయటం రచయిత్రియొక్క కథనశిల్పంలో సజీవమైన మేధాశక్తిని నిక్షిప్తంచేయటమే.

దేశ రాజకీయాలలో ఇందిరాగాంధి పాలనలో ప్రకటించిన ఎమర్జన్సీని స్వాతంత్ర్యానికి పూర్వంనుండి రాజకీయ అధికారాలమీద అవగాహన ఉన్న కాంగ్రెస్ వాదియైన గోపాలరావుకి, ఇందిరాగాంధిని వ్యక్తిగా అభిమానించే స్వరాజ్యలక్ష్మికి మధ్యన జరిగిన సంభాషణలలో ఎమర్జన్సీ స్వభావాన్ని, ప్రభావాన్ని విమర్శ, ప్రతివిమర్శలతో నిగ్గుతేల్చిన సందర్భంలో ఇద్దరిని సమన్వయ పరచటంలో రచయిత్రి ఉద్దేశ్యం కొంత తొంగి చూసినట్లనిపించింది. అయినా రచయిత్రి ప్రత్యక్షంగా కనబడకుండా రచనకు, పాఠకులకు వారధిగా నిలబడి రచన చేయటం సహానుభూతి కథనం గల రచనాశిల్పానికి నిదర్శనం[8].

ఎమర్జన్సీఅనే చారిత్రక వాస్తవికతను ప్రయోగాత్మకంగా నిరూపించటానికి రెంటు సంఘటనలను ఉదాహరించటం జరిగింది. ఒకటి గోపాలరావు పనిచేస్తున్న పత్రిక ప్రధానిని విమర్శించేది కాబట్టి సెన్సారింగ్ పేరుతో ఆలస్యంగా పర్మిషన్ యివ్వటంచేత పత్రిక రోజు ఆలస్యంగా రావటంతో సర్క్యులేషన్ తగ్గింది. అడ్వర్టైజ్ మెంట్లు తగ్గి ఆదాయం తగ్గుముఖం పట్టేసరికి సిబ్బందికి జీతాలు యివ్వలేక మేనేజిమెంటు సబ్ ఎడిటర్స్ ని, ఎడిటర్స్ ని పిలిచి కావాలంటే రిటైరుమెంటు తీసుకోమని చెప్పటం జరిగింది. రాజకీయనాయకులకు తమ తప్పులు తెలిస్తే పత్రికద్వారా ప్రజలకు తెలుస్తుందని వారికి పత్రికలంటే భయంగా ఉంటుంది. కాని ఎమర్జన్సీ పత్రికలవారికే నిద్రలేకుండా ఆందోళనకు గురిచేసిందని గోపాలరావు స్వగతంలో అర్థమౌతుంది. ఆ రకంగా ఎమర్జెన్సీ ప్రభావం రచనాశిల్పపు అంజనంలో ప్రస్ఫుటం అయింది.

రెండవ ఉదాహరణగా స్వరాజ్యలక్ష్మి బాగా చదివే తన స్నేహితురాలైన శ్యామలకు ఒక పరీక్షపేపరులో తక్కువ మార్కులు వచ్చినందుకు ఆమెతో కూడా ఆ ప్రొఫెసర్ని అడగటం, సమస్యపరిష్కారంకాక చివరికి వైస్–ఛాన్సలర్ వరకు వెళ్ళినప్పుడు తోటివిద్యార్థులు కొంతమంది గుంపుగా చేరి మాట్లాడుకుంటుంటే పోలీసులురావటం, స్వరాజ్యలక్ష్మితో సహా ఆ స్టూడెంట్స్ని అరెస్టుచేసి పోలీసుస్టేషన్కి తరలించటం జరిగింది. ఆవిషయాన్ని ఒక విద్యార్థి చాలా రహస్యంగా

తనపేరుకూడా చెప్పకుండా స్వరాజ్యలక్ష్మి అరెస్టువిషయాన్ని గోపాలరావుకి చెప్పటంజరిగింది. గోపాలరావు హతాశుడుకాగా పత్రికా మేనేజర్ గోపాలరావుతో తమ్ముడు ఎమ్.పి. కాబట్టి ఆతని రికమండేషన్ తో విడిపించకపోతే తరువాత ఆ స్టూడెంట్స్‌ని నక్సలైట్ అనే ముద్ర వేసి జీవితాంతం కటకటాలలో ఉంచేటట్లు చేస్తారని చెప్పటంతో గోపాలరావు చివరికి తన తమ్ముడైన బుచ్చిని నయానాభయాన బెదిరించి స్వరాజ్యలక్ష్మి ఆ మర్నాడే విడుదల అయ్యేటట్టు చేసాడు.

అంతవరకు స్వరాజ్యలక్ష్మికి ఇందిరాగాంధి అంటే అభిమానం ఉండటంతో ఆమె ప్రకటించిన ఎమర్జన్సీయొక్క ప్రభావం అర్థం కాలేదు. కాని ఎమర్జన్సీ కాలంలో స్టూడెంట్స్ ఏమాత్రం అన్యాయాన్ని ప్రశ్నించినా వారిని నక్సలైట్లంటూ జైల్లోపెట్టిన వాస్తవిక చరిత్రను స్వరాజ్యలక్ష్మికే కాక పాఠకులకు తెలిసేలా నవలలో సన్నివేశాన్ని నమోదుచేయటం జరిగింది. సామాన్యప్రజలను అందునా అన్యాయాన్ని సహించలేక ఉద్రేకం తెచ్చుకునే యువత జీవితాలతో, రాజకీయ సర్వాధికారం చెలగాటమాడగలదనే స్పృహను కలిగించిన కథావస్తుపరమైనపతాక సన్నివేశం రచనాశిల్పం యొక్క కాఠిన్యానికి ప్రతీకగా నిలిచింది. రాజకీయ అధికారం, అవినీతియెడల సహాయనిరాకరణ చేయటం శాంతిపథం. ఇది గాంధేయ సిద్ధాంతం. కాని స్వాతంత్ర్యానంతరం ఉన్న యువతకు గాంధి యెడల సదభిప్రాయం లేకపోవటంచేతనే స్వరాజ్యలక్ష్మి గాంధి సిద్ధాంతాలతో చేతులు ముడుచుకొని కూర్చుంటే ఎలా క్రమశిక్షణ ఉంటుందనే అభిప్రాయాన్ని వెల్లడించింది. స్వరాజ్యలక్ష్మికి స్వీయానుభవం అయితేగాని ఎమర్జన్సీలో ప్రజలయొక్క స్వేచ్ఛ, భావప్రకటన హక్కులను కాలరాసిన విషయం స్వరాజ్యలక్ష్మికి అర్థమయింది. వ్యక్తిమీద అభిమానం ఉన్నప్పుడు వాళ్ళు చేసే ఏ పనియైనా మంచిదిగానే కనపడటం ఒకభ్రమ. స్వరాజ్యలక్ష్మికి స్వీయానుభవాలతో తెలియచేయటం కోసం ఎమర్జన్సీ నాటి వాస్తవ సంఘటనలతో కథాగమనం ఉండటం సజీవమైన రచనాశిల్పానికి నిలువుటద్దం వంటిది.

స్వాతంత్ర్యానికి పూర్వం కథా వస్తువులో గాంధేయ సిద్ధాంతమైన అహింసాధర్మాన్ని ప్రతిపాదించి, స్వాతంత్ర్యానంతరం ముదిరిపోయిన రాజకీయ అవినీతి, అరాచకత్వాన్ని చూపించటం జరిగింది. దానిని అడ్డుకోవటానికి హింసతోకూడిన విప్లవవాదంతో యువత విలువైన తమ ప్రాణాలను పోగొట్టుకోవటం ముందు సాధించే ప్రయోజనం అల్పమని, ప్రజాసంక్షేమాన్ని కోరుకోవాలంటే గాంధేయదృక్పథంగల[9] శాంతియుత ప్రజాసేవ మాత్రమే పరిష్కారంగా నవలలో చూపెట్టటం జరిగింది. అదే భారతదేశప్రజల భవిష్యత్తుకు రచనాశిల్పంయొక్క విలువైన దిక్సూచిక.

గోపాలరావును గాంధేయవాదిగా, చివరివరకూ కాంగ్రెస్ అభిమానిగా ఆ పాత్రను పాఠకుల మనస్సులలో స్థిరంగా ఉంచటం, రచనా శిల్పానికి స్థిరత్వాన్ని కలిగించటమే. అయితే ఆ రచనాశిల్పం

పాఠకుల మనస్సులకు శాశ్వతమైన కళగా గోచరంకావాలంటే నవలా ధ్యేయమైన స్వాతంత్ర్యసాధన, స్వాతంత్ర్యపరిరక్షణ అనే శిల్పసౌందర్యం ఆ నవలలోని ప్రతి సంఘటనలో తొణికిసలాడ గలిగేటట్లు రచనచేయగలగటం రచయిత్రి సమర్థత ముంజేతి కంకణంలో ప్రతిఫలించటమే.

రెండవప్రపంచయుద్ధంలో భారతీయులు పాల్గొంటే బ్రిటిష్ వారు యుద్ధానంతరం స్వాతంత్ర్య ప్రకటనచేస్తామనే హామి యిచ్చారుగాని, యుద్ధానంతరం బ్రిటిష్ ప్రధాని చర్చిల్ పట్టించుకోక పోయేసరికి భారతీయులు వ్యక్తిసత్యాగ్రహంలో పాల్గొనటం, బ్రిటిష్ వారుకూడా యుద్ధంలో చావుతప్పి కన్నులొట్టపోయినట్లయి యిక భారతదేశాన్ని పాలించలేని స్థితికి చేరుకోవటం జరిగింది. అట్లీ ప్రధానిగా వచ్చిన తరువాత భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని ప్రకటించినా, తాము వారి విభజించి పాలించెడి రాజనీతిని శాశ్వతంచేస్తూ ఇండియా, పాకిస్థాన్‌గా భారతదేశాన్ని రెండుముక్కలుచేసి, హిందూముస్లిములు వలసవాదులుగా మారి ఆవేశకావేషాలకు గురికాబడ్డారు. ఆ సమయంలో భారతీయప్రజలనందరిని ఒకతాటిపై నడిపించి స్వాతంత్ర్యంకోసం పోరాడిన గాంధి, నిస్వార్థంగా రాజకీయపదవిని కోరుకోకుండా, అంతర్గత ప్రజాస్వామ్యరక్షణకై నిరాహారదీక్షను చేపట్టటంతో, హిందూముస్లిముల అల్లరులు తగ్గుముఖం పట్టాయిగాని ఆ తర్వాత మతవిద్వేషాలుగల దుండగుల చేతిలో గాంధి బలికావటం జరిగింది. నవలలోని ఈ సంఘటనలవల్లనే నిజాయితీ, నిబద్ధతగల దేశసేవకుడైన గోపాలరావులో పదవికంటే ప్రజాసేవ గొప్పదనుకునే భావనకు అతడు చేరుకొనేటట్టుగా పాత్రచిత్రణ నైపుణ్యంకొనసాగి రచనాశిల్పం మరింతగా కాంతులీనినది.

భారతరాజ్యాంగం ఏర్పడి ఎన్నికలు జరగటానికి ముందు జరిగిన మద్రాసు రాష్ట్రీయ స్వాతంత్ర్యపు ఎన్నికలలో నిలబడాలని లేకపోయినా చీరాల ప్రజల ఆంకాక్షమేరకు అవినీతి రహితంగా ప్రజాసేవను చేయాలనుకొని ఎలక్షన్లలో నిలబడి గెలిచినా గోపాలరావు మంత్రిపదవిని ఆశించకుండా చీరాలప్రజల సంక్షేమానికి పాడుపడ్డాడు. కాని స్వతంత్ర భారతదేశంలో 1952 సం.లో జరిగిన మొదటి ఎన్నికలనాటికే ఓట్లును కొనుక్కొనే అవినీతి రాజకీయాలు చోటుచేసుకోవటంతో దేశభక్తుడైన గోపాలరావు తాను అవినీతి రాజకీయాలకు పనికిరానని అనుకోవటంగా ఆ పాత్రను తీర్చిదిద్దటం రచనాశిల్పం ఆటుపోట్లకు గురికాకండా చూసుకోవటమే.

స్వాతంత్ర్యానంతర అవినీతి రాజకీయాలను పాఠకుల కళ్ళముందు ఉంచటానికి నందయ్యను, బుచ్చి పాత్రలను ఎన్నుకోవటం జరిగింది. ఒకానొకప్పుడు హరిజన విద్యార్థిగా సహాయంపొంది చదువుకొని పైకివచ్చిన నందయ్య రాజకీయ అధికారం రాగానే స్వార్థంపెరిగి డబ్బుమీద ఆశ ఏర్పడి కనీసం తన కులంవారిని పైకితెచ్చేయోచనలేకుండా కిందవాళ్ళను కిందనే ఉంచాలనుకొనే మనస్తత్వం గల పాత్రగా నందయ్యను, స్వాతంత్ర్యానికి పూర్వంనుండి ప్రభుత్వోద్యోగిగా అవినీతిపరుడైన

బుచ్చి స్వాతంత్ర్యానంతరం మరింతగా అవినీతిపరుడు కావటంతో ఉద్యోగంపోయినా, ముల్లుపోయి కత్తి వచ్చే అన్నట్లుగా ఆ అవినీతి డబ్బుతో ఓట్లుకొని రాజకీయపదవిని చేపట్టటమే ప్రజాస్వామ్య స్వాతంత్ర్యానికి ముప్పును గలిగిస్తోందని పాఠకుల మనస్సులలో నాటుకునేటట్లుగా పాత్రచిత్రణచేసి కథాకథనాన్ని, పాత్రలను జోడుగుర్రాలుగా సవారీచేయించే విధంగా రచన సాగింది. మానవ మనస్తత్వాలలోని బలహీనతలను వ్యక్తంచేసి సమాజపు మరోపార్శ్వానికున్న చెడును పాఠకుల గ్రహింపుకు తేవాలనుకున్నప్పుడే రచనాప్రయోజనం సంపూర్ణతను సంతరించుకుంటుంది. అంతేకాక స్వాతంత్ర్యానంతరం పెరిగిన రాజకీయ అవినీతికి, ఆర్థికదోపిడీకి వ్యతిరేకంగా వర్గరహితసమాజానికై తుపాకులను ఆయుధంగా చేసుకొని ప్రాణాలను బలిపెట్టే యువశక్తికి సానుకూలంగానో, ప్రతికూలంగానో ప్రతిస్పందించే పాఠకుల మనస్సులను సమన్వయపరుస్తూ స్వరాజ్యలక్ష్మి పాత్రను సృష్టించి స్వాతంత్ర్యానంతరం దేశప్రజాస్వామ్య పరిరక్షణకు గాంధి ఆశయమైన యువశక్తిని జాతీయసేవాపథంలో నడిపించేందుకు శాంతియుత ప్రజాసేవయే ప్రత్యామ్నాయంగా సూచించటం అంటే రచయిత్రి రచలాశిల్పానికి శాశ్వతకళలను నిక్షిప్తంచేయటమే.

అవినీతిపరులు లంచాలను తీసుకోవటాన్ని ప్రత్యక్షంగా ఋజువు కానప్పుడు, వారి సంపదలపెంపును వారి నోటితోనే చెప్పించేందుకు తెలంగాణా ఉద్యమసంఘటనను కూర్చటం, ఇంకా వారి విశ్వరూపాన్ని నిరూపించటంకోసం వాళ్ళు ఏ విధంగా స్వాతంత్ర్య సమరశీలురకు యివ్వాలనుకునే పొలాలపై కన్నువేయటానికి నందయ్య, బుచ్చి వంటి అవినీతి రాజకీయనాయకులు వేసే జిత్తులమారి ఎత్తులను పాఠకులకు అర్థమయేరీతిలో ఆయా పాత్రలచేతనే స్వీయగళాలతో చెప్పించి, అటువంటి అవినీతి సమాజంలో ఉందని పాఠకులు నిర్ధారణకు వచ్చేటట్లు రచయిత్రి చేయటం కత్తిమీద సామువంటి రచనాశిల్పప్రక్రియ అది. అంతేకాదు పిల్లికళ్ళుమూసుకొని పాలుతాగిన చందంగా రాజకీయాలు, అవినీతి వంటబట్టిన బుచ్చి మాతృప్రేమను కాదని స్వార్థంకోసం తల్లి నగలను కాజెయ్యాలనుకొని ధనదాహంతో అతడు తన తల్లిని హత్యచేసినవిషయాన్ని పోలీసులుకు తెలిసినా పట్టించుకోలేదని, రాజకీయ అధికార వ్యవస్థపై పాఠకులు కోపం తెచ్చుకునే సందర్భం అది. అయితే పాఠకుల సంతృప్తిమేరకు, గోపాలరావు మనమరాలు ఎమర్జన్సీలో న్యాయంకోసం వెళ్ళి ప్రశ్నించినందుకు అరెస్టుకు గురికాబడిన సంఘటనను మాలతీలతల అల్లికతో అల్లి ఆతని తప్పును అతడే పరోక్షంగా ఒప్పుకునేటట్లు చేయటమే రచనాశిల్పపు సూక్ష్మదృష్టికి నిదర్శనం. రాజకీయనాయకులు తమ తప్పిదాలను కప్పిపుచ్చుకోవటానికి పెట్టిన ఎమర్జన్సీలో జరిగే అక్రమాలను, అన్యాయాలను తెలియచేయటానికి ఒకే సంఘటనకు పార్శ్వాలుగా గల రాజకీయస్వార్థాన్ని, వ్యక్తిగతస్వార్థాలను బహిర్గతం అయేటట్లుగా రచన చేయటం చేయితిరిగిన రచయిత్రికి నల్లేరుమీద బండినడకవంటిదే.

గాంధి బెజవాడ సభకి వచ్చినప్పుడు, ఆయా సమావేశాలలో గాంధి దృక్పథాన్ని వివరించే టప్పుడు, సీతానగర ఆశ్రమానికి గాంధి వచ్చిబసచేసే విషయాన్ని చెప్పేటప్పుడు, ఉద్యమ పరిస్థితులను వర్ణించేప్పుడు, సంస్కారయుతమైన ప్రధానపాత్రల స్వభావ చిత్రీకరణ చేసేటప్పుడు చీరాల, పల్నాడులో పన్నులరాబడికై ప్రభుత్వవిధానాలను ప్రజలందరికీ తెలియచెప్పాల్సిన అవసరం ఏర్పడిన సందర్భంలోను, జైళ్ళలోని వాతావరణాన్ని, రెవిన్యూశాఖ అవినీతిని చెప్పాల్సివచ్చినప్పుడు రచయిత్రి పరోక్షంగా కథను నడిపించాల్సిన అవసంరం ఏర్పడుతుంది. అంతేకాక విశాలాంధ్ర ఉద్యమంగురించి, ఎమర్జన్సీని గురించిన ప్రజా స్పందనలకు ప్రాతినిధ్యం వహించే సందర్భంలోను రచయిత్రి ముందుకు రావలసిన అవసరం ఉంటుంది. అయితే ఒకొక్కప్పుడు రచయిత్రి వ్యక్తిగతంగా వకాల్తా పుచ్చుకున్నట్టుగా కాకుండా తన ఉద్దేశ్యాన్ని[10] పరోక్షంగానే పాత్రల సంభాషణల ద్వారానే వ్యక్తం చేయటం నవలాశిల్పంలోని గుండెలయలను వినిపింపచేయటమే.

రామలక్ష్మిపాత్ర శక్తిమంతమైన స్వాతంత్ర్యకాంక్ష ధ్యేయంతో దేశసేవికగా మొదలయి, దేశభక్తికి వారసుడిగా గోపాలరావును తయారుచేసి, ఉద్యమంలో పాల్గొని ఆత్మధృతిని పొందిన అమరత్వపు అంశగా, స్వాతంత్ర్యపరిరక్షణకై యువశక్తియైన స్వారాజ్యలక్ష్మి దేశసేవలో సాకారమయ్యేవిధంగా రచనాశిల్పపుమూర్తిమత్వానికి శాశ్వతమైన సంపూర్ణకళలను సంతరింపజేయటమే.

రచయిత్రి స్వాతంత్ర్యానికి పూర్వమున్న యువశక్తిని వెల్లడిచేసి, స్వాతంత్ర్యానంతరం రాజకీయ అవినీతికున్న శక్తిని వెల్లడిచేసినప్పుడు పాఠకులు నిరాశనిస్పృహలకు లోనవకుండా ఉండటానికే, ఆ నాటి యువశక్తి పోరాడితెచ్చిన స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను పరిరక్షింపబడేవిధంగా రచన సాగింది. అందుకే స్వాతంత్ర్యానంతర రాజకీయ అవినీతికి ప్రత్యామ్నాయంగా, ఇంకా కొనఊపిరిని బిగపట్టుకొని ఉన్న ఆనాటి దేశభక్తురాలైన జానకమ్మ దేశభవితవ్యానికి దూరదృష్టితో చూసి, నేటి యువశక్తి తమ హృదయనేత్రాలను విప్పారించి, నిర్మాణాత్మకమైన ప్రజాసేవకు పూనుకొనే విధంగా కర్తవ్యోన్ముఖులను[11] చేయటంగా నవలనుముగించటమే నవలా రూపశిల్పియొక్కగుణాత్మకమైన నిర్మాణ దక్షతకు అద్దంపట్టటంలాంటిది[12].

స్వాతంత్ర్యానంతరం మరోమంచి భారతదేశంకొరకు పాఠకులలో దేశాభిమానాన్ని జ్వలింపచేసే విధంగా నవలాశిల్పంయొక్క ప్రయోజనాన్ని సాధించటం మాలతీచందూర్ గారికే సాధ్యమని జాతీయస్థాయిలో ఉత్తమసాహితీ సృజనకారులకిచ్చే కేంద్రసాహిత్య అకాడెమి బహుమతితో సత్కరించి సంస్థ తన గౌరవాన్ని నిలుపుకోవటం జరిగింది.

8. సైద్ధాంతిక ప్రతిపాదన- గాంధేయదృక్పథం

వ్యక్తిగతంగా వర్తకరూపేణా భారతదేశానికి వచ్చిన వ్యాపారులను కట్టడిచేయటానికి వారినందరినీ బ్రిటిష్ ప్రభుత్వం ఈస్ట్ ఇండియాకంపెనీ గొడుగు కిందకు తెచ్చింది. వ్యాపారం పెంచుకొనే క్రమంలోనే బ్రిటిష్ కంపెనీ వారు భారతదేశ భూములపై ఆధిపత్యం కోసం అంతర్గత కుమ్ములాటలను సొమ్ముచేసుకుంటూ, భారతీయసైన్యంపై క్రైస్తవ మతమార్పిడులను రుద్దుతూ, హిందూముస్లిముల మధ్యన మతసంఘర్షణలను పెంచి పరిస్థితులను తమకు అనుకూలంగా చేసుకుంటూ అనైక్యతనుపెంచి, ప్రావిన్సులను ఏర్పాటుచేసుకున్నారు. ఓడల తయారీ, స్వదేశీ నేతపరిశ్రమలు కుదేలు అయ్యేట్టుచేయటమేకాక, కరువుకాటకాల ప్రభావంతో వ్యవసాయం తగ్గిపోయింది. భారతీయులు దిక్కుతోచని స్థితికి చేరుకున్నారు. అటువంటి అల్లకల్లోల పరిస్థితులలోనే ఆ పరిస్థితులలో 1958 సం.లో బ్రిటిష్ రాణి ఈస్ట్ ఇండియాకంపెనీని రద్దుచేసి భారతదేశపాలనను బ్రిటిష్ ప్రభుత్వం యొక్క అధీనంలోకి తెచ్చింది. ప్రావిన్సులను గవర్నర్లను పెట్టి వారంతా గవర్నర్ జనరల్ కింద పరిపాలనచేసేటట్లును అతడు బ్రిటిష్ పార్లమెంటుగా జవాబుదారిగాను ఉండేటట్లుగా వ్యవస్థను రూపొందించింది.

ఆ క్రమంలోనే భారతీయులకు తమపాలన తామే చేసుకోవాలనే ఆకాంక్షతో ఐక్యతకోసం ముస్లిమ్ లీగుతోకూడిన 1885సం.లో అఖిలభారత కాంగ్రెస్ సంస్థ ఏర్పడింది. అందుకే బ్రిటిష్ వాళ్ళు హిందూముస్లిములను విడదీయటానికై ముస్లిములు ఎక్కువగా ఉండేప్రాంతమైన వంగదేశాన్ని విభజనచేసారు. ఆ కుట్రను గ్రహించి 1905 సం.లో వంగదేశవిభజనను నిరసిస్తూ తిలక్ భారతీయులకు స్వాతంత్ర్యం జన్మహక్కు నినాదంతో 'వందేమాతరం' ఉద్యమాన్ని ప్రారంభించాడు. దానిలో భాగంగానే స్వదేశీదీక్షకై ఖద్దరుతయారీని, మద్యపాన నిషేధాన్ని, జాతీయవిద్యను, స్వదేశీభాషల వినియోగాన్ని, మతసమైక్యతకు, అస్పృశ్యతానివారణకు ప్రాధాన్యతను యివ్వాలని నిర్ణయించారు. దేశానికి స్వయంప్రతిపత్తిని యివ్వాలని1917 సం.లో మొదలుపెట్టిన హోమ్ రూల్ ఉద్యమం చేస్తున్న అనిబిసెంట్‌తో కలిసి తిలక్ ఉద్యమాన్ని తీవ్రతరం చేసేసరికి ఆతడు అరెస్టుకు గురికాబడటం జరిగింది. అకారణంగా భారతీయులను అరెస్టుచేసే రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా 1919సం.లో

ఏర్పాటుచేసుకున్న జలియన్ వాలా బాగ్ సమావేశంలో బ్రిటిష్ వారు చేసిన దమనకాండ, జైలులో తిలక్ అనారోగ్యానికి గురియై 1920 సం.లో మరణించటం వంటి సంఘటనల నేపథ్యంలో, గాంధి భారతదేశ స్వాతంత్ర్యోద్యమ సారథ్య పగ్గాలను చేపట్టటం జరిగింది. బ్రిటిష్ పాలననుండి భారతదేశం విముక్తిచెంది భారతీయులు స్వాతంత్ర్యాన్ని పొందటానికి 1920 సం. నుండి గాంధి శాంతియుతంగా జాతీయోద్యమాన్ని తీవ్రతరం చేయాలనుకొన్నాడు.

వర్తకరూపేణా వచ్చి స్వదేశీనేతపరిశ్రమలు కుదేలు అయ్యేటట్లు చేయటమేకాక, ప్రావిన్సులు ఏర్పాటుచేసుకొని, భారతీయరాజుల మధ్యనఉన్న అనైక్యతను ఆసరా చేసుకొని ఆంగ్లేయులు దేశపాలనను చేజిక్కించుకొన్నారు. వారిపాలనకు సహకరించే విధంగా ఆంగ్లవిద్యను ప్రవేశపెట్టటంతో స్వభాషల వ్యవహారం తగ్గటంతో విదేశీసంస్కృతి చోటుచేసుకుంది. బ్రిటిష్ వారికి అడ్డులేని, అనువైనరీతిలో న్యాయస్థానాలలో భారతీయుల శిక్షాస్మృతిని అమలుపరిచేవారు. అటువంటి పరిస్థితులలో గాంధి ఆధునిక ఆయుధాలతో దమననీతిని పాటించే బ్రిటిష్ వారిని ఎదుర్కొని నిలబడటంకంటే కూడా ఐక్యతతో, అహింసతో ఉద్యమం చేయటమే పరిష్కారంగా భావించాడు. ముందుగా బ్రిటిష్ వారి వస్త్రవ్యాపారానికి, మద్యపాన వర్తకానికి, గండికొడితే వారు పలాయనం చిత్తగించవచ్చని భావించటమేకాక, భారతీయులుకూడా తమ ఆర్థికదుస్థితినుండి కొంతతేరుకోగలిగి ఉద్యమం యెడల ఉత్సాహం చూపించగలుగుతారని గాంధి అనుకున్నాడు.

అందుకే 1920 సం.లో దేశస్వరాజ్యసాధన ధ్యేయంగా ఐక్యతతో కూడిన అహింసాయుత ఉద్యమానికై సత్యాగ్రహ నిర్మాణకార్యక్రమాలకు రూపకల్పనచేసాడు. సత్యాగ్రహ ఉద్యమనిర్మాణ కార్యక్రమాలలో భాగంగా తిలక్ ప్రారంభించిన ఖద్దరుతయారీ, మద్యపాన నిషేధం, జాతీయవిద్య, అస్పృశ్యతానివారణ, హరిజనోద్ధరణ, హిందూముస్లిముల సమైక్యతవంటి కార్యక్రమాలకు అదనంగా శాసనోల్లంఘనాన్ని కూడా చేర్చాడు. సమైక్యతకై స్త్రీపురుష సమానత్వానికై గాంధి స్త్రీలను[1] ముందుంచి ఉద్యమాన్ని నడిపాడు. దానికై భారతదేశమంతటా సత్యాగ్రహ ఉద్యమప్రచారం చేయటానికి గాంధి ఆసేతుహిమాచలం పర్యటన చేస్తున్నరోజులవి. దేశాభిమానులైన భారతీయులు స్త్రీపురుష విచక్షణ లేకుండా ఇంటింటా రాట్నం వడికి నూలుతీయటాన్ని, ఖద్దరువస్త్రధారణను చర్ఖా ఉద్యమంగా భావించారు. కాంగ్రెస్ సభ్యత్వం కోసం రాట్నం వడికి నూలుదారం తీయటం ప్రథమార్హతగా భావించారు. జాతీయవిద్యలో భాగంగా స్వభాషలో వృత్తివిద్యలను, ఖద్దరుతయారీని భాగంచేసారు. హరిజనోద్ధరణకు, హిందూముస్లుముల సమైక్యతకు పాటుపడ్డారు. కల్లుకొట్లముందు ధర్నాలు, పికెటింగ్‌లు చేసారు. గాంధి నాయకత్వంలో భారతీయులు ఉప్పుసత్యాగ్రహం, శాసనోల్లంఘనం,

వ్యక్తిసత్యాగ్రహాలు చేసి అరెస్టులుకాబడి జైలుశిక్షను అనుభవించి, తమ మానప్రాణాలను పణంగా పెట్టినా కూడా స్వపరిపాలన రానందుకు చివరికి చావో, బతుకో తేల్చుకుంటూ క్విట్ ఇండియా ఉద్యమాన్ని చేయటం జరిగింది. బ్రిటిష్ వారు తమకిక భారతీయుల సహకారం లభించటం కష్టమనుకొని, రెండవప్రపంచయుద్ధానంతరం తమ ఆర్థికస్థితికూడా అనుకూలించకపోవటంతో భారతీయులు 60 ఏళ్ళపాటు ఉద్యమించిన శ్రమకు ఫలితంగా 1947 సం.లో స్వాతంత్ర్యాన్ని ప్రకటించారు. 1948 సం.లో గాంధి దుండగుల తాల్పులకు బలిఅయ్యాడు. కాని పాతసీసాలో కొత్తసారాయిలాగా స్వాతంత్ర్యానంతరం పెచ్చుపెరిగిన అధికార రాజకీయఅవినీతి, స్వార్థం, ధనాశలకు విరుగుడుగా విప్లవంతో ప్రాణాలను బలిపెట్టటంకంటే శాంతియుతమార్గాన్ని అన్వేషించే అవసరం ఏర్పడింది. ఆ క్రమంలో స్వాతంత్ర్యానంతరం గాంధి సిద్ధాంత ధర్మాలను గుర్తుచేస్తూ మరోమంచి స్వతంత్ర భారతదేశ నిర్మాణానికై రాజకీయాధికార బానిసత్వాన్ని నిర్మూలించే దిశగా ప్రజాసంక్షేమ పరమావధిగా ముందడుగువేస్తూ జాతీయసేవ చేయటానికి గాంధి అహింసాఉద్యమం యొక్క మరోస్వరూపాన్ని నవలలో ప్రతిపాదించటమే గాంధేయసిద్ధాంత ప్రతిపాదన చేయటంగా నవలా రచయిత్రి ముఖ్యోద్దేశంగా అర్థమౌతుంది.

గాంధిసత్యాగ్రహఉద్యమ ప్రభావ నేపథ్యంగల రామలక్ష్మి పాత్రప్రవేశంతో 'హృదయనేత్రి' నవలాకథాప్రారంభం జరిగింది. దేశసేవికగా 'వందేమాతరం' అంటూ ఖద్దరువస్త్రధారణతో స్వాతంత్రసమరశీలుడైన గాంధిమహాత్ముని గురించిన కథనంతో నవల ప్రారంభమవటం గాంధేయదృక్పథానికి బాటలువేయటమే. సత్యాగ్రహ ఉద్యమంలో ప్రధానమైన ఖద్దరు తయారీ, ఖద్దరువస్త్రధారణ, వందేమాతరం నినాదాలతో కథాప్రారంభంచేయటం చీరాలకు రైలులో వెడుతున్నప్పుడు రామలక్ష్మి ఆలోచనలలో గాంధి దక్షిణాఫ్రికాలో చేసిన సత్యాగ్రహాన్ని తలచుకోవటమే గాంధి చేపట్టిన స్వాతంత్ర్యోద్య ప్రభావానికి నిదర్శనం.

గాంధిగారికి ఏకలవ్యశిష్యుడు వాసుదేవరావు. అందుకే ఉద్యమంలో భాగంగా తన న్యాయవాదవృత్తిని వదిలిపెట్టాడు. నూలువడకటం, తనువడికిన నూలుతో నేసిన బట్టలను ధరించడం, విదేశీవస్తుబహిష్కరణ వంటి స్వాతంత్ర్యోద్యమ కార్యక్రమాలలో భార్యయైన రామలక్ష్మితోసహా పాల్గొనేవాడు. రామలక్ష్మి రాట్నం వడికి నూలుతీయటం ఊరూర ఉపన్యాసాలు యిస్తూ సంచరిస్తూ ఉండేదని ఆమెయొక్క వదిన సుబ్బమ్మ అయిష్టంగా చెప్పిన మాటల్లో అర్థమౌతుంది. రామలక్ష్మి కడజాతివ్యక్తిని యింట్లో పెట్టుకుందనికూడా విమర్శచేసింది. రామలక్ష్మి హరిజనబాలుడ్ని యింట్లో తోటమాలిగా పెట్టుకొని, అతనిచేత అక్షరాలను దిద్దించి చదువును నేర్పించింది. స్వాతంత్ర్యోద్యమ

కార్యకర్తలందరికీ కాంగ్రెస్ ఒక్కటే కులం. వర్తకరూపేణా వచ్చిన బ్రిటిష్ వారి వ్యాపారానికి గండికొడితేనే వారు దేశంనుండి పలాయనం చిత్తగిస్తారని, విదేశీవస్త్ర బహిష్కరణకై స్వదేశీదీక్షలో భాగంగా ఖద్దరు తయారీ ప్రాధాన్యతను రామలక్ష్మి వహించింది. ఐకమత్యంతో స్త్రీపురుషభేదంలేకుండా ప్రజలందరూ పాల్గొని స్వాతంత్ర్యదీక్షను పొందగల ఉద్యమమార్గంకూడా. దేశస్వరాజ్యసాధనకై గాంధిపిలుపును అనుసరించి చేపట్టిన సత్యాగ్రహ నిర్మాణకార్యక్రమాలలో భాగంగా ఖద్దరు, మద్యపాన నిషేధం, అస్పృశ్యతానివారణ, న్యాయస్థానాల బహిష్కరణవంటి ప్రభుత్వ సహకారవృత్తుల నిరసన ముఖ్యమైనవి. రెండువేల గజాల నూలుదారాన్ని రాట్నంతో వడికిన వారికి కాంగ్రెస్ సభ్యత్వం ఉంటుంది. నవలలో ఈసంఘటనలన్నీ గాంధేయదృక్పథాన్ని బలంగా నాటుకునేటట్టు చేసాయి.

1921 సం.లో బెజవాడలో గాంధి సమావేశానికి రామలక్ష్మి, చిన్నవాడైన గోపాలరావు వెళ్ళటంతో రామలక్ష్మి తన తరువాతి తరానికి కూడా గాంధితత్వం వంటబట్టటానికి వేసిన పునాదులుగా భావించాలి. ఆ సమావేశంలో మహాత్మగాంధికి జై అంటూ చేసిన నినాదాలు దూరంనుండి కనపడ్డ గాంధిమూర్తిమత్వం చిన్నవాడైన గోపాలరావుపై చెరగని ముద్రవేసాయి. చీరాలను అధిక పన్నులరాబడికై మున్సిపాలిటీని ప్రకటించిన దానికి నిరసనగా దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి ఆధ్వర్యంలో వాసుదేవరావు, జానకమ్మ, రామలక్ష్మిలవంటి గాంధేయవాదులతో చీరాల ఉద్యమం శాంతియుతంగా సాగింది..

గాంధిగారి బోధనలు, ఊళ్ళోని గోపాలకృష్ణయ్యగారి ప్రభావానికి లోనయి జానకమ్మ ఖద్దరు కట్టటం మొదలుపెట్టింది. ఇంటింటికి ఖద్దరుమూటలను నెత్తిన పెట్టుకొని అమ్మేది. హిందీభాషను నేర్చుకుంది. చేతిలో తఖిలీ పట్టుకొని బారులుబారులుగా నూలు తీస్తుంది. ఇదంతా గాంధి సిద్ధాంతప్రభావమే.

గాంధి చీరాల ఉద్యమశిబిరానికి వచ్చినప్పుడు రామలక్ష్మితో ప్రత్యక్షంగా మాట్లాడిన సంభాషణగా ఒకసందర్భంలో మాత్రమే నవలలో ఉంది. జానకమ్మ స్వరాజ్యనిధికి తననగలైన కంటె, కాసులపేరును గాంధి పాదాలముందు పెట్టినప్పుడు రామలక్ష్మికూడా తన వంటిమీద ఉన్న నగలన్నీ స్వరాజ్యనిధికి సమర్పిస్తున్నప్పుడు గాంధి "ఈ నగలు మనస్ఫూర్తిగా యిస్తున్నారా? మళ్ళీ వీటిని తిరిగి చేయించుకోనని హామి యిస్తేనే, వీటిని తీసుకుంటాను,లేకపోతే వద్దు" అని అన్నాడు. నేను యిక నగలుపెట్టుకోననిచెప్పి తన మంగళసూత్రాలను తీసి యివ్వబోతే గాంధి "వద్దు" అని అన్నాడు. ఈ విధంగా గాంధిని ఒక పాత్రగా సూత్రధారిగా చేసి నవలను రాయటం అంటే గాంధి సిద్ధాంతాన్నే కాక దేశంకోసం త్యాగాల ఆకాంక్షను రేకెత్తించే గాంధి మూర్తిమత్వాన్ని పాఠకుల

మనస్సులలో శాశ్వతంగా నిలపాలనుకోవటం గాంధేయసిద్ధాంత ప్రతిపాదనగా భావించాలి. అంతేకాక నవలలో ప్రధానపాత్రగా చివరివరకూ కనపడే గోపాలరావుపై గాంధి ప్రభావాన్ని స్పష్టంచేయటానికే గాంధి చీరాలశిబిరానికి వచ్చినప్పుడు గోపాలరావు తలను స్పృశించినప్పుడు ఆతనిలో గాంధి సిద్ధాంతాలప్రకంపనలు పుట్టినట్లుగాపాఠకులను భావింపచేసే రచన సాగింది.

చీరాలఉద్యమ శిబిరాలనుండి వచ్చిన తరవాత రామలక్ష్మి నగలను, యిళ్ళువాకిళ్ళను గాంధిచెప్పినట్టు స్వరాజ్యంకోసం త్యాగాలుచెయ్యాలంటే, గోపాలరావు స్వరాజ్యం అంటే ఏమిటని అడిగిన సందర్భంలో దేశాన్ని పాలించుకుంటూ మనతిండి మనంతింటూ బ్రిటిష్ వారి పరాయి పాలనలోని ఆంక్షలు లేకుండా పిల్లలు కూడా స్వేచ్ఛగా, ధైర్యంగా తిరగగలగటం అని రాముడత్తయ్య గాంధి గాంధేయసిద్ధాంత ప్రతిపాదనలు చేయటం జరిగింది.

ఆంధ్రపత్రికలో గాంధిని అరెస్టుచేసిన వార్త చదివిన రామలక్ష్మి కేకపెట్టుకుంటూ ఆ వార్తను ఊరందరికీ చేరవేసేసరికి ప్రజలు తమయింట్లో శవంలేచినంతగా బాధపడ్డారు. సత్యాగ్రహ ఉద్యమాన్ని చేస్తున్న గాంధియొక్క అరెస్టు వార్తతో ఇళ్ళల్లోని పొయ్యిలలో పిల్లిలేవలేదంటే ఎవ్వరూ అన్నాలు వండుకొని తినలేదంటే గాంధి ప్రభావం ప్రజలపై ఎంతగా ఉందో అర్థమౌతుంది.

వాసుదేవరావు తన యింటికి అన్నికులాల, మతాలవారిని తీసుకొచ్చి సమావేశాలను పెట్టటం, తమది కాంగ్రెస్ కులమని అనటం, రామలక్ష్మి తన యింట్లో హరిజన పిల్లవాడిని పెట్టుకొని చదివించటం, గోపాలరావును బందరులోని జాతీయవిద్యాలయంలో చదివించమని పట్టుపట్టటంలో కూడా గాంధి ప్రభావం కనపడుతుంది. అంతేకాక గోపాలరావు అక్కడ చదువుతున్నప్పుడు నందయ్య అనే హరిజనవిద్యార్థిని తనతో కలుపుకోవటమేకాక, తోటివిద్యార్థులందరూ కలుపుకునేటట్లుగా చేయటం గాంధి ఆచరించమన్న అస్పృశ్యతానివారణ దిశగా ప్రయోగాత్మకంగా గాంధి సిద్ధాంత ప్రతిపాదనచేయటమే.

గాంధేయవాదియైన మేనత్త తన యింట్లో కడజాతివానిని పెట్టుకోవటం అతనితో కలిసి ఆడుకోవటం వంటి వాతావరణంలో మేనత్త పెంపకంలో గ్రహించిన అస్పృశ్యతానివారణను గోపాలరావు జాతీయకళాశాలలో చదువుకుంటున్న సమయంలో హరిజన విద్యార్థియైన నందయ్యను తనతో కలుపుకోగలగటం గాంధేయసిద్ధాంతానికి ఆచరణరూపమిచ్చి మిగిలిన విద్యార్థులుకూడా గోపాలరావును అనుసరించినట్టుగా రాయటం, గాంధేయసిద్ధాంతమైన సత్యాగ్రహ ఉద్యమంలో భాగంగా హరిజనోద్ధరణకు ఉన్న ప్రాముఖ్యతను ప్రతిపాదించటమే. ఆ రకంగా ప్రజలసమైక్యత స్వరాజ్యఉద్యమానికి బలంగా మారటమే గాంధి సిద్ధాంతప్రయోజనం అయినప్పటికీ నేడు

స్వాతంత్ర్యపరిరక్షణకోసం గాంధేయదృక్పథాన్ని నేటికీ కొనసాగించాల్సిన పరిస్థితులు భారతదేశంలో ఉన్నాయి.

గోపాలరావు తన పెళ్ళిశుభలేఖను యివ్వటానికి వచ్చిన సందర్భంలో జైల్లో అనారోగ్యం పాలయి ఎముకలగూడులా తయారయిన వాసుదేవరావు తల్లిదండ్రుల బలవంతం మీద వివాహమాడబోతున్న గోపాలరావులో వ్యక్తిగా అతనిలో స్థిరత్వం కలిగించటానికి రామలక్ష్మి ఆశయమైన స్వాతంత్ర్యవీరుడిగా అతడు నిలబడటానికి అవసరంమైన గాంధి సిద్ధాంతాలను ప్రబోధించే ప్రథమసూత్రంగా – అంతరాత్మకు వ్యతిరేకమైన పని ఏమిచేయవద్దని చెప్పి, నీ మనసుకు నచ్చింది– నీవునమ్మింది మనస్ఫూర్తిగా చెయ్యి అని గాంధి ఆశీస్సులు పొందిన గోపాలరావు దేశసేవలో పునీతంకావాలి అని వాసుదేవరావు చెప్పాడు. అందుకే గోపాలరావు తన వివాహానంతరం భార్యాబిడ్డలకంటే దేశస్వాతంత్ర్యసాధన లక్ష్యంతో ఉద్యమంలో భాగస్వామియై జైలుశిక్షలను అనుభవించగల త్యాగాలను చేయగలిగాడు. ఆ రకంగా స్వాతంత్ర్యోద్యమ వ్యక్తిత్వ వికాసానికి గాంధి ప్రబోధప్రభావాన్ని నిరూపించటం గాంధి సిద్ధాంతప్రతిపాదనయే. అంతేకాదు పెళ్ళిలో అలకపాన్పుమీద యిచ్చే డబ్బును హరిజననిధికి యిచ్చేయమనటం గోపాలరావు దానిని పాటించటం కూడా గాంధేయసిద్ధాంత ప్రభావమే.

అంపశయ్యమీద చివరిక్షణాలలో ఉన్న భీష్ముడిలా వాసుదేవరావు స్త్రీవిద్యాప్రాముఖ్యతను చెప్పించటమేకాక, 'అంతరాత్మకు వ్యతిరేకమైనపని చేయవద్ద"ని, స్వాతంత్ర్యం "నా జన్మహక్కు" అని గాంధి గురువైన తిలక్ నినాదాన్ని చెప్పి "ప్రతిమనిషికి స్వతంత్రపౌరుడిగా బ్రతికే హక్కు వుంది. ఆ హక్కుకోసం పోరాడటం ధర్మం, అదే ధర్మయుద్ధం, ఈ ధర్మయుద్ధానికి భార్యాపిల్లలు శృంఖలాలు కాకూడదు. వీటన్నింటికంటే ఉత్తమమైనలక్ష్యం మన దేశస్వాతంత్ర్యం అది మర్చిపోకు" అని చెప్పిన మాటలు గోపాలరావుకు ఉపనయనం అప్పుడు చెప్పిన అర్థంకాని గాయత్రి మంత్రంలా కాకుండా వంటబట్టిన స్వాతంత్ర్యమంత్రంలా అనిపించటమే గాంధీ స్వాతంత్ర్య లక్ష్యసాధనా దృక్పథం యొక్క ప్రభావమే.

గాంధేయవాదియైన వాసుదేవరావు తమతో స్వాతంత్ర్యజ్యోతి ఆరిపోకూడదని, పోరాటం సాగించాలని, స్వాతంత్ర్యం కోసం తాముఅరెస్టు అయి జైల్లో రాళ్ళుకొట్టి ఎద్దులస్థానంలో నూనె గానుగలను తిప్పి, మట్టిముంతలలో తిండితిని, దోమలు, బొద్దింకలతో సహవాసం చేసే శక్తిని ప్రసాదించింది గాంధిమహాత్ముడని చెప్పటంలోనే గాంధి ప్రభావం స్వాతంత్ర్యదీక్షాపరులపై ఎంతగా ఉందో అర్థమౌతుంది.

వాసుదేవరావు గోపాలరావుతో 'నీ మనసుకు నచ్చింది - నీవు నమ్మింది-మనస్ఫూర్తిగా చెయ్యమని' అంటూ ఆతనితో గాంధిచెప్పిన ప్రథమసూత్రంగా 'ఎవరికీ భయపడవద్దని, అంతరాత్మకు వ్యతిరేకమైనపని ఏమీచెయ్యవద్దని' చెప్పి ఆతని వ్యక్తిత్వాన్ని తట్టిలేపాడు. దేశంకోసం తమతరం వారు పోలీసుల లాఠీదెబ్బలుతిన్నామని, జైల్లో రాళ్ళుకొట్టామని, బరువులు మోసామని, ఎద్దులబదులుగా తమచేత గానుగలను తిప్పించి నూనె తీయించారని చెప్పాడు. మట్టిమూకుళ్ళలో పురుగుల తిండి పడేసేవారని, కప్పుకోను గొంగళీలు యిచ్చేవారుకాదని, దోమలు, నల్లులు, బొద్దింకలతో జైల్లో సహజీవనం సాగించగల శక్తిని గాంధి మహాత్ముడు ప్రసాదించాడని చెప్పాడు. ఇదంతా తమకు గాంధి ప్రసాదించిన శక్తిగా భావించటం గాంధి ఉద్యమ ప్రభావశీలత స్పష్టమౌతుంది.

శాసనోల్లంఘన సమయంలో జైలుశిక్షను అనుభవించి వచ్చిన గోపాలరావుతో రామలక్ష్మి 'కేవలం జైలుకు వెళ్ళివస్తే సరిపోదనీ, యింకా సత్యాగ్రహకార్యక్రమాలు చెయ్యాలని, గాంధిబాటలో నడవటానికి తొలిసారిగా నువ్వు దేశంపట్ల కళ్ళుతెరచిన చోటికివెళ్ళి అక్కడి పల్లెల్లో తిరిగి ప్రజలకు స్వాతంత్రేచ్ఛను బోధించమ'ని చెప్పింది. బాపూజీ మాటలుగా అక్కడ ఉన్నవారిని అక్కచెల్లెళ్ళు అన్నదమ్ములుగా భావించి వారితో కలిసి నడవమని చెప్పింది. ఆ రకంగా స్వాతంత్ర్యోద్యమంలో ముందుకు నడవమని గాంధేయవాద ప్రేరణను కలిగించింది. రామలక్ష్మికి గాంధి అంటే అహింస అనీ, గాంధి అంటే ప్రజాహితసేవ అనే భావనలు ఆమె నరనరాలలో జీర్ణింపచేసుకోవటంచేత ప్రజలంతా గాంధిబాటలో నడవాలనే ఆశయస్ఫూర్తిగల దేశసేవిక రామలక్ష్మి అని అర్థమౌతుంది.

గాంధి ఉప్పుసత్యాగ్రహానికి పిలుపునివ్వగా గాంధి వెంట అశేష జనం అనుసరించి దేశంమొత్తం ఉప్పుసత్యాగ్రహంలో భాగస్వాములయ్యారు. ఎక్కడివారిని అక్కడ అరెస్టుచేసింది ప్రభుత్వం. గాంధితో కూడా పాల్గొన్న రామలక్ష్మి తన ఉప్పుసత్యాగ్రహ ఉద్యమాన్ని గోపాలరావుకు తెలియచేస్తూ రాసిన లేఖలో తాను బంధువులందరితో సంబంధంలేకుండా ఉండటం వల్లనే తనలో ఆత్మధృతి, జీవితం పట్ల అవగాహన కలిగిందని రాసింది. అంతేకాదు, ప్రస్తుతం తాను మహాత్ముని వెంట వాలంటీరుగా ఉన్నానని, గాంధి ఉపన్యసిస్తుంటే దానిని తాను తెలుగులోకి తర్జుమా చేస్తున్నానని, జీవితానికి ఒక ఆలంబన, ప్రయోజనం కలిగిందని,

ఆర్థికదోపిడీలో భాగంగా బ్రిటిష్ ప్రభుత్వం 3 శాతంగా ఉన్న ఉప్పుపన్నును 8 శాతానికి పెంచినందుకు నిరసనగాచేపట్టిన ఉద్యమమే ఉప్పుసత్యాగ్రహం. అంటే భారతీయులు తమ ఉప్పును తయారుచేసుకోవటం జరిగింది. అయితే సముద్రతీరప్రాంతాలలో మాత్రమే వీలవుతుంది కాబట్టి మిగిలిన ప్రాంత భారతీయులు విదేశీ వస్తు, వస్త్ర బహిష్కరణతో పాటు కల్లుకొట్లదగ్గర పికెటింగ్

చేయటం ద్వారా మద్యపాననిషేధాన్ని అమలు చేయగలిగితే విదేశీవ్యాపారానికి, ఆదాయానికి గండికొట్టటం చేయవచ్చని భావించిన గాంధి శాసనోల్లంఘనాన్ని చేయమన్నాడు. శాసనోల్లంఘనంలో భాగంగా కల్లుకొట్టుదగ్గర పికెటింగ్ లో పాల్గొన్న గోపాలరావు మూడేళ్ళజైలుశిక్షను అనుభవించటమే గాంధి సిద్ధాంతాల ప్రభావానికి ఆచరణపూర్వకమైన నిదర్శనం.

గోపాలరావు మనసు భార్యని చూడాలన్న కోరిక ఉన్నా దేశమంతా తిరిగి, హరిజననిధికి డబ్బును పోగుచేస్తున్న మహాత్ముని వెంట తాను వెళ్ళాలన్న ఆశ కలిగింది. మహాత్ముడు పల్లెపల్లెకూ మారుమూల గ్రామాలకు వెళుతున్నారు. వెళ్ళిన ప్రతిచోటా హరిజననిధికి నగలు, నగదు వసూలుచేస్తున్నారు. బ్రిటిష్ వారి దమనశక్తిని ఆయుధాలతో విప్లవాలతో ఎదిరించి విజయం సాధించలేమన్నది గాంధికి తెలుసు. ఆ సేతుహిమాచల పర్యంతమైన ఈ బీదదేశంలో విప్లవం తీసుకురావాలి, ఎటువంటి విప్లవంలో ప్రజాబాహుళ్యం పాల్గొనగలుగుతారు అందరూ అన్ని వర్గాలవారు పాలుపంచుకోగల ఉద్యమంగా అపూర్వమైన ఉద్యమం చేపట్టాలి అన్న ప్రశ్నలకి ఉప్పురాయి నేనున్నానంటూ ఎలుగెత్తి కేకవేసింది. గాంధిజీ వాడవాడలాతిరిగి ఉప్పుసత్యాగ్రహానికి ఆయత్తంచేస్తుంటే ప్రజలలో నూతన చైతన్యం వచ్చింది. గాంధీ మహాత్ముడు ఉప్పుసత్యాగ్రహ ప్రచారానికై ఆంధ్రదేశంలోని మూలమూలలా పర్యటిస్తూ చేసిన హిందీభాషలోని ఉపన్యాసాలను తెలుగులోకి తర్జుమాచేస్తూ ఆయన వెంట వాలంటీరుగా నడిచిన రామలక్ష్మి తన జీవితానికి ఒక ఆలంబన, ఒకప్రయోజనం కలిగిందని గోపాలరావుకు రాసిన లేఖలో పేర్కొనటం అంటే గాంధిసాహచర్య ప్రభావం స్పష్టమవుతుంది.

గోపాలరావు సీతానగర ఆశ్రమంలో ఉన్న రాముడత్తయ్యను చూడటానికి వెళ్ళినప్పుడు ఆమె అనారోగ్యంతో ఉన్నా ఆత్మస్థైర్యం ఆమె కళ్ళల్లో ప్రతిఫలించటానికి ఉప్పుసత్యాగ్రహ సమయంలో ఆమెకు లభించిన గాంధి నీడన గడపగల భాగ్యం లభించింది అని గోపాలరావు అనుకొన్నాడంటే రామలక్ష్మిపై గాంధి ప్రభావమెంతగా ఉందో అర్థమౌతుంది. అంతేకాక రామలక్ష్మి సత్యాగ్రహిగా జైలుకి వెళ్ళివచ్చిన గోపాలరావుతో ఉద్యమంలో జైలుకెళ్ళినంత మాత్రాన సరిపోదని, గాంధి మహాత్ముడు చూపించిన బాటలో నడుస్తూ పల్లెప్రాంతాలలోగల అమాయకప్రజలకి దేశభక్తి, స్వాతంత్ర్యేచ్ఛను ప్రబోధించమని చెప్పింది. దానికై గోపాలరావు చీరాలకువెళ్ళి పల్లెప్రజలకు చదువుచెపుతూ, రాట్నం వడకటం నేర్పుతూ స్వాతంత్ర్యోద్యమ పాఠాలను బోధించాడని అర్థమౌతుంది. అందుకే చీరాలలో ఉన్న జానకమ్మ కూడా గోపాలరావును గురించి చెపుతూ ఆతడు గాంధీ బాటలో నడుస్తున్నాడని గర్వంగా చెప్పింది.

గోపాలరావు కూడా గాంధీవలె రాజకీయ పదవులు వద్దని భావించాడు. అందుకే భారతదేశ ప్రభుత్వచట్టం, 1935 ప్రకారం భారతదేశంలో రాష్ట్రీయస్వాతంత్ర్యపు ఎన్నికలలో గోపాలరావు నిలబడదలచుకోలేదు. స్వాతంత్ర్యానికి పూర్వం 1946 సం.లో జరిగిన కాని నందయ్య బలవంతం మీద ప్రజాసేవచేయటానికి ఎన్నికలలో కాని ఖర్చుపెట్టకుండా గెలిచాడు. కాని మంత్రిపదవికోసం ఆరాటపడలేదు. స్వాతంత్ర్య ప్రకటనానంతరం భారతదేశవేడుకలలో శాసనసభ్యుడిగా నామమాత్రం పాల్గొని, కాందిశీకు మతఘర్షణల నివారణకై నిరాహారదీక్షచేస్తున్న గాంధిని చూడటానికి వెళ్ళాడు. గాంధివలె పదవిని ఆశించలేదు. కాబట్టే 1952 ఎన్నికలలో గోపాలరావు పాల్గొనదలచుకోలేదు. ఇదంతా గాంధేయదృక్పథమే.

బ్రిటిష్ వారు తమ విభజించి పాలించే రాజనీతిలో భాగంగా రెండవప్రపంచ యుద్ధంలో భారతీయసైన్యం పాల్గొన్నందుకు భారతదేశానికి స్వతంత్రం యిస్తామంటూచెప్పి హిందూ ముస్లిములను విభజిస్తూ ఇండియా, పాకిస్తాన్‌గా భారతదేశాన్ని రెండుముక్కలుచేయటం, రెండుమతాలవారు కాందిశీకులవటంతో చెలరేగిన మతఘర్షణలను అదుపుచేయటానికి గాంధి మిగిలినవారిలా స్వాతంత్ర్యవేడుకలలో పాల్గొనకుండా నిరాహారదీక్షను చేపట్టినందుకు అప్పటి శాసనసభ్యుడిగా గోపాలరావు కూడా స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలలో భాగంగా మిఠాయిలు పంచుకోకుండా గాంధి ఉపవాసదీక్షను చూడాలనుకొని ఢిల్లీ వెళ్ళటం జరిగింది. అక్కడ విలేఖరులు స్వాతంత్ర్యం వచ్చిన యింకా మతఘర్షణలు కొనసాగుతాయా అని అడిగిన ప్రశ్నకు, గాంధి నిరాహారదీక్ష అని సమాధానం చెప్పినప్పుడు, దాని పర్యవసానంగా తాత్కాలికంగానైనా హిందూ ముస్లిములు ఘర్షణపడమని గాంధికి మాటయివ్వటం వంటివి చూసినప్పుడు గాంధియొక్క అహింసకు ఉన్న పదును గోపాలరావుకు అవగతమైందని అనటం అంటే గాంధి సిద్ధాంతమైన అహింస స్వాతంత్ర్యానంతరం కూడా బలీయమైనదని ప్రతిపాదించినట్టు అర్థమౌతుంది. ఆ తరవాత కొన్నిరోజులకే గాంధి మరణాన్ని దూరంనుండి కళ్లారచూడటం వంటివి గోపాలరావుపై చెరగని ముద్రవేసాయి. స్వాతంత్ర్యానంతరం తాను భారతీయులనందరినీ ఒకత్రాటిపై నడిపించి స్వాతంత్ర్యాన్ని సాధించిపెట్టినా, పదవిని ఆశించని గాంధివలె స్వాతంత్ర్యానంతరం1952 సం.లో జరిగిన భారతదేశఎన్నికలలో తాను పాల్గొనలేదు. ఆ తర్వాత కుటుంబపోషణార్థం ప్రిటింగ్ ప్రెస్‌లో ఉద్యోగం చేస్తూకూడా ఆ పత్రికలో వారంవారం గాంధేయదృక్పథంమీద వ్యాసాలురాసి గాంధి ఆశయాలకు శాశ్వతత్వం కలిగించి తరతారాలకు అందించటానికి అక్షరబద్ధం చేసాడని నవలలో పేర్కొనటం కూడా గాంధేయసిద్ధాంతాలను ప్రతిపాదించే ప్రయత్నమే. అంతేకాదు గోపాలరావు చిన్నయింటిని

కొనుక్కొని దానిలోకి ప్రవేశించేటప్పుడు కూడా గాంధి పటాన్ని స్వరాజ్యలక్ష్మి చేతితో పట్టుకొనిరాగా గృహప్రవేశం చేయటం జరిగింది. అంటే రచయిత్రి సూక్ష్మాతి విషయాలలో కూడా గాంధిని మరిచిపోకుండా ఉండేటట్లు చేయటం, గృహప్రవేశ సందర్భంలో గోపాలరావు దేవుడి ఫొటోకంటే కూడా గాంధి పటానికి ప్రాముఖ్యతనిచ్చి తరతరాలకు గాంధిపటాన్ని చూస్తే అహింసా ధర్మం గుర్తుకు వచ్చేటట్టుగా రాయటం గాంధిసిద్ధాంతానికి శాశ్వతత్వాన్ని ప్రతిపాదించటంగా అర్థమౌతుంది. గాంధి తలపెట్టిన ఉప్పుసత్యాగ్రహ సమయంలోని స్ఫూర్తి చైతన్యంతోనే ప్రజలు ఎమర్జన్సీ అనంతరం జనతాప్రభుత్వాన్ని ఎన్నుకొన్నారనటంలోను, జానకమ్మ గోపాలరావుతో సంభాషిస్తూ సత్యాయాగ్రహ ఉద్యమ విరుద్ధమైన కార్యకలాపాలను చేయటాన్ని గాంధిచూస్తే స్వాతంత్ర్యంవద్దని హిమాలయాలకు వెళ్ళి తపస్సు చేసుకునేవాడనటంలోను, గాంధి సిద్ధాంత ప్రతిపాదనను నవల చివరవరకూ కొనసాగించాలని అనుకోవటమే జరిగింది.

అందుకే తన మనమరాలైన స్వరాజ్యలక్ష్మిని గాంధిప్రబోధాలతో పెంచి స్వాతంత్ర్యానంతరం పెరిగిన రాజకీయస్వార్థాలకు, అధికారపు అవినీతికి విరుగుడుగా విప్లవపంథాకంటే శాంతియుత అహింసా పద్ధతిని పాటించటానికి గాంధి యువతకు ప్రబోధించిన జాతీయసేవను[2] స్వరాజ్యలక్ష్మి తన జీవనవిధానంగా చేసుకునేటట్టుగా నవలను ముగించాలనుకోవటం, దేశసేవిక, గాంధేయవాది యైన రామలక్ష్మి నాలుగో తరంమీద కూడా గాంధి ప్రభావం తరలివస్తోందని ప్రతిపాదించటం వంటి సంభాషణలు, పాత్రల చర్యలు, సంఘటనల ద్వారా నవలలో మౌలికమైన గాంధేయ అహింసాసిద్ధాంతాన్ని ప్రతిపాదించటమే జరిగింది.

9. హృదయనేత్రి నవల-సాహిత్యప్రయోజనం

హృదయనేత్రి నవలను సైద్ధాంతిక ప్రాతిపదికన చూసినప్పుడే దాని ప్రయోజనం స్పష్టమౌతుంది. నేటి ప్రపంచీకరణ సందర్భంలో దేశస్వాతంత్ర్యపరిరక్షణ అత్యంత ఆవశ్యకమైన విషయం. నేటి యువతరం యొక్క పూర్వీకులు తమ జీవితాలను పణంగా పెట్టి సాధించి తెచ్చిపెట్టిన ఆ స్వాతంత్ర్యాన్ని వజ్రసమానం చేసుకుంటూ విలువైనదిగా చూసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. దానికోసం యువత ముందుగా స్వాతంత్ర్యానికి పూర్వము భారతదేశంలో ఉన్న పరిస్థితులను అర్థంచేసుకుంటూ ముందుకు సాగగలగాలి. చారిత్రకసంఘటనల సమాహారంగా స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పుస్తకాలలో లభ్యమైనప్పటికీ, సాహిత్యకళారూపంగా ఉండినప్పుడు మాత్రమే ఆయా చారిత్రక సంఘటనలపట్ల పాఠకుల మనస్సుదగ్గరై వారిలో అనుభూతి జ్ఞానం ఏర్పడుతుంది. అప్పుడే స్వాతంత్ర్యోద్యమ విలువ అవగాహనకు వస్తుంది. దాన్ని పరిరక్షించుకోవాలనే స్పృహ కలుగుతుంది. అటువంటి దేశభక్తి యువతలో ఏర్పడినప్పుడే దేశానికి భద్రత ఉంటుంది. ప్రతిదీ జీవితంలో అనుభవించి తెలుసుకోవటానికి అవకాశం ఉండదు. జీవితకాలం సరిపోదు.

భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర రాజకీయ-ఆర్థిక, సామాజిక-సాంస్కృతిక విషయాల సమ్మేళంగా ఉండటంతో నేటి పరిస్థితులకు మూలాలను తెలియచేస్తుంది. కాబట్టి చారిత్రక అనుభవాలలోని మంచిచెడులను విశ్లేషణ చేసుకుంటూ, మారుతున్న నేటి పరిస్థితులకు అనుగుణంగా ఆయా అనుభవాల జ్ఞానంతో నేటి పాఠకులను దేశస్వాతంత్ర పరిరక్షణకై కర్తవ్యోన్ముఖులను చేయగలిగేది సాహిత్యం మాత్రమే. అందులోను విస్తృతసమాజ చిత్రీకరణకు ఆస్కారంగా నవలా ప్రక్రియ అనువైనది కాబట్టి రచయిత్రి హృదయనేత్రి అనే నవలను పాఠకులముందుకు తెచ్చారు. దేశస్వాతంత్ర్యానికి ముందున్ననాటి సామాజిక, రాజకీయ ఆర్థికవ్యస్థను నేటి పాఠకుల కళ్ళముందుకు తెచ్చి స్వాతంత్ర్యానంతరం కళ్ళముందున్న వ్యవస్థను పోల్చి చూసుకోగలిగేట్టలు చేస్తేనే స్వాతంత్ర్యపు విలువలు అర్థమౌతాయి. దేశస్వాతంత్ర్యానికి పూర్వం ఆనాటి యువతరానికి చెందిన గోపాలరావు గాంధేయవాదిగా దేశభక్తుడిగా తయారవటానికి మార్గదర్శకం వహించింది ఆతని మేనత్త రామలక్ష్మి/ రాముడత్తయ్య. ఆమె గోపాలరావును కూర్చోపెట్టుకొని నీతులను బోధించలేదు. రాముడత్తయ్య

జీవిస్తున్న పరిసరాలలో అతడు తనకున్న జిజ్ఞాసతో ఊహాజ్ఞానాన్ని సంపాదించుకునే స్థితిని చేరుకునేటట్టు చేసింది. అందుకనే నేటి యువత ముందుగా ఆకర్షణ కంటే ఆశయాల వాతావరణాన్ని కోరుకోవాలి. సామాజిక సాంస్కృతిక ఆంక్షలను అధిగమించిన రాముడత్తయ్య కల్లుదుకాణాల పికెటింగ్‌లలో పాల్గొనటం, యింట్లో జరిగే సమావేశాలలో స్త్రీపురుషలను సమంగా చూడటం వంటి విషయాలలో ధైర్యంగా ఉండటం వంటి విషయాలు గోపాలరావులో పిరికితనాన్ని పోగొట్టాయి. ఆనాడు స్త్రీలకు చదువు నిషిద్ధం అయినా ఆమె పత్రికా పఠనం చేయటం, బ్రిటిష్ వస్త్రవ్యాపారానికి గండికొట్టే విధంగా రాట్నాన్ని వడికి, నూలు తయారుచేయటం, ఖద్దరు వస్త్రధారణ వంటి సత్యాగ్రహ ఉద్యమ కార్యాచరణను పాటించటమనే వాతావరణంలో ఉన్న గోపాలరావుకు దేశాభిమానం సహజంగానే వంటబడుతుంది.

కాబట్టి నేటి యువత అశ్లీలచిత్రాల ఆకర్షణకు లోనుకాకుండా దేశంయొక్క స్థితిగతులను తెలుసుకునే పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి. దానికోసం దేశాన్ని గురించి రాసిన సాహిత్యాన్ని చదవాలి. సాహిత్యంలో వివిధకాలాలలో జరిగిన సంఘటనల చరిత్ర, సంఘర్షణలు, వాటిపట్ల స్పందించిన మానవ నాగరికత, మానవజీవన సంస్కృతి, మానవస్వభావాల చిత్రీకరణను విస్తారంగా ప్రతిబింబించేది నవలాసాహిత్యం. అందుకే స్వాతంత్ర్యపు విలువలను విస్మరిస్తుంటే, స్వాతంత్ర్య దీపం రెపరెపలాడుతూ భద్రత కరువవుతున్న నేటి పరిస్థితులలోని మంచిని, చెడుని అర్థం చేసుకోవటానికి, ఆ పరిస్థితులు అలా ఏర్పడటానికి కారకాంశాలైన రాజకీయ–ఆర్థిక పరిస్థితుల అంచనా వేయగలిగి మానవ తప్పిదాలను, మనస్తత్వాలను తెలుసుకోవటానికి హృదయనేత్రి వంటి నవలా సాహిత్యపఠనం అవసరం. అలాంటప్పుడు ఆ పరిస్థితులపట్ల యువత స్పందిస్తుంది. చెడును వ్యతిరేకించటానికి ఉద్యమాలు చేస్తుంది. ఉద్యమాలు రెండురకాలుగా ఉంటాయి ఒకటి అహింసాయుతంగా జరిగేది. రెండవది శాంతియుతంగా సాధించలేనప్పుడు విప్లవాత్మకంగా హింసకు పూనుకునేది.

రెండింటిలో నిస్వార్థత ఉంటేనే ఏ ఉద్యమమైనా విజయం సాధిస్తుంది. గాంధేయవాదులుగా పరాయిపాలన యొక్క పీడిత అధికారం నుండి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకై నాటి పెద్దల అడుగుజాడలలో నడిచి శాంతియుత విప్లవం ద్వారా జైళ్ళల్లో మగ్గి తమ మానప్రాణాలను పణంగా పెట్టి స్వాతంత్ర్యాన్ని సాధించగలిగారని దేశచరిత్ర తెలియచేసింది. అయితే అందులో సాయుధపోరాటం చేసిన భగత్ సింగ్, నేతాజీ సుభాష్ చంద్రబోసువంటి సాయుధవీరుల పోరాటం కూడా ఉందని చరిత్ర చెప్పింది. అందుకే స్వాతంత్ర్యానంతరం మారిన పరిస్థితులలో దేశంలో పెచ్చుపెరిగిన అవినీతి రాజకీయ అధికారంపట్ల సాయుధపోరాటం పరిష్కారమనుకుంటున్న యువశక్తి తమ ప్రాణాలను బలిపెట్టడంతప్ప ప్రయోజనం కనపడటం లేదు. కాబట్టి రచయిత్రి స్వాతంత్ర్యసమరయోధులైన అనుభవశీలురచేత

దేశభవిష్యత్తుకై యువత చేయాల్సిన శాంతియుత కార్యాచరణగా నిస్వార్థమైన ప్రజాసేవయే వాటన్నింటికి విరుగుడుమందుగా భావించటం జరిగింది. తాము రాజకీయ అధికారాలకు బలికాకుండా జీవితాంతం ప్రజాసేవలో నిస్వార్థంగా యువశక్తి భాగస్వామ్యం అవటాన్ని పరిష్కారంగా సూచించిన నవల నేటి యువతకు కరదీపిక కాగలుగుతుంది. అందుకే నవలలో వాసుదేవరావు పాత్రద్వారా గాంధిప్రభోధాలను గోపాలరావుకు గుర్తుచేస్తూ 'నీ మనసు నమ్మినదానిని, నీ మనసు నచ్చినదానిని చేయటానికి నీవు ఎవరికీ భయచడాల్సిన పనిలేదు' అని చెప్పించటమే యువశక్తికి కావలసినది. తాను చేసే పనులు మనసుకు మంచివనే నమ్మకం ఉంటే ఎవరికీ భయపడకుండా ఉండే ధైర్యాన్ని కలిగించినప్పుడే ఆ పనులు విజయాన్ని సాధించగలుగుతాయని, మహాత్ములవంటి వారి సాహచర్యంలో ఆత్మధృతి కలిగిందని రామలక్ష్మి పాత్రద్వారా చెప్పించటంవల్ల యువశక్తి అటువంటి ఆశయాల ఆచరణాత్మకతను అన్వేషించి స్వాతంత్ర్యపరిరక్షణకై అటువంటి వారి మార్గదర్శకత్వాన్ని కోరుకోవాల్సిన అవసరాన్ని రచయిత్రి యువతకు దిశానిర్దేశం చేసిన నవలా రచన హృదయనేత్రిని నేటి యువత తప్పక పఠించాల్సిన అవసరం ఉంది.

సమాజంలో చిన్నచూపు చూడబడే వితంతువుల జీవితాలకు స్వాతంత్ర్యోద్యమంలో ఉన్న విలువ జానకమ్మ పాత్రద్వారా అర్థం అవటమేకాక, ఎటువంటి పరిస్థితులు ఉన్నా ధైర్యంగా దేశసేవికగా సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని ఆచరణాత్మకంగా ఆత్మనిర్భరత్వంతో ఉండటమేకాక, స్త్రీలు మానప్రాణాలను పణంగా పెట్టి కష్టపడి సాధించిన స్వాతంత్ర్యపు విలువలను తరువాతి యువతరం కాపాడాలని దేశభవితవ్యాన్ని దర్శించినప్పుడు వారికి యువశక్తి తన హృదయనేత్రాలను విప్పారించి కర్తవ్యోన్ముఖులు కాగలగేటట్లుగా రాసిన నవలయొక్క ప్రభావం యువతమీద తప్పనిసరిగా ఉంటుంది. అందుకే శ్రీమతి మాలతీ చందూర్ రాసిన ఈ 'హృదయనేత్రి' నవల 'సహృదయసంధాత్రి'. నేటి యువతకు దేశస్వాతంత్ర్యపు విలువలు అర్థమైతేనే దేశస్వాతంత్ర్యపరిరక్షణకు యువశక్తి బద్ధకంకణులు కాగలుగుతారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినకూడా పౌరస్వేచ్ఛకు ప్రతిబంధకంగా ఉన్న నేటిస్వార్థపూరిత రాజకీయాలు రక్షణగా ఉంటే, నేటి భారతీయపోలీసు వ్యవస్థలోను స్వాతంత్ర్యానికి పూర్వమున్నవారి వారసత్వ స్వామ్యాలు, సామ్యాలను గుర్తించుకుంటూ అవసరమైతే స్వాతంత్ర్య పరిరక్షణలో జైళ్ళకుకూడా వెళ్ళగలిగే స్ఫూర్తిని యువతకు అందించగల నవల ఈ హృదయనేత్రి. నేటి యువత స్వాతంత్ర్య యువశక్తిని పుంజుకొని సహృదయసంధాయకులు కాగలిగి దేశస్వాతంత్ర్య పరిరక్షణలో భాగస్వాములు కావటమే ఈ గ్రంథపాఠకప్రయోజనం.

10. పాదసూచికలు

1 వ అధ్యాయం -

1. మనోజ్ఞమాలతి-విజ్ఞాన సరస్వతి-అంతర్జాలసమాచారం
2. 'హృదయనేత్రి'- నవలక్వాలిటీపబ్లిషర్స్-ఆగస్టు 2020, విజయవాడ

2 వ అధ్యాయం -

1. తెలుగు నవలావికాసం-మొదిలి నాగభూషణశర్మ1971 ప్రచురణ
2. తెలుగు నవలావికాసం-మొదిలి నాగభూషణశర్మ1971 ప్రచురణ
3. తెలుగు నవలావికాసం-మొదిలి నాగభూషణశర్మ1971 ప్రచురణ
4. తెలుగు నవలావికాసం-మొదిలి నాగభూషణశర్మ1971 ప్రచురణ
5. తెలుగు నవలావికాసం-మొదిలి నాగభూషణశర్మ1971 ప్రచురణ
6. తెలుగు నవలావికాసం-మొదిలి నాగభూషణశర్మ1971 ప్రచురణ
7. తెలుగు నవలావికాసం-మొదిలి నాగభూషణశర్మ1971 ప్రచురణ
8. సాంఘికనవలలు-కథనశిల్పం-మృణాళిని 1988 ప్రచురణ
9. సాంఘికనవలలు-కథనశిల్పం-మృణాళిని1988 ప్రచురణ
10. సాంఘికనవలలు-కథనశిల్పం-మృణాళిని1988 ప్రచురణ
11. సాంఘికనవలలు-కథనశిల్పం-మృణాళిని1988 ప్రచురణ
12. తెలుగు నవలావికాసం-మొదిలి నాగభూషణశర్మ1971 ప్రచురణ
13. సాంఘికనవలలు-కథనశిల్పం-మృణాళిని1988 ప్రచురణ
14. సాంఘికనవలలు-కథనశిల్పం-మృణాళిని1988 ప్రచురణ

3 వ అధ్యాయం -

1. సాంఘికనవలలు-కథనశిల్పం-మృణాళిని1988 ప్రచురణ
2. తెలుగు నవలావికాసం-మొదిలి నాగభూషణశర్మ1971ప్రచురణ

4 వ అధ్యాయం -

1. భారతస్వాతంత్ర్యోద్యమ చరిత్ర-మామిడిపూడి వేంకటరంగయ్య-1976-ప్రచురణ

2. భారతస్వాతంత్ర్యోద్యమ చరిత్ర-మామిడిపూడి వేంకటరంగయ్య -1976-ప్రచురణ

3. క్వాలిటీపబ్లిషర్స్-ఆగస్టు 2020,విజయవాడ

5 వ అధ్యాయం -

1. చీరాల,పేరాల, జాంద్రపేట అనుమూడుగ్రామాలు అంతకుపూర్వం పంచాయితీలుగా ఉండేవి, ఈ ప్రాంతం చేనేతవ్యాపారానికి విదేశీవస్త్రాలఎగుమతికి ప్రసిద్ధిపొందింది. ఈప్రాంతానికి మున్సిపాలిటీ ఏర్పాటుచేస్తే హెచ్చుపన్నులు వస్తాయనే దురాశ బ్రిటిష్ ప్రభుత్వానికి కలిగి 1919లో ముల్సిపాలిటీగా చేసింది. పన్నులు ఒక్కసారిగా నాలుగువేల రూపాయల నుండి పాతికవేల రూపాయలకు పెరిగింది. అందుకే 'ఆంధ్రరత్న' దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు రంగంలోకి దూకి ప్రజలకు నాయకత్వం వహించారు-చీరాల ఉద్యమ ప్రచారంచేస్తున్నందుకు దుగ్గిరాల వారిని బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టుచేసి ఏడాదిపాటు జైలుశిక్షకు గురిచేసింది.
   జాతినిర్మాతలు-తుర్లపాటి కుటుంబరావు-పునర్ముద్రణ 2018

2. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గారు చీరాలలో జాతీయవిద్యాలయాన్ని నెలకొల్పాలనే కోర్కెతో చీరాల ప్రజలను భూమికావాలని అడిగేసరికి 25 ఎకరాల భూమిని యిచ్చారు. దానిలో ఆయన శ్రీ మదాంధ్ర విద్యాపీఠాన్ని నెలకొల్పారు. ఆ ప్రాంతానికి ఆయన రామ్‌నగర్ అని పేరుకూడా పెట్టారు.

3. 1921లో అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సమావేశాలు విజయవాడలో జరిగాయి. ఈ మహాసభల నిర్వహణకు స్వచ్ఛందసేవాదళం అవసరం అయింది. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గారు స్థాపించిన క్రమశిక్షణ, ఓర్పు నిజాయితీ, ప్రజాసేవాసక్తిగల రామదండుతో మహాసభలను జయప్రదం చేసింది.
   జాతినిర్మాతలు-తుర్లపాటి కుటుంబరావు-పునర్ముద్రణ2018

4. 1921లో గరిమెళ్ళ సత్యనారాయణ రాసిన 'మాకొద్దీతెల్లదొరతనం' అనే 140 పంక్తుల పాట నేటికి ప్రజల నాలుకలమీద నాట్యమాడే పాట.

5. కొండ వెంకటప్పయ్యగారు ఆంధ్రుల సాంస్కృతిక పునరుజ్జీవనానికి జాతీయభావప్రదీప్తికి ఒక జాతీయపత్రిక ఉండాలని అంటే 1902 లో మచిలీపట్నం నుండి వచ్చిన పత్రికయే కృష్ణాపత్రిక.
   జాతినిర్మాతలు-తుర్లపాటి కుటుంబరావు-పునర్ముద్రణ2018-

   ముట్నూరి కృష్ణారావు సంపాదకత్వంలో వచ్చిన కృష్ణాపత్రిక- కృష్ణా మండలం నుండి వచ్చేపత్రిక కృష్ణాపత్రిక. ముట్నూరి కృష్ణారావుగారి సంపాదకత్వంలోని కృష్ణాపత్రిక ఆంధ్రదేశంలో రాజకీయచైతన్యానికి ఎంతగానో దోహదం చేసింది- బందరులోని కృష్ణాపత్రిక కార్యాలయంలో ముట్నూరివారు కృష్ణదేవరాయలుగాను, అష్టదిగ్గజాల వంటి రాజకీయనాయకులతోను, రచయితలు, కవులు రోజూ పాల్గొంటూ రాజకీయ, సాంఘిక విషయాలపై చేసే చర్చలే మర్నాటి సంచికలో

వచ్చేవి. అందుకనే ఆ కృష్ణాపత్రిక, దాని సంపాదకులు జాతీయోద్యమంలో భాగస్వాములయ్యారు– మహానాయకులు–తుర్లపాటి కుటుంబరావు– పునర్ముద్రణ–2018

6. 'దేశభక్త' బిరుదుగల కొండ వెంకటప్పయ్య కాంగ్రెస్ కురువృద్ధుడు. గాంధితో మంచి అనుబంధం ఉన్నవాడు. గొప్పసంఘసంస్కర్త. అస్పృశ్యతానివారణకు చిత్తశుద్ధితో పనిచేసారు. "అంటరానితనం పూర్తిగా నిర్మూలింపబడనంతవరకు స్వాతంత్ర్యం సమగ్రంకాజాలదు. ఒక్క అస్పృశ్యుడు దేశంలో ఉన్నా మనం సిగ్గుతో తలవంచుకోక తప్పదు" అని అన్నాడు వీరు. 1921,1930, 1932,1942 లలో జైలుశిక్షకు గురిచేయబడ్డారు..
జాతినిర్మాతలు–తుర్లపాటి కుటుంబరావు–పునర్ముద్రణ2018

7. 1921 లో ఉన్నవ లక్ష్మీనారాయణరావు రచించినది. పల్నాడులో జరుగుతున్న పుల్లరి పన్నుకు వ్యతిరేకంగా ఆదివాసీలుచేస్తున్న పన్నులనిరాకరణ ఉద్యమాన్ని చూడటానికి వెళ్ళినప్పుడు ఉన్నవ లక్ష్మీనారాయణను అరెస్టుచేసి ఏడాదుపాయు జైలు శిక్షనువేసారు. జైల్లో రాసిన నవల యిది. అయితే జైలునుండి బయటకు రాగానే ప్రచురించబడేసరికి బ్రిటిష్ ప్రభుత్వం దీనిని నిషేధించింది. దానితో ఈ పుస్తకాన్ని రహస్యంగాచదదివేవారు. 1926 నిషేధాన్ని తొలగించినా దీనిని పాఠ్యాంశంగా పెట్టినందుకు తిరిగి 1931లో నిషేధానికి గురియైనది.

8. 1871 నుండి ప్రవేశ పెట్టిన నేరస్థజాతుల చట్టం ప్రకారం సంచారజాతులను, వ్యవసాయకూలీలను నేరస్థజాతులని నిర్ణయించి బ్రిటిష్ ప్రభుత్వం వారిని ఊరికి దూరంగా ఒకచోట ఉంచే ప్రదేశాన్ని సెటిల్మెంటు అంటారు..– అంతర్జాలం

9. మాలపల్లి నవలలో జ్యోతి అప్పాదాసులు బావామరదళ్ళు, ఇద్దరి మధ్య శారీరకవాంఛలులేని అమలినశృంగారం ఉండేది. బ్రిటిష్ అధికారి పౌలు జ్యోతిని అనుభవించాలని వెంటపడ్డప్పుడు ఆమె నదిలోకి దూకుతుంది. అక్కడకు చేరుకున్నఅప్పాదాసు కూడా ఆమెవెంట నదిలోకి వెళ్ళిపోతాడు. ఇది వారిద్దరి విషాదగాథ.– మాలపల్లి – ఉన్నవలక్ష్మీనారాయణ.–2022 ప్రచురణ

10. సంగదాసు పంచమోద్ధరణకు పూనుకొని పాఠశాలనుపెట్టి బోధించేవాడు. కర్షకులు, కార్మికుల తరపున పోరాటం చేసినవాడు. అంతేకాక, రైతుకూలీకోసం అప్పటివరకున్న ధాన్యమార్పిడికాక, కూలిడబ్బును యిస్తామని భూస్వాములు నిర్ణయిస్తే పెరిగిన ధరలకు కూలి గిట్టుబాటుకాదని, ధాన్యమే యివ్వాలని పట్టుబట్టి కూలీలు పనికివెళ్ళకుండా చేస్తున్నందుకు భూస్వామియైన వెంకట్రామయ్య చేతిలో హత్యకు గురికాబడ్డాడు. అతనిపేరున సంగపీఠాన్ని ఏర్పాటుచేయబడింది. మాలపల్లి – ఉన్నవలక్ష్మీనారాయణ–2022 ప్రచురణ

11. తక్కెళ్ళ జగ్గడు రామదాసు కొడుకు తక్కెళ్ల జగ్గడుగా పేరు మార్చుకొని ధర్మకన్నాలు వేసేవాడు. అంటే ధనవంతులదగ్గర సొమ్మును దొంగతనం చేసి బీదలకు పంచిపెట్టి తక్కెడలో వలె

ధనవంతులను, బీదలను సరిసమానంచేసే వర్గరాహిత్య సమాజంకోసం పాటుబడ్డాడు. చివరికి పోలీసుల తుపాకులు బలిఅయ్యాడు.

12. రామదాసు మాలపల్లి నవలలో మాలదాసరి. శుచిశుభ్రతను పాటించేవాడు ముఖ్యంగా గాంధి అహిసా ధర్మాన్ని పాటించేవాడు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో బ్రిటిష్ వారు మూఢనమ్మకాలు పాటించే భారతీయులకు స్వరాజ్య అర్హతలేదన్నందుకు తిలక్ భారతీయులు స్వీయసంస్కరణ చేసుకోవాలని ప్రచారంచేసాడు. పంచముల స్వీయోద్ధరణకూడా చేసుకోగలిగితే సత్యాగ్రహ ఉద్యమంలో ప్రాధాన్యత వహించిన హరిజనోద్ధరణ జరుగుతుందనే ఆశయంతో ఉన్నవ లక్ష్మీ నారాయణగారు మాలపల్లిని రచించారు. – ఆతని భార్య మాలక్ష్మి. అగ్రకులాలవారి ఆధిపత్యానికి కొడుకు సంగదాసు బలియైనా ఎవరినీ పల్లెత్తుమాట అనని కష్టజీవి. – ప్రచురణకై పంపిన వ్యాసం– జంధ్యాల కనకదుర్గ

13 . 'హృదయనేత్రి' నవల–క్వాలిటీ పబ్లిషర్స్ విజయవాడ ప్రచురణ– 25 వ పేజిలో గోపాలరావు స్వరాజ్యం చే ఏమిటని అడిగినప్పుడు రామలక్ష్మి "మనదేశాన్ని మనం పాలించుకోవచ్చు ప్రజలందరికీ తిండి బట్ట వుంటుంది.. దరిద్రం ఉండదు. నీలాంటి పిల్లలు స్వేచ్ఛగా, ధైర్యంగా పెరగవచ్చు" అని చెప్పింది.

14. ఆడపిల్లలు చదువుకోగలుగుతారని, రజస్వల వివాహాలను త్రుంచే క్రమంలో శారదాగౌరు గారు ఆడపిల్లలకు14 ఏండ్లు వచ్చేంతవరకు వివాహం నిషేధం అని1929 లో వచ్చినదే శారదా చట్టం.

15. స్త్రీలఅభ్యున్నతికై సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగంగారు రాజమండ్రిలో వితంతు శరణాలయాన్ని నెలకొల్పి వితంతువులకు వివాహాలు జరిపించాడు. 1891లో ఆంధ్రదేశంలోని మొట్టమొదటి వితంతువివాహాన్ని ఎక్కడే జరిపించాడు.

16. 1919 చట్టం– స్వయంపరిపాలనకావాలని భారతీయులు చేస్తున్న హోమ్ రూల్ ఉద్యమాన్ని ఆపటానికి మాంటేగ్–ఛేమ్స్ ఫర్డ్ చేసిన సంస్కరణలలో భాగంగా బ్రిటిష్ వారు భారతీయులకు ప్రావిన్సులస్థాయిలో ఎన్నకల ద్వారా భారతీయులకు భాగస్వామ్యం కల్పిస్తూ చేసిన చట్టం 1919.– భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర–మామిడిపూడి వెంకటరంగయ్య1976 ప్రచురణ.

17. 1917 నుండి అనిబిసెంట్ తిలక్ కలిసి స్వయంప్రతిపత్తి కోసం చేసిన హెూమ్ రూల్ ఉద్యమ ఫలితంగా వచ్చిన 1919 చట్టం ప్రకారం, కేంద్ర, రాష్ట్ర శాసనసభలలకు ఎన్నికలు ప్రకటించినప్పుడు గాంధి స్వయంప్రతిపత్తి స్థానంలో స్వరాజ్యం అనే పదాన్ని పెట్టి కాంగ్రెస్ స్వరాజ్యంకోసం పోరాడే పార్టి అని నిర్ణయించటం జరిగింది. భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర– మామిడిపూడి వెంకట రంగయ్య 1976 ప్రచురణ

18. బ్రిటిష్ వారిని ఎదుర్కొనటానికి భారతీయుల ఐక్యతముఖ్యమని భావించిన గాంధి, దానికోసం అస్పృశ్యతానివారణలో భాగంగా హరిజనోద్ధరణ జరగాలని భావించి వారికోసం ఏర్పాటుచేసిన నిధి హరిజననిధి. గాంధి దేశంలోని నలమూలలా తిరిగి ఈ నిధికి విరాళాలను సేకరించేవాడు.

19. గురజాడ రాసిన 'దేశభక్తి' అనే గేయంలో సొంతలాభం కొంతమానుకొని పొరుగువాడికి సాయపడవోయ్ – ముత్యాలసరాలు–గురజాడ అప్పారావు.

20. బులుసు సుబ్రహ్మణ్యంగారు. కాంగ్రెస్ వాది. గాంది అనుయాయి. కాకినాడలో జరిగిన కాంగ్రెస్ సభలను నిర్వహించినవాడు. రాజమండ్రి దగ్గరలో ఉన్న సీతానగరంలో గాంధి వచ్చినప్పుడు బస చేయటానికి వీలుగా ఆశ్రమాన్ని కట్టించాడు.

21. సత్యాగ్రహ ఉద్యమంలో భాగంగా గాంధి సూచనమేరకు దేశమంతటా ఉద్యమాన్ని నిర్వహిస్తున్న సత్యాగ్రహులు బస చేయటానికి వీలుగా ఆశ్రమాలను కట్టించారు. అవే సత్యాగ్రహ ఆశ్రమాలు. అక్కడ ఉన్నవారు బ్రహ్మచర్య నియమాలను పాటిస్తూ, రాట్నం వడికి నూలు తియ్యటం, సాత్వికాహారపు అలవాట్లు పాటించటం వారి విధి. ఇప్పటికీ గాంధి నివసించిన సబర్మతీ ఆశ్రమం ఒక పర్యాటక ఆశ్రమంగా ఉండటం ప్రపంచ అధినేతలు దర్శించి, అక్కడున్న రాట్నంతో నూలువడకటం తెలిసిన విషయమే.

22. గాంధి ఆధ్వర్యంలో దేశస్వరాజ్యంకోసం సత్యాగ్రహ ఉద్యమం జరుగుతున్న రోజులలో, ఖద్దరు విదేశీవస్త్ర,వస్తు బహిష్కరణ బ్రిటిష్ వారి వ్యాపారం భారతదేశంలో 100 కోట్ల వ్యాపారం 57 కోట్లకు పడిపోవటంతో ఉద్యమాన్ని అదుపుచేసేఎత్తుగడలో భాగంగా భారతీయులకు స్వరాజ్యం యిచ్చే అర్హతవచ్చిందా లేదా అని దేశం అంతా పర్యటించి పరిశీలించటానికి1927 లో బ్రిటిష్ ప్రభుత్వం పంపిన కమిషన్ సైమన్ కమిషన్.అప్పుడు చేసినదే 'సైమన్ గోబ్యాక్' అనే ఉద్యమం. భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర–మామిడిపూడి వెంకట రంగయ్య 1976 ప్రచురణ

23. జితేంద్రనాథ్ దాస్ బెంగాలి యువకుడు. లాహోర్ లో జరిగిన పోలీసు అధికారిని కాల్చిచంపి న కుట్రలో జితేంద్రనాథ్ దాస్ కూడా ఉన్నాడని అతడిని అరెస్టుచేసారు. జైల్లో ఉన్నప్పుడు రాజకీయఖైదీలను నేరస్థులను ఒకే రగంగా చూస్తున్నందుకు ఇతడు. ఆ మరణనిరాహారదీక్షను చేపట్టి అరవైమూడురోజుల అనంతరం శుష్కించిమరణించాడు. 13–09–1929 ఆతడు మరణించాడు. – భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర– మామిడిపూడి వెంకట రంగయ్య 1976 ప్రచురణ

24. భగత్ సింగ్ ఇంక్విలాబ్ జిందాహాద్ (విప్లవం వర్ధిల్లాలి) అనే నినాదకర్త. వందలాదిమంది రక్షకభటులు కంటికి రెప్పలా కాపాడుతున్న కేంద్ర శాసనసభలో సైమన్ కమిటి సభ్యుల సప్తకం ఉన్నసభలో భారతీయుడైన భగవత్‌సింగ్ బాంహును విసిరిన సాహసికుడు. "న్యాయస్థానంలో భగత్ సింగ్ భారతీయులకు ప్రాతినిథ్యంలేకుండా, వారు ఎంతగా వలదని ఆందోళనచేసినా బ్రిటిష్ ప్రభుత్వం

సైమన్ కమిషన్‌ని నియమించింది. ప్రజావాణి వినిపించకుండా బ్రిటిష్ సామ్రాజ్యప్రభుత్వానికి బధిరత్వం ఆవహించింది. ఆ బధిరత్వం పోగొట్టటానికే ఈ బాంబుప్రయోగం. అంతేగాని ఎవరినీ హత్య చేయాలనిగాని, గాయపరచాలనిగాని, మేము బాంబును ప్రేల్చలేదు. మానవకారుణ్యంలో మేమెవ్వరికీ తీసిపోము" అని అన్నాడు 23-03-1931 న భగత్ సింగ్ ను బ్రిటిష్ ప్రభుత్వం ఉరితీసింది. -జాతినిర్మాతలు-తుర్లపాటి కుటుంబరావు. - పునర్ముద్రణ-2018

25. 1919 లో రౌలత్ అనే బ్రిటిష్ వ్యక్తి తయారుచేసిన చట్టం రౌలత్ చట్టం. దీనిప్రకారం అకారణంగానే భారతీయులను అరెస్టుచేసే అధికారం బ్రిటిష్ సైన్యానికి లభించింది. దీనిని వ్యతిరేకిస్తూ భారతీయులు పంజాబ్ లోని జలియన్ వాలాబాగ్ అనే ఒక ప్రవేశద్వారం గల ప్రదేశంలో జలియన్ వాలాబాగ్‌లో సమావేశం అయినప్పుడు డయ్యరు అనే సైన్యాధికారి జరిపిన కాల్పులలో అక్కడికక్కడ వేయిమంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.- భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర- మామిడిపూడి వెంకట రంగయ్య 1976 ప్రచురణ.

26. సాండర్స్ అననేవ్యక్తి ఒక బ్రిటిష్ పోలీసు అధికారి. సైమన్ కమిషన్ వచ్చినప్పుడు దానిని బహిష్కరిస్తూ సైమన్ గో బ్యాక్ అనే నినాదాలతో లాహెూర్ లో లాలాలజపతిరాయ్ ప్రదర్శనలుచేస్తున్నప్పుడు ఆతనిని అరెస్టుచేసి జైల్లో ఆతని పక్కటెనుకలు విరిగేలా కొట్టారు. అతడు జైల్లోనే అనారోగ్యం పాలయ్యాడు. జైలునుండి విడుదలచేసినకొన్నాళ్ళకే ఆతడు మరణించాడు. దానితో కోపోద్రిక్తులైన విప్లవకారులు పోలీసు అధికారియైన ఆ సాండర్స్ ని హత్యచేసారు..- భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర - మామిడిపూడి వెంకట రంగయ్య 1976 ప్రచురణ.

27. ఉప్పుపన్ను 3 శాతం నుండి 8 శాతానికి బ్రిటిష్ ప్రభుత్వం పెంచింది. మన ఉప్పు మనం తయారు చేస్తుంటే లాభార్జనకై బ్రిటిష్ ప్రభుత్వం అధికపన్నులు వేయటాన్ని వ్యతిరేకిస్తూ గాంధి ఉప్పుసత్యాగ్రహానికి పిలుపునిచ్చాడు. 1930 మార్చి 23 న బయలుదేరి గాంధి ఏప్రిల్ 6వ తేదీకి గుజరాత్‌లోని దండి అనే సముద్రతీరానికి చేరుకొని 10వ తేదీనుండి ఉప్పుతయారీని మొదలుపెట్టాడు. దేశమంతా స్వాతంత్ర్యవాదులు సముద్రతీరాలకు చేరుకొని ఉప్పుతయారీలో పాల్గొనటం, తీరపువాసులు కానివారు సముద్రపునీళ్ళు తెచ్చి వీధుల్లో ఉప్పును తయారుచేయటం, మరికొంతమంది విదేశీవస్తుబహిష్కరణలో భాగంగా కల్లుకొట్ల దగ్గర పికెటింగ్ చేయటం వంటివి ఉప్పుసత్యాగ్రహ కార్యక్రమాలు. దీనిలో స్త్రీలుపురుషులు పాల్గొన్నారు. ఎంతోమంది స్త్రీపురుషులను అరెస్టు చేయటంతో జైళ్ళు కిటకిటలాడిపోయాయి.- స్వాతంత్ర్యోద్యమ చరిత్ర-మామిడిపూడి వెంకటరంగయ్య1976 ప్రచురణ

28. గాంధి అహింసతో స్వాతంత్ర్యం వస్తుందనే నమ్మకంలేనివారు కాంగ్రెస్ పార్టీలోనే మితవాదులు, జాతీయవాదులుగా 1919 చట్టంప్రకారం ఎన్నికయి దిగువసభ (ప్రావిన్సుసభలు) లకు

శాసనసభ్యులుగా ఉన్నప్పుడు భారతీయులకు అప్రధాన్యమైన శాఖలను యివ్వటం, బడ్జెట్టు గురించిన చర్చలలో పాల్గొనే అధికారంలేనందుకు మితవాదులు తమ శాసనసభ్యత్వానికి రాజీనామా యివ్వగా జాతీయవాదులు అంటే కాంగ్రెస్‌లోనే ఉంటూ ఆయుధాలహింసతో స్వరాజ్యాన్ని పొందాలని గాంధితో విభేదించినవారు. వెంటనే రాజీనామాచేయలేదు. అప్పటినుండి కాంగ్రెస్ మితవాదులు జాతీయవాదులుగా వేరుగా ఉన్నారు. – స్వాతంత్ర్యోద్యమ చరిత్ర–మామిడిపూడి వెంకటరంగయ్య 1976 ప్రచురణ

29 కలకత్తాలోని విప్లవకారుడైన ఎమ్.ఎన్.రాయ్ కృషితో 1924 లో భారతదేశంలో కమ్యూనిజం ప్రవేశించింది. యువకులలో వామపక్షవాలు చోటుచేసుకున్నాయి. దానితో దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పట్టుపట్టారు. కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ సమావేశాలలో భారతదేశ స్వయంప్రతిపత్తి స్థానంలో సంపూర్ణ స్వరాజ్యంకావాలని నిర్ణయించారు. ఈ పరిస్తితులలో వైస్రాయిగా ఉన్న ఇర్విన్ లండనుపోయివచ్చి స్వయంప్రతిపత్తిని యివ్వటానికి రౌండుటేబిల్ సమావేశాలను ఏర్పాటుచేసినట్టు చర్చలకు రమ్మనగా 1931లో రెండో రౌండుటేబుల్ సమావేశంలో గాంధి పాల్గొని సంపూర్ణస్వరాజ్యంకావాలని, కొన్ని షరతులు పెట్టాడు. ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొన్న వారిని జైళ్ళనుండి విడుదలచేయాలని, భగత్ సింగ్ కువేసిన ఉరిశిక్షను జీవితకీల శిక్షగా మార్చమని ఇర్విన్ తో ఒప్పందం చేసుకొని వచ్చాడు. దానినే ఇర్విన్ – గాంధి ఒడంబడిక అంటారు..– స్వాతంత్ర్యోద్యమ చరిత్ర–మామిడిపూడి వెంకటరంగయ్య1976 ప్రచురణ

30. గాంధి – ఇర్విన్ ఒడంబడిక ప్రకారం భారతదేశానికి స్వయంప్రతిపత్తిని యివ్వకుండా దానిని అమలు పరచనందుకు నిరసనను తీవ్రతరంచేస్తూ 1931లో ఉప్పుసత్యాగ్రహంలో వలె సామూహిక సత్యాగ్రహంకాకుండా వ్యక్తిసత్యాగ్రహంతో శాసనోల్లంఘనం చేయాలని పిలుపునిచ్చాడు.. అదే 1931లో జరిగిన శాసనోల్లంఘుల ఉద్యమం..– స్వాతంత్ర్యోద్యమ చరిత్ర–మామిడిపూడి వెంకటరంగయ్య1976 ప్రచురణ

31. 'ఖాదీ' అనేది ఒక వస్త్రం కాదు, అది ఒక భావన ఒక ఆదర్శం అని గాంధి అంటారు. – 'అసలైన విప్లవవాది....సిసలైన సిద్ధాంతకర్త– గాంధీజీ'– డా. నాగసూరి వేణుగోపాల్–తృతీయముద్రణ, ఏప్రిల్ 2021

32. భారతీయులు శాసనోలమలంఘనాన్ని తీవ్రతరంచచేసేసరికి భారతీయుల అనైక్యతను దెబ్బతీసే ఎత్తుగడతో బ్రిటిష్ వైస్రాయ్ కాంగ్రెస్ నాయకులతో చేసుకొన్న పూనా ఒడంబడికతో ముస్లిములకు, హరిజనుల రాజకీయసాధికారితకై ఓటు అధికారాలను యిస్తూ అధికసంఖ్యలో నియోజకస్థానాలను కేటాయించారు. దానిని చట్టబద్ధం చేయటానికి భారతదేశ ప్రభుత్వచట్టం, 1935ను రూపొందించారు దాని ప్రకారం 1937 లో కేంద్ర, రాష్ట్ర (ప్రావిన్సులు) శాసనసభలకు ఎన్నికలు వచ్చాయి. ఎన్నికలలో

కాం(గెస్ ముస్లిములకంటే అధికసంఖ్యలో శాసనసభ స్థానాలను గెలుచుకుంది. కాని కాం(గెస్ వారు సభలో ఆర్థికబిల్లు పెట్టితే దానిని తిరస్కరించే హక్కు గవర్నరుకు ఉండటంతో కాం(గెస్ సభ్యులు రాజీనామా చేసారు. కాని ముస్లిములు తమ శాసనసభ్యత్వాన్ని కొనసాగించారు..- స్వాతంత్ర్యోద్యమ చరిత్ర-మామిడిపూడి వెంకటరంగయ్య 1976 ప్రచురణ

33. 1938 లో జర్మనీ నియంతకు వ్యతిరేకంగా ఫ్రాన్సు, ఇంగ్లండు, అమెరికా కూటమిగా ఏర్పడితే అటు జపాను జర్మనివైపు నిలబడింది. అదే రెండవ ప్రపంచయుద్ధం. బ్రిటిష్ వారు భారతీయులతో సంప్రదించకుండానే భారతీయసైన్యం యుద్ధంలో పాల్గొనాల్సిందే అనేసరికి దానిని అహింసా వాదియైన గాంధి తీవ్రంగా వ్యతిరేకించాడు. దానిని నిరసిస్తూ 1941లో శాంతియుత వ్యక్తిసత్యాగ్రహానికి పిలుపునిచ్చాడు. అయితే యుద్ధానంతరం భారతదేశానికి సంపూర్ణస్వాతంత్ర్యం యిస్తామని హామి యిచ్చేసరికి భారతీయులు యుద్ధంలో పాల్గొన్నారు. వేలమంది భారతీయసైనికులు యుద్ధంలో మరణించారు. రైతులు పండించిన పంటలను యుద్ధసైనికులకు పంపాలంటూ దుండగుల దోపిడీకి కూడా తోడై కిరాణావస్తువులన్నింటికి రేషన్ పెట్టారు. ప్రజలకు తిండికొరత ఏర్పడింది..- స్వాతంత్ర్యోద్యమచరిత్ర-మామిడిపూడి వెంకటరంగయ్య 1976 ప్రచురణ.

34. రెండవప్రపంచ యుద్ధవాతావరణం తగ్గిన తరువాత బ్రిటిష్ వారు తమ మాటను నిలబెట్టుకోక పోయేసరికి గాంధి తన హరిజన పత్రికద్వారా 'సాధించు లేదా మరణించు' (డు ఆర్ డై) 'క్విట్ ఇండియా' ఉద్యమానికి పిలుపునిచ్చాడు. ఉద్యమంలో విద్యార్థులు రైలుస్టేషన్లను తగలపెట్టారు. భారతీయ ఉద్యమకారులును, విద్యార్థులను ఎముకలువిరిగేటట్లుగా చావకొట్టి జైళ్ళల్లో పెట్టారు..- స్వాతంత్ర్యోద్యమ చరిత్ర-మామిడిపూడి వెంకటరంగయ్య1976 ప్రచురణ

35. క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో గాంధి ప్రసంగించటానికి బొంబాయికి ప్రయాణమవుతుంటే అరెస్టుచేయగా ఆతని భార్య కస్తూరిబా రంగంలోకి దిగి లక్షలమంది ఉన్న ఆ సభలో ప్రసంగించి నందుకు ఆమెను అరెస్టుచేసి గాంధిని పెట్టిన ఆగాఖాన్ భవనంలో పెట్టారు. అక్కడ 2 రోజులపాటు గాంధి నిరాహారదీక్ష చేసినప్పుడువ బ్రిటిష్ అధికారులు ఆయన ఆత్మశక్తికి అచ్చెరువు పొందారు. 1944 లో రెండుసార్లు గుండెపోటుకు గురికావటంతో 1944 ఫిబ్రవరి ఇరవైరెండున గాంధి ఒడిలోనే మరణించారు. ఆ మర్నాడు అక్కడే ఉన్న గాంధి కార్యదర్శి మహదేవ్ దేశాయి కూడా మరణించాడు.. - 'అసలైన విప్లవవాది....సిసలైన సిద్ధాంతకర్త- గాంధీజీ' - డా.నాగసూరి వేణుగోపాల్-తృతీయముద్రణ, ఏప్రిల్ 2021

36. 1945 డిసెంబరులో మళ్ళీ కేంద్ర, రాష్ట్ర శాసనసభలకు ఎన్నికలు వచ్చాయి. కాం(గెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ముస్లిము లీగ్ కు మూడురాష్ట్రాలలో మెజారిటీ లభించగా ఇక్కడ మంత్రివర్గాలను ఏర్పాటుచేసుకున్నారు మిగిలిన రాష్ట్రాలలో కాం(గెస్ మంత్రి వర్గం ఏర్పాటయింది.

దీనితో తాత్కాలిక భారతప్రభుత్వం ఏర్పడింది. స్వాతంత్ర్యోద్యమ చరిత్ర–మామిడిపూడి వెంకటరంగయ్య 1976 ప్రచురణ.

37. 1946 మార్చిలో భారతీయులకు స్వయంప్రతిపత్తిని యివ్వటానికి వేవేల్ త్రిసభ్యకమిషన్‌ని వేసాడు సంప్రదింపులలో జిన్నా సహకరించక తమకే భారతదేశపగ్గాలు యివ్వాలన్నాడు. దానికి కాంగ్రెస్ ఒప్పుకోకపోయేసరికి చివరికి1947 ఫిబ్రవరిలో భారతస్వాతంత్ర్య చట్టాన్ని రూపొందించి ఇద్దరికి పంచిపెడుతూ పాకిస్థాన్, ఇండియా కింద భారతదేశాన్ని రెండుదేశాలుగా విభజించారు. స్వాతంత్ర్యోద్యమ చరిత్ర–మామిడిపూడి వెంకటరంగయ్య1976 ప్రచురణ.

38. ఢిల్లీకి దూరంలో ఉన్న నౌకాలీలో మతకల్లోలాలకు గురైన ప్రజలను ఆదుకోవటానికి గాంధి తన అనుచరులతో గ్రామగ్రామాలు తిరుగుతూ ఊరట కలిగిస్తున్నాడు. ముస్లిములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. దాన్ని హిందూసంస్థలు వ్యతిరేకించాయి. శాంతి పునరుద్ధరణకు, ముస్లుములకు యివ్వాల్సిన నిధుల బదలాయింపు కోసం జనవరి12 వతేదీన గాంధి నిరాహారదీక్షను ప్రారంభించాడు ఆరోగ్యం క్షిణించటంతో మౌలానా అబ్దుల్ కలామ్ వచ్చి గాంధిని నిర్దిష్ట ప్రతిపాదనలను చేయమనగా ముస్లిములు స్వేచ్ఛగా తిరగటానికి హిందూవులు ఆక్రమించిన వారి మసీదులను వారికి తిరిగి యిప్పించటానికి ఒప్పుకునేసరికి గాంధి నిరాహారదీక్షను విరమించాడు. – భారతస్వాతంత్ర్యోద్యమం–ఉజ్జ్వలఘట్టాలు–వకుళాభరణం రామకృష్ణ–జూన్ 2022 ప్రచురణ.

39. భారతదేశపరువు ప్రతిష్ఠలకు భంగం కలుగుచుండగా పిరికిపందల వలె నిలబడటంకంటే భారతీయులు బలాన్ని ప్రయోగించి గౌరవాన్ని కాపాడటం మంచిదంటున్నారు. కాని హింసా విధానం కంటే అహింసా విధానం వేయిరెట్లు మెరుగని నా ధృఢవిశ్వాసం–గాంధి అన్నారు. 'అసలైన విప్లవవాది....సిసలైన సిద్ధాంతకర్త– గాంధీజీ'– డా.నాగసూరి వేణుగోపాల్–తృతీయముద్రణ, ఏప్రిల్ 2021.

40. గాంధి అహింసావిధానాన్ని పాటించాలంటే క్షమ, ఓపిక, పట్టుదల, ధైర్యం ఇంకా ఎక్కువ ఉండాలి. 'అసలైన విప్లవవాది....సిసలైన సిద్ధాంతకర్త– గాంధీజీ' డా.నాగసూరి వేణుగోపాల్–తృతీయముద్రణ, ఏప్రిల్ 2021.

41 ఇక్కడ గాంధిని గాడ్సే హత్యచేసాడని ప్రత్యక్షసాక్షులు భావించినా రచయిత్రి ఆతని పేరును పేర్కొనలేదంటే విషయాన్ని వివాదం చేయటం రచయితకు యిష్టం లేదని భావించాలి.

42 అంబేద్కర్ సమరసింహ అనే కావ్యంలో అంబేద్కర్ పోరాట తీరుతెన్నులను రానూరి ఏకాంబర ఆమోదయోగ్యమైన వాదనా పటిమతో విమర్శిస్తూ గాంధి తదితరజాతీ. నాయకులకంటే నా జాతి విద్యావంతులే నాకు ద్రోహంచేసారని అంబేద్కర్ ఆవేదనచెందాడు ఆ ఆవేదనను ఏకాంబరం అక్షరరూపమిస్తూ సిద్ధాంతములు నాస్తి, రాద్ధాంతములుజాస్తి, సిగపట్లుజస్తయ్యో సిగ్గులేక

స్వార్థప్రయోజనాల్ బహునాయకత్వాలతో అనైక్యతతో అంబేద్కరీయులే అంబేద్కరీయులకు ఆగర్భ శత్రువులుగా మారుతున్నారని రావూరి ఏకాంబరం ఆత్మవిమర్శన కోణం నుండి ఆరోపించారు.(-ఆధునిక తెలుగు కవిత్వంలో అంబేద్కర్ - కోయికోటేశ్వరరావు వ్యాసం-వివిధ-ఆంధ్రజ్యోతి- దినపత్రిక 10-04-2023)

43. స్వాతంత్ర్యానంతర ప్రజాస్వామ్యంలో రాసుకొన్న రాజ్యంగంప్రకారం సమసమాజం ఏర్పడుతుందను కొన్నారు గాని రానందుకు కారణంగా కొనసాగుతున్న భూస్వామ్యవ్యవస్థ దోపిడీ వ్యతిరేకంగా కమ్యూనిష్టులలో లెనిన్ సిద్ధాంతాల ప్రభావం గల విప్లవవాదులు కలకత్తాలోని నక్సల్ బరిప్రాంతంలో తిరుగుబాటు అద్యమం మొదలుపెట్టారు. ధనవంతులనుండి నయానాభయానా డబ్బును తీసుకొని బీదలకు పంచిపెట్టటంగా ప్రారంభమైనదే నక్సలైటు ఉద్యమం. దానిని అణచటానికి పోలీసు యంత్రాంగం అవసరమైతే ఎన్ కౌంటర్లు కూడా చేయటం మొదలుపెట్టింది.

44. 1952 అక్టోబరు 19న పొట్టిశ్రీరాములు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకోసం నిరసనదీక్షను మద్రాసు నగరంలో ప్రారంభించి 58 రోజులపాటు చేసి అమరుడయ్యాడు. దీంతో ఆంధ్రదేశం భగ్గుమంది. రైళ్ళు, బస్సులు బంద్ అయ్యాయి. చిన్నాపెద్దా తారతమ్యాలు లేకుండా లక్షలాదిమంది హర్తాళ్ళు చేసారు. విద్యాలయాలు, ప్రభుత్వకార్యక్రమాలు మూతపడ్డాయి. పరిస్థితులు దిగజారక మునుపే కేంద్రప్రభుత్వం ఆంధ్రరాష్ట్రాన్ని 11జిల్లాలు మూడుతాలుకాలతో ఆంధ్రరాష్ట్రాన్ని ప్రకటించింది. 1953 అక్టోబరు1న కర్నూలు రాజధానిగా, ఆంధ్రరాష్ట్రం ఏర్పడి టంగుటూరి ప్రకాశంపంతులు ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పడింది. 1956 లో ఆంధ్రప్రదేశ్ గా ఏర్పడింది. భారత స్వాతంత్ర్యోద్యమం-ఉద్వలఘట్టాలు-వకుళాభరణం రామకృష్ణ-జూన్ 2022 ప్రచురణ.

45. 1962లో తెలంగాణా ఉద్యమం వచ్చింది. మద్రాసు రాష్ట్రం నుండి విడిపోయి విశాలాంధ్ర ఏర్పడిన తరువాత హైదరాబాద్ నిధులన్నీ ఆంధ్రప్రాంతానికి వెళ్ళిపోతున్నాయని, నిధులు నియామకాలు తెలంగాణాప్రాంత ప్రజల అభివృద్ధికే వినియోగించాలని పట్టుపడుతూ తెలంగాణా ప్రజలుచేసిన ఉద్యమం. ఆ సందర్భంలో తెలంగాణావాళ్ళ ఉ ద్యోగాల నియామకానికై ముల్కీ పత్రాలను జారీచేసారు. దాని ప్రకారం 1956 నాటికే అభ్యర్థుల తల్లిదండ్రులు తెలంగాణాప్రాంతంలో పుట్టి స్థిరనివాసం ఏర్పరచుకొని ఉండాలి. అటువంటి వారికి జారీచేసేది ముల్కీసర్టిఫికెట్లు.

46. 1952లో స్వతంత్ర భారతదేశరాజ్యాంగం ఏర్పడిన తరువాత వచ్చిన మొదటి ఎన్నికలు-స్వాతంత్ర్యోద్యమ చరిత్ర-మామిడిపూడి వెంకటరంగయ్య 1976 ప్రచురణ.

47. స్లమ్ ఏరియా అంటే బీదలు అంటే మురికివాడలు.

48. 1975 లో ఇందిరాగాంధి ప్రధానిగా ఉన్నప్పుడు ప్రతిపక్షాల విమర్శలు విప్లవవాదుల తిరుగుబాట్లకు ముక్కుతాడు వేయటానికి ఎమర్జన్సీని ప్రకటించింది. అంటే దేశంలో అత్యవసరపరిస్థితి అని అర్థం.

ఎమర్జన్సీ సమయంలో ప్రజలకు భావప్రకటన స్వేచ్ఛకూడా ఉండకుండా చేయటం. ఎవరైనా తమ బయటకువచ్చి తమ హక్కుల వినియోగానికై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే వారిని జైల్లోపెట్టే అధికారాలను పోలీసువ్యవస్థకు ఉంటాయి. ప్రజాస్వామ్యంలో పౌరుల మానవహక్కులను హరించటమేనని అర్థం. – అంతర్జాలం

49. ఇందిరాగాంధి ఎమర్జన్సీని ఎత్తివేసిన తరువాత *1977* లో జరిగిన ఎన్నికలలో ఇందిరాగాంధి ఓడిపోయింది. జనతాపార్టి గెలిచింది. మొరార్జీదేశాయ్ ప్రధానమంత్రిగా ప్రభుత్వం ఏర్పడింది. (అంతర్జాలం)

50. పదవిలోకి వచ్చిన జనతాప్రభుత్వం ఇందిరాగాంధి మీద కమిషన్లువోయించి ఇందిరాగాంధి దారిలో కనపడ్డ కోడిపెట్టను దొంగిలించింది అనే నేరంతో జైలుకుపంపించి ప్రదలదృష్టిలో అభాసుపాలయి ఆర్నెల్లలోనే ప్రభుత్వం పడిపోయింది మళ్ళీ ఎన్నికలు జరిగేవరకు... చరణ్ సింగ్ తాత్కాలిక ప్రధానిగా ఉన్నారు. *1978* లో జరిగిన ఎన్నికలలో ఇందిరాగాంధి ఘనవిజయం సాధించి తిరిగి భారత ప్రధాని పదవి చేపట్టింది. –అంతర్జాలం.

51. ఇందిరాగాంధి సిక్కుల స్వర్ణదేవాలయాలలో సిక్కుల ఊచకోతకు ప్రతిగా ఒక సిక్కు రక్షకభటుని చేతిలోనే *31-10-1984* న హత్యకు గురికాబడింది.

6 వ అధ్యాయం

1. లేబరుపార్టీ తరపున బ్రిటిష్ ప్రధానియైన అట్లీ భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని ప్రకటిస్తూ బ్రిటిష్ ప్రభుత్వం *1947* జులైలో భారతస్వాతంత్ర్యచట్టాన్ని రూపొందించిది.. భారతదేశంలోని ముస్లిములు ఎక్కువగా ఉండే బెంగాల్, పంజాబ్, కాశ్మీర్ లోని కొన్నిప్రాంతాలను కలిపి పాకిస్థాన్ గాను మిగిలిన రాష్ట్రాలను స్వతంత్ర భారతదేశంగాను ప్రకటించింది. హిందూ ముస్లిములు తమకు ....మైనదేశంలోకి వెళ్ళి నివసించవచ్చు అనీ, ప్రభుత్వం ఏర్పడేలోపు లోపు వైస్రాయ్ తాత్కాలికంగా రాజుగా ఉంచుతామంటే జిన్నా ఒప్పుకోలేదు కాని భారతదేశం ఒప్పుకోవటం చేత చివరి వైస్రాయిగా మైంట్ బాయటన్ ఉండటం జరిగింది. స్వాతంత్ర్యవేడుకల సమయంలో కాందిశీకులైన హిందూ ముస్లిముల మధ్య మతఘర్షణలు చెలరేగాయి. – స్వాతంత్ర్యోద్యమ చరిత్ర–మామిడిపూడి వెంకటరంగయ్య *1976* ప్రచురణ.

2. భారతదేశ స్వాతంత్ర్యానంతరం *1948* లో శ్రీశ్రీ (శ్రీరంగం శ్రీనివాసరావు) రాసిన కవితలోని వాక్యం–భారతి*1948*.

7.వ అధ్యాయం

7. వావిలాల గోపాలకృష్ణయ్య – స్వాతంత్ర్యోద్యమశీలి. స్వతంత్ర భారతదేశంలో వరుసగా 20 ఏళ్ళపాటు స్వతంత్రశాసనసభ్యుడిగా గెలుపొందిన వాడు. ఆంధ్రభాషోద్యమకారి. గ్రంథాలయాల స్థాపకుడు. మద్యపాననిషేధప్రచారకర్త.

7.1 అధ్యాయం

7.1.1 సత్యాగ్రహఉద్యమంలో భాగంగా శాంతియుతంగా అహింసా పద్ధతిలో ఖద్దరు తయారీకై రాట్నంతిప్పి నూలువడకటం, ఖద్దరు వస్త్రధారణ ప్రధానమైనవి. ఈ ఉద్యమంలో స్త్రీలు ఎక్కువగా పాల్గొన్నారు. వ్యాపార రూపేణ వచ్చి భారతీయ నేతపరిశ్రమ కుదేలయేట్టుచేసి దేశాన్ని ఆక్రమించిన వారి మూలాలలోకి వెళ్ళి తరిమికొట్టటానికి మొదలుపెట్టిందే ఈ ఖద్దరు ఉద్యమం. దీనివల్ల బ్రిటిష్ వారి ఆదాయం 80 కోట్లవ్యాపారం 50 కోట్లకు పడిపోయింది. స్వాతంత్ర్యోద్యమ చరిత్ర–మామిడిపూడి వెంకటరంగయ్య1976 ప్రచురణ –

7.1.2 భారతదేశ స్వాతంత్ర్యసాధనకై జాతీయస్థాయిలో 1885 లో ఏర్పడ్డ సంస్థ కాంగ్రెస్. కులాలకతీతంగా ఐక్యతకోసం ఏర్పడ్డ సంస్థ కాంగ్రెస్. దీనిలోని సభ్యులందరూ కాంగ్రెస్ కులం.

7.1.3. కందుకూరి వీరేశలింగంగారు సంఘసంస్కర్త. స్త్రీల అభ్యున్నతికోసం కృషిచేసారు. ఇంటనుండు స్త్రీల బానిసత్వంగురించి ఆలోచించనివారము, దేశానికి రాజకీయస్వాతంత్ర్యంవచ్చి ప్రయోజనం ఏమిటని, ముందుగా స్త్రీలకుస్వాతంత్ర్యాన్ని యివ్వగల విద్య అవసరమని పుంఖానుపుంఖాలుగా వ్యాసాలురాసాడు. కందుకూరి వీరేశలింగం రచనలు

7.1.4 ఆంధ్రదేశంలో రాజకీయచైతన్యానికి దోహదంచేసిన కృష్ణాపత్రికకు సంపాదకులు ముట్నూరి కృష్ణారావుగారు. కృష్ణాపత్రికలో వార్తపడితే ది తిరుగులేని నిజంగా భావించేవారు. –మహానాయకులు–తుర్లపాటి కుటుంబరావు–పునర్ముద్రణ–2018

7.1.5. పట్టాభి సీతారామయ్యగారు ముట్నూరి కృష్ణారావుగారు మిత్రులు.గాంధికి శిష్యులు. 'జన్మభూమి' అనే ఇంగ్లీషువారపత్రికను నడిపారు. –జాతినిర్మాతలు–తుర్లపాటి కుటుంబరావు. –పునర్ముద్రణ–2018

7.1.6. గాంధి దృష్టిలో గ్రామాలు స్వయంసమృద్ధంకావాలి. ఇతరవనరులమీద ఆధారపడకుండా నిలవగలగాలి. గ్రామీణపునరుద్ధరణ కార్యక్రమంలోని ప్రధానఘట్టాలన్నీనిడమైన ఆర్థికశాస్త్రాన్ని అనుసరించి రూపొందింపబడ్డయి.(గాంధి గారి హరిజన్ పత్రిక–1–3–1935)– –.'అసలైన విప్లవవాది....సిసలైన సిద్ధాంతకర్త– గాంధీజీ' డా.నాగసూరి వేణుగోపాల్–తృతీయముద్రణ, ఏప్రిల్ 2021

7.1.7. సత్యాగ్రహ ఉద్యమ నిర్మాణ కార్యక్రమాలలో భాగంగా న్యాయస్థానాల బహిష్కరణ. న్యాయవాదులు తమ వృత్తిని వదిలిపెట్టి నిరసన చూపించారు. బ్రిటిష్ వారు రౌలత్ చట్టంపెట్టి అకీరణంగా భారతీయులను అరెస్టుచేస్తున్నందుకు సత్యాగ్రహులు న్యాయస్థానాలను బహిష్కరించటం జరిగింది. – స్వాతంత్ర్యోద్యమ చరిత్ర–మామిడిపూడి వెంకటరంగయ్య1976 ప్రచురణ

7.1.8 సత్యాగ్రహ ఉద్యమ విర్మాణకార్యక్రమాలలో ఒకటి అస్పృశ్యతా నివారణ. అందుకని కడజాతి వారిని ఇంట్లోపెట్టుకొని వారితో కలిసిమెలగటం, వారి అభివృద్ధికి కృషిచేయటం జరిగేది. గాంధి వీరినే హరిజనులని, హరిజనోద్ధరణ సత్యాగ్రహ ఉద్యమంలో భారతీయుల ఐక్యతకోసం ముఖ్యమైనదిగా భావించారు. –

7.1.9 'దేశభక్తి' ముత్యాలసరాలనే అనే కవితలో గురజాడ అప్పారావు 'సొంతలాభం కొంతమానుకొని పొరుగువాడికి సాయపడవోయ్' అని రాసాడు.

7.1.10 పల్నాడు పుల్లరివిషయంలోను, ఉప్పుసత్యాగ్రహ సమయంలోను జైలుశిక్షలను అనుభవించిన ఉన్నవ లక్ష్మీనారాయణగారు తన మాలపల్లి నవలలో జైళ్ళలోని అసౌకర్యాలను ఇలానే వర్ణించారు. – మాలపల్లి నవల 2022 ప్రచురణ

7.1.11 19 శతాబ్దానికి చెందిన గురజాడ ముత్యాలసరాలు అనే కవితలో 'మంచియన్నది మాల అయితే నేనామాలనవుతా' అనేవి కవితా పంక్తులు

7.1.12 ఇండియన్ నైటింగేల్ గా గుర్తింపుపొందిన సరోజినీ నాయుడు 1925 లో కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎన్నికయిన మొదటిమహిళ. 1947 మార్చిలో ఢిల్లీలో జరిగిన అఖిల ఆసియా మహాసభలకు అధ్యక్షతవహించి యిచ్చిన ఉపన్యాసం భారతీయులను ఉర్రూతలూగించింది. స్వాతంత్ర్యానంతరం ఉత్తరప్రదేశ్ గవర్నరుగా నియమింపబడింది. స్వతంత్ర భారతదేశంలోని మొట్టమొదటి మహిళాగవర్నరుకూడా. –జాతినిర్మాతలు–తుర్లపాటి కుటుంబరావు. –పునర్ముద్రణ–2018

7.1.13 దుర్గాబాయి దేశముఖ్‌గా ప్రసిద్ధిపొందిన గుమ్మడిదల దుర్గాబాయమ్మ హిదీభాషను అభ్యసించింది. గాంధి అనుయాయిగా ఆంధ్రదేశంలో ఆయన యిచ్చిన ప్రసంగాలను తెలుగులో అనువించేది. కాకినాడలో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ సభలలో వాలంటీరుగా పనిచేసింది. ఆ సమావేశాలకు వచ్చిన నెహ్రూ కాంగ్రెస్ సభ్యత్వగుర్తింపుకార్డును చూపించనందుకు ఆయనను కూడా అటకాయించిన నిజాయితీగల కాంగ్రెస్ కార్యకర్త. దేశముఖ్ గారిని పెళ్లిచేసుకున్న తరవాత దుర్గాబాయ్ దేశముఖ్ గా ప్రసిద్ధురాలు. –అంతర్జాలం

7.1.14 సత్యాగ్రహఉద్యమ నిర్మాణకార్యక్రమాలలో ఒకటి మద్యపాననిరసన. మద్యం అమ్మి బ్రిటిష్

వాళ్ళు సొమ్ముగడిస్తున్నందుకు వారిని తరిమికొట్టటానికి చేసిన ప్రయత్నాలలో ఒకటి మద్యపాన నిరసనకార్యక్రమం. దానిలో భాగంగా ఉద్యమకారులు కల్లుమానండి, అంటూ నిరసనను చూపిస్తూ కల్లుదుకాణాలను మూయించేందుకు కల్లుకొట్లదగ్గర పికెటింగ్‌గా చేసేవారు. – స్వాతంత్ర్యోద్యమ చరిత్ర–మామిడిపూడి వెంకటరంగయ్య1976 ప్రచురణ

7.1.15 1921 లో గాంధి సహాయనిరాకరణోద్యమం మొదలుపెట్టినప్పుడు 'వందేమాతరం', 'భారత్ మాతాకి జై', 'మహాత్మాగాంధికిజై' అనే నినాదాలు భారదేశప్రజలను ఉద్రూతలిగించి జాతీయోద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళాయి. భారతస్వాతంత్ర్యోద్యమం–ఉజ్జ్వలఘట్టాలు– వకుళాభరణం రామకృష్ణ–జూన్ 2022 ప్రచురణ.

7.1.16 స్వాతంత్ర్యోద్యమసమయంలో 20 శతాబ్దపు ప్రారంభానికే,వేమూరి శారదాంబ, బండారు అచ్చమాంబ, ఉన్నవ లక్ష్మీబాయమ్మ, బాలాంత్రపు శేషమ్మవంటివారు స్త్రీవిద్యాప్రాముఖ్యతను తెలియజేయటానికి రాసిన సాహిత్యంలో స్త్రీలు చదువుకుంటే వారిలో ధైర్యస్థైర్యాలు పెరుగుతాయని, ఏదిమంచో ఏది చెడో తెలుసుకోగలిగే జ్ఞానం ఏర్పడుతుందని, స్వేచ్ఛాస్వాతంత్ర్యాల విషయంలో బాధ్యతతో ఉంటారని సాహిత్యవ్యాసాలను, కథలను రాసారు. – స్వతంత్రనుండి....స్వాతంత్ర్యానికి – జంధ్యాల కనకదుర్గ– జులై2021

7.1.17 బాలనేరస్థులను బయటతిరగకుండా నివాసవసతిని ఏర్పాటుచేసి, అక్కడే విద్యావసతిని ఏర్పాటుచేసే బాలలుండేజైలు.

7.1.18 1932 లో షెడ్యూల్ కులాలు, తెగలవారికి రాజకీయసాధికాత కలిగించేటందుకు పూనాలో జరిగిన కాంగ్రెస్ సమావేశఫలితంగా షెడ్యూల్ కులాలకు, షెడ్యూల్ తెగలవారికి నియోజకస్థానాల సంఖ్యను పెంచాలని తీర్మానం చేయటంతో నాటి బ్రిటిష్ ప్రధాని రామ్సే మెకడోనాల్డ్స్ 'కమ్యూనల్ అవార్డును' ప్రకటించాడు. ముస్లిములకు, షెడ్యూలుకులాల, తెగలవారికి అధికసంఖ్యలో ప్రత్యేక నియోజకవర్గాల కేటాయింపులు చేస్తూ, బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశచట్టం, 1935ను ప్రవేశపెట్టింది. ఆ చట్టంప్రకారం 1937లో కేంద్ర, రాష్ట్ర శాసనసభలకు ఎన్నికలు జరిగాయి. – స్వాతంత్ర్యోద్యమ చరిత్ర–మామిడిపూడి వెంకటరంగయ్య 1973 ప్రచురణ

7.1.19 ఆర్థికబిల్లును తిరస్కరించే అధికారం బ్రిటిష్ గవర్నర్‌ల చేతిలో ఉండటంతో కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచిన శాసనసభ్యులు రాజీనామా చేసినా ముస్లిమ్ లీగుకు చెందిన శాసనసభ్యులు మాత్రం కొనసాగారు.ఎస్వాతంత్ర్యోద్యమ చరిత్ర–మామిడిపూడి వెంకటరంగయ్య1976 ప్రచురణ

7.1.20 రెండవప్రపంచయుద్ధానంతరం బ్రిటిష్ ప్రధానిగా చర్చిల్ దిగిపోగా లేబరుపార్టీ వ్యక్తియైన అట్లీ ప్రధానమంత్రి అయినప్పుడు భారతీయులకు మౌలికంగా స్వపరిపాలనా హక్కును

అంగీకరించి, తాత్కాలికంగా కేంద్ర, రాష్ట్ర శాసనసభలకు ఎన్నికలు జరగాలని ప్రకటించాడు.

7.1.21 వివిధ-ఆంధ్రజ్యోతి దినపత్రిక, 10-04-2023

7.1.22 1956 కు మునుపు అక్కడ పుట్టిన తల్లి దండ్రులను తెలంగాణాస్థానికులుగా నిర్ణయించిన ధృవపత్రాలు

7.1.23 మద్రాసు నగరంలోని ప్రభుత్వ సదుపాయాలుగల కళాశాల క్వీన్ మేరీస్. స్వాతంత్ర్యోద్యమ సమయంలో కమలాదేవి ఛటోపాధ్యాయి, ముత్తులక్ష్మిరెడ్డి, ఆచంట రుక్మిణమ్మ ఈ కళాశాల విద్యార్థులు. కమలాదేవి ఛటోపాధ్యాయి కాంగ్రెస్ కార్యకర్తగా ఉపన్యాసాలు యివ్వటంలో దిట్ట. నెహ్రుగారి అనుయాయి.

డాక్టరు ముత్తులక్ష్మీరెడ్డి మద్రాసు రాష్ట్రంలోని మొదటి మహిళా వైద్యురాలు. అనిబిసెంట్ తో కలిసి స్త్రీధర్మపత్రికను నిర్వహించింది. స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యం కోసం ఉద్యమించింది. భోగంమేళాలరద్దు, వేశ్యావృత్తి నిషేధ చట్టం తేవటంలో ఈమె కృషి చాలా ఉంది.

స్వాతంత్ర్యోద్యమ సమయంలో ఆచంట రుక్మిణమ్మ ఎమె.ఎ. పట్టభద్రురాలు. రజస్వలానంతర వివాహాలకై కృషిచేసింది. ఆసియా అఖిలమహిళాసభలలో ప్రసంగించింది. స్వతంత్రత నుండి ..స్వాతంత్ర్యానికి-జంధ్యాల కనకదుర్గ- 2021 ప్రచురణ

7.1.24 బర్మా స్వాతంత్ర్యానికిపూర్వం మనదేశంలోనే ఉండేది. బ్రిటిష్ వాళ్ళు బెంగాలు విభజన అప్పుడు దానిని తూర్పు దేశంగా మార్చుచేసారు.

7.1.25 కందుకూరి వీరేశలింగంగారు దేశస్వాతంత్ర్యంకంటెముందుగా స్త్రీలు పురుషులతోపాటు సమానంగాస్వేచ్ఛనుపొందాలని, దానికోసం స్త్రీలువిద్యావంతులు కావాల్సిన అవసరాన్నితన ఉపన్యాసాలలో, వ్యాసాలలో తెలియచేసాడు.

7.1.26 ఇందిరాగాంధి ప్రధానిగా ఉన్నప్పుడు ప్రతిపక్షనాయకుడిగా ఇందిరాగాంధి పాలనను విమర్శించేవాడు. అవసరమైతే ధర్నాలను ప్రోత్సహించేవాడు.

7.1.27 భూస్వామ్య, పెట్టుబడిదారీ వర్గాల దోపిడిని నిర్మూలించటానికి ఏర్పడిన విప్లవవాదుల సంఘంలోని సభ్యులను కామ్రేడ్ అని పిలుచుకుంటారు.

7.2 అధ్యాయం

7.2.1 తెలుగు నవలావికాసం- మొదిలి నాగభూషణశర్మ

7.2.2 మొపాసా మాటల్లో చెప్పాలంటే నువ్వు చెప్పదలచుషయానికి ఒకే పదం, దాని చలనానికి ఒకే క్రియ, దాని వర్ణనకు ఒకే విషేషణం ఉంటుంది. దానికోసం నువ్వు వేటాడి ఇవికాక యితరపదాలు ఎంతఘనమైనవి, అరుదైనవి, గాఢమైనవి అయినప్పటికీ తద్భావవ్యక్తీకరణకు సమర్థంకాజాలవు. సాంఘికనవలలు-కథనశిల్పం- డా.సి.మృణాళిని-1988 ప్రచురణ

7.2.2 శ్రీశ్రీ రచించిన దేశచరిత్రలలో తారీఖులు, దస్తావేజులు ఇవికావోయ్ చరిత్రకర్థం,చారిత్రక ప్రభాతసంధ్యలో మానవవికాసం సాధించిన పరమార్థం

7.2.3 నవలముగింపు ప్రారంభంయొక్క సహజ ఫలితంగా ఉండాలి. - సాంఘికనవలలు-కథనశిల్పం- డా.సి.మృణాళిని-1988 ప్రచురణ

7.2..4 రాజకీయప్రాతిపదికపై రచింపబడిన నవలలో ఆనాటి రాజకీయోద్యమ సంఘటనలసూచన ఉంటుంది. వీటిని తత్ప్రభావంతో ఫలితాన్ని పాత్రలఆధారంగాగాని, సంక్షిప్తకతలద్వారా గాని, సన్నివేశాలద్వారా గానీ రచయితలు నిర్దేసిస్తారు. రాజకీయ వాతావరణం రూపేణా కథలో సంచరించే మార్పులను సూచించటం కోసం ఈ వాతావరణాన్ని స్పష్టంగా సహేతుకంగా రూపొందిస్తారు. సాంఘికనవలలు-కథనశిల్పం- డా.సి.మృణాళిని-1988 ప్రచురణ

7.2..5 పరిణామశీలమైన పాత్రలు (కథాగతమైన) జీవితంలోని ఆటుపోట్లకు చలించి, బాహ్యాంభతర సంఘర్షణలచే ప్రభావితమై, తమ మౌలికమైన స్వభావం లేకపోయినా దృక్పథాలలో ఆలోచనలు, చర్యలు హృదయసంస్కారంతో పరిణామం చెందుతాయి. కథాప్రారంభంలో పాత్రస్వభావానికి కథాంతంలోని స్వభావంలో పరిణితి ఉంటుంది. సాంఘికనవలలు-కథనశిల్పం- డా.సి.మృణాళిని-1988 ప్రచురణ

7.2..6 కుతూహల జనకంగా ఉండటం కథాప్రారంభ లక్షణం-సాంఘికనవలలు-కథనశిల్పం- డా.సి.మృణాళిని-1988 ప్రచురణ

7.2..7 నవలలోని ప్రతిసన్నివేశం, అందులో పాల్గొనే పాత్రస్వభావానికి అనుగుణమై ఉంటుంది. అలాగే ప్రతిసన్నివేశం, ఆపాత్రపట్ల పాఠకుడి అవగాహన పంచేదిగా ఉంటుంది. పాత్ర, సన్నివేశాలమధ్య ఈ విధమాన సహజమైన పొందిక హెన్రీజేమ్స్ చెప్పినట్లుగా రచయిత్రి రచనాశిల్పంలోని ప్రధానలక్షణం. -సాంఘికనవలలు-కథనశిల్పం- డా.సి.మృణాళిని-1988 ప్రచురణ

7.2..8 తెలుగ నవలావికాసం మొదిలినాగభూషణశర్మ-1971 ప్రచురణ

7.2..9 టాల్ స్టాయ్ అన్నట్టుగా కళాకారుడు దేన్నిచిత్రించినా అందులో మనంకోరుకునేది మనకు కనిపించేది అతని ఆత్మ. ఈ విశ్వాసాన్ని పాటించి స్పష్టమైన నిర్దిష్టమైన నూతనమైన దృక్పథంలేని రచయిత, అది ఉండనవసరంలేదనిభావించిన రచయిత ఎప్పటికీ కళాసృష్టిచేయలేదు. సాంఘికనవలలు-కథనశిల్పం- డా.సి.మృణాళిని-1988 ప్రచురణ

7.2.10 తెలుగు నవలావికాసం-మొదిలి నాగభూషణశర్మ-1971 ప్రచురణ

7.2..11 రాచమల్లు రామచంద్రారెడ్డి చెప్పినట్లుగా జీవిత పరిస్థితులను, జాతి సంస్కారాన్ని మెరుగు పరచటమే ఏయుగంలోనైనా సాహిత్యానికి ఏకైకలక్ష్యం కనుక జీవితపరిస్థితులకు, వ్యక్తుల సంస్కారంలోను ఉన్న కంటకాలను, కాలుష్యాలను బహిర్గతంచెయ్యటం సాహిత్యానికి యెప్పుడూ ప్రధమ కర్తవ్యంగానే ఉంటుంది. సాంఘికనవలలు–కథనశిల్పం– డా.సి.మృణాళిని– 1988 ప్రచురణ

7.2.12 శైలీప్రయోజనం రచయిత భావాలు పాఠకుడికి అర్థంకావటమేకాక, ఆతని ఆలోచన సరైనదైతే పాఠకుడు ఆకర్షితుడు కాగలుగుతాడు. – సాంఘికనవలలు–కథనశిల్పం– డా.సి.మృణాళిని– 1988 ప్రచురణ

8 అధ్యాయం

8.1 అహింసే మన జీవనవిధానం అయితే భవిష్యత్తు అంతా స్త్రీమూర్తిదే అంటున్నారు. –హింద్ స్వరాజ్. 'అసలైన విప్లవవాది....సిసలైన సిద్ధాంతకర్త– గాంధీజీ'– డా. నాగసూరి వేణుగోపాల్– తృతీయముద్రణ, ఏప్రిల్ 2021

8.2 గాంధి దృష్టిలో విద్య అంటే సమాచారాన్ని అందజేయటం కాదు. ప్రతిమనిషిలోను మంచిచేయటానికి ఉన్న శక్తిని వెలికితీయటం. అది కేవలం మేధకు సంబంధించినదికాదు. శరీరం, ఆత్మకి కూడా సంబంధించినది. అక్షరాస్యత అన్నది ఒకపరికరం మాత్రమే. గమ్యానికి ఒకసాధన మాత్రమే. 'అసలైన విప్లవవాది....సిసలైన సిద్ధాంతకర్త– గాంధీజీ' – డా. నాగసూరి వేణుగోపాల్–తృతీయముద్రణ, ఏప్రిల్ 2021

11. ఉపయుక్త గ్రంథాలు

1. 'హృదయనేత్రి' - మాలతీచందూర్ 'క్వాలిటీ పబ్లిషర్స్' విజయవాడ
2. 'మనోజ్ఞమాలతి' - విజ్ఞాన సరస్వతి - అంతర్జాలసమాచారం
3. 'స్వాతంత్ర్యోద్యమ చరిత్ర' -మామిడిపూడి వెంకటరంగయ్య (1976 ప్రచురణ)
4. 'సాంఘికనవలలు-కథనశిల్పం' - డా.సి.మృణాళిని (1988 ప్రచురణ)
5. 'తెలుగు నవలావికాసం' - మొదిలి నాగభూషణశర్మ (1971 ప్రచురణ)
6. 'భారతస్వాతంత్ర్యోద్యమం-ఉద్వలగట్టాలు' - వకుళాభరణం రామకృష్ణ (2022)
7. 'మహానాయకుడు-తుర్లపాటి కుటుంబరావు' - పునర్ముద్రణ (2018)
8. 'జాతిరత్నాలు- తుర్లపాటి కుటుంబరావు' - పునర్ముద్రణ (2018)
9. 'అసలైన విప్లవవాది....సిసలైన సిద్ధాంతకర్త- *గాంధీజీ*' - డా.నాగసూరి వేణుగోపాల్ (తృతీయముద్రణ, ఏప్రిల్ 2021)
10. 'స్వతంత్రత నుండి...స్వాతంత్ర్యానికి' - జంధ్యాల కనకదుర్గ (2021 ప్రచురణ)
11. అంతర్జాల సమాచారం
12. ఆంధ్యజ్యోతి దినపత్రిక- వివిధ శీర్షిక

రచయిత : **డా. జంధ్యాల కనకదుర్గ**

పుట్టినతేది : 10.04.1953

తల్లిదండ్రులు : శ్రీ జంధ్యాల కుమారస్వామి, శ్రీమతి లక్ష్మీప్రసన్నమ్మ

భర్త : శ్రీ ఎమ్.వి.శాస్త్రి

విద్యార్హతలు :

1. ఎమ్.ఏ – ఆంధ్రా విశ్వవిద్యాలయం (బంగారుపతకం) 1974
2. ఎమ్.ఫిల్ – కాకతీయ విశ్వవిద్యాలయం (రెండు బంగారు పతకాలు) 1990
3. పి.ఎచ్.డి – కాకతీయ విశ్వవిద్యాలయం 1994

వృత్తి అనుభవం : 34 సం.లు – లెక్చరర్, రీడర్ (అసోసియేట్ ప్రొఫెసర్), ప్రిన్సిపాల్ – సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ కళాశాల, కొత్తగూడెం, ఖమ్మంజిల్లా.

సత్కారం :

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వపు ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారం, 1994 మరియు ఇతర సంస్థల పురస్కారాలు
- ఉత్తమ గ్రంథం రచయిత్రి సాహితీ పురస్కారం2025 – సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వ విద్యాలయం, తెలంగాణ
- శ్రీ పోపూరి సుబ్బారావు స్మారక సత్కారం–2022 : శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం, తిరుపతి.
- ఉత్తమ ఎన్.ఎస్.ఎస్ ఆఫీసర్ :1996, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.
- BOLT అవార్డు ఆఫ్ ఎయిర్ ఇండియా

పరిశోధనలు :

- యు.జి.సి. రీసెర్చ్ ఫెలోషిప్ అవార్డు – 1975
- యు.జి.సి.మైనర్ రీసెర్చ్ ప్రాజెక్టు–సింగరేణి గని కార్మిక జీవన చిత్రణ 1998.
- యు.జి.సి.మేజర్ రీసెర్చ్ ప్రాజెక్టు – ప్రపంచీకరణ సందర్భంలో స్త్రీ పురుష సంబంధాలు – 2004

ప్రచురణలు : 1. కొఱవి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక **2.** తెలుగు స్వతంత్ర కథాకావ్యాలలో మహిళా జీవన చిత్రణ **3.** తెలుగు సాహిత్యం–మహిళా చైతన్య ప్రస్థానం **4.** సింగరేణి సాహిత్యం–శ్రమ శక్తుల జీవనం **5.** సాహితీ సుమాలు **6.** సాహిత్యం–సత్త్వదర్శిని **7.** స్వతంత్రత నుండి... స్వాతంత్ర్యానికి – (తెలుగులో స్త్రీల సాహిత్యం 1900–1947) **8.** గత శతాబ్దపు సాంస్కృతిక స్రవంతి **9.** హృదయనేత్రి – సహృదయ సంధాత్రి **10.** ఆకాశమే.. హద్దుగా **11.** అమరావతిలో అస్థికలు–కథావాహిని.

వివిధ పత్రికలలో ప్రచురింపబడిన విమర్శ వ్యాసాలు 60 పైగా

అభిరుచి – నిరంతర తెలుగు సాహిత్యాధ్యయనం – పరిశోధన

ISBN: 978-93-5810-046-4